
'పారదర్శకతతో పథకాలు అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 64

శుక్రవారం 26-5-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL

ఫ్యాషన్











పాకెట్ స్టైల్

ప్యాంట్, షర్ట్‌కి పాకెట్స్ ఉండటం తెలిసిందే కానీ, ఎవర్‌గ్రీన్ డ్రెస్‌గా కితాబులు అందుకునే శారీ కట్టుకుంటే.. వెంట పర్స్ లేదా బ్యాగ్ తప్పనిసరి అనుకునేవారికి పాకెట్ శారీస్ ఈ కాలానికి అనువుగా ఉంటున్నాయి. హుందాతనం, స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకుంటున్నాయి. ఫోన్, మనీ వెంట తీసుకెళ్లడానికి ఉపయోగకరంగానూ ఉంటున్నాయి.

ప్యాచ్ వర్క్

చీరకు తగినంత పరిమాణంలో కాంట్రాస్ట్ కలర్ క్లాత్ తీసుకొని, దానిని నడుము భాగాన జత చేస్తే పాకెట్ రెడీ అవుతుంది.

ఎంబ్రాయిడరీ వర్క్

పూసలు, అద్దాలు, జరీ దారాలతో పాకెట్ క్లాత్‌కు ఎంబ్రాయిడరీ వర్క్ చేసి, దానిని చీరకు జత చేయచ్చు.

మ్యాచింగ్

జాకెట్, పాకెట్ ఒకే ఫ్యాబ్రిక్‌తో మ్యాచ్ చేయడం వల్ల చీరకట్టుకు ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తాయి.

న్యూ ట్రెండ్

స్టార్స్ స్టాకింగ్ క్రేజ్









ఒకప్పుడు మల్టీపుల్ రింగ్స్ వేళ్లకు ధరించడం అనేది ప్రత్యేక శుభసందర్భాలకు మాత్రమే పరిమితమైన విషయం. అయితే ఇప్పుడు మల్టీ రింగ్ కల్చర్ లేదా స్టాకింగ్ రింగ్ క్రేజ్ 'ఎవ్రీ డే వేర్'గా మారింది.

'రింగ్' అనేది అలంకారప్రాయమైనదే కాదు స్టేట్‌మెంట్ పీస్ కూడా.

శుభసందర్భాలు, సాంస్కృతిక ప్రత్యేతలు, జ్ఞాపకాలు, జ్ఞాపకాలతో ఆ ముడిపడిన అనుబంధాలు, భౌగోళిక అందాలు, ఆలోచనల తీరు... ఇలా ఎన్నో కోణాలలో రింగ్ ప్రతిఫలిస్తుంది.

స్టాకింగ్ రింగ్ క్రేజ్‌ను దృష్టిలో పెట్టుకొని ప్రపంచవ్యాప్తంగా ఎంతో మంది డిజైనర్‌లు రకరకాల కాన్సెప్ట్‌లతో స్టాకింగ్ రింగ్‌లను డిజైన్ చేశారు.

'బెస్ట్ స్టాకింగ్ రింగ్ ఐడియాలు' అంతర్జాలంలో హల్‌చల్ చేస్తున్నాయి.

స్టాకింగ్ రింగ్స్ డిజైన్‌కు సంబంధించి క్రియేటివిటీకి ఆకాశమే హద్దు.

బాలీవుడ్ అందాల తారలు జాహ్నవి కపూర్ నుంచి ప్రియాంకచోప్రా వరకు ఎంతోమంది ఈ 'స్టాకింగ్ రింగ్ క్రేజ్'ను 'లవ్ యూ' అంటున్నారు. అభిమానులు కూడా వారిని అనుసరిస్తున్నారు.

కళ

నటరాజు దీవించిన నాట్య సుధా నిధులు



● అశ్వినీ, అపర్ణల నృత్య కౌశలం

భావం, రాగం, తాళం...
ఈ మూడు నృత్య కళాంశాల
సమ్మేళనం భరతనాట్యం.
అరవై నాలుగు ముఖ,
హస్త, పాద కదలికల
అపురూప విన్యాసం భరతనాట్యం.
మూడు దశాబ్దాల క్రిందట అమెరికాలో
'రాగమాల డ్యాన్సింగ్ కంపెనీ' మొదలు పెట్టి
ఆ నాట్య వైభవాన్ని దశదిశలా
తీసుకువెళుతోంది రాణీ రామస్వామి.
తానే ఒక సైన్యంగా మొదలైన
రాణీ రామస్వామికి ఇప్పుడు
ఇద్దరు కూతుళ్ల రూపంలో
శక్తిమంతమైన సైనికులు తోడయ్యారు....

'మేము గత జన్మలు, పునర్జన్మల గురించి తరచుగా మాట్లాడుకుంటూ ఉంటాం. మా పెద్ద అమ్మాయి అపర్ణకు మూడు సంవత్సరాల వయసు నుంచే నృత్యంపై అనురక్తి ఏర్పడింది. ఆమె పూర్వజన్మలో నృత్యకారిణి అని నా నమ్మకం' అంటుంది రాణీ రామస్వామి.

చెన్నైలో పుట్టిన రాణీ రామస్వామికి ఏడు సంవత్సరాల వయసులో భరతనాట్యంతో చెలిమి ఏర్పడింది.

డెబ్బై ఒకటో యేట ఆమెకు ఆ నాట్యం శ్వాసగా మారింది. ఈ వయసులోనూ చురుగ్గా ఉండడానికి అవసరమైన శక్తిని, ఉత్సాహాన్ని ఇస్తోంది.

మూడు దశాబ్దాల క్రితం ఆమె అమెరికాలోని మినియాపొలిస్‌లో 'రాగమాల డ్యాన్స్ కంపెనీ'కి శ్రీకారం చుట్టింది. ఈ కంపెనీ ద్వారా అమెరికాలో నృత్యాభిమానులైన ఎంతో మందికి ఆత్మీయురాలిగా మారింది. భరతనాట్యాన్ని ముందుకు తీసుకువెళ్లే ఇంధనం అయింది.

'రాగమాల' ద్వారా ప్రసిద్ధ జాతీయ, అంతర్జాతీయ కళాకారులు, సంస్థలతో కలిసి పనిచేస్తోంది రాణీ రామస్వామి.

'రాగమాల ట్రెనింగ్ సెంటర్' ద్వారా ఏడు సంవత్సరాల వయసు నుంచే భరతనాట్యంలో శిక్షణ పొందుతున్నారు ఎంతోమంది పిల్లలు.

'అమ్మా, నేను, అక్క ఒక దగ్గర ఉంటే అపురూపమైన శక్తి ఏదో మా దరి చేరినట్లు అనిపిస్తుంది. ప్రేక్షకుల్లో కూర్చొని వేదికపై వారి నృత్యాన్ని చూసినప్పుడు, డ్యాన్స్ చేస్తూ ప్రేక్షకుల్లో కూర్చున్న వారిని చూస్తున్నప్పుడు, మేము ముగ్గురం కలిసి నృత్యం చేస్తున్నప్పుడు....అది మాటలకందని మధురభావన' అంటోంది అశ్వినీ రామస్వామి.



● కూతుళ్లతో రాణీ రామస్వామి

నోట్స్ రెడీ

ఇద్దరు కూతుళ్లు అపర్ణ, అశ్విని తల్లితో పాటు కూర్చుంటే కబుర్లకు కొరత ఉండదు. అయితే అవి కాలక్షేపం కబుర్లు కాదు. కళతో ముడిపడి ఉన్న కబుర్లు. అమ్మ రాణీ రామస్వామి తన సుదీర్ఘ ప్రయాణానికి సంబంధించిన విలువైన అనుభవం ఒకటి ఆ సంభాషణలలో మెరిసి ఉండవచ్చు. ఈతరానికి నాట్యాన్ని ఎలా దగ్గర చేయాలి అనేదాని గురించి పిల్లలిద్దరూ తల్లితో చర్చించి ఉండవచ్చు. ఇలా ఎన్నెన్నో ఉండవచ్చు. ఈ కబుర్లు వృథాగా పోవడం ఎందుకని అర్చన, అశ్విన్‌లు నోట్స్‌తో రెడీగా ఉన్నారు.

పాశ్చాత్య ప్రేక్షకులకు భరతనాట్యంలోని సొగసు అర్థమయ్యేలా, ఆకట్టుకునేలా చేయడంలో రాణీ రామస్వామి విజయం సాధించింది.

'క్రియేటివ్ పర్సన్ లేదా ఆర్టిస్ ప్రయాణం ఒంటరిగానే మొదలవుతుంది. ఆ ప్రయాణంలో వేరే వాళ్లు తోడైనప్పుడు ఎంతో శక్తి వస్తుంది. అమ్మ విషయంలోనూ ఇదే జరిగింది. ఇప్పుడు మాతో పాటు ఎంతోమంది ఆమె వెంట ప్రయాణం చేస్తున్నాం' అంటుంది అపర్ణ రామస్వామి.

భరతనాట్యానికి సంబంధించి ఈ ముగ్గురికి 3డీలు అంటే ఇష్టం. డీప్ లవ్, డెడికేషన్, డిసిప్లిన్.

'ప్రశంసల సంగతి సరే, విమర్శల సంగతి ఏమిటి?' అనే ప్రశ్నకు వీరు ఇచ్చే సమాధానం... 'విమర్శ కోసం విమర్శ అని కాకుండా హానెస్ట్ ఫీడ్ బ్యాక్ అంటే ఇష్టం. దీని ద్వారా మనల్ని మనం మరింతగా మెరుగుపరుచుకోవడానికి అవకాశం ఏర్పడుతుంది.

హిందూ, సూఫీ తత్వాన్ని మేళవిస్తూ రూపొందించిన 'రిటెన్ ఇన్ వాటర్' నృత్య రూపకం భౌగోళిక సరిహద్దులను చెరిపేసి అందరినీ ఒకే ప్రపంచంలోకి తీసుకు వచ్చింది.

'రాగమాల డ్యాన్సింగ్ కంపెనీ' ద్వారా మూడు దశాబ్దాల ప్రయాణం సులువైన విషయం ఏమీ కాదు.

ప్రయాణంలో...కొందరు కొన్ని అడుగుల దూరంతో వెనుదిరుగుతారు. కొందరు కొన్ని కిలోమీటర్ల దూరంలో వెనుతిరుగుతారు. కొందరు మాత్రం వందలాది కిలోమీటర్లు అలుపెరగకుండా ప్రయాణిస్తూనే ఉంటారు. రాణీ రామస్వామి ఆమె కూతుళ్లు అపర్ణ, అశ్వినిలు అచ్చంగా ఈ కోవకు చెందిన కళాకారులు.

తురుముదాం తరుగుదాం

వంటిల్లు



ఆనియన్ పరాఠా



కావలసినవి: గోధుమ పిండి – 400 గ్రా; ఉల్లిపాయ ముక్కలు – 150 గ్రా; చీజ్– 100 గ్రా (తురమాలి); మిరియాల పొడి– టీ స్పూన్; నూనె– టేబుల్ స్పూన్; నెయ్యి– టేబుల్ స్పూన్; ఉప్పు– అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి.

తయారీ: ● పెనంలో టీ స్పూన్ నూనె వేడి చేసి ఉల్లిపాయ ముక్కలను వేయించి పక్కన పెట్టుకోవాలి. ● పెద్ద పాత్రలో గోధుమపిండి, ఉప్పు, చీజ్, మిరియాల పొడి, నెయ్యి, వేయించిన ఉల్లిపాయ ముక్కలు వేసి తగినంత నీటితో ముద్దగా కలుపుకోవాలి. ● ఈ పిండిని పెద్ద గోళీలంత ముద్దలు చేసి చపాతీ పీట మీద వత్తాలి. ● పెనం వేడి చేసి కొద్దిగా నూనె వేసి ఒక్కో పరాఠాను రెండు వైపులా ఎరుపు రంగు వచ్చే వరకు మీడియం మంట మీద కాల్చాలి. ఈ పరాఠాలను వేడిగా వడ్డించాలి. ఇది సింధీ వంట. ఆ భాషలో కోకి అంటారు. ఎండాకాలంలో చపాతీలు తింటే వేడి చేస్తుందనిపిస్తే ఈ ఆనియన్ పరాఠాలు చేసుకోవచ్చు.

ఆనియన్ క్యారట్ సూప్



కావలసినవి: క్యారట్ ముక్కలు– 300 గ్రాములు; ఉల్లిపాయ ముక్కలు – 100 గ్రాములు; నూనె – టీ స్పూన్; యాపిల్ ముక్కలు – అర కప్పు; ఉప్పు – అర టీ స్పూన్ లేదా రుచిని బట్టి; కొత్తిమీర తురుము– టీ స్పూన్; పుదీన ఆకులు – పది; మెంతి ఆకులు– గుప్పెడు; పాలు – అర కప్పు; నీరు – ఒకటిన్నర కప్పు; మిరియాల పొడి– అర టీ స్పూన్.

తయారీ: ● ప్రెషర్ పాన్‌లో నూనె వేడి చేసి అందులో ఉల్లిపాయ ముక్కలను వేసి రెండు నిమిషాల సేపు మగ్గనివ్వాలి. ఆ తరవాత అందులో క్యారట్ ముక్కలు, యాపిల్ ముక్కలు, నీరు పోసి బాగా కలిపి మూత పెట్టి మూడు విజిల్స్ వచ్చే వరకు ఉడికించాలి.

● చల్లారిన తరవాత మొత్తాన్ని మిక్సీ జార్‌లో వేసి మెత్తగా గ్రైండ్ చేయాలి. ● ఈ మిశ్రమాన్ని మరొక బాణలిలో పోసి అందులో కొత్తిమీర, పుదీన ఆకులు, మెంతి ఆకు, పాలు, ఉప్పు, మిరియాల పొడి వేసి మూడు నిమిషాల సేపు మీడియం మంట మీద ఉడికించి దించేయాలి. ● క్యారట్– ఆనియన్ సూప్‌ని వేడిగా సర్వ్ చేయాలి.

మినీ ఆనియన్ సమోసా



కావలసినవి: సమోసా పిండి కోసం; గోధుమ పిండి లేదా మైదా– 150 గ్రా; నూనె– 2 టీ స్పూన్‌లు; జీలకర్ర – అర టీ స్పూన్; ఉప్పు – చిటికెడు.

సమోసా వేయించడానికి: నూనె– దాదాపుగా పావు కేజీ; సమోసా

లోపల స్టఫింగ్ కోసం: ఉల్లిపాయ ముక్కలు – కప్పు (సన్నగా తరగాలి) నూనె– 2 టీ స్పూన్‌లు; జీలకర్ర– అర టీ స్పూన్; ఉప్పు– పావు టీ స్పూన్ ; మిరప్పొడి – టీ స్పూన్; గరం మసాలా పొడి– అర టీ స్పూన్; ఆమ్‌చూర్ లేదా నిమ్మరసం – అర టీ స్పూన్ (ఎండిన మామిడి చూర్ణం); పసుపు – పావు టీ స్పూన్; కొత్తిమీర – 2 టేబుల్ స్పూన్‌లు (సన్నగా తరగాలి); శనగ పిండి– టేబుల్ స్పూన్.

తయారీ: ● సమోసా పిండి కోసం తీసుకున్న అన్నింటినీ ఒక పాత్రలో వేసి తగినంత నీటితో చపాతీల పిండిలా కలిపి తడి వస్త్రాన్ని కప్పి పక్కన ఉంచుకోవాలి. ● ఇప్పుడు స్టఫింగ్ సిద్ధం చేసుకోవాలి. బాణలిలో నూనె వేడి చేసి జీలకర్ర వేయించిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు వేసి రెండునిమిషాల సేపు మగ్గనిచ్చి స్టవ్ మీద నుంచి దించేయాలి. అందులో మిరప్పొడి, గరం మసాలా, ఆమ్‌చూర్ లేదా నిమ్మరసం, పసుపు, కొత్తిమీర తరుగు, శనగపిండి, ఉప్పు వేసి బాగా కలిపి పక్కన పెట్టాలి. ● సమోసాల పిండిని చిన్న గోళీలు చేసుకుని ఒక్కో గోళీని చిన్న చపాతీలా వత్తి, ఒక్కో చపాతీని రెండుగా కట్ చేయాలి. ఇలా చేయడం వల్ల వలయాకారంగా ఉన్న చపాతీ అర్ధవలయాకారపు ముక్కలవుతుంది. ఒక్కో ముక్కను కోన్‌లా చుట్టి అందులో స్టఫింగ్ మిశ్రమాన్ని ఒక స్పూన్ పెట్టి అంచులు మూసేసి అతుక్కునేటట్లు వేళ్లతో నొక్కాలి. ఇలా పిండినంతటినీ చేసుకోవాలి. ఇక్కడ తీసుకున్న కొలతలతో దాదాపుగా 20 సమోసాలు చేయవచ్చు. ● బాణలిలో నూనె వేడి చేసి సమోసాలను దోరగా వేయించాలి.

ఆనియన్ ఊతప్పం



కావలసినవి: పిండి కోసం; మినప్పప్పు – కప్పు; మెంతులు– టేబుల్ స్పూన్; పచ్చి బియ్యం – 2 కప్పులు; ఉప్పుడు బియ్యం (బాయిల్డ్ రైస్) – 2 కప్పులు; అటుకులు – కప్పు; ఉప్పు– టీ స్పూన్.

ఊతప్పం కోసం: ఉల్లిపాయ ముక్కలు –2 కప్పులు (సన్నగా తరగాలి); కొత్తిమీర – కప్పు (సన్నగా తరగాలి); ఉప్పు – చిటికెడు; నూనె– టేబుల్ స్పూన్.

తయారీ: ● దోశ పిండితో ఊతప్పం చేసుకోవచ్చు. కానీ ఊతప్పం కోసం పైన చెప్పుకున్న కొలతలు పాటిస్తే ఊతప్పం మృదువుగా, రుచిగా ఉంటుంది. మినప్పప్పు, మెంతులు, బియ్యాన్ని కడిగి ఆరు గంటల సేపు నానబెట్టాలి. రుబ్బేటప్పుడు అటుకులు, ఉప్పు వేయాలి. మెత్తగా రుబ్బిన ఈ మిశ్రమాన్ని రాత్రంతా నాననివ్వాలి. ఉదయానికి పిండి బాగా పొంగి ఉంటుంది. ● ఉల్లిపాయ ముక్కలు, కొత్తిమీర తరుగు, ఉప్పు ఒక పాత్రలో వేసి కలిపి సిద్ధం చేసుకోవాలి. ● పెనాన్ని వేడి చేసి ఒక గరిటె పిండితో మందంగా దోశ వేసి పైన ఉల్లిపాయ ముక్కల మిశ్రమం ఒక టీ స్పూన్ వేసి సమంగా సర్ది చుట్టూ కొద్దిగా నూనె వేయాలి. ఒకవైపు కాలిన తర్వాత ఉల్లిపాయ ముక్కలు రాలిపోకుండా జాగ్రత్తగా తిరగేసి రెండవ వైపు కూడా కాల్చాలి. అవసరమనిపిస్తే రెండో వైపు కాలేటప్పుడు కూడా కొద్దిగా నూనె వేసుకోవచ్చు.

గమనిక: ఎండాకాలం నూనెతో తింటే దాహం పెరుగుతుందనిపిస్తే పెనం మీద ఊతప్పం వేసిన తర్వాత మూత పెట్టి సన్న మంట మీద ఆవిరికి ఉడకనివ్వాలి. రెండవ వైపు కాలేటప్పుడు మూత పెట్టకూడదు.


'అభివృద్ధి ఎంత ముఖ్యమో... సంక్షేమమూ అంతే ముఖ్యం'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 14 | వెల: ₹ 5.50 | సంపుటి: 16 | సంచిక: 64

శుక్రవారం 26-05-2023

SIMULTANEOUSLY PRINTED AT KARIMNAGAR | HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



పటిష్టంగా లాభదాయకత..

ఆస్తుల నాణ్యతలోనూ మెరుగు... ఎస్‌అండ్‌పీ రేటింగ్స్ అంచనా. - 11లో



చెన్నైని 'ఢీ' కొట్టేదెవరు?

ఐపీఎల్ టోర్నీలో నేడు ముంబై, గుజరాత్ మధ్య రెండో క్వాలిఫయర్. - 11లో



చితికి చేరుతున్న చీతాలు

మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయవనంలో తాజాగా మరో రెండు చీతా కూనలు మరణించినట్లు అటవీశాఖ అధికారులు తెలిపారు.


- వివరాలు 6లో



హైదరాబాద్‌లో మానసిక కల్లోలం!

ఇతర నగరాలతో పోలిస్తే హైదరాబాద్‌లో ఆత్మహత్య ధోరణులు ఎక్కువగా ఉన్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది.

- వివరాలు 12లో



జైల్లో కుప్పకూలిన జైన్

ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో తీహార్ జైలులో ఉన్న సత్యేందర్ జైన్ అస్వస్థతతో గురువారం కుప్పకూలిపోయారు.

- వివరాలు 6లో



కుల ఓటు తారుమారు

కర్ణాటక ఎన్నికల్లో బీజేపీకి అండగా నిలుస్తూ వచ్చిన లింగాయత్‌లు ఈసారి కాంగ్రెస్ వైపు మొగ్గడంతో బీజేపీ మూల్యం చెల్లించుకుంది.

- వివరాలు 6లో

న్యూస్‌రీల్

భారీగా పెట్టుబడులు.. 42 వేల కొలువులు



మంత్రి కేటీఆర్ యూకే, యూఎస్ పర్యటన ముగిసింది. ఈ పర్యటనలో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను ఆకర్షించగలిగారు. తద్వారా సుమారు 42 వేల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమమైంది.

- వివరాలు 12లో

ఘనకీర్తిని చాటుదాం

ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా దశాబ్ది ఉత్సవాలు జరపాలి

- మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధుల సమన్వయంతో విజయవంతం చేయాలి: సీఎం కేసీఆర్
- రూ.105 కోట్ల విడుదలకు ఆదేశం
- ఒక్కో నియోజకవర్గంలో 3 వేల మందికి గృహలక్ష్మి
- కలెక్టర్ల ఆధ్వర్యంలో పథకం అమలు
- అన్ని రంగాల్లోనూ దేశంలోనే ముందంజలో తెలంగాణ
- పంటల సాగును రైతులు ముందుకు జరుపుకోవాలి
- బీసీ, ఎంబీసీ కుల వృత్తులకు రూ. లక్ష ఆర్థిక సహాయం
- సచివాలయంలో కలెక్టర్లు, ఎస్పీలతో సీఎం సమావేశం



సచివాలయంలో జరిగిన సమీక్షలో మాట్లాడుతున్న సీఎం కేసీఆర్

సాక్షి, హైదరాబాద్: పోరాటాలు, త్యాగాలతో ప్రజాస్వామ్య పంథాలో సాధించుకున్న స్వరాష్ట్రం పదేళ్ల ప్రగతి ప్రస్థానాన్ని.. దశాబ్ది ఉత్సవాల సందర్భంగా అమరుల త్యాగాలను స్మరించుకుంటూ, ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా ఘనంగా జరపాలని సీఎం కె.చంద్రశేఖర్‌రావు ఆదేశించారు. జూన్ 2 నుంచి 3 వారాల పాటు తెలంగాణ ఘనకీర్తిని చాటి చెప్పేలా సంబురాలు జరపాలన్నారు. ఉత్సవాల నిర్వహణకు రూ.105 కోట్లను విడుదల చేయాలని ఆర్థిక శాఖను ఆదేశించారు. తెలంగాణ రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలతో పాటు ఇతర అంశాలపై గురువారం రాష్ట్ర సచివాలయంలో జిల్లా కలెక్టర్లు, ఎస్పీలు/పోలీసు కమిషనర్లతో సీఎం సమావేశం నిర్వహించారు. ఉత్సవాల్లో భాగంగా రోజువారీగా నిర్వహించాల్సిన కార్యక్రమాలపై కలెక్టర్లకు దిశానిర్దేశం చేశారు. గ్రామాలు, నియోజకవర్గాలు, జిల్లాల వారీగా చేపట్టాల్సిన కార్యక్రమాలను వివరించారు. మంత్రులు, ఎమ్మెల్యేలు, ప్రజాప్రతినిధులను సమన్వయం చేసుకుంటూ విజయవంతం చేయాలని కోరారు. శాఖలు సాధించిన అభివృద్ధి, అందుకు రాష్ట్ర ప్రభుత్వం అనుసరించిన ప్రజా సంక్షేమ కోణాన్ని, తాత్విక ధోరణిని, దాని వెనకున్న దార్శనికతను వివరించారు. వ్యవసాయం, విద్యుత్, సాగునీరు, రోడ్లు, భవనాలు తదితర శాఖల ప్రగతిని ప్రత్యేకంగా కొనియాడారు.

మూడు విడతల్లో గృహలక్ష్మి సాయం

ప్రతి శాసనసభ నియోజకవర్గంలో 3 వేల మంది చొప్పున అర్హులైన లబ్ధిదారులకు గృహలక్ష్మి పథకాన్ని వర్తింపచేయాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. జిల్లా కలెక్టర్ల ఆధ్వర్యంలో గృహలక్ష్మి పథకం అమలవుతుందని స్పష్టం చేశారు. సొంత స్థలాల్లో

మిగతా 2వ పేజీలో ▶



కేంద్రం ఆధ్వర్యంలో ఆవిర్భావ ఉత్సవాలు!

- 2న గోల్కొండ కోటలో నిర్వహణకు నిర్ణయం
- జెండా వందనం, కేంద్ర బలగాల కవాతు: కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

12లో

టాపర్స్‌గా అబ్బాయిలు... టోటల్‌గా అమ్మాయిలు!

ఎంసెట్ ఫలితాలు విడుదల చేసిన మంత్రి సబిత

టాప్-10లో అబ్బాయిలే ఎక్కువ.. అర్హత పొందిన వారిలో అమ్మాయిలే ఎక్కువ

ర్యాంకర్లలో ఎక్కువ మంది ఏపీకి చెందిన విద్యార్థులు

మొత్తంగా ఇంజనీరింగ్‌లో 80.33 శాతం.. అగ్రి, మెడికల్‌లో 86.31% ఉత్తీర్ణత

ఇంజనీరింగ్



అనిరుధ్ – మొదటి ర్యాంకు | మణీందర్‌రెడ్డి – రెండో ర్యాంకు | ఉమేశ్ వరుణ్ – మూడో ర్యాంకు

అగ్రికల్చర్ అండ్ మెడికల్



జశ్వంత్ – మొదటి ర్యాంకు | వెంకటతేజ – రెండో ర్యాంకు | సఫల్ లక్ష్మి – మూడో ర్యాంకు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్‌లో ఈసారి ఎక్కువ మంది అమ్మాయిలే అర్హత సాధించారు. ఇదే సమయంలో టాప్ ర్యాంకుల్లో అబ్బాయిల హవా కొనసాగింది. మొత్తంగా ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో 80 శాతం.. అగ్రి, మెడికల్ స్ట్రీమ్‌లో 86 శాతం మంది అర్హత సాధించారు. ఇక ర్యాంకులు తెలంగాణ విద్యార్థులకన్నా.. ఏపీకి చెందినవారికే ఎక్కువగా వచ్చాయి. ఇంజనీరింగ్, ఫార్మసీ, నర్సింగ్, వ్యవసాయ కోర్సుల్లో ప్రవేశానికి ఉన్నత విద్యామండలి, జేఎన్‌టీయూహెచ్ నేతృత్వంలో ఈ నెల 10 నుంచి 14 వరకు ఎంసెట్ పరీక్షను నిర్వహించారు. ఈ ఫలితాలను విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి గురువారం విడుదల చేశారు. ఈ కార్యక్రమంలో కాలేజీ విద్య కమిషనర్ నవీన్ మిత్తల్, విద్యాశాఖ కార్యదర్శి వాకాటి కరుణ, ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆర్.లింబాద్రి, వైస్ చైర్మన్ వి.వెంకటరమణ, జేఎన్‌టీయూహెచ్ వీసీ కట్టా నర్సింహారెడ్డి, ఎంసెట్ కన్వీనర్ డీన్‌కుమార్‌లు పాల్గొన్నారు.

భారీగా దరఖాస్తులు

రాష్ట్ర ఎంసెట్‌కు ఈసారి దరఖాస్తులు భారీగా పెరిగాయి. నర్సింగ్ సీట్ల భర్తీ కూడా ఎంసెట్ ర్యాంకు ద్వారానే చేపట్టడంతో డిమాండ్ వచ్చింది. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌కు మొత్తం 2,05,351 మంది దరఖాస్తు చేసుకోగా.. 1,95,275 మంది పరీక్షకు హాజరయ్యారు. వీరిలో 1,56,879 (80.33 శాతం) మంది అర్హత సాధించారు. అగ్రి, మెడికల్ స్ట్రీమ్‌కు 1,15,332 మంది దరఖాస్తు చేసుకోగా.. 1,06,514

మిగతా 5వ పేజీలో ▶

ఉద్యోగాల వెల్లువ

1,000 గ్రూప్-1, గ్రూప్-2 పోస్టుల భర్తీకి ఏపీ సీఎం జగన్ గ్రీన్‌సిగ్నల్

- గ్రూప్-1లో 100 పోస్టులు, గ్రూప్-2లో 900 పోస్టులు

సాక్షి, అమరావతి: ఏపీలో మరోసారి ఉద్యోగాల జాతరకు రాష్ట్ర ప్రభుత్వం నగారా మోగించింది. కీలకమైన గ్రూప్-1, గ్రూప్-2కు సంబంధించి మొత్తం 1,000 పోస్టులను భర్తీ చేయాలని నిర్ణయించింది. ఇందులో గ్రూప్-1 పోస్టులు 100కాగా గ్రూప్-2 పోస్టులు 900 ఉన్నాయి. ఈ మొత్తం పోస్టుల భర్తీకి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గ్రీన్‌సిగ్నల్ ఇచ్చారు. ఈ నేపథ్యంలో ఈ పోస్టులకు అతి త్వరలోనే ఆంధ్రప్రదేశ్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ (ఏపీపీఎస్సీ) నోటిఫికేషన్లు విడుదల చేయనుంది. ఈ మేరకు ముఖ్యమంత్రి వైఎస్ జగన్ గురువారం ఉదయం గ్రూప్-1, 2 పోస్టుల భర్తీపై అధికారులతో సమీక్ష నిర్వహించారు. ఈ పోస్టులకు సంబంధించి

మిగతా 2వ పేజీలో ▶

బీఆర్‌ఎస్‌ను దించే ప్లాన్ ఏంటి?

ఈటలను ప్రశ్నించిన పొంగులేటి, జూపల్లి!

- బీఆర్‌ఎస్ అసంతృప్త నేతలతో ఈటల రాజేందర్ మంతనాలు..బీజేపీలోకి రావాలని ఆహ్వానం
- గన్‌మన్లు లేకుండానే 4 గంటలకుపైగా భేటీ
- బీఆర్‌ఎస్‌ను గద్దె దించే ప్రణాళికను వివరించిన ఈటల.. సంతృప్తి చెందని నేతలు.. పార్టీలో చేరడానికి మరింత సమయం కావాలన్న పొంగులేటి, జూపల్లి

2లో

వ్యవస్థలో మార్పు కోసమే యాత్రలు



కాంగ్రెస్ అధికారంలోకి వచ్చేందుకు కాదు

- జడ్చర్ల సభలో హిమాచల్ సీఎం సుఖ్వీందర్‌సింగ్ సుఖు
- కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఓపీఎస్ అమలు
- ఉపాధి హామీ తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర
- రాష్ట్రంలో కాంగ్రెస్ నేతలందరితో కలిసి బస్సు యాత్ర: ఠాక్రే



సభలో మాట్లాడుతున్న భట్టి

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: రాహుల్ గాంధీ భారత్ జోడో యాత్ర, రేవంత్ హాథ్ సే హాథ్ జోడో యాత్ర, మల్లు భట్టి పీపుల్స్ మార్చ్ పాదయాత్రలు కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చేందుకు కాదని.. వ్యవస్థలో మార్పు కోసమేనని హిమాచల్‌ప్రదేశ్ సీఎం సుఖ్వీందర్ సింగ్ సుఖు అన్నారు. రాహుల్‌గాంధీ భారత్ జోడో యాత్ర ప్రధాని పదవి కోసం చేయలేదని, దేశంలో నెలకొన్న విద్వేషాలను తొలగించేందుకు చేశారని చెప్పారు. తెలంగాణలో టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డి, సీఎల్పీ నేత భట్టి.. రాహుల్ సందేశాన్ని వివరిస్తూ వ్యవస్థలో మార్పు కోసం పాదయాత్రలు చేస్తున్నారని వివరించారు. ఆ మార్పు కోసం కాంగ్రెస్ పార్టీకి ఓటు వేయాలని కోరారు. 'పీపుల్స్‌మార్చ్ ఫర్ ఛేంజ్' పేరుతో ప్రారంభమైన భట్టి పాదయాత్ర 69వ రోజు 800 కిలోమీటర్లు పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా మహబూబ్‌నగర్ జిల్లా జడ్చర్లలో గురువారం నిర్వహించిన బహిరంగ సభకు హిమాచల్ సీఎం ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు.

కాంగ్రెస్ కారణంగానే దేశాభివృద్ధి

స్వాతంత్య్రం వచ్చిన తొలినాళ్లలో దేశంలో గుండుసూది కూడా తయారు చేసే పరిస్థితి లేదని.. ఆ స్థితి నుంచి ఇప్పుడు ఎంతో అభివృద్ధి చెందిందంటే కాంగ్రెస్ పార్టీయే కారణమని సుఖు చెప్పారు. 2004లో సోనియా గాంధీ ప్రధాని అయ్యే అవకాశం ఉన్నప్పటికీ త్యాగం చేశారని గుర్తు చేశారు. అప్పట్లో సోనియా ప్రధాని కావాలని చెప్పిన పార్టీల్లో బీఆర్ఎస్‌గా మారిన టీఆర్ఎస్ కూడా ఉందని తెలిపారు. రానున్న

మిగతా 2వ పేజీలో ▶



ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే వారిదే

- ఆస్ట్రేలియాలో అధికార, ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ప్రశంసలు
- పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన పార్టీలపై పరోక్ష విమర్శలు

- వివరాలు 6లో

ఆగస్టులో గురుకుల పరీక్షలు!

రేపటితో ముగియనున్న టీజీటీ దరఖాస్తు ప్రక్రియ

- ఇక అన్ని కేటగిరీలకు పరీక్షల నిర్వహణపై బోర్డు దృష్టి
- ఇతర పరీక్షలతో క్లాష్ కాకుండా తేదీల పరిశీలన
- త్వరలో ఇతర బోర్డులతో సంప్రదింపులు

సాక్షి, హైదరాబాద్: గురుకుల విద్యా సంస్థల్లో ఉద్యోగాల భర్తీకి సంబంధించి దరఖాస్తు ప్రక్రియ చివరి దశకు చేరింది. ట్రైన్డ్ గ్రాడ్యుయేట్ టీచర్ (టీజీటీ) కొలువులకు దరఖాస్తు గడువు శనివారం సాయంత్రంతో ముగియనుంది. దీంతో గురుకుల విద్యా సంస్థల్లో అన్ని కేటగిరీల ఉద్యోగాలకు దరఖాస్తుల స్వీకరణ పూర్తికానుంది. అర్హత పరీక్షల విధానానికి సంబంధించిన అంశాలను నోటిఫికేషన్ల ద్వారా అభ్యర్థులకు వివరించిన

మిగతా 2వ పేజీలో ▶

క్లుప్తంగా...

'టాప్-10'లో శ్రీచైతన్యకే అధిక ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్-2023 ఫలితాల్లో శ్రీచైతన్య చరిత్ర సృష్టించింది. ఇంజనీరింగ్‌లో స్టేట్ ఫస్ట్‌ర్యాంక్‌తో పాటు టాప్ 10లోపు 6, అగ్రి, మెడికల్‌లో టాప్ 10లోపు 8 ర్యాంకులు సాధించి రికార్డ్ నమోదు చేసినట్లు ఆ విద్యాసంస్థల అకడమిక్ డైరెక్టర్ సుష్మ తెలిపారు. ఆమె మీడియాతో మాట్లాడుతూ ఇంజనీరింగ్ స్టేట్ ఫస్ట్ ర్యాంక్ ఎస్.అనిరుధ్ పి.ప్రమోద్‌కుమార్‌రెడ్డి 5, వి.శాన్వితారెడ్డి 7, బి.సంజన 8, ఎస్.ప్రిన్స్ బ్రణహంరెడ్డి 9, ఎమ్.ప్రణతి శ్రీజ 10 ర్యాంకులు, అగ్రి/మెడికల్‌లో స్టేట్ 2వ ర్యాంక్ ఎస్.వెంకట్ తేజ, పి.సఫల్‌లక్ష్మీ 3, డి.కార్తికేయరెడ్డి 4, బి.వరుణ్ చక్రవర్తి 5, డి.గురుశశిధర్ 6, డి.సాయిరెడ్డి 7, కే.ప్రీతమ్ సిద్ధార్థ్ 10వ ర్యాంకులు సాధించినట్లు తెలిపారు. విద్యార్థులను, తల్లిదండ్రులను, అధ్యాపక బృందాన్ని శ్రీచైతన్య అధినేత డాక్టర్ బీఎస్ రావు అభినందించారు.

'నారాయణ'వే అత్యుత్తమ ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్-2023 ఫలితాల్లో నారాయణ విద్యార్థులు రికార్డ్ సృష్టించారని ఆ విద్యాసంస్థల మేనేజింగ్ డైరెక్టర్లు డా.పి. సింధూర నారాయణ, పి.శరణి వెల్లడించారు. స్టేట్ 6, 9, వంటి అత్యుత్తమ ర్యాంకులతో పాటు 15, 18, 19, 22, 30, 35, 36, 37, 43, 45, 46, 48, 51, 52, 53, 54, 60, 61, 64, 66, 67, 69, 72, 78, 82, 85, 86, 87, 89, 94, టాప్ 100లో 35 ర్యాంకులు నారాయణ విద్యార్థులే చేజిక్కించుకున్నారని చెప్పారు. మొత్తంగా 10లోపు 2, 100లోపు 35, 500లోపు 232, 1,000లోపు 453 ర్యాంకులు సాధించి మళ్లీ తమ విద్యార్థులు సత్తాచాటారని తెలిపారు. ఇంతటి విజయాన్ని సాధించిన విద్యార్థులకు, తల్లిదండ్రులకు, అధ్యాపక బృందానికి నారాయణ విద్యాసంస్థల ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పునీత్ అభినందనలు తెలిపారు.

ఎంసెట్‌లో 'అల్ఫోర్స్' ప్రతిభ

కొత్తపల్లి (కరీంనగర్): ఎంసెట్-2023 ఇంజనీరింగ్, అగ్రికల్చర్ ఫలితాల్లో అల్ఫోర్స్ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించారు. వారిని గురువారం విద్యాసంస్థల చైర్మన్ డాక్టర్ వి.నరేందర్‌రెడ్డి బొకేలతో సన్మానించారు. ఎం.అభిరామ్ 301వ ర్యాంకు సాధించి అత్యున్నత స్థానంలో నిలువగా ఎ.ఇషాంత్‌రెడ్డి 322, బి.శ్రీగోధ 356, జి.జ్యోతి 374, టి.దీపిక 446, ఎం.చిన్మయ్ 542, బి.శ్రీనివాస్ 650, ఎస్.సాయిసదిష్ట 681, కె.ప్రణీతరెడ్డి 752, హస్వితరెడ్డి 818, బి.విద్యాలక్ష్మి 821, ఎస్.ధీరజ్‌కుమార్ 833, ఎన్.మనస్విని 865, ఆర్.సుహాసిత 893వ ర్యాంకులు సాధించినట్లు ఆయన చెప్పారు. వెయ్యిలోపు 14 మంది, 2,000లోపు 40 మంది, 3,000లోపు 63 మంది, 5,000లోపు 118 మంది ర్యాంకులు సాధించారని వివరించారు.

'ఎస్ఆర్' విద్యార్థుల సత్తా

విద్యారణ్యపురి: టీఎస్ ఎంసెట్ ఫలితాల్లో ఎస్ఆర్ విద్యాసంస్థలకు చెందిన పలువురు విద్యార్థులు రాష్ట్రస్థాయిలో సత్తా చాటారని ఆ విద్యాసంస్థల చైర్మన్ ఎ.వరదారెడ్డి, డైరెక్టర్లు మధుకర్‌రెడ్డి, సంతోష్‌రెడ్డి గురువారం తెలిపారు. ఎంపీసీ విభాగంలో రాష్ట్రస్థాయిలో జి.సాత్విక్ 41వ ర్యాంకు, ఎ.మణిదీప్‌రెడ్డి 70, పి.నర్మద 71వ ర్యాంకు సాధించినట్లు వివరించారు. అలాగే, జి.బాలరాజు బీపీసీ విభాగంలో 63, ఇంకా వి.దీక్షిత్‌రెడ్డి 153, మాకినేని సింగు 254, బి.నితిన్ 261, కె.ఆశ్రిత్‌రెడ్డి 278, వారణాసి సాయి సిద్ధార్థ 296, రేణికుంట్ల ఐశ్వర్య 480, సీహెచ్.సోనిక 508, కె.వీరేష్ 530వ ర్యాంకు సాధించినట్లు తెలిపారు. ర్యాంకర్లను చైర్మన్, డైరెక్టర్లు అభినందించారు.

'ఫిట్-జీ'కి 4, 21 ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ ఎంసెట్-2023 ఫలితాల్లో ఎఫ్ఐఐటీజేఈఈ (ఫిట్-జీ) హైదరాబాద్ విద్యార్థులు ప్రతిభను కనబరిచారు. అభినీత్ మాజేటి 4వ ర్యాంకు, ఈవూరి మోహన శ్రీధరరెడ్డి 21వ ర్యాంకు సాధించినట్లు సంస్థ డైరెక్టర్ డాక్టర్ ఆనందరామన్ వెల్లడించారు. వీరిద్దరూ ఫిట్-జీ వరల్డ్ స్కూల్‌లో 9, 10వ తరగతులు, ఇంటర్మీడియట్ విద్యను అభ్యసించారని తెలిపారు.

'దశాబ్ది ఉత్సవాలను బహిష్కరించండి'

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/కొత్తపల్లి (కరీంనగర్): బలవంతంగా ప్రజలపై రుద్దుతున్న రాష్ట్ర అవతరణ దశాబ్ది ఉత్సవాలను తెలంగాణ సమాజం బహిష్కరించాలని బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ పిలుపునిచ్చారు. ప్రజాప్రతినిధులు ఉత్సవాల పేరుతో గ్రామాల్లోకి వస్తే.. 'మా ఆస్తుల్ని ఎంత కొల్లగొట్టారు? మీ ఆస్తులు ఎంత పెరిగాయి?' అని నిలదీయాలని గురువారం సూచించారు.

జీఓ 111 రద్దుతో జీవావరణ వినాశనం

'వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా' ఆందోళన

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్‌లోని జంట జలాశయాల పరీవాహక ప్రాంత పరిరక్షణకు తెచ్చిన జీఓ 111ను ఉపసంహరిస్తూ కేబినెట్ తీసుకున్న నిర్ణయాన్ని వాటర్‌మ్యాన్ ఆఫ్ ఇండియా రాజేంద్రసింగ్ తీవ్రంగా వ్యతిరేకించారు. జలాశయాల పరిరక్షణతోపాటు పర్యావరణహితం, జీవరాశుల మనుగడకు జీఓ 111ను తప్పనిసరి చేశారన్నారు. ఈ జీఓ రద్దుతో జీవావరణానికి తీవ్ర హాని కలుగుతుందన్నారు. ప్రభుత్వం ఈ నిర్ణయాన్ని ఉపసంహరించుకోవాలని రాజేంద్రసింగ్ సీఎం కేసీఆర్‌ను కోరారు. లేకుంటే సుప్రీంకోర్టుకు వెళ్లేందుకూ వెనుకాడబోమని గురువారం ఒక ప్రకటనలో హెచ్చరించారు.



గురువారం సచివాలయం ఆవరణలో సీఎస్, డీజీపీ సహా ఉన్నతాధికారులతో ముఖ్యమంత్రి కేసీఆర్ గ్రూప్ ఫొటో

ఘనకీర్తిని చాటుదాం

▶ మొదటి పేజీ తరువాయి

ఇళ్ల నిర్మాణానికి రూ.3 లక్షలు ఆర్థిక సహాయం అందించడానికి గృహలక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టిన విషయం తెలిసిందే. కాగా ఇళ్ల నిర్మాణానికి సంబంధించిన ఆయా దశలను ఫొటోలు, ఇతర మార్గాల ద్వారా నిర్ధారించుకుని, నిర్మాణ పనులను పర్యవేక్షిస్తూ లబ్ధిదారులకు దశలవారీగా గృహలక్ష్మి పథకాన్ని వర్తింపజేయాలని కేసీఆర్ సూచించారు. లబ్ధిదారులకు మొదటి దశ (బేస్‌మెంట్)లో రూ.లక్ష, స్లాబ్ దశలో మరో రూ.లక్ష, చివరి దశలో మిగిలిన రూ.లక్ష అందించాలని చెప్పారు. ఇందుకు సంబంధించిన విధివిధానాలను రూపొందించి జిల్లాల కలెక్టర్లకు పంపించాలని ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి శాంతికుమారిని ఆదేశించారు.

రైతుల్ని చైతన్యపరచాలి..

'వ్యవసాయంలో రాష్ట్ర ప్రగతి దేశానికే ఆదర్శంగా నిలిచింది. రాష్ట్రంలో ధాన్యం దిగుబడి 3 కోట్ల మెట్రిక్ టన్నులు దాటింది. ప్రాజెక్టులతో పుష్కలంగా సాగునీరు, 24 గంటల ఉచిత కరెంటు, గ్రౌండ్ వాటర్ ఉంది. మొగులు మొకం చూడకుండా కాల్వల నీళ్లతో వరి నాట్లు పెట్టుకునే పరిస్థితి తుంగతుర్తి, సూర్యాపేట వంటి ప్రాంతాల్లో కూడా ఉంది. అయితే యాసంగి నాట్లు ఆలస్యం కావడంతో వేసవిలో అకాల వర్షాలు, వడగండ్లతో పంటలకు నష్టం వాటిల్లుతోంది. ఈ బాధలు తప్పాలంటే నవంబర్ 15, 20లోగా యాసంగి వరినాట్లు వేసుకోవాలి. యాసంగి నాట్లు ముందుగా పడాలంటే వానాకాలం వరినాటును కూడా ముందుకు జరుపుకోవాలి. రోహిణీ కార్తె ప్రారంభంలోనే వానాకాలం వరినాట్లు మొదలు కావాలి. మే 25 నుంచి జూన్ 25 మధ్య వరినాట్లు పూర్తి కావాలి. యాసంగి వరినారు నవంబర్‌లో అలికితే తీవ్రమైన చలికి నారు పెరగదనే అపోహ రైతుల్లో ఉంది. అది వాస్తవం కాదు. వరి తూకం పోసేటప్పుడు కాదు, వరి ఈనే సమయంలో చలి ఉండొద్దు. ఈనేటప్పుడు చలి వుంటే తాలు ఎక్కువవుతుంది. ఎండలు ముదరకముందే వరి కోసుకుంటే గింజ గట్టిగ ఉండి తూకం కూడా బాగుంటుంది. యాసంగి వరిని ముందుగా నాటుకుంటే తాలు తక్కువ, తూకం ఎక్కువ అవుతుంది. కలెక్టర్లు, వ్యవసాయ శాఖ ఈ దిశగా రైతులను చైతన్యపరచాలి..' అని కేసీఆర్ ఆదేశించారు.

ఉత్సవాల వీడియో రికార్డింగ్..

'దశాబ్ది ఉత్సవాలను జిల్లాల వారీగా కలెక్టర్లు వీడియో రికార్డు చేసి భద్రపరచాలి. నియోజకవర్గాలు, జిల్లాల వారీగా జరిగిన అభివృద్ధిని తెలిపే పదేళ్ల ప్రగతి నివేదిక, పుస్తకాలను ముద్రించి పంపిణీ చేయాలి. ఆయా రంగాల అభివృద్ధిపై డాక్యుమెంటరీలు రూపొందుతున్నాయి. ఉత్సవాల సందర్భంగా వీటిని ప్రదర్శించాలి. ఆయా జిల్లాల అభివృద్ధికి సంబంధించిన పూర్తి వివరాలను మంత్రులు ఈ దశాబ్ది ఉత్సవాల్లో ప్రజలకు వివరించేలా సిద్ధం కావాలి..' అని ముఖ్యమంత్రి సూచించారు.

4 లక్షల ఎకరాలకు పోడు పట్టాలు..

'జూన్ 24 నుంచి 30 వరకు రాష్ట్రంలో ఆదివాసీ, గిరిజనులు సాగుచేసుకుంటున్న అటవీ భూములకు పోడు పట్టాలను పంపిణీ చేయాలి. 2,845 గ్రామాలు, తండాలు, గూడేల పరిధిలో 4,01,405 ఎకరాల పోడు భూములకు పట్టాలు అందచేయనున్నాం. మొత్తం 1,50,224 మంది గిరిజనులకు లబ్ధి చేకూరుతుంది. పోడు భూముల లబ్ధిదారుల పేరుతో ప్రభుత్వమే బ్యాంకు ఖాతాను తెరిపించాలి. ఈ ఖాతాల ద్వారా వారికి ప్రభుత్వం రైతుబంధును అందజేస్తుంది. 3.08 లక్షల మంది ఆర్ఓఎఫ్ఆర్ పట్టాదారులకు కూడా రైతుబంధును వర్తింపజేస్తాం..' అని ప్రకటించారు.

గొర్రెల పంపిణీని కూడా ప్రారంభించాలి..

'బీసీ కుల వృత్తులను కాపాడడమే రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యం. కులవృత్తులతో జీవనం కొనసాగిస్తున్న విశ్వకర్మలు, ఇతర బీసీ, ఎంబీసీ కులాలను ఆదుకునేందుకు రూ.లక్ష ఉచిత ఆర్థిక సాయాన్ని అందించనున్నాం. జూన్ 9న జరుపుకొనే తెలంగాణ సంక్షేమ సంబురాల్లో.. సబ్ కమిటీ సిఫారసు చేసిన, ఇప్పటికీ ప్రభుత్వ పథకాలు అందుకోని బీసీ, ఎంబీసీ కులాలకు రూ.లక్ష ఆర్థిక సాయాన్ని అందిస్తాం. ప్రతి అసెంబ్లీ నియోజకవర్గానికి 1,100 మంది లబ్ధిదారులను ఎంపిక చేసి దళితబంధు పథకాన్ని అమలు చేయాలి. గొర్రెల పంపిణీ కార్యక్రమాన్ని కూడా దశాబ్ది ఉత్సవాల సందర్భంగా ప్రారంభించి దశల వారీగా అమలు చేయాలి..' అని ఆదేశించారు.

సఫాయి కార్మికులు భగవంతుడంతటివారు..

'గ్రామ, పట్టణ స్థాయిల్లో పారిశుధ్య కార్మికుల సేవలు వెలకట్టలేనివి. దశాబ్ది వేడుకల సందర్భంగా 'సఫాయన్నా.. నీకు సలామన్నా' అనే నినాదంతో ఉత్తమ మహిళా, పురుష కార్మికులకు అవార్డులు అందించి గొప్పగా గౌరవించుకుంటాం. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచుతూ తోటి మానవుల కోసం వారి జీవితాలను త్యాగం చేస్తున్న పారిశుధ్య కార్మికులు భగవంతుడంతటివారు. వారి సంక్షేమానికి ప్రభుత్వం కట్టుబడి ఉంది. జీతాలు పెంచుతున్నది వారిపై గౌరవంతోనే' అని కేసీఆర్ స్పష్టం చేశారు.

అన్ని రాష్ట్రాలను దాటేసి ముందంజ

'తెలంగాణ.. వ్యవసాయం, ఐటీ, పరిశ్రమలు, విద్యుత్ సహా అన్ని రంగాల్లోనూ దేశంలోనే ముందంజలో ఉంది. గుజరాత్, మహారాష్ట్ర, తమిళనాడు, పంజాబ్ హరియాణాలను దాటేసి దూసుకుపోతోంది. ఎరువుల వినియోగం 8 లక్షల టన్నుల నుంచి 28 లక్షల టన్నులకు పెరిగింది. గంజి కేంద్రాలు నడిచిన పాలమూరులో పచ్చని పంటలతో పారే వాగులతో పాలుగారే పరిస్థితి నెలకొన్నది. ధాన్యం ఉత్పత్తిలో మనం పంజాబ్‌ను దాటేసి పోతున్నాం. విద్యా, వైద్య రంగాల్లోనూ తెలంగాణ అత్యద్భుత ఫలితాలను అందుకుంటూ దేశానికే ఆదర్శంగా నిలిచింది. రాష్ట్ర విద్యార్థులు నీట్, సివిల్స్ పరీక్షల్లో దేశంలోనే ముందువరుసలో ర్యాంకులు సాధిస్తూ తెలంగాణ కీర్తిని చాటుతున్నారు..' అని సీఎం తెలిపారు. (నారాయణపేట ఎస్పీ వెంకటేశ్వర్లు కుమార్తె సివిల్స్‌లో మూడో ర్యాంకు సాధించినందుకు ఈ సందర్భంగా సమావేశం అభినందనలు తెలిపింది).

లక్షన్నర పోడు దరఖాస్తులు.. 4 లక్షల ఎకరాలు

- సీఎం అధ్యక్షతన జరిగిన కలెక్టర్ల సదస్సులో ప్రభుత్వం వెల్లడి
- నమూనా పాసుపుస్తకం విడుదల.. త్వరగా జారీకి చర్యలు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ప్రభుత్వం అందించనున్న పోడుభూముల పట్టాల కోసం గురువారం నాటికి 1,50,012 మంది గిరిజన, ఆదివాసీ రైతులు దరఖాస్తులు సమర్పించారు. దరఖాస్తుల ఆధారంగా ఆయా రైతులు సాగు చేసుకుంటున్న పోడుభూముల విస్తీర్ణం 4,05,601 ఎకరాలుగా ఉన్నట్లు అధికారులు నిర్ధారించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ అధ్యక్షతన గురువారం జరిగిన కలెక్టర్ల సదస్సులో ఈ గణాంకాలను రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసింది. రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల్లో పోడు దరఖాస్తులు వచ్చాయి. అందులో అత్యధికంగా భద్రాద్రి కొత్తగుడెం నుంచి 50,595 మంది రైతులు దరఖాస్తులు సమర్పించారు. ఈ జిల్లాలో ఏకంగా 1,51,195 ఎకరాల విస్తీర్ణంలో రైతులు సాగు చేసుకుంటున్నారు. ఆ తర్వాతి స్థానాల్లో మహబుబాబాద్ (24,972 దరఖాస్తులు–70,434 ఎకరాల విస్తీర్ణం), కుమురం బీం ఆసిఫాబాద్ (15,254 దరఖాస్తులు–44,750 ఎకరాల విస్తీర్ణం), అదిలాబాద్ (12,222 దరఖాస్తులు–31,683 ఎకరాల విస్తీర్ణం) జిల్లాలు ఉన్నాయి. ఈ సదస్సులో పట్టా పాసుపుస్తకం నమునాను ప్రభుత్వం విడుదల చేసింది. వీలైనంత త్వరగా రైతులకు పాసుపుస్తకాలు ఇచ్చేందుకు చర్యలు వేగవంతం చేసింది.



పోడుభూములకు సంబంధించిన అటవీ హక్కు పత్రం

..మార్పు కోసమే యాత్రలు



గురువారం జడ్చర్ల సభలో ప్రజలకు అభివాదం చేస్తున్న కోమటిరెడ్డి, రేవంత్, సుఖు, భట్టి, ఠాక్రే

▶ మొదటి పేజీ తరువాయి

ఎన్నికల్లో తెలంగాణలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక హిమాచల్ ప్రదేశ్ తరహాలో ఓపీఎస్ (పాత పింఛను విధానం) తీసుకొస్తామని హామీ ఇచ్చారు. పేదలకు అన్నం పెట్టేందుకు కాంగ్రెస్ హయాంలో తీసుకొచ్చిన ఉపాధి హామీ పథకాన్ని తొలగించేందుకు బీజేపీ ప్రభుత్వం కుట్ర పన్నిందని ఆరోపించారు. కరోనా కాలంలో ఎంతోమంది పేదలకు ఆ పథకం కడుపు నింపిందని గుర్తు చేశారు. రాష్ట్రంలో రేవంత్, భట్టిల పాదయాత్రలు ముగిశాక పార్టీ ముఖ్య నేతలందరితో కలిసి బస్సు యాత్ర నిర్వహించనున్నట్లు కాంగ్రెస్ రాష్ట్ర వ్యవహారాల ఇన్‌చార్జి మాణిక్‌రావు ఠాక్రే వెల్లడించారు. అన్ని జిల్లాల్లో యాత్ర కొనసాగుతుందని చెప్పారు.

కేసీఆర్ కిడ్నీలు ఇచ్చినా జనం నమ్మరు: రేవంత్‌రెడ్డి

కర్ణాటక ఎన్నికల ఫలితాలతో సీఎం కేసీఆర్ తెలంగాణ ఆడబిడ్డలకు ఉచితంగా సిలిండర్లను ఇచ్చే ఆలోచన చేస్తున్నారని, కేసీఆర్ కిడ్నీలు ఇచ్చినా జనం నమ్మే పరిస్థితిలో లేరని రేవంత్‌రెడ్డి అన్నారు. సీఎం కేసీఆర్ కుటుంబం రాజ్యాలు ఏలితే, బడుగుల బిడ్డలు వలసలు పోవాలా? అని ప్రశ్నించారు. పాలమూరు ప్రాజెక్టు తర్వాత ప్రారంభమైన కాళేశ్వరం, రంగనాయక సాగర్, మల్లన్న సాగర్ ప్రాజెక్టులను పూర్తిచేసిన కేసీఆర్, పాలమూరుకు మాత్రం చుక్కనీరు తేలేదని విమర్శించారు. ఉమ్మడి జిల్లాలో 14 అసెంబ్లీ, రెండు పార్లమెంట్ స్థానాల్లో కాంగ్రెస్‌ను గెలిపించి అండగా నిలవాలని కోరారు. రేవంత్‌రెడ్డి పరోక్షంగా అలంపూర్ అసెంబ్లీ అభ్యర్థిని ప్రకటించారు. వెనుకబడిన అలంపూర్ నియోజకవర్గంలో ఏఐసీసీ నుంచి ప్రాతినిధ్యం వహిస్తున్న సంపత్ కుమార్‌ను అధిక మెజార్టీతో గెలిపించాలన్నారు.

ఐలమ్మ స్ఫూర్తితో తిరగబడాలి: భట్టి

'కాంగ్రెస్ పంచిన భూములను బీఆర్ఎస్ ప్రభుత్వం ధరణి పేరుతో లాక్కొంటోంది. ఈ భూములపై పోరాడతాం.. రుతుపవనాలు వస్తున్నాయి. మేమంతా వచ్చి అరకలు దున్నిస్తాం' అంటూ రైతులకు భట్టి భరోసా కల్పించారు. కాంగ్రెస్ పంచిన భూములను కాపాడుకునేందుకు చాకలి ఐలమ్మ స్ఫూర్తితో ప్రభుత్వంపై తిరగబడాలని పిలుపునిచ్చారు. పాదయాత్రలో ప్రజల బాధలు గుర్తించామని ఆయన తెలిపారు. తొమ్మిదేళ్లయినా పాలమూరు ప్రాజెక్టు పూర్తిచేయని బీఆర్ఎస్ ప్రభుత్వానికి శిక్ష తప్పదని ఎంపీ ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. సభలో మొదటగా ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 12 సీట్లలో కాంగ్రెస్‌ను గెలిపించాలని కోరారు. తాము నల్లగొండలో 12 సీట్లను గెలిపించి మొత్తం 24 సీట్లతో కాంగ్రెస్‌కు ఆధిక్యాన్ని కట్టబెడతామని చెప్పారు. సభలో ఏఐసీసీ కార్యదర్శులు రోహిత్ చౌదరి, నవీన్ జావెద్, కొప్పుల రాజు, టీపీసీసీ నేతలు వీహెచ్, అనిరుధ్‌రెడ్డి, నాగం జనార్దన్‌రెడ్డి, చిన్నారెడ్డి, జీవన్‌రెడ్డి, పొన్నం ప్రభాకర్, మల్లు రవి పాల్గొన్నారు. అంతకుముందు సభకు హాజరయ్యేందుకు సిమ్లా నుంచి శంషాబాద్ విమానాశ్రయానికి వచ్చిన సుఖుకు ఠాక్రే, రేవంత్ తదితరులు స్వాగతం పలికారు. దాదాపు అరగంటపాటు టీ కాంగ్రెస్ నేతలతో ఆయన భేటీ అయ్యారు.

బీఆర్ఎస్‌ను దించే ప్లాన్ ఏంటి?

ఈటలను ప్రశ్నించిన పొంగులేటి, జూపల్లి!

- బీఆర్ఎస్ అసంతృప్త నేతలతో ఈటల రాజేందర్ మంతనాలు

సాక్షి, హైదరాబాద్: బీజేపీలోకి ఇతర పార్టీల నేతలను చేర్పించే కసరత్తును ఆ పార్టీ చేరికల కమిటీ కన్వీనర్, జాతీయ కార్యవర్గ సభ్యుడు ఈటల రాజేందర్ వేగవంతం చేశారు. పార్టీ జాతీయ నాయకత్వం ఆదేశాల మేరకు నేతలతో మంతనాలు సాగిస్తున్నారు. ఈ క్రమంలో గురువారం మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి, మాజీ మంత్రి జూపల్లి కృష్ణారావులతో ఈటల భేటీ అయ్యారు. ఉదయమే జూబ్లీహిల్స్ ప్రాంతంలో తమ సొంత వాహనాలను విడిచిపెట్టి.. గన్‌మన్లు, వ్యక్తిగత సహాయకులు కూడా లేకుండానే వారితో నాలుగైదు గంటల పాటు చర్చించినట్టు తెలిసింది. ఐదారు నెలల్లోనే అసెంబ్లీ ఎన్నికలు ఉండటంతో వెంటనే బీజేపీలో చేరికపై నిర్ణయం తీసుకోవాలని, చేరికపై జాతీయ నాయకత్వం నుంచి సానుకూలత వ్యక్తమైందని వారికి ఈటల చెప్పినట్టు తెలిసింది. ఇటీవల ఢిల్లీలో బీజేపీ అగ్రనేత, కేంద్ర హోంమంత్రి అమిత్‌షాతో భేటీ సందర్భంగా కూడా ఈ అంశం చర్చకు వచ్చిందని తెలిపినట్టు సమాచారం. జాతీయ నాయకత్వం తరఫున పొంగులేటి, జూపల్లిలకు ఈటల హామీ ఇచ్చారని, పార్టీలోకి వస్తే కలిగే ప్రయోజనాలను వివరించారని తెలిసింది.

మీ దగ్గర ఉన్న ప్రణాళిక ఏమిటి?

భేటీ సందర్భంగా బీఆర్ఎస్‌ను ఓడించేందుకు బీజేపీ వద్ద ఉన్న ప్రణాళిక ఏమిటని, ఇందుకోసం ఎలాంటి కార్యాచరణ ప్రణాళికను అమలు చేయబోతున్నారని ఈటలను పొంగులేటి, జూపల్లి ప్రశ్నించినట్టు తెలిసింది. బీఆర్ఎస్‌ను ఎదుర్కొనేందుకు జాతీయ, రాష్ట్ర నాయకత్వాల వద్ద స్పష్టమైన ప్రణాళికలు ఉన్నాయని, ఏ రకమైన వ్యూహాలను అనుసరిస్తారన్నది ఈటల వివరించినట్టు సమాచారం. వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమే తమ ప్రధాన లక్ష్యమని, దాన్ని సాధించగలిగే పార్టీ, నాయకత్వం వెంటే వెళ్లేందుకు తాము సిద్ధమని వారు ఈటలకు చెప్పినట్టు తెలిసింది. ఈ దిశగా బీజేపీ ఏమేరకు సంసిద్ధమై ఉంది? బీఆర్ఎస్‌ను గద్దె దించేందుకు ఎలాంటి కార్యాచరణ అమలు చేయబోతున్నదనే దానిపై మరింత స్పష్టత కావాలని వారు కోరినట్టు సమాచారం. ఈటల సమాధానాలతో సంతృప్తి చెందని పొంగులేటి, జూపల్లి.. బీజేపీలో చేరికపై నిర్ణయం తీసుకునేందుకు మరికొంత సమయం కావాలని కోరినట్టు తెలిసింది. శుక్రవారం కూడా వారితోపాటు మరి కొందరితో ఈటల సమావేశమయ్యే అవకాశాలు ఉన్నాయని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

ప్రత్యామ్నాయాలపై చర్చ?

వచ్చే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను ఓడించేందుకు అన్ని రాజకీయ ప్రత్యామ్నాయాలను పరిశీలించాలని ఈటలకు పొంగులేటి, జూపల్లి సూచించినట్టు సమాచారం. అంతా బలమైన పార్టీలోకి వెళ్లడం లేదా వివిధ పార్టీల్లోంచి ముఖ్య నేతలంతా కలిసి ఓ ప్రాంతీయ పార్టీని స్థాపించి.. ఇతర భావ సారూప్య శక్తులతో పొత్తు కుదుర్చుకుంటే ఎలా ఉంటుందనే అంశాలపైనా వారి మధ్య చర్చ జరిగినట్టు ప్రచారం జరుగుతోంది. అయితే ఈ ఇద్దరు నేతలూ బీజేపీలో చేరే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని బీజేపీ వర్గాలు చెప్తున్నాయి.

అవినాశ్ ముందస్తు బెయిల్ పిటిషన్‌పై

వాదనలు నేటికి వాయిదా

వాయిదా వేసిన తెలంగాణ హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: మాజీమంత్రి వైఎస్ వివేకానందరెడ్డి హత్యకేసులో సీబీఐ అరెస్టు చేయకుండా ముందస్తు బెయిల్ ఇవ్వాలని కోరుతూ ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలను తెలంగాణ హైకోర్టు శుక్రవారానికి వాయిదా వేసింది. గురువారం ఈ పిటిషన్ జస్టిస్ ఎం.లక్ష్మణ్ ధర్మాసనం ముందు విచారణకు వచ్చింది. అవినాశ్‌రెడ్డి తరఫున ఉమామహేశ్వర్‌రావు, సీబీఐ తరఫున అనిల్, ఇంప్లీడ్ పిటిషన్ వేసిన సునీత తరఫున ఎల్. రవిచందర్ వాదనలు వినిపించేందుకు సిద్ధమయ్యారు. అప్పటికే సాయంత్రం దాదాపు 6.30 గంటలు కావొస్తుండటంతో.. వాదనలకు ఎవరెవరికి ఎంత సమయం పడుతుందని న్యాయమూర్తి ప్రశ్నించారు. ఐదారు గంటలకుపైగా పడుతుందని న్యాయవాదులు తెలపడంతో విచారణను శుక్రవారం ఉదయం 10.30 గంటలకు చేపడతామని న్యాయమూర్తి చెప్పారు.

సుప్రీం ఆదేశాల నేపథ్యంలో

వివేకా హత్యకేసులో ముందస్తు బెయిల్ కోరుతూ ఏప్రిల్‌లో అవినాశ్‌రెడ్డి తెలంగాణ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై సెలవుల ముందు రోజు వరకు విచారణ చేపట్టిన న్యాయస్థానం.. జూన్ 5కు వాయిదా వేసింది. దీంతో ఆయన సుప్రీంకోర్టు ఆశ్రయించారు. పిటిషన్‌పై వాదనలు విన్న సర్వోన్నత న్యాయస్థానం.. అవినాశ్‌రెడ్డి వాదనలు విని తగు నిర్ణయం తీసుకోవాలని తెలంగాణ హైకోర్టును ఆదేశించింది. ఈ నేపథ్యంలో పిటిషన్‌ను వెకేషన్ బెంచ్ విచారణకు స్వీకరించింది.

కుదుటపడుతున్న శ్రీలక్ష్మి ఆరోగ్యం

సాక్షి ప్రతినిధి, కర్నూలు: ఎంపీ వైఎస్ అవినాశ్‌రెడ్డి మాతృమూర్తి శ్రీలక్ష్మి ఆరోగ్యం క్రమంగా మెరుగవుతోంది. ఆమె ఆరోగ్యంపై విశ్వభారతి సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రి యాజమాన్యం గురువారం హెల్త్ బులెటిన్ విడుదల చేసింది. మూడు రోజులతో పోలిస్తే శ్రీలక్ష్మి ఆరోగ్య పరిస్థితి మెరుగుపడింది. అల్ట్రా సౌండ్ స్కానింగ్ చేస్తే అనారోగ్య సమస్యలు కన్పించలేదు. వాంతులు తగ్గాయి. ప్రస్తుతం ఆమె నోటి ద్వారా ఆహారం తీసుకుంటున్నారు. బీపీని నియంత్రించేందుకు అమెనోట్రిప్స్ మందులు వాడేవారు. ఇప్పుడు వాటిని కూడా నిలిపేశారు. ఆ మందులు లేకుండానే బీపీ నిలకడగా ఉంది. త్వరలోనే క్రిటికల్ కేర్ యూనిట్ నుంచి గదిలోకి మార్చనున్నారు. గుండెలో రెండు రక్తనాళాలు బ్లాక్ అయ్యాయని పరీక్షల్లో తేలింది. వీటికి చికిత్స అందించే ప్రయత్నాలు వైద్యులు చేస్తున్నారు. తన తల్లి శ్రీలక్ష్మి ఆరోగ్యం మెరుగవుతోందని వైద్యులు చెప్పడంతో అవినాశ్ ధైర్యంగా ఉన్నారు. ఆరు రోజులుగా రాత్రింబవళ్లు శ్రీలక్ష్మి ఆరోగ్యంపై ఆందోళన చెందుతూ ఆస్పత్రి వద్దే పడిగాపులు కాస్తున్న వైఎస్సార్‌సీపీ నేతలు, కార్యకర్తలకు ఉపశమనం లభించినట్టయింది.

'ఔటర్ టోల్ టెండర్'పై సీబీఐకి ఫిర్యాదు చేశాం

- బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు వెల్లడి
- అంతర్జాతీయ టెండర్ అని చెప్పి నిబంధనలు ఎందుకు మార్చారు?
- గతంలో డిఫాల్ట్ అయిన సంస్థకు టెండర్ అప్పగింత వెనక ఆంతర్యం ఏమిటి?



సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్‌రోడ్డు (ఓఆర్ఆర్) టోల్‌గేట్ టెండర్ల కేటాయింపులో అవినీతి, అక్రమాలు జరిగాయని.. వాటిపై దర్యాప్తు జరపాలని సీబీఐకి ఫిర్యాదు చేసినట్లు బీజేపీ ఎమ్మెల్యే ఎం. రఘునందన్‌రావు తెలిపారు. ఈ వ్యవహారంపై ఆయన ఇప్పటికే ఈడీకి ఫిర్యాదు చేశారు. గురువారం రఘునందన్‌రావు మీడియాతో మాట్లాడుతూ టెండర్ పొందిన ఐఆర్‌బీ డెవలపర్స్ సంస్థకు వ్యతిరేకంగా మాట్లాడితే హత్యలు చేస్తున్నారని, ఆ సంస్థకు వ్యతిరేకంగా సోషల్ మీడియాలో పోస్టులు పెడితే బెదిరిస్తున్నారని ఆరోపించారు. నేర చరిత్రగల ఈ సంస్థకు కట్టబెట్టిన టెండర్‌ను రద్దు చేయాలని డిమాండ్‌ను రాష్ట్ర ప్రభుత్వం పట్టించుకోకపోవడం వల్లే సీబీఐని ఆశ్రయించాల్సి వచ్చిందని రఘునందన్ చెప్పారు. వేసవి సెలవుల తరువాత దీనిపై హైకోర్టును ఆశ్రయిస్తామన్నారు. మున్సిపల్ శాఖ మంత్రి కేటీఆర్, స్పెషల్ చీఫ్ సెక్రెటరీ అరవింద్ కుమార్ అప్పనంగా ఐఆర్‌బీ సంస్థకు టెండర్ అప్పగించారని ఆరోపించారు. ఈ టెండర్ అంశంపై ఇప్పటికే దర్యాప్తు సంస్థలు విచారణకు సిద్ధమవుతున్నట్లు తనకు సమాచారం ఉందని తెలిపారు.

కేసీఆర్, కేటీఆర్ బదులివ్వాలి...

టోల్‌గేట్ వ్యవహారంపై సీఎం కేసీఆర్ ఎందుకు స్పందించడం లేదని రఘునందన్‌రావు ప్రశ్నించారు. ఓఆర్ఆర్ టెండర్ విలువను రూ. 7,272 కోట్ల నుంచి రూ. 7,380 కోట్లకు పెంచింది ఎవరో కేసీఆర్, కేటీఆర్ సమాధానం చెప్పాలని ఆయన డిమాండ్ చేశారు. టెండర్ విలువను పెంచడం వెనకున్న అధికారులు ఎవరని ప్రశ్నిస్తే కేటీఆర్ స్పందించడం లేదన్నారు. ఇది అంతర్జాతీయ టెండర్ అని చెప్పి నిబంధనలు ఎందుకు మార్చారో చెప్పాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు టెండర్ పొందిన సంస్థ గతంలో హెచ్ఎండీఏకు రూ. 86 లక్షలు చెల్లించకుండా డిఫాల్ట్ అయిందన్నారు. అయినా టెండర్ కట్టబెట్టడం వెనక ఆంతర్యమేమిటని ప్రశ్నించారు. రింగ్‌రోడ్డు చుట్టూ కొల్లూరు, ఇతర చోట్ల కట్టిన డబుల్ బెడ్రూం ఇళ్లను ఎందుకు పంపిణీ చేయడం లేదో చెప్పాలని ప్రభుత్వాన్ని రఘునందన్‌రావు డిమాండ్ చేశారు. ఇందుకోసం ప్రభుత్వం కార్పొరేషన్ ఏర్పాటు చేసి తీసుకున్న రుణం ఎంత.. అందుకు కడుతున్న వడ్డీలు ఎంతో చెప్పాలన్నారు.

ఔటర్ రింగ్‌రోడ్డు లీజుపై విపక్షాల విషం



మీడియాతో మాట్లాడుతున్న ఎమ్మెల్యేలు వివేకానంద, సుధీర్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ఔటర్ రింగ్ రోడ్డు లీజుపై విపక్షాలు విషం చిమ్ముతున్నాయని, నిబంధనల ప్రకారమే ఐఆర్‌బీకి టోల్‌గేట్ టెండర్లు దక్కాయని బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు డి.సుధీర్‌రెడ్డి, కేపీ వివేకానంద అన్నారు. లీజుపై టీపీసీసీ అధ్యక్షుడు, ఎంపీ రేవంత్‌రెడ్డి, బీజేపీ ఎమ్మెల్యే రఘునందన్‌రావు చిల్లర రాజకీయాలు మానుకోవాలని హితవు పలికారు. వారు గురువారం బీఆర్ఎస్ఎల్పీలో విలేకరులతో మాట్లాడుతూ ఐటీశాఖ మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటనపై అనుచిత వ్యాఖ్యలు చేసిన రేవంత్‌రెడ్డి తక్షణమే క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. 111 జీవోపై కాంగ్రెస్, బీజేపీ లేనిపోని రాద్ధాంతం చేస్తున్నాయని, ఆ గ్రామాలకు వెళ్లి జీవో కొనసాగాలని కోరే ధైర్యం ఉందా? అని నిలదీశారు. రాజకీయాల గురించి గవర్నర్ మాట్లాడడం సరికాదని, ఆమెకు దేవుడు మంచి బుద్ధి ప్రసాదించాలని కోరారు.

ఆగస్టులో గురుకుల పరీక్షలు!

▶ మొదటి పేజీ తరువాయి

టీఆర్ఈఐఆర్‌బీ.. ప్రస్తుతం పరీక్షల నిర్వహణపై దృష్టి సారించింది. ఆగస్టులో ఈ పరీక్షలు నిర్వహించాలని ప్రాథమికంగా నిర్ణయించిన గురుకుల బోర్డు.. తేదీల ఖరారుపై కసరత్తు చేస్తోంది.

రెండు నెలల గ్యాప్..!

గురుకుల కొలువులకు సంబంధించిన దరఖాస్తుల స్వీకరణ, అర్హత పరీక్షలకు మధ్య అంతరం గరిష్టంగా రెండు నెలలు ఉండాలని టీఆర్ఈఐఆర్‌బీ నిర్ణయించింది. గురుకులాల్లో ఉద్యోగ ఖాళీల ఖరారు, ఆర్థిక శాఖ అనుమతుల జారీ ప్రక్రియ పూర్తయ్యి దాదాపు ఏడాది పూర్తయ్యింది. తర్వాత ప్రభుత్వం కూడా స్పష్టత ఇవ్వడంతో అభ్యర్థులు ఏడాదిగా పరీక్షలకు సన్నద్ధమవుతూ వచ్చారు. తాజాగా దరఖాస్తు ప్రక్రియ అనంతరం సన్నద్ధతకు రెండు నెలల గడువు ఇస్తే సరిపోతుందని నిపుణులు సూచించడంతో బోర్డు అదే నిర్ణయం తీసుకుంది. ఈ మేరకు ఆగస్టులో పరీక్షల నిర్వహణపై దృష్టి పెట్టిన టీఆర్ఈఐఆర్‌బీ.. ఏయే తేదీల్లో పరీక్షలు నిర్వహించాలనే అంశాన్ని తేల్చేందుకు చర్యలు చేపట్టింది. ఆయా రోజుల్లో ఇతర ఎలాంటి పరీక్షలు లేకుండా జాగ్రత్తలు తీసుకుంటోంది. జాతీయ స్థాయి నియామకాల బోర్డులు నిర్వహించే పరీక్షల తేదీలు, ఇతర కీలక నియామకాల బోర్డుల పరీక్షల తేదీలను పరిశీలిస్తోంది. ఆయా పరీక్షలు లేని రోజుల్లో గురుకుల కొలువుల అర్హత పరీక్షలు నిర్వహించనున్నట్లు బోర్డు అధికారులు చెబుతున్నారు.

నియామక సంస్థలతో ఉమ్మడి భేటీ?

రాష్ట్రంలోని వివిధ నియామక సంస్థలతో సమన్వయ సమావేశం నిర్వహించాలని తెలంగాణ గురుకుల విద్యా సంస్థల నియామకాల బోర్డు భావిస్తోంది. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వ శాఖల పరిధిలో 80 వేల ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించిన నోటిఫికేషన్లు జారీ చేయగా.. ప్రస్తుతం నియామక సంస్థలు అర్హత పరీక్షలను నిర్వహిస్తున్నాయి. ఈ క్రమంలో గురుకులాల్లో 9 వేల ఉద్యోగ ఖాళీల భర్తీకి నిర్వహించే అర్హత పరీక్షలు, ఇతర పరీక్షల తేదీల్లో లేకుండా నివారించేందుకు ఈ సమన్వయ సమావేశం ఉపకరిస్తుందని అధికారులు భావిస్తున్నారు. ఈ మేరకు తెలంగాణ స్టేట్ పబ్లిక్ సర్వీస్ కమిషన్, తెలంగాణ హెల్త్ అండ్ మెడికల్ సర్వీసెస్ రిక్రూట్‌మెంట్ బోర్డు, తెలంగాణ స్టేట్ లెవల్ పోలీస్ రిక్రూట్‌మెంట్ బోర్డు అధికారులతో సంప్రదింపులు జరుపుతున్నట్లు తెలుస్తోంది. ఈ భేటీ తర్వాత గురుకుల పరీక్షల తేదీలపై మరింత స్పష్టత రానుంది.

ఉద్యోగాల వెల్లువ

▶ మొదటి పేజీ తరువాయి

ఇప్పటికే వివిధ శాఖల నుంచి ఖాళీల వివరాలు తెప్పించుకున్నామని అధికారులు సీఎంకు వివరించారు. త్వరితగతిన ఈ పోస్టులను భర్తీ చేయాలని సీఎం అధికారులను ఆదేశించారు. నోటిఫికేషన్ల జారీకి అవసరమైన కసరత్తు తుదిదశలో ఉందని అధికారులు ఆయనకు తెలిపారు. వీలైనంత త్వరగా నోటిఫికేషన్లు జారీ చేయాలని సీఎం సూచించారు. పరీక్షల నిర్వహణ, ఫలితాల వెల్లడి తదితర అంశాలపైనా దృష్టి సారించాలని ఆదేశించారు. కాగా 2019లో రాష్ట్రంలో వైఎస్సార్‌సీపీ అధికారంలోకి వచ్చాక వైఎస్ జగన్ విప్లవాత్మక సంస్కరణలకు శ్రీకారం చుట్టారు. ప్రజల ముంగిటకే ప్రభుత్వ పాలనను తీసుకువెళ్లి.. వారి సమస్యలను తీర్చడానికి గ్రామ, వార్డు సచివాలయ వ్యవస్థను ప్రవేశపెట్టారు. వీటిలో లక్షలాది ఉద్యోగాల భర్తీకి శ్రీకారం చుట్టారు. రాష్ట్ర చరిత్రలో గతంలో కనీవినీ ఎరుగని రీతిలో ఒకేసారి 1.34 లక్షల మందికి ప్రభుత్వ ఉద్యోగాలను ఇచ్చారు. గతంలో మన రాష్ట్రంలోనే కాకుండా ఇతర రాష్ట్రాల్లోనూ ఒకే దఫాలో ఇంత పెద్ద ఎత్తున ఎక్కడా ఉద్యోగాలు భర్తీ చేసిన దాఖలాలు లేకపోవడం గమనార్హం.

క్లుప్తంగా...

శవాన్ని డ్రమ్ములో కుక్కి.. చెరువులో పడేసి..



పహాడీషరీఫ్ (హైదరాబాద్): ఓ వ్యక్తి శవాన్ని డ్రమ్ములో కుక్కి చెరువులో పడేశారు. రంగారెడ్డి జిల్లా తుక్కుగూడలో గురువారం జరిగిన ఈ సంఘటన కలకలం రేపింది. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ కథనం ప్రకారం .. తుక్కుగూడలోని సూరం చెరువులో గురువారం సాయంత్రం వ్యక్తి మృతదేహం డ్రమ్ములో తేలియాడుతుండటాన్ని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. వారు వెంటనే అక్కడికి చేరుకుని మృతదేహాన్ని బయటికి తీశారు. మృతుని వయసు సుమారు 35–40 ఏళ్లు ఉంటుంది. మృతదేహం కుళ్లిపోయి ఉండటాన్ని బట్టి మూడు రోజుల క్రితమే మృతి చెంది ఉండొచ్చని అనుమానిస్తున్నారు. ఎక్కడో హత్య చేసి ఇక్కడ పడేశారా..? మరే ఇతర కారణాలున్నాయా? అనే కోణంలో పోలీసులు దర్యాప్తు కొనసాగిస్తున్నారు. డ్రమ్ములో దొరికిన మృతదేహంపై ఎరుపు రంగు ఫుల్ హ్యాండ్స్ షర్ట్, ప్యాంటు, బ్లాక్ కలర్ హాఫ్ బనియన్, నలుపు రంగు ఫుల్ చెడ్డీ, నలుపు, తెలుపు రంగు శాలువా ఉన్నాయి. తెలిసినవారు పహాడీషరీఫ్ పోలీస్‌స్టేషన్‌లో లేదా 87126 62367 నంబర్‌లో సంప్రదించాలని సీఐ కోరారు.

ప్రత్యేక పార్టీతోనే బీసీలకు రాజ్యాధికారం



సాక్షి, హైదరాబాద్: రాబోయే అసెంబ్లీ, పార్లమెంటు ఎన్నికల్లో బీసీల కోసం ప్రత్యేకమైన మేనిఫెస్టోను ప్రకటించని పార్టీలను ఉపేక్షించరాదని బీసీ రాజ్యాధికార సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు దాసు సురేష్ పిలుపునిచ్చారు బీసీలకు అసెంబ్లీ సీట్లలో పెద్దపీట వేయని ఏ పార్టీ జెండాను ఎత్తవద్దని గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ప్రత్యేక పార్టీ ద్వారానే బీసీలకు రాజ్యాధికారం సిద్ధిస్తుందన్నారు.

క్వింటాల్‌కు 5 కిలోల దోపిడీ: జీవన్‌రెడ్డి

సాక్షి, హైదరాబాద్: ప్రభుత్వం చెప్పుచేతల్లో రైస్ మిల్లర్లు పని చేస్తున్నారని, ప్రతి క్వింటాల్‌కు ఐదు కిలోల దోపిడీ జరుగుతోందని కాంగ్రెస్ ఎమ్మెల్సీ జీవన్‌రెడ్డి ఆరోపించారు. గురువారం అసెంబ్లీ మీడియా హాల్‌లో ఆయన మాట్లాడుతూ రైస్ మిల్లర్లను అదుపు చేయకపోవడం ప్రభుత్వం అసమర్థత అని, మే 31లోపు ధాన్యం పూర్తిగా కొనుగోలు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. కొనుగోలు కేంద్రాల్లో ఎక్కడ కూడా రసీదు ఇవ్వడం లేదని మండిపడ్డారు. విధిలేని పరిస్థితుల్లో రైతులు రోడ్డెక్కుతున్నారని, ప్రభుత్వంపై నమ్మకంలేక మిల్లర్లతో మాట్లాడుకునే పరిస్థితి వచ్చిందని జీవన్‌రెడ్డి ఆవేదన వ్యక్తం చేశారు.

దేవాదుల పంపింగ్ షురూ

మూడో ఫేజ్‌లో 2 మోటార్లు ప్రారంభం

కన్నాయిగూడెం: ములుగు జిల్లా కన్నాయిగూడెం మండలం తుపాకులగూడెం వద్ద గోదావరిపై నిర్మించిన జె.చొక్కారావు ఎత్తిపోతల (దేవాదుల) వద్ద రెండు మోటార్లతో పంపింగ్ ప్రారంభించారు. అధికారులు బుధవారం ఒక మోటార్‌తో బుధవారం పంపింగ్ చేశారు. దిగువ ప్రాంతంలో నీటి వినియోగం అధికంగా ఏర్పడడంతో దేవాదుల వద్ద ఉన్న మూడు ఫేజ్‌ల్లో.. 3వ ఫేజ్‌లో ఉన్న రెండు మోటార్లను గురు వారం ఆన్ చేసి పంపింగ్ ప్రారంభించారు. ప్రస్తుతం మూడు మోటార్లతో 875 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

రూ. 2 వేల నోట్ల రద్దు వెనుక రాజకీయ కోణం

సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ



హుజూర్‌నగర్: కేంద్ర ప్రభుత్వం రూ.2 వేల నోట్లు రద్దు చేయడం వెనుక రాజకీయ కోణం ఉందని సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ అన్నారు. పెద్ద నోట్ల రద్దు వల్ల పేద ప్రజలకు ఒరిగిందేమీ లేదని, పెద్దల వద్ద ఉన్న బ్లాక్ మనీని వైట్‌మనీగా మార్చుకునేందుకు మార్గం ఏర్పడిందని పేర్కొన్నారు. గురువారం ఆయన సూర్యాపేట జిల్లా చింతలపాలెంలో తెలంగాణ రైతాంగ పోరాట యోధుడు ఉప్పేల వీరారెడ్డి విగ్రహాన్ని ఆవిష్కరించారు. అనంతరం బహిరంగ సభలో మాట్లాడుతూ, పార్లమెంట్ నూతన భవన ప్రారంభోత్సవాన్ని 19 పార్టీలు ముక్తకంఠంతో బహిష్కరిస్తే.. బీఆర్ఎస్ అధ్యక్షుడు, సీఎం కేసీఆర్‌కు దానిని బహిష్కరించేందుకు ఊగిసలాట ధోరణి ఎందుకని ప్రశ్నించారు. బీజేపీ ప్రభుత్వ పాలనలో గ్యాస్ ధర రూ.400 నుంచి రూ1,250కి పెరిగిందని, నిత్యావసర వస్తువుల ధరలు కూడా వందల రెట్లలో పెరిగాయని మండిపడ్డారు. దేశ సంపదను కొల్లగొట్టుకుపోయిన వారందరూ ప్రధాని దత్తపుత్రులేనని అన్నారు. దేశంలోని కేంద్ర వ్యవస్థలన్నింటినీ బీజేపీ పాలనలో ధ్వంసం చేశారని ఆయన విమర్శించారు. కుల, మతపరమైన అంశాలను ప్రచారంలో చేర్చి రాజకీయాలు చేస్తున్న ఏకైక ప్రధాని మోదీ మాత్రమేనని అన్నారు. లౌకిక ప్రజాస్వామ్య శక్తులను ఏకం చేసేందుకు సీపీఐ ప్రముఖ పాత్ర పోషిస్తుందని చెప్పారు.

గింజ కోత పెట్టినా ఉపేక్షించం

- రైతుకు ఇబ్బంది కలగకుండా ప్రభుత్వానికి సహకరించాల్సిందే
- సీఎంఆర్ బియ్యాన్ని నిర్ణీత గడువులోగా ఇవ్వాల్సిందే
- మిల్లర్లతో భేటీలో పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్



మిల్లర్లతో జరిగిన భేటీలో మాట్లాడుతున్న పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్

సాక్షి, హైదరాబాద్: రైతుల నుంచి సేకరించే ధాన్యంలో ఒక్క గింజ కోత పెట్టినా ఉపేక్షించేది లేదని, మిల్లులకు వచ్చిన ధాన్యాన్ని వెంటనే అన్‌లోడింగ్ చేపట్టాలని పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ హెచ్చరించారు. ఎట్టిపరిస్థితుల్లోనూ రైతులకు ఇబ్బంది కలగకుండా మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాల్సిందేనన్నారు. యాసంగి ధాన్యం సేకరణ, సీఎంఆర్ బియ్యం, నూక శాతం తదితర అంశాలపై సచివాలయంలో ఆయన మిల్లర్స్ అసోసియేషన్ ప్రతినిధులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా మంత్రి కమలాకర్ మాట్లాడుతూ రైతు సంక్షేమమే ధ్యేయంగా నిరంతరం పని చేసే ప్రభుత్వం తమదని, విపరీత పరిస్థితుల్లోనూ దేశంలో ఎక్కడా లేనివిధంగా కనీస మద్దతు ధరతో ధాన్యాన్ని సేకరించడమే ఇందుకు నిదర్శనమని వ్యాఖ్యానించారు. యాసంగి ధాన్యంలో నూక శాతంపై నిపుణుల కమిటీ గతంలో ఇచ్చిన మధ్యంతర నివేదికను ప్రస్తుత పరిస్థితులకు ఎలా అన్వయించాలో సీఎం కేసీఆర్ దృష్టికి తీసుకెళ్లి నిర్ణయం తీసుకుంటామని చెప్పారు. ప్రభుత్వంతోపాటు మిల్లర్లు నష్టపోకుండా చర్యలు తీసుకుంటామని చెప్పిన మంత్రి... నిర్ణీత గడువులోగా సీఎంఆర్ బియ్యాన్ని ప్రభుత్వానికి మిల్లర్లు అందజేయాలని సూచించారు.

నూక శాతాన్ని త్వరగా తేల్చాలి...

తమ సమస్యలను మిల్లర్లు మంత్రి దృష్టికి తీసుకెళ్లారు. నూక శాతం విషయాన్ని ప్రభుత్వం త్వరగా తేల్చాలని విజ్ఞప్తి చేశారు. తమను రైతులకు శత్రువులుగా ప్రచారం చేయడం బాధ కలిగిస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమావేశంలో పౌరసరఫరాల కమిషనర్ అనిల్‌కుమార్, జనరల్ మేనేజర్ శ్రీనివాసరావు, రైస్ మిల్లర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు గంపా నాగేందర్, ప్రధాన కార్యదర్శి సుధాకర్‌రావు, వర్కింగ్ ప్రెసిడెంట్ బి. ప్రభాకర్‌రావు, కోశాధికారి చంద్రపాల్‌తోపాటు అన్ని జిల్లాల అధ్యక్షులు పాల్గొన్నారు.

శుభకార్యానికి వెళ్తూ.. ప్రమాదానికి బలి

రెండు బైకులు ఢీకొనడంతో నలుగురు దుర్మరణం

- మృతుల్లో భార్యాభర్తలతోపాటు ఓ చిన్నారి
- మరో చిన్నారి పరిస్థితి విషమం
- ఏదో పెద్ద వాహనం రెండు బైకులను ఢీకొట్టి ఉంటుందని స్థానికుల సందేహాలు



అంజప్ప కుటుంబం

కృష్ణా: శుభకార్యంలో పాల్గొనేందుకు భార్యభర్తలు, ఇద్దరు చిన్నారులతో బైక్‌పై బయలుదేరారు. కానీ విధి వక్రించి రోడ్డు ప్రమాదానికి బలయ్యారు. ప్రమాదంలో భార్యాభర్తలతోపాటు ఒక చిన్నారి మృతి చెందగా.. మరో చిన్నారి మృత్యువుతో పోరాడుతున్నాడు. వారి బైక్‌ను ఢీకొట్టిన మరో బైక్‌పై ఉన్న వ్యక్తి కూడా మృతి చెందాడు. నారాయణపేట జిల్లా కృష్ణా మండలం నల్లగట్టు సమీపంలో గురువారం రాత్రి ఈ దారుణ ప్రమాదం జరిగింది. గ్రామస్తుల కథనం ప్రకారం.. కృష్ణా గ్రామానికి చెందిన అంజప్ప (38), భార్య నర్సమ్మ (30), కుమారులు అనిరుధ్ (3), నమ్రత్‌లతో కలిసి అత్తగారి ఊరైన భూత్పూర్‌లో జరిగే శుభకార్యానికి బైక్‌పై బయలుదేరారు. అదే సమయంలో ఓబ్లాపూర్‌కు చెందిన ఆశప్ప మరో బైక్‌పై మాగనూర్ వైపు నుంచి హిందూపూర్‌కు వస్తున్నాడు. నల్లగట్టు సమీపంలో రెండు వాహనాలు ఎదురెదురుగా ఢీకొన్నాయి. ప్రమాదంలో ఆశప్ప అక్కడికక్కడే మృతిచెందగా.. తీవ్రంగా గాయపడ్డ మిగతా వారిని రాయచూర్‌లోని రిమ్స్ ఆస్పత్రికి తరలించారు. కానీ అప్పటికే అంజప్ప, నర్సమ్మ, అనిరుధ్ మృతి చెందినట్టు వైద్యులు ధ్రువీకరించారు. నమ్రత్ పరిస్థితి విషమంగా ఉండటంతో వైద్యుల సూచన మేరకు హైదరాబాద్‌కు తరలించారు. ప్రమాదంలో ఒకే కుటుంబానికి చెందిన ముగ్గురు మృతిచెందడంతో గ్రామంలో విషాదఛాయలు అలుముకున్నాయి. అయితే రెండు ద్విచక్ర వాహనాలు ఢీకొట్టుకోవడం కాదని, ఏదో గుర్తు తెలియని వాహనం రెండింటినీ ఢీకొట్టడంతోనే అంత తీవ్రమైన ప్రమాదం జరిగి ఉంటుందని గ్రామస్తులు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

అమెరికాలో భర్త మృతి.. మనోవేదనతో భార్య ఆత్మహత్య

- భర్త అంత్యక్రియలు జరిగిన మర్నాడే బలవన్మరణం
- పెళ్లైన ఏడాదిన్నరకే దంపతుల మృతితో ఇరు కుటుంబాల్లో విషాదం



భర్త మనోజ్‌తో సాహితి (ఫైల్)

అంబర్‌పేట: అమెరికా ఆశల సౌధంలో ఉన్న కొత్త దంపతుల ఆశలను విధి విరిచేసింది. భర్త గుండెపోటుతో ఇటీవల మృతిచెందగా మనోవేదన తట్టుకోలేక భార్య గురువారం బలవన్మరణానికి పాల్పడింది. ఈ ఉదంతం ఇరు కుటుంబాల్లో తీరని విషాదం నింపింది. అంబర్‌పేట పోలీసు స్టేషన్ ఇన్‌స్పెక్టర్ ఆశోక్ కథనం ప్రకారం... డీడీ కాలనీలో నివసించే సురేష్, ఉమ దంపతులకు సాహితి (29), సంజనలు కూతుళ్లు. ఏడాదిన్నర క్రితం వనస్థలిపురానికి చెందిన మనోజ్ (31) అనే సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌తో సాహితి వివాహం జరిగింది. పెళ్లి తర్వాత ఈ యువ జంట అమెరికాలోని డాలస్‌కు వెళ్లి నివాసం ఉంటున్నారు. ఈ నెల 2న సాహితి తన తల్లిదండ్రులను చూసేందుకు అమెరికా నుంచి హైదరాబాద్ వచ్చింది. అయితే ఈ నెల 20న భర్త మనోజ్ అకస్మాత్తుగా గుండెపోటుకు గురై మృతి చెందాడు. అతని మృతదేహాన్ని ఈ నెల 23న వనస్థలిపురంలోని మనోజ్ నివాసానికి తీసుకురాగా 24న అంత్యక్రియలు నిర్వహించారు. భర్త మృతదేహాన్ని చూసి సాహితి గుండెలవిసేలా రోదించింది. అంత్యక్రియల అనంతరం రాత్రికి డీడీ కాలనీలోని పుట్టింటికి చేరుకొని తన సోదరి సంజనతో కలసి గదిలో నిద్రించింది. గురువారం ఉదయం నిద్రలేచిన సంజన వాష్‌రూంకు వెళ్లగానే సాహితి లేచి లోపలి నుంచి గది గడియ పెట్టుకుంది. చీరతో ఫ్యాన్‌కు ఉరేసుకొని ఆత్మహత్య చేసుకుంది. వెంటనే తేరుకున్న కుటుంబ సభ్యులు బలవంతంగా గది తలుపులు తెరిచి సమీప ఆస్పత్రికి తీసుకువెళ్లగా ఆమె అప్పటికే మృతిచెందినట్లు వైద్యులు చెప్పారు. దీంతో తల్లిదండ్రులు కన్నీరుమున్నీరయ్యారు. సమాచారం అందుకున్న పోలీసులు మృతదేహాన్ని స్వాధీనం చేసుకొని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా ఆస్పత్రికి తరలించారు. కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా

చెరువులో మునిగి ఇద్దరు పిల్లల మృతి



చిన్నారులు రిషి, రిత్విక్ (ఫైల్)

మడికొండ/ ధర్మసాగర్ / ఎల్కతుర్తి: ఈత సరదా ఇద్దరు పిల్లల ప్రాణం తీసింది. మేనత్త కూతురి పెళ్లికి వచ్చిన ఇద్దరు చిన్నారులు ఈత కొట్టేందుకు చెరువులోకి వెళ్లి మృత్యువాత పడ్డారు. హనుమకొండ జిల్లా కాజీపేట మండలం రాంపూర్ గ్రామంలో గురువారం సాయంత్రం ఈ ఘటన చోటుచేసుకుంది. ఎల్కతుర్తి మండలం దామెర గ్రామానికి చెందిన గొర్రె సుమన్, నిహారిక దంపతుల కుమారులు రిషి (11), రిత్విక్(9) రాంపూర్‌లోని మేనత్త కూతురు వివాహానికి వచ్చారు. గుంటూరులో జరిగిన పెళ్లికి వెళ్లి గురువారం ఉదయం రాంపూర్ గ్రామానికి చేరుకున్నారు. పెద్దలందరూ పెళ్లి సంబరాల్లో ఉండగా సాయంత్రం సమయంలో రిషి, రిత్విక్‌తోపాటు మరో బాలుడు ఈత కొట్టేందుకు సమీపంలోని ఊర చెరువులోకి వెళ్లారు. చెరువులోకి దిగిన రిషి, రిత్విక్ ఒకరి తరువాత ఒకరు మునిగిపోవడంతో బయట ఉన్న బాలుడు భయంతో ఇంటికి వెళ్లి విషయం చెప్పాడు. బంధువులు హుటాహుటిన చెరువు వద్దకు చేరుకుని పిల్లలను బయటకు తీశారు. అపస్మారక స్థితిలోకి వెళ్లిన చిన్నారులను 108 సిబ్బంది పరీక్షించి, అప్పటికే మృతి చెందినట్లు ధ్రువీకరించారు. ధర్మసాగర్ పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.



కోటగండి గోదాంల వద్ద వరంగల్–నర్సంపేట రహదారిపై ధర్నా చేస్తున్న రైతులు

మక్క రైతుల కన్నెర్ర

అన్‌లోడింగ్ చేయాలంటూ రాస్తారోకో

గీసుకొండ: వరంగల్ జిల్లా కోటగండి వద్ద ఉన్న సాయినాథ గోదాముల్లో తాము తీసుకొచ్చిన మక్కలను అన్‌లోడ్ చేయాలని రైతులు గురువారం రాస్తారోకో నిర్వహించారు. మూడ్రోజులుగా మక్కలను ట్రాక్టర్ల లోడ్‌లతో సహా గోదాముల వద్ద పడిగాపులు కాస్తున్నా లోడ్ దించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. రైతుల ఆందోళనతో వరంగల్–నర్సంపేట రహదారిపై రెండు కిలోమీటర్ల మేర ట్రాఫిక్ నిలిచిపోయింది. అన్‌లోడ్ చేయకపోవడంతో ట్రాక్టర్ల కిరాయి భారం తమపై పడుతోందని రైతులు వాపోయారు. ఈ విషయంపై తహసీల్దార్ విశ్వనారాయణ రైతులతో మాట్లాడి పరిస్థితిని అదనపు కలెక్టర్ శ్రీవత్సకు ఫోన్‌లో వివరించారు. అక్కడికి వచ్చిన మార్క్‌ఫెడ్ డీఎం మహేశ్.. గోదాంల వద్ద ఉన్న 40 ట్రాక్టర్లలోని మక్కలను అక్కడే అన్‌లోడ్ చేయాలని, కొత్తగా వచ్చే లోడ్‌లను ఏనుమాముల ఏఎంసీ వద్ద ఉన్న గోదాముల్లోకి తరలించాలని అధికారులకు చెప్పడంతో రైతులు ఆందోళన విరమించారు.

2 నుంచి 'ప్రజాపంథా' దీక్షా దివస్



ఖమ్మం మయూరి సెంటర్: తెలంగాణ ఏర్పడి పదేళ్లు అయిన సందర్భంగా ప్రజల ఆకాంక్షలు నెరవేర్చాలని, ఉద్యోగ ఖాళీలన్నీ భర్తీ చేయడమే కాక అర్హులందరికీ పోడు పట్టాలు, రేషన్ కార్డులు ఇవ్వాలనే డిమాండ్లతో జూన్ 2 నుంచి 12వ తేదీ వరకు సీపీఐ (ఎంఎల్) ప్రజాపంథా ఆధ్వర్యంలో దీక్షా దివస్ చేపట్టనున్నట్లు పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ నెల 22, 23, 24వ తేదీల్లో ప్రజాపంథా రాష్ట్ర ఏడో మహాసభలు జరిగాయని, ఈ సభలకు రాష్ట్రవ్యాప్తంగా 180 మంది ప్రతినిధులతో పాటు ఇతర రాష్ట్రాల నుండి 25 మంది ఆహ్వానితులు హాజరయ్యారన్నారు. ఈ మహాసభల్లో పార్టీ పంథాపై చర్చించి, పలు తీర్మానాలను ఆమోదించినట్లు తెలిపారు. రాష్ట్ర మహాసభల్లో 29 మందితో నూతన రాష్ట్ర కమిటీని ఎన్నుకోగా రాష్ట్ర కార్యదర్శిగా తనను ఎన్నుకున్నారని పోటు రంగారావు తెలిపారు. కమిటీలో కేజీ రాంచందర్, కెచ్చెల రంగయ్య, రాయల చంద్రశేఖర్, చిన్న చంద్రన్న, కె.రమ, గోకినేపల్లి వెంకటేశ్వరరావు, గుమ్మడి నర్సయ్య (మాజీ ఎమ్మెల్యే), చంద్ర అరుణ, ముద్దా బిక్షం, వి.కృష్ణ, ప్రభాకర్ తదితరులను ఎన్నుకున్నట్లు వివరించారు.

సెల్ఫీ కోసం చెరువు బురదలోకి ..

- కుమార్తెలను కాపాడబోయి తండ్రి మృతి
- ఇద్దరు కుమార్తెలు క్షేమం
- వరంగల్ జిల్లా లక్ష్మీపురంలో ఘటన



డాక్టర్ విజయ్‌కుమార్ (ఫైల్)

దుగ్గొండి: పిల్లల సెల్ఫీ సరదా తండ్రి ప్రాణాన్ని బలితీసుకుంది. చెరువులో బురదలోకి దిగిన ఇద్దరు కుమార్తెలను కాపాడబోయిన ఓ తండ్రి మృత్యువాతపడ్డాడు. వరంగల్ జిల్లా దుగ్గొండి మండలం లక్ష్మీపురం గ్రామంలో ఈ విషాదకర ఘటన జరిగింది. నల్లబెల్లి మండలం రుద్రగూడెం గ్రామానికి చెందిన డాక్టర్ కరుడపెల్లి విజయ్‌కుమార్(42) మంచిర్యాల ఈఎస్ఐ ఆస్పత్రిలో పనిచేస్తున్నారు. లక్ష్మీపురం గ్రామంలో తోడల్లుడి కూతురు వివాహ వేడుకకు వచ్చారు. పెళ్లి అనంతరం తన అత్తగారి స్వగ్రామం అదే కావడంతో కుటుంబంతో ఐదు రోజులుగా గ్రామంలోనే ఉంటున్నారు. గురువారం ఉదయం 10 గంటల ప్రాంతంలో తన కుమార్తెలు వింధ్యశ్రీ, హిమజ, బావమరిది కూతుళ్లు ఇద్దరితో కలసి స్థానికంగా ఉన్న చెరువు వద్దకు వెళ్లారు. చెరువు నీరు కనిపించేలా వింధ్యశ్రీ, హిమజలు బురదలోకి దిగి సెల్ఫీ తీసుకుంటున్నారు. అదే సమయంలో పిల్లలు బురదలోకి జారిపోతుండగా వారిని కాపాడే ప్రయత్నంలో విజయ్‌కుమార్ పిల్లలను ఒడ్డుకు లాగారు. పిల్లలు క్షేమంగా బయటపడగా, విజయ్‌కుమార్ మాత్రం పట్టుజారి చెరువులో పడ్డారు. ఆయనకు ఈత రాకపోవడంతోపాటు అక్కడే మొరం కోసం తీసిన 4 మీటర్ల లోతు గుంత ఉండటంతో విజయ్ అందులో మునిగిపోయారు. ఇది గమనించిన పిల్లలు కేకలు వేయడంతో కొంతమంది యువకులు వచ్చి విజయ్‌కుమార్‌ను బయటకి తీశారు. బంధువులు వెంటనే ఆయనను చికిత్స నిమిత్తం నర్సంపేటకు తరలించారు. అయితే అప్పటికే విజయ్‌కుమార్ మృతిచెందాడు. మృతుడి భార్య పవిత్ర ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై నవీన్‌కుమార్ తెలిపారు. విజయ్‌ది పేద కుటుంబం కావడంతో స్వగ్రామంలో ఇల్లు కూడా లేదని బంధువులు తెలిపారు. అత్తింటి వద్దనే అంత్యక్రియలు నిర్వహించారు.

ఎంఎల్ గ్రూపులన్నీ ఏకతాటిపైకి రావాలి

త్రిపుర పీసీసీ సీపీఐ (ఎంఎల్) నేత సుభాష్ దేవ్

ఖమ్మం మయూరిసెంటర్: దేశంలో బూర్జువా పార్టీలు అనుసరిస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను తిప్పి కొట్టాలంటే కార్మిక, రైతు వర్గ పోరాటాలు విస్తృతంగా జరగాలని.. అందుకోసం దేశంలోని ఎంఎల్ గ్రూపులన్నీ ఏకతాటిపైకి రావాల్సిన అవసరం ఉందని త్రిపుర రాష్ట్ర పీసీసీ సీపీఐ (ఎంఎల్) నేత సుభాష్ దేవ్ అన్నారు. ఖమ్మంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, నక్సలైట్ గ్రూపులుగా ఉన్న అన్ని ఎంఎల్ గ్రూపులు ఒక చోటకు రావాలన్నారు. కలిసి పోరాటాలు చేసేందుకు తమకు సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా పార్టీకి ఏడాదిగా చర్చలు జరుగుతున్నాయని, ఈ చర్చలు సఫలమవుతాయని ఆశిస్తున్నట్లు తెలిపారు. పంజాబ్ రాష్ట్ర సీపీఐ ఎంఎల్(కీర్తి) నేత రశ్పాల్ సింగ్ మాట్లాడుతూ, ప్రజాపంథా నేటి రాజకీయ పరిస్థితులకు అనుగుణంగా ముందుకు సాగుతోందన్నారు. సమావేశంలో సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు, నాయకులు కెచ్చల రంగయ్య, ఎస్ఎల్.పద్మ తదితరులు పాల్గొన్నారు.

ప్రేమించాడని..

- బాలిక కుటుంబ సభ్యుల దాడి
- దెబ్బలకు మృతి చెందిన యువకుడు



సంతోష్ (ఫైల్)

గుర్రంపోడు: ప్రేమ వ్యవహారంలో బాలిక కుటుంబ సభ్యుల చేతిలో యువకుడు దారుణ హత్యకు గురయ్యాడు. నల్లగొండ జిల్లా గుర్రంపోడు మండలం కొప్పోలు గ్రామంలో గురువారం జరిగిన ఈ సంఘటన వివరాలివి. కట్టంగూర్ మండలం దుగినవెల్లి గ్రామానికి చెందిన బొడ్డు సంతోష్ (20)కు.. నల్లగొండలో ఇంటర్ చదువుతున్న కొప్పోలు గ్రామానికి చెందిన బాలికతో గతంలో ప్రేమ వ్యవహారం సాగింది. ఈ విషయమై బాలిక తల్లిదండ్రుల ఫిర్యాదుతో పోలీసుస్టేషన్‌లో సంతోష్‌కు కౌన్సెలింగ్ ఇచ్చారు. తమ పిల్లలు ఒకరి జోలికి మరొకరు రాకుండా చూసుకోవాలని బాలిక, యువకుడి తల్లిదండ్రుల మధ్య పంచాయితీలో అంగీకారం కుదిరింది. కాగా, సంతోష్ గురువారం చండూరు మండలం ఉడుతలపల్లిలో రామాలయ వార్షికోత్సవానికి మేనమామల ఇంటికి వచ్చాడు. మధ్యాహ్న సమయంలో కొప్పోలు గ్రామంలోని ఆ బాలిక ఇంటికి వచ్చాడు. బాలికతో ఇంట్లో మాట్లాడుతుండగా.. ఆమె నాయనమ్మ ఇంటి బయట నుంచి గడియపెట్టి కుటుంబ సభ్యులకు సమాచారం ఇచ్చింది. విషయం తెలుసుకుని ఇంటికి వచ్చిన బాలిక తండ్రి ఆవుల మల్లయ్య, నాయనమ్మ రాములమ్మ కలిసి కొట్టడంతో దెబ్బలకు తాళలేక సంతోష్ అక్కడికక్కడే మృతి చెందాడు. సంతోష్ తల్లిదండ్రులు సైదులు, రేణుక ఉపాధి కోసం సూరత్ వెళ్లారు. వీరికి ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. మృతుడు సంతోష్ రెండో కుమారుడు. సమాచారం అందుకున్న సంతోష్ బంధువులు కొప్పోలు గ్రామానికి చేరుకున్నారు. వారి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసుకుని మృతదేహాన్ని నల్లగొండ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. దేవరకొండ డీఎస్పీ రవీందర్, మల్లేపల్లి సీఐ ఎస్.శ్రీనివాసులు, ఎస్ఐ శివప్రసాద్‌లు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. గ్రామంలో బందోబస్తు ఏర్పాటు చేశారు.

ఇంటి ఆవరణలోనే గంజాయి మొక్కలు!

- ధ్వంసం చేసిన ఎక్సైజ్ అధికారులు



గంజాయి మొక్కల వద్ద సుధ, ఎక్సైజ్ ఉద్యోగులు

సత్తుపల్లిరూరల్: తెలిసో.. తెలియకో ఓ మహిళ ఇంటి ఆవరణలోనే గంజాయి మొక్కలు పెంచుతోంది. ఖమ్మం జిల్లా సత్తుపల్లి మండలం చంద్రాయపాలెం గ్రామానికి చెందిన యట్టగాని సుధ ఇంట్లో నాలుగు గంజాయి మొక్కలు ఏపుగా పెరిగాయి. ఈ సమాచారం అందడంతో సత్తుపల్లి ఎక్సైజ్ సీఐ రాంప్రసాద్ ఆధ్వర్యాన గురువారం ధ్వంసం చేశారు. తాను పూల మొక్కలు పెంచగా.. గంజాయి మొక్కలు ఎలా పెరిగాయో తెలియదని సుధ చెప్పిందని సీఐ పేర్కొన్నారు. ఈమేరకు ఆమెపై బైండోవర్ కేసు నమోదు చేసి తహసీల్దార్ శ్రీనివాసరావు ఎదుట హాజరుపరిచామని పేర్కొన్నారు.

పాటలు వింటూ.. డ్యాన్స్ చేస్తూ..

- బోర్లాపడి పశువుల కాపరి మృతి



యాదగిరి (ఫైల్)

జోగిపేట(అందోల్): సెల్‌ఫోన్ పాటలు వింటూ డ్యాన్స్ చేస్తూ ఓ పశువుల కాపరి బోర్లాపడి అక్కడికక్కడే మృతి చెందాడు. సంగారెడ్డి జిల్లా అందోల్ మండలం అల్మాయిపేట గ్రామంలో జరిగిన ఈ సంఘటనపై ఎస్ఐ సామ్యానాయక్ కథనం ప్రకారం.. గ్రామానికి చెందిన బంటు యాదగిరి (21) పశువుల కాపరి. ఎప్పటిలాగే బుధవారం పశువులను మేపడానికి గ్రామ శివారుకు వెళ్లాడు. మధ్యాహ్నం తోటి కాపరులిద్దరూ కల్లు తాగగా, యాదగిరి, మరొకరు కూల్‌డ్రింక్ తాగారు. సెల్‌ఫోన్‌లో పాటలు వింటూ డ్యాన్స్ చేయడం యాదగిరికి అలవాటు. ఫోన్‌లో వస్తున్న పాటకు అనుగుణంగా డ్యాన్స్ చేస్తూ పైకి ఎగిరి కిందపడ్డాడు. ఐదు నిమిషాలపాటు లేవకుండా అలాగే ఉండి పోయాడు. రెండు రోజుల క్రితమే యాదగిరి దగ్గరి బంధువు చనిపోవడంతో అతన్ని తోటికాపర్లు ముట్టుకోవడానికి సంకోచించారు. ఎంతకీ లేవకపోవడంతో వారే లేపే ప్రయత్నం చేయగా అప్పటికే యాదగిరి ప్రాణాలు కోల్పోయాడు. బుధవారం రాత్రి పోలీసులకు సమాచారం అందించడంతో వారు మృతదేహాన్ని జోగిపేట ఆస్పత్రి మార్చురీలో భద్రపరిచారు. మృతుని తండ్రి బంటు రాములు గురువారం ఫిర్యాదు చేయడంతో మృతదేహానికి పోస్టుమార్టం నిర్వహించి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

తాటికాయలు కోస్తూ పిడుగుపాటుకు మృతి



రమావత్ వాష్‌రాం (ఫైల్)

పిట్లం(జుక్కల్): కామారెడ్డి జిల్లా పిట్లం మండలం సిద్దాపూర్ శివారులో ముంజల కోసం తాటిచెట్టెక్కిన ఒక వ్యక్తి పిడుగుపాటుకు మృతి చెందాడు. ఏఎస్ఐ లింబాద్రి గురువారం తెలిపిన వివరాలివి. సిద్దాపూర్ తండాకు చెందిన రమావత్ వాష్‌రాం (25) బుధవారం తాటికాయలు కోయడానికి గ్రామ శివారులోని వడ్లోని కుంటలో తాటిచెట్టుపైకి ఎక్కాడు. కాయలు కోస్తుండగా అతనిపై పిడుగు పడింది. దీంతో చెట్టుపై నుంచి కిందపడి వాష్‌రాం మృతి చెందాడు. పిడుగుపాటుకు అతని శరీరం కాలిపోయింది. మృతునికి భార్య, ఒక కుమార్తె ఉన్నారు.

ఓ విశ్వాసులారా! అతిగా అనుమానించడం నుండి దూరంగా ఉండండి. ఎందుకంటే కొన్ని అనుమానాలే నిశ్చయంగా పాపాలు. మీరు మీ పరస్పర రహస్యాలను తెలుసుకోవటానికి ప్రయత్నించకండి. చాడీలు చెప్పకోకండి.

– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 26 మే 2023

ఇది మోదీ ఎక్స్‌ప్రెస్!

గమనించాలి... గ్రహించాలే కానీ సంఘటనలన్నీ ఏదో ఒక సంకేతమిస్తాయి. భారత ప్రధాని నరేంద్ర మోదీ అయిదు రోజుల పాటు జరిపిన మూడు దేశాల పర్యటన చూస్తే అదే అనిపిస్తుంది. ప్రపంచ దేశాధినేతల ప్రత్యేక ప్రశంసలు, ప్రవాస భారతీయుల నుంచి జయ జయ ధ్వానాలు మోదీకే కాదు... భారత్‌కు పెరిగిన ప్రాధాన్యాన్నీ, ప్రతిష్ఠనూ సూచిస్తున్నాయి. జపాన్‌లో 'జీ7' దేశాల సదస్సులో అతిథిగా హాజరైనప్పుడూ, పాపువా న్యూ గినియా నేత ఏకంగా పాదాభివందనం చేసినప్పుడూ, ఆస్ట్రేలియాలో ప్రవాస భారతీయుల 'మోదీ' నాదాలు చూసినప్పుడూ వెలువడ్డ సంకేతం అదే. కర్ణాటకలో పదే పదే పర్యటించి, భారీ సభలు, ఊరేగింపులు నిర్వహించినప్పటికీ ఆ రాష్ట్రంలో అధికారం చేజార్చుకున్న బీజేపీ నేతగా స్వదేశంలో సన్నాయి నొక్కులు వినిపిస్తూ ఉండవచ్చు. ప్రధానిగా బాహ్య ప్రపంచంలో మాత్రం మోదీ సమ్మోహన మంత్రానికి తరుగు, తిరుగు లేదని అర్థమవుతుంది. అభివృద్ధి చెందుతున్న దేశాల నుంచి అగ్ర రాజ్యాల దాకా అన్నీ.. అతిపెద్ద మార్కెటైన నవభారతంతో భుజాలు రాసుకోవడానికి ఉత్సాహం చూపుతున్నాయని తెలుస్తుంది.

హిరోషిమాలో 'జీ7' సదస్సుకు హాజరైన ప్రధాని ఆ పైన ద్వీపదేశమైన పాపువా న్యూ గినియాను తొలిసారి సందర్శించారు. 'భారత – పసిఫిక్ ద్వీపదేశాల సహకార వేదిక' (ఎఫ్ఐపీఐసీ) మూడో సదస్సుకు సహాధ్యక్షత వహించారు. ఆ దేశానికి ఒక భారత ప్రధాని వెళ్ళడం ఇదే ప్రథమం. ఏడాది క్రితం పదవి చేపట్టిన లేబర్ పార్టీ నేత, ఆస్ట్రేలియా ప్రధాని ఆంథోనీ అల్బనీస్ ఆహ్వానంపై మోదీ సిడ్నీలో పర్యటించారు. అల్బనీస్‌తో ద్వైపాక్షిక సమావేశం, వ్యాపార బృందాల రౌండ్ టేబుల్‌తో తన మూడు దేశాల పర్యటనను విజయవంతంగా ముగించి, స్వదేశానికి తిరిగొచ్చారు. స్వదేశంలోని రాజకీయ చిక్కులతో అమెరికా అధ్యక్షుడు వైదొలగేసరికి ఆస్ట్రేలియాలో జరగాల్సిన 'క్వాడ్' సదస్సును లఘువుగా జపాన్‌లోనే అధినేతలు జరిపేశారు. ఆస్ట్రేలియాతో పటిష్ఠ బంధానికి అవకాశం వదులుకోని మోదీ తన పర్యటనను సమయానికి తగ్గట్టు ద్వైపాక్షిక సందర్శన చేసేశారు. గత ఏడాది కాలంలో ఆరోసారి అల్బనీస్‌తో భేటీ, ఈ ఆర్థిక, వాణిజ్య సహకార దోస్తీ ప్రాంతీయ శాంతి సుస్థిరతలకూ కీలకమన్నారు. 'డెమోక్రసీ, డయాస్పొరా, దోస్తీ'– ఈ మూడు 'డి'లు కీలకమంటూ, శరవేగంతో మెరుగవుతున్న ఇరుదేశాల సంబంధాలకు టీ20 మ్యాచ్‌లతో పోలిక తెచ్చారు.

అదే సమయంలో ఆస్ట్రేలియాలో ఆలయాలపై దాడులు, వేర్పాటువాద శక్తుల విజృంభణను మార్చిలో అల్బనీస్‌తో ప్రస్తావించినా ఇప్పుడూ ఆ ఊసెత్తడం స్నేహదేశానికి ఒకింత ఇబ్బందికరమే. అది అటుంచితే, భారత ప్రధానికి సాదర స్వాగతం పలుకుతూ ఆ దేశంలోని అతి పెద్ద వినోద, క్రీడా ప్రాంగణంలో సాగిన భారీ సంబరం ప్రవాసుల్లో పెరిగిన జాతీయవాదానికి మచ్చు తునక. 'మోదీ ఎయిర్‌వేస్', 'మోదీ ఎక్స్‌ప్రెస్' లాంటి పేర్లతో ఆస్ట్రేలియా నలుమూలల నుంచి ప్రత్యేక విమానాల్లో, రైళ్ళలో అభిమాన జనం తరలివచ్చారు. భారత ఆర్థిక వ్యవస్థలోకి లక్షల కోట్ల రూపాయలను ప్రవహింపజేస్తున్న ప్రవాస భారత ప్రపంచానికి ఒక భరోసా ఇవ్వాలని ప్రధాని భావించినట్టున్నారు. అందుకే, క్రిక్కిరిసిన స్టేడియమ్‌లో ముప్పావుగంట సేపు మాటల మోళీ చేశారు. తొమ్మిదేళ్ళలో తొలిసారి ఆస్ట్రేలియాలో పర్యటిస్తున్న ప్రియతమ నేత పట్ల భారతీయ డయాస్పొరా స్పందన చూసి, అక్కడి పాలకులు సైతం అబ్బురపడ్డారు.

2014 నవంబర్‌లో మోదీ ఆస్ట్రేలియా పర్యటించినప్పుడు ఆయన అప్పుడప్పుడే విశ్వవేదికపై నిలదొక్కుకునే ప్రయత్నం చేస్తున్న భారత ప్రధాని. నాడు బ్రిస్బేన్‌లో 'జీ20' సదస్సులో ఇతర దేశాలతో స్నేహానికి ఆయన శ్రమిస్తే, నేడు 2023లో అదే భారత్ 'జీ20'కి అధ్యక్ష పీఠం దాకా ఎదిగింది. పోటీ దేశాల కన్నా వేగంగా పెరుగుతున్న దేశమైంది. అప్పట్లో ఆస్ట్రేలియన్ పార్లమెంట్‌లో బెరుకుగా మాట్లాడిన అదే వ్యక్తి ఇప్పుడు విదేశీ పర్యటనలు, డజన్ల కొద్దీ శిఖరాగ్ర సదస్సుల్లో ఆరితేరిన ఆత్మవిశ్వాసం ప్రదర్శిస్తున్నారు. ఆస్ట్రేలియా సహచరుడు 'మోదీ... ది బాస్' అని మైకులో అంటే, వచ్చే అమెరికా పర్యటనలో భారత ప్రధాని వైట్‌హౌస్ విందుకు అప్పుడే టికెట్లు అమ్ముడైపోయాయంటూ, ఆటోగ్రాఫ్ కావాలని అగ్రరాజ్య అధినేత బైడెన్ చమత్కరించడం గమనార్హం. మోదీ మాటల్లోనే చెప్పాలంటే, 'నేను కలసిన నేతలందరూ 'జీ20'కి భారత సారథ్యం పట్ల ప్రశంసలు కురిపిస్తున్నారు. ఇది భారత్‌కు గర్వకారణం.'

ఇవాళ భారత్ ప్రపంచంలోని అయిదో అతి పెద్ద ఆర్థిక వ్యవస్థ. జనాభాలో చైనాను దాటి ప్రపంచంలో ప్రథమ స్థానానికి దూసుకుపోతున్న మన గడ్డపై ఈ మానవ వనరులకు తోడు అపార ప్రతిభ, అరచేతిలో సాంకేతికత ఉన్నాయి. వాణిజ్యం, ఆటోమొబైల్ ఉత్పత్తులు, మొబైల్ తయారీ, అందివచ్చిన అంకుర సంస్థల ఉద్యమం లాంటి అనేక సానుకూలతలతో పురోగమిస్తున్న భారత్ వైపు ప్రపంచం చూస్తున్నది. హరిత ఉదజని టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు ఖరారు చేసుకోవడం మొదలు వలసలు – రాకపోకల భాగస్వామ్య ఒప్పందం (ఎంఎంపీఏ) దాకా ఆస్ట్రేలియా – భారత్‌లు తాజాగా సంతకాలు చేయడం ఆ ధోరణికి కొనసాగింపే! ఇవన్నీ విద్యార్థులు, వృత్తి నిపుణులు, పరిశోధకులు, విద్యావేత్తల రాకపోకలను సులభతరం చేస్తాయి. ఆర్థిక, దౌత్య సంబంధాలైనా, అత్యంత కీలకమైన భౌగోళిక వ్యూహాత్మక దోస్తీలైనా బాగుండాలంటే మనుషుల మధ్య ఆత్మీయ బంధాలు ప్రధానం. ప్రజాస్వామ్య దేశాలతో, ప్రవాస భారతీయులతో కలసి అడుగులు వేస్తున్న నమో భారత్ అనుసరిస్తున్న మార్గమూ అదే!

కృత్రిమ మేధ విసరనున్న సవాళ్లు

విశ్లేషణ



నితిన్ దేశాయి

ఛాట్ జీపీటీ, బార్డ్, బింగ్, డాల్–ఈ! ఈ మధ్యకాలంలో బాగా ప్రాచుర్యంలోకి వచ్చిన కృత్రిమ మేధ ఆధారిత టెక్నాలజీల పేర్లు ఇవి. వాణిజ్యం, భద్రత విషయాల్లో ఈ సాఫ్ట్‌వేర్ల ప్రభావం ఏమిటన్న విషయంపై ఇప్పుడు విస్తృత చర్చ జరుగుతోంది. జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్లు ఎంత పురోగతి సాధించినా... వాటికి మనిషికున్న విచక్షణ జ్ఞానం ఉండదు. కాబట్టి వాటంతట అవే మనిషికి చెడు చేయలేకపోవచ్చు కానీ... చెడుబుద్ధి కలిగిన మనిషి వల్ల మాత్రం జరిగే ప్రమాదం ఉంది. కంప్యూటర్ల రాకతో మేలూ జరిగింది, సైబర్ మోసాలూ పెరిగాయి. జనరేటివ్ ఏఐ విషయంలోనూ రాగల అపార అవకాశాలకు రానున్న తరాలను సిద్ధం చేయడం, ఎదురుకాగల ప్రమాదాలను వీలైనంత వరకూ తగ్గించడం ఇప్పుడు మనం చేయాల్సిన పని!

సాధారణంగా మనం ఉపయోగించే సాఫ్ట్‌వేర్ ఏదైనా సొంతంగా సృష్టించేది ఏమీ ఉండదు. అయితే కొన్ని సాధారణ కృత్రిమ మేధ(ఏఐ) సాఫ్ట్‌వేర్లు మన రాతల్లోని తప్పులను దిద్దడమే కాకుండా... తరువాత ఉపయోగించగల పదాలను సూచించగలవు. ఛాట్‌జీపీటీ వంటివి వీటికంటే అత్యాధునికమైనవి. సొంతంగా వ్యాసాలు, కవితలు రాసి పెట్టగలవవు. ఈ లాంగ్వేజ్ జనరేటెడ్ కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్లు మనం వేసిన ప్రశ్నలను సమర్థంగా అర్థం చేసుకోవడమే కాకుండా ఇంటర్నెట్‌లో అందుబాటులో ఉన్న సమాచారం మొత్తాన్ని మథించి సవివరమైన సమాధానాన్ని సిద్ధం చేయగలవు. ఇతరుల గొంతులను అనుకరించేందుకు, గ్రాఫిక్స్ కోసం కూడా వీటిని వాడుకోవచ్చు. గత ఏడాది అక్టోబరులో సామాన్యులకూ అందుబాటులోకి వచ్చిన ఛాట్ జీపీటీ చాలా తక్కువ కాలంలో వ్యాప్తి చెందింది. సెకన్ల కాలంలోనే సంక్లిష్టమైన ప్రశ్నలకూ జవాబులు చెబుతూ అందరినీ ఆకట్టుకుంది. అదే సమయంలో చాలామందిలో కృత్రిమ మేధపై ఆందోళన వ్యక్తమయ్యేందుకూ కారణమైంది.

ఈ నేపథ్యంలో నేనూ ఛాట్ జీపీటీకి ఒక ప్రశ్న సంధించా. ఉద్యోగాలపై అత్యాధునిక కృత్రిమ మేధ సాఫ్ట్‌వేర్ల ప్రభావం ఎలా ఉంటుందన్న ప్రశ్నకు ఛాట్ జీపీటీ సంతులనంతో కూడిన జవాబిచ్చింది. డేటా ఎంట్రీ, అసెంబ్లీ లైన్, కస్టమర్ కేర్ వంటి రంగాల్లోని రిపిటీటివ్ పనులు (ఒకే పనిని పదేపదే చేయడం) చేయడంలో కృత్రిమ మేధకు అపారమైన సామర్థ్యముందని చెబుతూనే... గ్రాఫిక్ డిజైనింగ్, అడ్వర్టైజ్‌మెంట్, కంటెంట్ క్రియేషన్ వంటి సృజనాత్మక విషయాల్లోనూ జనరేటివ్ ఏఐ మంచి ప్రభావం చూపగలదని తెలిపింది. ఈ సమాధానంలోనే ఛాట్ జీపీటీ ప్రపంచవ్యాప్తంగా పెరిగిపోతున్న ధనిక, పేద అంతరాన్ని కూడా ప్రస్తావించడం గమనార్హం. నైపుణ్యలేమి లేదా మధ్యమ స్థాయి నైపుణ్యాలు మాత్రమే ఉన్న పనివారికి నష్టం జరిగే అవకాశముందని తేల్చి చెప్పింది. మెషీన్ లెర్నింగ్, డేటా అనా లసిస్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ వంటి ప్రత్యేక నైపుణ్యాలున్న వారికి కొత్త, వినూత్న ఉద్యోగాలను సృష్టించగల సామర్థ్యం కూడా జనరేటివ్ ఏఐకి ఉందని వివరించింది.

సాంకేతిక పరిజ్ఞానంలో జరిగే మార్పులు అప్పటికే ఉన్న ఉద్యోగాలపై ప్రతికూల ప్రభావం చూపుతాయి. అదే సమయంలో కొత్త కొత్త ఉద్యోగాలను కూడా సృష్టిస్తాయి. ఎడ్లబండ్ల స్థానంలో మోటారు వాహనాలు వచ్చినట్లు అన్నమాట! భారతదేశంలో జనరేటివ్ ఏఐ దానికున్న సృజనాత్మక సామర్థ్యాన్ని బట్టి చూస్తే బిజినెస్ ప్రాసెసింగ్, సాఫ్ట్‌వేర్ డెవలప్‌మెంట్ రంగాల్లోని ఉద్యోగాలపై కచ్చితంగా ప్రతికూల ప్రభావం చూపనుంది. ఈ రంగాల్లోని పనులను జనరేటివ్ ఏఐ ప్రోగ్రామ్స్ చాలా సులువుగా చేయగలవు. కాకపోతే వీటితో పని చేయించేందుకు కొంత సాయం, ప్రాంప్టింగ్ అవసరం. మన ఐటీ, బీపీవో కంపెనీలు ఈ సామర్థ్యాలను అందుకోవడంపై శ్రద్ధ పెట్టాలి. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... జనరేటివ్ ఏఐ ఈ విషయంలోనూ మనకు సాయపడగలదు. తక్కువ నైపుణ్యం ఉన్నవారికి తగిన శిక్షణ ఇవ్వగలదు. ఉదాహరణకు ఇంగ్లీషు భాషా నైపుణ్యాన్ని పెంచుకునేందుకు, తద్వారా మార్కెటింగ్ లేదా మరే ఇతర రంగంలోనైనా రాణించేందుకు ఏఐని వాడుకోవచ్చు.



ఇప్పుడు చర్చ మొత్తం భద్రత పైనే...

జనరేటివ్ ఏఐ విషయంలో ఇప్పుడు చర్చ మొత్తం భద్రతాంశాల పైనే. ఛాట్ జీపీటీ రాక నేపథ్యంలో ఇది మరింత ముదురుతోంది. మనుషుల ప్రమేయం లేకుండానే ఈ జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్లు ఇమేజెస్, వీడియో, టెక్స్ట్‌లను సృష్టించగలవు. ప్రఖ్యాత రచయిత యువాన్ హరారి అభిప్రాయం ప్రకారం, మానవ సంస్కృతికి భాష అనేది ప్రాథమిక ప్రాతిపదిక. భాష విషయంలో ప్రావీణ్యం కలిగి ఉన్న జనరేటివ్ ఏఐ... సంస్కృతి వృద్ధి, విశ్వాసాలను తన చేతుల్లోకి తీసుకోలదని యువాన్ అంటారు. అయితే జనరేటివ్ ఏఐకి తనదైన చేతన ఉండదు. ఏదో సాధించాలన్న కాంక్ష కూడా కరవు. స్పష్టంగా చెప్పాలంటే... కొంతమంది మనుషులు ఇతరులపై తమ ప్రభావాన్ని మరింత పెంచుకునేందుకు జనరేటివ్ ఏఐ వంటివాటిని ఉపయోగించుకునే అవకాశం ఉంది.

ఈ జనరేటివ్ ఏఐ సాఫ్ట్‌వేర్లు చాలా వరకూ ఓపెన్ సోర్స్. అందరికీ అందుబాటులో ఉండేవి. అంటే రకరకాల అభిప్రాయాలు, నమ్మకాలు ప్రచారంలోకి వచ్చేందుకు అవకాశమున్నవి. కాబట్టి సమస్య అంత పెద్దగా ఏమీ ఉండకపోవచ్చు. కానీ అసలైన సవాలు కృత్రిమ మేధను మానసిక ప్రకోపాలతో ఉపయోగించడంతోనే ఉంది. ఛాట్ జీపీటీ ఇచ్చిన సమాధానం ప్రకారమే... కృత్రిమ మేధ ఆధారంగా నిఘా వ్యవస్థలను ఏర్పాటు చేయడం, సంప్రదాయ భద్రత ఏర్పాట్లను తప్పించుకుని సైబర్ దాడులకు తెగబడేలా ఏఐని వాడుకోవడం, కృత్రిమ మేధను ఉపయోగించుకుని మానవులపై ఆయుధ దాడి చేయడం వంటివాటికి అవకాశం ఉంది. అంతేకాకుండా... నకిలీ వార్తలు, మోసాల వంటివాటిని మరింత తీవ్రతరం చేసేందుకు కూడా ఈ జనరేటివ్ ఏఐ అక్కరకొచ్చే ప్రమాదముంది. గొంతులను అనుకరించే సామర్థ్యం కూడా ఉండటం వల్ల భవిష్యత్తులో మన కుటుంబ సభ్యుల గొంతులోనే డబ్బులడిగే మోసాలకు తెరలేవవచ్చు.

దుర్వినియోగాన్ని అరికట్టడం ఎలా?

జనరేటివ్ ఏఐ కారణంగా ఒకవేళ ఉద్యోగాలు తగ్గిపోతే సార్వత్రిక కనీస ఆదాయం వంటి వాటి ద్వారా జరిగే నష్టాన్ని కొంతైనా తగ్గించవచ్చునని ఛాట్ జీపీటీ సృష్టికర్త సామ్ ఆల్ట్‌మ్యాన్ అంటారు. కానీ భద్రతపరమైన అంశాలతోపాటు ఏఐ దుర్వినియోగాన్ని అరికట్టడం ఎలా అన్నదే ఇప్పుడు అసలు ప్రశ్న. కృత్రిమ మేధ వాడకానికి, నియంత్రణకు ప్రత్యేక సంస్థ ఒకదాన్ని ఏర్పాటు చేయాలన్న ఏకాభిప్రాయం కూడా ఇప్పుడిప్పుడే ఏర్పడుతోంది. ఈ విషయమై జీ7 దేశాలు ఓ వర్కింగ్ గ్రూప్ ఏర్పాటుకు ప్రయత్నాలు చేస్తుండగా, యూరోపియన్ యూనియన్ ఇప్పటికే నియంత్రణ మార్గదర్శకాల తయారీలో నిమగ్నమైంది. అయితే ఈ నియంత్రణ ప్రభుత్వాల ఆధ్వర్యంలో జరిగితే రాజకీయ దుర్వినియోగమన్న ప్రశ్న ఉత్పన్నమవుతుంది. కృత్రిమ మేధ అభివృద్ధిపై చైనా ఇప్పటికే కొన్ని నియంత్రణలను అమల్లో పెట్టిన విషయం ప్రస్తావనార్హం.

భారత్ సిద్ధం కావాలి

దశాబ్దాల క్రితం కంప్యూటరీకరణ మాదిరిగానే... జనరేటివ్ ఏఐ రేపటితరం టెక్నాలజీ అన్న విషయాన్ని భారత్ అంగీకరించాల్సిన అవసరముంది. కాబట్టి అలాంటి సాఫ్ట్‌వేర్లను స్థానికంగా అభివృద్ధి చేయాలి, వాడటాన్ని ప్రోత్సహించాలి. జనరేటివ్ ఏఐకి భాషే ప్రాతిపదిక కాబట్టి.. బోలెడన్ని భాషలు మాట్లాడే భారత్‌లో వాటి వినియోగం పెద్ద సవాలే. పైగా ఏఐ సర్వీసులకు పెద్ద పెద్ద సర్వర్ వ్యవస్థల అవసరం ఉంటుంది. ఇది పెద్ద పెద్ద కంపెనీలకు అనుకూలమైన అంశం. అలాగే... వీలైనంత తొందరగా ఇన్ఫోటెక్ పరిశ్రమను, ఏఐని అనుసంధానించాల్సిన అవసరముందని... తద్వారా మాత్రమే ఏఐ మార్కెట్‌లో స్థానం సంపాదించవచ్చునని తాజా అంచనా. కంప్యూటర్ల రాకతో కష్టతరమైన లెక్కలు వేసే బాధ తప్పి అంతకంటే ఎక్కువ ప్రయోజనకరమైన పనులపై దృష్టి పెట్టడం సాధ్యమైంది. సైబర్ మోసాలూ పెరిగాయి. ఇదే విధంగా జనరేటివ్ ఏఐ కూడా భవిష్యత్తు తరాలకు కూడా కొంత మంచి, కొంత చెడు అనుభవాలను చూపించనుంది. ఈ పరిణామాలకు, రాగల అపార అవకాశాలకు రానున్న తరాలను సిద్ధం చేయడం... ఎదురు కాగల ప్రమాదాలను వీలైనంత వరకూ తగ్గించడం ఇప్పుడు మనం చేయాల్సిన పని!

వ్యాసకర్త ఆర్థికవేత్త
('ద బిజినెస్ స్టాండర్డ్' సౌజన్యంతో)

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

మొత్తం ఒకదానికే!



ప్రాచీన హోదా కలిగిన భారతీయ భాషల కోసం మోదీ ప్రభుత్వం ఇలా ఖర్చు చేసింది (2017–20):
సంస్కృతం – రూ. 643 కోట్లు.
తమిళం – 23 కోట్లు. కన్నడ – 3 కోట్లు.
తెలుగు – 3 కోట్లు. ఒడియా – 0 కోట్లు.
మలయాళం – 0 కోట్లు.

– అద్వైద్, చరిత్రకారుడు

అంతా ఆయనే!



వందే భారత్ రైళ్ల నుంచి నూతన పార్లమెంట్ భవనం వరకు ప్రతిదీ ప్రధాని మోదీ ఆవిష్కరించాల్సిందే. కోవిడ్ సర్టిఫికెట్ల మీదా ఆయన ఫొటో ఉండాల్సిందే. ఏ మంత్రిత్వ శాఖ చేసిన పనికైనా ఆయనకు క్రెడిట్ ఇవ్వాల్సిందే. ఇట్లాంటి మహాత్మోన్మాదం... అధికారవాదుల అభద్రతకు ప్రమాణ చిహ్నం.

– సాకేత్ గోఖలే, తృణమూల్ జాతీయ ప్రతినిధి

మర్యాద కాదు!



ఇండియాలో ఏం జరుగుతోంది? ఇండియాను ప్రపంచం గౌరవించడం మొదలుపెట్టినప్పుడే – మనం మన జాతీయ చిహ్నాలను, సంస్థలను అప్రతిష్ఠపాలు చేయడానికి ప్రయత్నిస్తున్నాం; పరస్పరం అగౌరవాన్ని చూపుకొంటున్నాం.

– వేద్ మాలిక్, భారత ఆర్మీ మాజీ చీఫ్

మళ్లీ మొదలా?



కోవిడ్ 19 కన్నా ప్రమాదకరమైన వ్యాధికి సిద్ధంగా ఉండాలని ప్రపంచ నాయకులను ప్రపంచ ఆరోగ్య సంస్థ డైరెక్టరు హెచ్చరించారు. నేను మళ్లీ మరొక మహమ్మారికి సిద్ధంగా లేను. మీ సంగతేంటి?

– తస్లీమా నస్రీన్, రచయిత్రి

ఉండొద్దా?



పాలస్తీనియన్లకూ, ఇజ్రాయిలీలకూ ఘర్షణ పాలస్తీనా దేశం ఏర్పాటు గురించి కానేకాదు; మొత్తంగా అసలు ఒక యూదు దేశం ఉనికిలో ఉండటం గురించి.

– ఆర్సెన్ ఓస్ట్రోవ్‌స్కీ, హక్కుల న్యాయవాది

ఈ సంకేతాన్ని ప్రతిపక్షాలు అందిపుచ్చుకోవాలి!

అభిప్రాయం



బి.టి. గోవిందరెడ్డి

దాదాపు అందరి అంచనాలనూ తలకిందులు చేస్తూ కర్ణాటక ప్రజలు కాంగ్రెస్‌కు అత్యధిక స్థానాలు అందించి అందలం ఎక్కించారు. ఆ ఘన విజయం కారు చీకటిలో క్షణకాలం తళుక్కున మెరిసి మాయమయ్యే కాంతిరేఖ వంటిదేనా? కేవలం కర్ణాటకకే పరిమితమైన రాజకీయాల ప్రభావం తప్ప అందులో మరేదీ లేదా? దేశ ప్రజల్లో గత దశాబ్ద కాలంగా గూడుకట్టుకుంటున్న ఆగ్రహావేశాలకు అదేమీ సంకేతం కాదా? ఈ ప్రశ్నలు కర్ణాటక ఫలితాలు వెలువడిన మే 13 మొదలుకొని చానెళ్లలోనూ, పత్రికల్లోనూ, సామాజిక మాధ్యమాల్లోనూ పదే పదే వినిపిస్తున్నాయి. ఆ ప్రశ్నలకు ఎవరికి తోచినట్టు వారు వివరణ ఇస్తున్నారు. ఇవన్నీ 'తెలిసినవారికి పలుకు లేదు... పలికేవారికి తెలివి లేదు' అన్నట్టు ఉన్నాయి.

కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో సాగిన ప్రచారం అసాధారణమైనది. ప్రధానంగా బీజేపీ వైపునుంచి సాగిన ఈ ప్రచారాన్ని చూసి ఒక దశలో విపక్షాలన్నీ బెంబేలెత్తాయి. కానీ తెలివైన కర్ణాటక ఓటర్లు 'జనాదేశం' ఎలా ఉందో చూపారు. 'కర్ర వంకర పొయ్యి తీర్చినట్టు' లెక్క సరిచేశారు. దీనికి ముందు పంజాబ్ ఓటర్లు సైతం విచక్షణ ప్రదర్శించారు. కాంగ్రెస్ పాలన బాగులేదనుకున్నప్పుడు ఆ రాష్ట్ర ప్రజలు ఆమ్ ఆద్మీ పార్టీ(ఆప్) గెలిపించారు తప్ప కమలం పార్టీ వైపు చూడనే లేదు. తాము గెలిపించుకోకపోయినా ప్రలోభాల ఫిరాయింపులతో గద్దె నెక్కి స్వారీ చేసిన బీజేపీ పోకడలను కర్ణాటక ప్రజలు గమనించారు. ఇక నిరుడు డిసెంబర్‌లో జరిగిన ఎన్నికల్లో హిమాచల్ ప్రదేశ్ అసెంబ్లీకి జరిగిన ఎన్నికల్లో కూడా కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం గట్టి బీజేపీని కాదనుకున్నారు.

దేశవ్యాప్తంగా ప్రజల్లో వర్తమాన ఎన్డీఏ పాలనపై ఒక పునరాలోచన ప్రారంభమైందనడానికి ఈ మూడు రాష్ట్రాల ప్రజలు ఇచ్చిన తీర్పులు స్పష్టమైన సంకేతం. దీన్ని ప్రతిపక్షాలు అందిపుచ్చుకుని తమకు అనుకూలంగా మలుచుకుంటాయా లేక బీజేపీయే జాగ్రత్తపడి తన బలాన్ని కాపాడుకునే ప్రయత్నం చేస్తుందా అన్నది రానున్న కాలం చెబుతుంది. ఒకటైతే వాస్తవం. ఈ రెండు రాష్ట్రాలూ బీజేపీ సొంత ఇలాకాలు కాదు. కానీ ఈ ఏడాది చివరి నాటికి రాజస్థాన్, మధ్యప్రదేశ్, తెలంగాణ, ఛత్తీస్‌గఢ్, మిజోరాంలలో ఎన్నికలు జరుగుతాయి. ఇందులో రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్‌లు కాంగ్రెస్ చేతిలో ఉన్నాయి. ఆ రెండుచోట్లా కాంగ్రెస్‌లో అంతర్గత కుమ్ములాటలున్నాయి. కాంగ్రెస్ నేతలే పార్టీ పనితీరు బాగులేదంటూ బాహాటంగా విమర్శిస్తున్నారు. మధ్యప్రదేశ్‌లో బీజేపీ ఫిరాయింపులతో అధికార పీఠాన్ని అందుకుంది. బీజేపీ మౌలిక సిద్ధాంతాలైన హిందూత్వ, రామ మందిరం, జాతీయత వంటివి హిందీ బాగా మాట్లాడే ప్రాంతాల్లో బాగా పనికొస్తాయి. తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లలో ఆ ఉద్వేగపు విభజన రాజకీయాలు పనిచేయవు. సామాజికంగా, ఆర్థికంగా వెనకబడిన వర్గాల సంక్షేమాన్ని చూస్తూ సాగునీటి ప్రాజెక్టుల కోసం, ప్రపంచ ప్రఖ్యాత కార్పొరేట్ సంస్థల రాక కోసం కృషి చేస్తూ, దూసుకెళ్తున్న కేసీఆర్ ముందు బీజేపీ నెత్తినెత్తుకునే ఇలాంటి అంశాలు ఎందుకూ ఉపయోగపడవు. వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో విపక్షాలు ఐక్యంగా ఉంటే, వాటిమధ్య పొత్తులు కుదిరితే బీజేపీని ఓడించడం కష్టమేమీ కాదు.




కానీ ఈ రెండే విపక్షాలను ఒడ్డుకు తీసుకెళ్లగలవని అనుకోవడం భ్రమ. ఒకటైతే నిజం... అందరూ కలిసి అన్నిచోట్లా ద్విముఖ పోరు ఉండేలా చూడగలిగితే బీజేపీ బలాన్ని 220 లోక్‌సభ స్థానాలకు పరిమితం చేయడం సాధ్యపడొచ్చు. కానీ అంతకన్నా కిందికి నెట్టాలంటే మాత్రం బీజేపీ ప్రతిపాదించే, అమలు చేసే నమూనాకు భిన్నమైన ప్రత్యామ్నాయ ప్రతిపాదనను ప్రజల ముందుకు బలంగా తీసుకురావడంలో విపక్షాలు కార్యదీక్షను ప్రదర్శించాల్సి ఉంటుంది. తన గుత్త సొత్తుగా బీజేపీ తరచు ప్రకటించుకునే జాతీయ భద్రత విషయంలో నెలకొన్న అస్తవ్యస్థ స్థితిని, చైనాను నిలువరించడంలో వైఫల్యాలను చెప్పగలగాలి. కుల, మత, ప్రాంతీయ విభేదాలు లేని స్థితి నిజమైన జాతీయ భద్రతకు తోడ్పడుతుందని ఎలుగెత్తాలి.

మొత్తం 543 లోక్‌సభ సీట్లలో 322 బీజేపీయేతర రాష్ట్రాల్లో ఉన్నాయి. కాబట్టి ప్రస్తుత పరిస్థితిని ప్రతిపక్షాలు క్యాష్ చేసుకోవాలి. ఇందుకు ప్రతిపక్షాలు ముందు ప్రత్యర్థి బలహీనతను గుర్తెరగాలి. ముస్లింలకు సీట్లు ఇవ్వకపోవడం బీజేపీకి ఉన్న అతి పెద్ద బలహీనత. తెలంగాణలో ముస్లిం జనాభా 20 శాతం ఉంటే, బెంగాల్లో 30 శాతం పైగా ఉంది. ఇక కర్ణాటకలో వారి వాటా దాదాపు 13 శాతం. యూపీ వంటి ఉత్తరాది రాష్ట్రాల్లోనూ ముస్లిం జనాభా గణనీయంగా ఉన్న విషయం తెలిసిందే. ఇటువంటి రాష్ట్రాలో నేర్పుగా వ్యవహరించి బీజేపీ బలాన్ని గణనీయంగా తగ్గించవచ్చు. ద్విముఖ పోటీ మాత్రమే ఉండేలా చూసుకోవడం, వైవిధ్యభరితమైన సంక్షేమ నమూనాలతో ప్రజలను ఒప్పించడం ప్రతిపక్షాల వ్యూహంలో ప్రధాన అంశాలుగా ఉండాలి. ప్రజలు ప్రత్యామ్నాయం కోరుకుంటున్నారన్నది నిజం. 'ధైర్యం లేనివాడికే దయ్యాలు కనబడతాయ'ని నానుడి. ఇప్పుడు కావలసింది ధైర్యంతో, ఆత్మవిశ్వాసంతో ముందడుగు వేసే చేవ. అది విపక్షాలకుందా అన్నదే ప్రశ్న!

వ్యాసకర్త సీనియర్ జర్నలిస్ట్

జెనంకు పంగనామాలు బెట్టె తండ్కు...

అట్లుంటది



తెలిదేవర భానుమూర్తి

పొద్దు మీకింది. మొగులు మీద చుక్కలు ఎల్లినయి. వాడకట్టుల లైటు బుగ్గలు ఎల్గినయి. ఎప్పటి తీర్గనే ఆనంద్ బాగ్ చౌరస్త కాడ్కి బోయిన. గాడ రవి పాన్ డబ్బ ఉన్నది. గది మా దోస్తుల అడ్డ.

''కర్నాటకల సిద్దరామయ్య ముఖ్యమంత్రి ఎట్ల అయ్యిండు?'' అని యాద్గిరి అడిగిండు.

''డికె శివకుమార్ ఎన్కకు బోయె బట్కి'' అని సత్నారి అన్నడు.

''ముఖ్యమంత్రి కుర్సి దప్పిడ్సి ఏమొద్దు అన్న శివకుమార్ ఎవరి మాట ఇన్నడు? ఖర్గే మాట ఇన్నడా?''

''లే.''

''రాహుల్ గాంది సమ్జాయిస్తె ఊకున్నడా?''

''ఊకోలేదు.''

''సోనియ గాంది సమ్జాయిస్తె ఎన్కకు బోయిండా?''

''ఎన్కకు బోలేదు.''

''శివకుమార్ గీల్ల ఎవ్వలి మాట ఇనకున్నా పంచాతి ఎట్ల తప్ప అయ్యింది''

''జోతిస్యం జెయ్యబట్కి.''

''గదెట్ల?''

''గాచారం జెప్పేటి స్వామిజీ తాన్కి శివకుమార్ బోయిండు. నాకు ముఖ్యమంత్రి కుర్సి దొర్కుతదా అని అడిగిండు. గిప్పుడు నీ గాచారం బాగలేదు. జెర సైసు అని గా స్వామిజీ జెప్పిండు. గాయిన మాట ఇని శివకుమార్ ఎన్కకు బోయిండు'' అని సత్నారి జెప్పిండు.

''కేసీఆర్ గుడ్క గాచారం జూసేటి స్వామిజీ తాన్కి బోయినా బోతడు. ఎలచ్చన్లు ఎప్పుడు బెట్టిపిస్తె బాగుంటదని అడుగుతడు. వాస్తు ప్రకారం స్టేజి ఉండెటట్లు జూస్కుంటడు. మల్ల గెలిస్తె తెలంగానను వాస్తు ప్రకారం జేస్తనని జెప్తడు'' అని సిగిలేటు దాక్కుంట ఇస్తారి అన్నడు.

''ఇట్కె మీద ఇట్కె బెడ్తె ఇల్లైతది. కేసీఆర్‌తోని బెట్టుకుంటె లొల్లైతది'' అని అన్కుంట యాద్గిరి మజాక్ జేసిండు.

''లొల్లి అయితనే జెనంకు అసల్ సంగతి ఎర్కయితది.''

''తెలంగాన వొచ్చి పదేండ్లు అయితున్నది. పదేండ్లు అయినందుకు దూమ్ దామ్గ పండ్గ జెయ్యాలె. గా పండ్గ దినాన జెనంకు కొత్త కొత్త నాస్తలు బెట్టాలె. ఇంతకు ముందు దలిత బందు, రైతు బందు పలారాలు బెట్టినం. గిప్పుడు కుల బందు పలారాలు బెడ్తం అని బీఆర్ఎస్ అంటున్నది.''

''కుల బందు అంటె ఏంది?''



''కులం పనులు జేసుకునేటోల్లకు యాడాదికి తలా లచ్చ రూపాయలు ఇచ్చుడే కులబందు.''

''నా కెర్క లేక అడ్గుతున్న. గియన్నిటికి బీఆర్ఎస్ సర్కార్‌కు పైసలు యాడికెల్లి వొస్తున్నయి?''

''ఎన్కట ఒక గొర్రె పిల్ల నీ లెక్కనే అడిగింది. ఒక రాజు సలి కాలం గొర్లన్నిటికి ఉన్ని కోట్లు ఇచ్చిండు. మన గొర్లకు ఉన్ని కోట్లు ఇచ్చెతందుకు రాజు ఉన్ని యాడికెల్లి దెస్తడే అని ఒక గొర్రె పిల్ల గాల్ల అమ్మను అడిగిందట. యాడికెల్లో ఏంది మన గొర్ల కెల్లే అని అమ్మ గొర్రె జెప్పిందట.''

''ప్రతాని నరేంద్ర మోదీ గీ నడ్మ పసిఫిక్ దేసాలల్ల దిరుక్కుంట గినియా బోయిండు'' అని యాద్గిరి ఇంకేమొ జెప్పబోతే, ''గాయిన మన దేసంల ఉండుడు తక్వ. ఫారిన్ దేసాలల్ల తిర్గుడే ఎక్వ'' అని ఇస్తారి అన్నడు.

''పురాగ జెప్ప నియ్యకుంట నడ్మల అడ్డం మొస్తవేంది? గినియా ప్రతాని మోదీ కాల్లు మొక్కిండు.''

''ఎవలి తాన గాయిన కాల్లు మొక్కుడు నేర్సుకుండు?''

''తెలంగాన లీడర్ల తాన.''

''గినియా ప్రతాని మోదీ కాల్లు మొక్కితె బీజేపీ లీడర్లు ఏమన్నరు?''

''కేసీఆర్ కాల్లను తెలంగాన లీడర్లే మొక్కుతున్నరు. గని మా మోదీ కాల్లను ఫారిన్ లీడర్లు గూడ మొక్కుతున్నరని బీజేపీ లీడర్లన్నరు.''

''గా నడ్మ ఉత్తరాంద్రల చెంద్రబాబు స్పీచ్ ఇన్నవా?''

''లే. జెరంత జెప్పు.''

''అర్తమైందా తమ్ముండ్లూ. రైతులు మంచి గుండాలంటె, సదువుకున్న పోరగాల్లకు కొల్వులు దొర్కాలంటె, ఉత్తరాంద్ర బాగ గావాలంటె సైకిల్ పోవాలె అన్నడు. అన్నంక నాల్కె కొరుక్కొని సారీ అన్నడు.''

''సైకిల్ పోతదనేటి బయం గాయినకు లోపట లోపట ఉన్నట్లు గొడ్తున్నది.''

''రొండు వేల రూపాయలను ఎందుకు బందు బెట్టింండ్రో ఎర్కేనా?''

''ఎర్కలే.''

''నేను యాడికి బోయినా రొండు ఏల్లు సూబెట్ట బట్కె రొండు వేల రూపాయలను బంద్ జేసింండ్రని చెంద్రబాబు అంటుండు.''

''జీవో నూట పదకొండును ఎందుకు దెచ్చింండ్రు?''

''జెనంకు పంగనామాలు బెట్టెతండ్కు.''

గీ తీర్గ మా దోస్తులు ముచ్చట బెట్టింండ్రు.

రచయిత సీనియర్ జర్నలిస్ట్ । 99591 50491

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, జ్యేష్ఠ మాసం, **తిథి:** శు.సప్తమి తె.5.11 వరకు (తెల్లవారితే శనివారం), తదుపరి అష్టమి, **నక్షత్రం:** ఆశ్లేష రా.7.01 వరకు, తదుపరి మఖ, **వర్జ్యం:** ఉ.6.33 నుండి 8.22 వరకు, **దుర్ముహూర్తం:** ఉ.8.04 నుండి 8.54 వరకు, తదుపరి ప.12.23 నుండి 1.14 వరకు, **అమృతఘడియలు:** సా.5.14 నుండి 6.58 వరకు ; **రాహుకాలం:** ఉ.10.30 నుండి 12.00 వరకు, **యమగండం:** ప.3.00 నుండి 4.30 వరకు, **సూర్యోదయం:** 5.29, **సూర్యాస్తమయం:** 6.24.

టాపర్లలో ఏపీ అబ్బాయిలు



సాక్షి, హైదరాబాద్: ఎంసెట్‌లో టాప్ ర్యాంకులు సాధించిన వారిలో ఎక్కువ మంది అబ్బాయిలే ఉన్నారు. అగ్రి–మెడికల్, ఇంజనీరింగ్ రెండు విభాగాల్లోనూ అబ్బాయిలే టాప్ ర్యాంకుల్లో నిలిచారు. ఇక టాప్ ర్యాంకర్లలో ఏపీకి చెందిన వారు ఎక్కువగా ఉన్నారు. ఇంజనీరింగ్‌లో టాప్–10లో ఏపీకే 8 ర్యాంకులు, అగ్రి–మెడికల్ ఎంసెట్‌లో ఏడుగురు ఏపీ విద్యార్థులు నిలిచారు.

టాప్-10 ర్యాంకర్లు వీరే..

ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో..	
పేరు	జిల్లా
1. సనపల అనిరుధ్	విశాఖ (ఏపీ)
2. యెక్కంటి ఫణి వెంకట మణీందర్‌రెడ్డి	గుంటూరు (ఏపీ)
3. చల్లా ఉమేశ్ వరుణ్	నందిగామ, కృష్ణా (ఏపీ)
4. అభినీత్ మాజేటి	రంగారెడ్డి (తెలంగాణ)
5. పొన్నతోట ప్రమోద్‌కుమార్‌రెడ్డి	అనంతపురం (ఏపీ)
6. మరడాన ధీరజ్‌కుమార్	విశాఖ (ఏపీ)
7. వడ్డే శాన్విత‌రెడ్డి	నల్గొండ (తెలంగాణ)
8. బోయిన సంజన	శ్రీకాకుళం (ఏపీ)
9. ప్రిన్స్ బ్రాన్హంరెడ్డి	నంద్యాల (ఏపీ)
10. మీసాల ప్రణతి శ్రీజ	విజయనగరం (ఏపీ)
అగ్రి, మెడికల్ విభాగంలో..	
1. బూరుగుపల్లి సత్యరాజ్ జశ్వంత్	తూర్పుగోదావరి (ఏపీ)
2. నాసిక వెంకట తేజ	ప్రకాశం (ఏపీ)
3. సఫల్‌లక్ష్మి పసుపులేటి	రంగారెడ్డి (తెలంగాణ)
4. దుర్గెంపూడి కార్తికేయరెడ్డి	గుంటూరు (ఏపీ)
5. బోర వరుణ్ చక్రవర్తి	శ్రీకాకుళం (ఏపీ)
6. దేవగుడి గురు శశిధర్‌రెడ్డి	రంగారెడ్డి (తెలంగాణ)
7. వంగీపురం హర్షల్ సాయి	నెల్లూరు (ఏపీ)
8. దద్దనాల సాయి చిద్విలాస్‌రెడ్డి	గుంటూరు (ఏపీ)
9. గంధమనేని గిరి వర్షిత	అనంతపురం (ఏపీ)
10. కొల్లాబత్తుల ప్రీతం సిద్ధార్థ్	హైదరాబాద్ (తెలంగాణ)

టాపర్స్‌గా అబ్బాయిలు... టోటల్‌గా అమ్మాయిలు!

▶ మొదటి పేజీ తరువాయి

మంది పరీక్ష రాశారు. ఇందులో 91,935 మంది (86.31 శాతం) అర్హత సాధించారు. అగ్రి, మెడికల్ స్ట్రీమ్‌లో 155.008732 మార్కులతో బూరుగుపల్లి సత్యరాజ జశ్వంత్.. ఇంజనీరింగ్ స్ట్రీమ్‌లో సంగపల్లి అనిరుధ్ 158.899780 మార్కులతో టాపర్లుగా నిలిచారు.

మూడు మార్కులు కలిపి..

ఈసారి ఎంసెట్ ఇంజనీరింగ్ విద్యార్థులకు మూడు మార్కులు అదనంగా కలిపారు. మొత్తంగా 6 సెషన్లుగా పరీక్షలను నిర్వహించగా.. 5వ, 6వ సెషన్లలో గణితంలో ఇచ్చిన పలు ప్రశ్నలకు సమాధానాలు సరి తూగకపోవడం, స్పష్టత లోపించడంతో ఈ మార్కులు కలిపారు. నార్మలైజేషన్ ప్రక్రియ ద్వారా కూడా పలు సెషన్లలో కఠినంగా వచ్చిన ప్రశ్నలకు మార్కులు కలిపినట్టు తెలిసింది.

సకాలంలో సమర్థవంతంగా నిర్వహించాం: సబితా ఇంద్రారెడ్డి

ఎంసెట్‌ను సమర్థవంతంగా నిర్వహించామని, దీనిపై సంబంధిత విభాగాలకు, విద్యాశాఖ అధికారులకు అభినందనలు తెలుపుతున్నామని మంత్రి సబితా ఇంద్రారెడ్డి చెప్పారు. ఉత్తమ ర్యాంకులు సాధించినవారిని మంత్రి అభినందించారు. రెండు, మూడు రోజుల్లోనే ప్రవేశాల షెడ్యూల్‌ను విడుదల చేయాలని సాంకేతిక విద్యాశాఖ కమిషనర్ నవీన్ మిట్టల్‌ను ఆదేశించారు.



ఎంసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న విద్యాశాఖ మంత్రి సబితా ఇంద్రారెడ్డి. చిత్రంలో నవీన్ మిట్టల్, ప్రొఫెసర్ లింబాద్రి తదితరులు

ఎంసెట్ ఫలితాల తీరు ఇదీ..

	ఇంజనీరింగ్		అగ్రికల్చర్ అండ్ మెడికల్	
	అబ్బాయిలు	అమ్మాయిలు	అబ్బాయిలు	అమ్మాయిలు
దరఖాస్తులు	1,24,679	80,672	34,127	81,205
హాజరైనవారు	1,18,739	76,536	31,633	74,881
క్వాలిఫై అయింది	94,065	62,814	26,772	65,163
అర్హత శాతం	79.21	82.07	84.63	87.02

సామాజిక వర్గాల వారీగా క్వాలిఫై అయినవారు (ఇంజనీరింగ్‌లో)

కేటగిరీ	తెలంగాణ వారు	ఏపీవారు	మొత్తం (శాతం)
బీసీ-ఏ	7,470	3,547	11,017 (72.99)
బీసీ-బీ	23,711	5,132	28,843 (75.53)
బీసీ-సీ	552	208	760 (75.39)
బీసీ-డీ	20,706	7,088	27,794 (74.30)
బీసీ-ఈ	5,824	1,480	7,304 (71.06)
ఓసీ	32,268	18,119	50,387 (80.57)
ఎస్సీ	16,370	3,262	19,632 (100)
ఎస్టీ	10,426	716	11,142 (100)
మొత్తం	1,17,327	39,552	1,56,879 (80.33)

సామాజికవర్గాల వారీగా క్వాలిఫై అయినవారు (అగ్రికల్చర్ అండ్ మెడికల్‌లో)

కేటగిరీ	తెలంగాణవారు	ఏపీవారు	మొత్తం (శాతం)
బీసీ-ఏ	4,313	1,870	6,183 (76.39)
బీసీ-బీ	11,171	2,197	13,368 (78.77)
బీసీ-సీ	486	207	693 (84.20)
బీసీ-డీ	11,648	2,749	14,397 (75.08)
బీసీ-ఈ	8,232	908	9,140 (81.13)
ఓసీ	9,531	4,224	13,755 (87.11)
ఎస్సీ	18,976	3,577	22,553 (100)
ఎస్టీ	11,070	776	11,846 (100)
మొత్తం	75,427	16,508	91,935 (86.31)

కార్డియాలజిస్ట్ అవుతా..

మాది రాజమహేంద్రవరం దగ్గర కాతేరు. నాన్న బూరుగుపల్లి సాయిరామకృష్ణ రైతు, అమ్మ రజని గృహిణి. ఇంటర్ బైపీసీలో 985 మార్కులు వచ్చాయి. నీట్‌లోనూ మంచి ర్యాంకు సాధిస్తానన్న నమ్మకం ఉంది. మంచి వైద్య కళాశాలలో ఎంబీబీఎస్ చదివి కార్డియాలజీలో స్పెషలైజేషన్ చేస్తా.

– బూరుగుపల్లి సత్యరాజ జశ్వంత్, 1వ ర్యాంకర్ (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

వైద్య రంగంలో ఉన్నత విద్యనభ్యసిస్తా..

మాది చీరాల. నాన్న సుధాకర్‌బాబు, అమ్మ శ్రీదేవి మగ్గం నేస్తారు. విజయవాడలోని ప్రైవేటు కాలేజీలో ఇంటర్ చదివాను. వైద్య రంగంలో ఉన్నత విద్య అభ్యసించడమే నా లక్ష్యం.

– నాసిక వెంకట్ తేజ, 2వ ర్యాంకర్ (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

డాక్టర్నై పేదలకు సేవ చేయాలన్నదే లక్ష్యం

పేదలకు ఉచిత వైద్యం అందించాలన్నది నా లక్ష్యం. గుండె వైద్య నిపుణుడిగా సేవలు చేస్తా..తల్లిదండ్రుల ప్రోత్సాహంతోనే ఈ విజయం సాధించాను. మాది ఉమ్మడి నల్గొండ జిల్లా కోదాడ. నాన్న శ్రీచరణ్ వైద్యుడు, అమ్మ శ్రీదేవి. హైదరాబాద్‌లోని ఆర్‌కేపురం హరిపురికాలనీలో ఉంటున్నాం.

– పసుపులేటి సఫల్ లక్ష్మి, 3వ ర్యాంకర్ (అగ్రి-మెడికల్ స్ట్రీమ్)

కార్డియాలజీ లేదా న్యూరాలజీ చేస్తా..



మాది తెనాలి. ఇంటర్ బైపీసీలో 983 మార్కులు వచ్చాయి. వైద్య రంగంలో స్థిరపడాలనేది నా ఆకాంక్ష. ఇప్పటికే నీట్ రాశాను. ఎంబీబీఎస్ చేసి ఆ తర్వాత కార్డియాలజిస్ట్, న్యూరాలజిస్ట్ లేదా గ్యాస్ట్రో ఎంటరాలజిస్ట్‌గా స్థిరపడాలనేదే నా కోరిక.

– దుర్గెంపూడి కార్తికేయరెడ్డి, 4వ ర్యాంకర్ (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

వైద్య రంగంలో స్థిరపడతా..



మాది శ్రీకాకుళం జిల్లా నరసన్నపేట. అమ్మానాన్న ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. నీట్‌లోనూ మంచి ర్యాంకు వస్తుందనే నమ్మకం ఉంది. వైద్య రంగంలో స్థిరపడాలనేది నా కోరిక.

– బోర వరుణ్ చక్రవర్తి, 5వ ర్యాంకర్ (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

ఎంబీబీఎస్ చదివి ప్రజలకు సేవ చేస్తా..



6వ ర్యాంకు రావడంతో సంతోషంగా ఉంది. నీట్ ర్యాంకు సాధించి ఎంబీబీఎస్ పూర్తి చేస్తా. వైద్యుడిగా పేద ప్రజలకు సేవ చేయాలని ఉంది. హైదరాబాద్‌లోని మూసాపేట డివిజన్ శివశక్తి నగర్‌లో ఉంటున్నాం. అమ్మానాన్న ఇద్దరూ ఉద్యోగులే. అమ్మ ప్రోత్సాహంతోనే బాగా చదివా..

– గురు శశిధర్‌రెడ్డి, 6వ ర్యాంకు (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

మంచి వైద్య కళాశాలలో మెడిసిన్ చేస్తా..



మాది నెల్లూరు. అమ్మానాన్న హారతి, శంకర్ వైద్యులుగా పనిచేస్తున్నారు. మంచి మెడికల్ కళాశాలలో మెడిసిన్ చదవడమే నా లక్ష్యం.

– వి. హర్షల్ సాయి, 7వ ర్యాంకర్ (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

ఐఐటీ-బాంబేలో ఇంజనీరింగ్ చేస్తా..

మాది శ్రీకాకుళం జిల్లాలోని దిమిలాడ. ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియాలో 122వ ర్యాంకు వచ్చింది. నాన్న ఖగేశ్వరరావు విశాఖపట్నంలో ఎస్సైగా పనిచేస్తున్నారు. అమ్మ ఝాన్సీ గృహిణి. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో మంచి ర్యాంకు సాధించి.. ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్‌లో ఇంజనీరింగ్ చేస్తా.

– సనపల అనిరుధ్, 1వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

కంప్యూటర్స్ సైన్స్ చదువుతా..

మాది గుంటూరు. నాన్న శ్రీనివాసరెడ్డి రైతు. ఇంటర్ ఎంపీసీలో 971 మార్కులు వచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంక్ సాధించి ఐఐటీ బాంబేలో సీటు సాధించడమే లక్ష్యం.

– యక్కంటి ఫణి వెంకట మణీందర్ రెడ్డి, 2వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

జేఈఈ అడ్వాన్స్‌డ్‌లో ర్యాంకే లక్ష్యం

మాది ఎన్టీఆర్ జిల్లా నందిగామ. ఇంటర్ ఎంపీసీలో 983 మార్కులు సాధించాను. ఇటీవల జేఈఈ మెయిన్ ఓపెన్ కేటగిరీలో 263వ ర్యాంక్ వచ్చింది. అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్నా. అందులో మంచి ర్యాంక్ సాధించడమే లక్ష్యం.

– చల్లా ఉమేశ్ వరుణ్, 3వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ అవుతా..



4వ ర్యాంకు వచ్చినందుకు చాలా సంతోషంగా ఉంది. సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ కావాలన్నది నా లక్ష్యం. మా నాన్న శశిధర్, అమ్మ క్రాంతికుమారిల ప్రోత్సాహంతో ఈ విజయం సాధించగలిగాను.

– సాధించిన అభినీత్ మాజేటి, 4వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

సివిల్స్ సాధించి ప్రజలకు సేవ చేయడమే లక్ష్యం



మాది అనంతపురం జిల్లా తాడిపత్రి. ఇటీవల జేఈఈ మెయిన్‌లో ఆలిండియాలో 97వ ర్యాంకు సాధించాను. జేఈఈ అడ్వాన్స్‌డ్‌లోనూ ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో చేరతా. తర్వాత సివిల్స్ రాసి ప్రజలకు సేవ చేయాలన్నదే నా లక్ష్యం.

– పొన్నతోట ప్రమోద్ కుమార్‌రెడ్డి, 5వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

ఐఐటీ బాంబేలో చేరుతా



మాది విశాఖపట్నం జిల్లా గాజువాక. నాన్న వ్యాపారం చేస్తారు. అమ్మ ఫార్మాసిస్టుగా పనిచేస్తున్నారు. ఇంటర్ ఎంపీసీలో 987 మార్కులు వచ్చాయి. జేఈఈ మెయిన్స్‌లో ఆలిండియా 110వ ర్యాంకు వచ్చింది. అడ్వాన్స్‌డ్‌లోనూ మంచి ర్యాంకు సాధించి ఐఐటీ బాంబేలో కంప్యూటర్ సైన్స్‌లో చేరుతా.

– మరడాన ధీరజ్ కుమార్, 6వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

కంప్యూటర్ సైన్స్ చేయాలని ఉంది



మాది నల్లగొండ జిల్లా మాడుగులపల్లి మండలం బొమ్మకల్లు. ఇంటర్‌లో 977 మార్కులు వచ్చాయి. ఎంసెట్‌లో అత్యుత్తమ ర్యాంకు సాధించాలని ప్రణాళికబద్ధంగా చదివా. కష్టానికి ఫలితం దక్కినందుకు సంతోషంగా ఉంది. ముంబై ఐఐటీలో కంప్యూటర్ సైన్స్ చదవాలన్నదినా కోరిక. సివిల్స్ సాధించాలన్నది జీవిత లక్ష్యం.

– వడ్డె శాన్వితరెడ్డి, 7వ ర్యాంకు (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

ఇంజనీరింగ్ చదువుతా..



మాది శ్రీకాకుళం జిల్లాలోని అరసవల్లి. నాన్న గణేశ్ వ్యాపారి, అమ్మ జ్యోతి గృహిణి. జేఈఈ మెయిన్‌లో 729వ ర్యాంక్ సాధించా. అడ్వాన్స్‌డ్‌కు సిద్ధమవుతున్నా. ఐఐటీ బాంబేలో ఇంజనీరింగ్‌లో చేరాలనేదే నా లక్ష్యం.

– బోయిన సంజన,8వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

కంప్యూటర్ ఇంజనీరింగ్ చేస్తా..



మాది నంద్యాల. ఇంటర్ ఎంపీసీలో 956 మార్కులు వచ్చాయి. జేఈఈ అడ్వాన్స్‌లో ర్యాంకు సాధించి మంచి ఐఐటీలో కంప్యూటర్ సైన్స్‌లో చేరతా. కంప్యూటర్ ఇంజనీర్ కావడమే లక్ష్యం.

– ప్రిన్స్ బ్రన్హంరెడ్డి, 9వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

అడ్వాన్స్‌లోనూ ర్యాంక్ సాధిస్తా..



మాది విజయనగరం జిల్లా గుర్ల. నాన్న అప్పలనాయుడు రైల్వే కానిస్టేబుల్, అమ్మ ప్రభుత్వ టీచర్‌గా పనిచేస్తున్నారు. ఇటీవల జేఈఈ మెయిన్స్‌లో 99 శాతం పర్సంటైల్ సాధించాను. అడ్వాన్స్‌డ్‌లో ర్యాంక్ సాధించి ఐఐటీ బాంబేలో చేరతా.

– మీసాల ప్రణతి శ్రీజ, 10వ ర్యాంకర్ (ఇంజనీరింగ్ స్ట్రీమ్)

కష్టపడి చదివా..



మాది గుంటూరులోని ఏటీ అగ్రహారం. అమ్మానాన్న ఇద్దరూ ప్రభుత్వ ఉపాధ్యాయులే. కష్టపడి చదవడంతో తెలంగాణ ఎంసెట్‌లో ఎనిమిదో ర్యాంక్ సాధించాను.

– డి. సాయి చిద్విలాస్‌రెడ్డి, 8వ ర్యాంకర్ (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

కష్టపడి చదివా.. ర్యాంకు సాధించా



అటు ఇనిస్టిట్యూట్‌లో, ఇటు ఇంట్లో రోజుకు పది గంటలకుపైగా కష్టపడి చదివాను. ర్యాంకు వస్తుందని ముందే ఊహించాను. 10వ ర్యాంకు వచ్చినందుకు సంతోషంగా ఉంది.

– కె. ప్రీతమ్ సిద్ధార్థ్, 10వ ర్యాంకర్ (అగ్రి, మెడికల్ స్ట్రీమ్)

ఏపీ కొత్త ఎత్తిపోతలను అడ్డుకోండి

- కృష్ణా బోర్డుకు తెలంగాణ లేఖ
- ఆవులపల్లి రిజర్వాయర్ కూడా నిలిపివేయించండి

సాక్షి, హైదరాబాద్: గాలేరు నగరి సుజల స్రవంతి–హంద్రీ నీవా సుజల స్రవంతి ప్రాజెక్టుల అనుసంధానానికి వీలుగా ఏపీ ప్రభుత్వం నిర్మించ తలపెట్టిన కొత్త ఎత్తిపోతల పథకాన్ని అడ్డుకోవాలని తెలంగాణ ప్రభుత్వం కృష్ణా నది యాజమాన్య బోర్డు (కేఆర్ఎంబీ)ను కోరింది. దీంతోపాటు చిత్తూరు జిల్లా ఆవులపల్లిలో ప్రతిపాదించిన బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ నిర్మాణాన్నీ నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేసింది. కృష్ణా జలాల ఆధారంగా ప్రతిపాదించిన ఈ ప్రాజెక్టులకు కృష్ణా బోర్డు/అపెక్స్ కౌన్సిళ్ల అనుమతులతో పాటు ఇతర అనుమతులు లేవని పేర్కొంది. ఈ మేరకు తెలంగాణ నీటిపారుదల శాఖ ఈఎన్‌సీ సి.మురళీధర్ ఈ నెల 23న కృష్ణా బోర్డు చైర్మన్‌కు లేఖ రాశారు. ఆ ప్రాజెక్టులకు బీ–2 కేటగిరీ కింద పర్యావరణ అనుమతులు పొందేందుకు ప్రయత్నించినందుకు గాను కృష్ణా బోర్డుకు రూ.100 కోట్లను 3 నెలల్లోగా జరిమానాగా చెల్లించాలని జాతీయ హరిత ట్రిబ్యునల్ (ఎన్జీటీ) ఇటీవల ఏపీ ప్రభుత్వాన్ని ఆదేశించిందని తెలంగాణ గుర్తు చేసింది. ఆవులపల్లి, ముదివేడు, నేతిగుంటలపల్లి బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ల పనులపై సైతం ఎన్జీటీ స్టే విధించిందని.. అయినప్పటికీ ఆవులపల్లి రిజర్వాయర్ పనులను ఏపీ ప్రభుత్వం కొనసాగిస్తున్నట్టు పత్రికల్లో వార్తలు వచ్చాయని వివరించింది. పనులను ఆపించాలని కృష్ణా బోర్డును కోరింది.

'భాష్యం'కు వందలోపు 11 స్టేట్‌ర్యాంకులు

సాక్షి, హైదరాబాద్: ఎంసెట్–2023 ఫలితాల్లో తమ విద్యార్థులు సత్తాచాటారని 'భాష్యం' విద్యాసంస్థల చైర్మన్ రామకృష్ణ తెలిపారు. గురువారం విడుదలైన ఫలితాల్లో వై.మణీందర్‌రెడ్డి 2వ ర్యాంకు, సీహెచ్.వరుణ్ 3, ఎ.వెంకటశివరామ్ 15, కె.లక్ష్మీసూర్య 17, వై.దీపేష్ 20, పి.నిశ్చల్ సుభాష్ 26, రూపేష్ 32, హర్షిత 38, యు.అజయ్‌కుమార్ 73, టి.బాలకోటయ్య 84, బి.హర్షిత్ 99 ర్యాంకులను సాధించారని చెప్పారు. వందలోపు 11 స్టేట్ ర్యాంకులతో 'భాష్యం'ది బెస్ట్ అని నిరూపించారన్నారు.

తెలంగాణపై కేంద్రానిది సవతి ప్రేమ

సాక్షి, హైదరాబాద్: తెలంగాణపై కేంద్రం సవతితల్లి ప్రేమ చూపుతూ, నిధుల కేటాయింపులో మోకాలొడ్డుతున్నదని రాష్ట్ర పోలీస్ హౌసింగ్ కార్పొరేషన్ చైర్మన్ కోలేటి దామోదర్ ఆరోపించారు. ఈ మేరకు గురువారం ఆయన ఓ ప్రకటన విడుదల చేశారు. 2014–15 ఆర్థిక ఏడాదిలో రెవెన్యూలోటు భర్తీ కింద ఏపీకి నిధుల విడుదలకు గ్రీన్‌సిగ్నల్ ఇచ్చిన కేంద్రం, తెలంగాణలో వెనుకబడిన జిల్లాల అభివృద్ధికి నిధులు ఎందుకు మంజూరు చేయడం లేదని ఆయన ప్రశ్నించారు. తెలంగాణకు విభజన చట్టం ప్రకారం నిధులివ్వాలని కేంద్రాన్ని కోరారు.

క్లుప్తంగా

అమూల్ వర్సెస్ అవిన్

- తమిళనాడులోనూ మిల్క్ వార్
- అమిత్ షాకు సీఎం స్టాలిన్ లేఖ

చెన్నై: కర్ణాటక ఎన్నికల సమయంలో అమూల్ వ్యవహారం ఆ రాష్ట్రంలో ప్రకంపనలు సృష్టిస్తే, ఇప్పుడు తమిళనాడు వంతు వచ్చింది. తమిళనాడులో పాల సేకరణకు అమూల్ సంస్థ ప్రయత్నాలు మొదలుపెట్టడం రాష్ట్ర కోఆపరేటివ్ డెయిరీ అవిన్‌పై తీవ్ర ప్రభావం చూపిస్తుందన్న ఆందోళన మొదలైంది. రాష్ట్ర ముఖ్యమంత్రి స్టాలిన్ గురువారం ఈ మేరకు కేంద్ర హోంశాఖ మంత్రి అమిత్ షాకు లేఖ రాశారు. అమూల్ సంస్థ పాల సేకరణను వెంటనే నిలిపివేసేలా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు. 'అమూల్‌కు చెందిన కైరా జిల్లా సహకార పాల ఉత్పత్తిదారుల యూనియన్ రాష్ట్రంలోని కృష్ణగిరి జిల్లాలో పాల సేకరణ కోసం రైతులతో చర్చిస్తోంది. రాష్ట్ర సహకార డెయిరీ అవిన్ కంటే ఎక్కువ ధర ఇచ్చి పాలను కొనుగోలు చేయడానికి ఒప్పందాలు కుదుర్చుకుంది. తనకున్న బహుళ రాష్ట్రాల సహకార లైసెన్స్‌లను వినియోగించి పాల శీతలీకరణ కేంద్రాలను, ప్రాసెసింగ్ యూనిట్లను ఏర్పాటు చేయడానికి సన్నాహాలు చేస్తోంది. కృష్ణ నగర్, ధర్మపురి, వెల్లూరు సహా వివిధ జిల్లాల్లో పాల సేకరణ చేయడానికి సన్నాహాలు చేస్తోంది. ఇది ఆపరేషన్ శ్వేత విప్లవం నిబంధనలకు విరుద్ధం. రాష్ట్ర డెయిరీ అవని ప్రయోజనాలను అణచివేయడమే. వెంటనే అమూల్ పాల సేకరణ చేయకుండా చర్యలు తీసుకోవాలి' అని స్టాలిన్ పేర్కొన్నారు. అమూల్ తన చర్యలతో డెయిరీ సంస్థల మధ్య అనారోగ్యకరమైన పోటీకి తెర తీస్తోందని స్టాలిన్ విమర్శించారు.

అధ్యక్ష అభ్యర్థిత్వ రేసులోకి డీశాంటీస్



మియామీ: అమెరికా అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున అభ్యర్థిత్వం కోసం పోటీకి దిగుతున్నట్లు ఆ పార్టీ నేత, ఫ్లోరిడా రాష్ట్ర గవర్నర్ రాన్ డీశాంటీస్ ప్రకటించారు. 'అమెరికా ప్రగతి నేల చూపులు చూస్తోంది. దీన్ని ఆపడం అసాధ్యమైతే కాదు. మనకింకా సువర్ణావకాశం ఉంది. మళ్లీ మనం దేశ ప్రగతిని పైకి ఎగసేలా చేద్దాం. ఇది అమెరికా పునర్వైభవానికి బాటలువేస్తుంది' అని కుబేరుడు ఎలాన్ మస్క్‌తో కలిసి ఆన్‌లైన్ ఆడియో చర్చావేదిక 'ట్విట్టర్ స్పేసెస్'లో డీశాంటీస్ మాట్లాడారు. అయితే ఒక్కసారిగా వేలాదిగా స్ట్రీమింగ్‌లోకి రావడంతో సాంకేతిక సమస్య తలెత్తింది. దీంతో డీశాంటీస్ మాట్లాడింది ఎవరికీ వినపడలేదు. కాగా, పార్టీ తరఫున అధ్యక్ష అభ్యర్థిత్వం కోసం పలువురు పోటీ పడుతుండటం తెల్సిందే. వీరిలో ట్రంప్, నిక్కీ హేలీ, భారతీయ మూలాలున్న వ్యాపారి వివేక్ రామస్వామి, టిమ్ స్కాట్, హట్‌చిన్సన్ ఉన్నారు.

కులవోటు తారుమారు

కర్ణాటక ఓటర్లలో స్పష్టమైన మార్పు

లింగాయత్‌లు, వొక్కలిగలు, ఎస్సీల్లో కాంగ్రెస్‌కే ఆదరణ


దాంతో అసెంబ్లీ ఎన్నికల్లో ఘనవిజయం


కర్ణాటక అసెంబ్లీ ఎన్నికల్లో దశాబ్దాలుగా కొనసాగుతూ వస్తున్న సంప్రదాయ ఓటింగ్ ధోరణి ఈసారి రూటు మార్చుకుంది. ముఖ్యంగా కులాల వారీ ఓటు బ్యాంకు తారుమారైంది. మూడు దశాబ్దాల పాటు కాంగ్రెస్ పార్టీకి దూరమై బీజేపీకి అండదండగా నిలుస్తూ వచ్చిన లింగాయత్‌లు మనసు మార్చుకున్నారు. ఓట్లపరంగా అత్యంత ప్రాబల్యమున్న సామాజిక వర్గమైన లింగాయత్‌లలో బాహుబలి నేత యడియూరప్పను పక్కన పెట్టినందుకు బీజేపీ భారీ మూల్యమే చెల్లించింది. ఆ పార్టీకి దశాబ్దాలుగా పెట్టని కోటలా ఉంటూ వచ్చిన లింగాయత్‌లు ఆగ్రహించి దూరమయ్యారు. 1990లో లింగాయత్ నాయకుడైన నాటి ముఖ్యమంత్రి వీరేంద్ర పాటిల్‌ను కాంగ్రెస్ అధ్యక్షుడు రాజీవ్ గాంధీ అవమానకరంగా సీఎం పదవి నుంచి తప్పించడంతో ఆ పార్టీ లింగాయత్‌ల ఆగ్రహ జ్వాలలకు గురైంది. నెమ్మదిగా లింగాయత్ ఓటుబ్యాంకు బీజేపీకి మళ్లింది. 30 ఏళ్ల తర్వాత సరిగ్గా మళ్లీ అదే సీన్ రిపీటైంది. ఈసారి బీజేపీ వంతు వచ్చింది. యడియూరప్పను సీఎం పదవి నుంచి తప్పించడమే గాక అభ్యర్థుల ఎంపిక మొదలుకుని ప్రచారం దాకా పెద్దగా ప్రాధాన్యమివ్వని ప్రభావం ఫలితాల్లో స్పష్టంగా కనిపించింది. లింగాయత్‌లు, వొక్కలిగలు, ఎస్సీల్లో ఐదేసి శాతం మంది కాంగ్రెస్ వైపు మళ్లడంతో ఆ పార్టీ అనూహ్య విజయాన్ని సాధించగలిగింది. కేంద్ర ఎన్నికల సంఘం, సీ –ఓటరు వెల్లడించిన పార్టీలవారీ ఓట్లు, సీట్ల సరళిని పరిశీలిస్తే కులాల ఓటుబ్యాంకుల్లో మార్పు స్పష్టంగా తెలుస్తోంది...

సాక్షి, నేషనల్ డెస్క్

లింగాయత్‌లు: బీజేపీకి షాక్


లింగాయత్‌లు బీజేపీకి దూరం కావడం ఇది తొలిసారేం కాదు. బీజేపీ యడియూరప్పను దూరం పెట్టినప్పుడు ఆయన బీజేపీకి గుడ్‌బై కొట్టి 2012లో కర్ణాటక జనతా పక్ష పేరుతో వేరు కుంపటి పెట్టారు. 2013 అసెంబ్లీ ఎన్నికల్లో బీజేపీకి చేతుల కాలాయి. అప్పుడే ఆ పార్టీకి యడియూరప్ప, లింగాయత్‌ల ఓట్ల ప్రాధాన్యం ఏమిటో తెలిసింది. ఆ తర్వాత యడియూరప్పను అక్కున చేర్చుకున్నప్పటికీ, మళ్లీ తాజాగా ఎన్నికల ముందు యడియూరప్పను సీఎం పదవి నుంచి తప్పించి అదే తప్పు చేసింది. 2018 ఎన్నికల్లో లింగాయత్ ప్రాబల్యం ఉన్న స్థానాల్లో 41.8% ఓటు షేర్ బీజేపీకి వస్తే, ఈసారి కాస్త స్వల్పంగా 39.5 శాతానికి తగ్గింది. కానీ సీట్లు మాత్రం ఏకంగా 20 స్థానాలను కోల్పోవలసి వచ్చింది. జేడీ(ఎస్)కు వచ్చిన ఓట్ల శాతంలో పెద్దగా మార్పు లేదు. కాంగ్రెస్‌కు ఓట్లు 5 శాతమే పెరిగినా సీట్లు మాత్రం రెట్టింపు పెరిగాయి.





జేడీ(ఎస్)కు అండగా ఉంటూ ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు, మాజీ ప్రధాని హెచ్‌డీ దేవెగౌడను తమ పితగా కొలిచే వొక్కలిగలు కూడా షాకిచ్చే నిర్ణయాలే తీసుకున్నారు. దేవెగౌడ కుటుంబ పెత్తనంపై ఓటర్లలో ఓ రకమైన కసి కనిపించింది. 2018 ఎన్నికల్లో వొక్కలిగ ప్రాబల్యమున్న మొత్తం 51 స్థానాల్లో జేడీ(ఎస్) 23 గెలుచుకుంటే ఈసారి కేవలం 12 సీట్లకు పరిమితమవ్వాల్సి వచ్చింది. పీసీసీ డీకే శివకుమార్ వొక్కలిగ నేత కావడంతో వారికి ప్రత్యామ్నాయం కనిపించింది. కాంగ్రెస్ ఓల్డ్ మైసూర్ గ్రామీణ ప్రాంతంలో ఏకంగా 36 స్థానాల్లో విజయం సాధించింది. శివకుమార్ కనకపురలో లక్షా 20 ఓట్ల పైచిలుకు మెజార్టీతో గెలిచారంటేనే దేవెగౌడ గుప్పిట్లోంచి వొక్కలిగలు జారిపోతున్నట్టేనని భావిస్తున్నారు.

ఈసారి కాంగ్రెస్ పార్టీ విజయంలో ఎస్సీలు అత్యంత కీలకంగా వ్యవహరించారు. ఎస్సీ ప్రాబల్య అసెంబ్లీ స్థానాల్లో కాంగ్రెస్ గత ఎన్నికలతో పోల్చి చూస్తే అదనంగా 5.5శాతం ఓట్లు, 10 సీట్లు సంపాదించింది. దళిత నాయకుడు మల్లికార్జున ఖర్గే కాంగ్రెస్ అధ్యక్ష పదవి చేపట్టడం ఈసారి ఆ పార్టీకి బాగా కలిసొచ్చింది. సాధారణంగా దళితులు ఏ ఒక్క పార్టీ వైపు ఉండరు. కానీ ఈసారి ఖర్గే దళిత బ్యాంకుపై ప్రత్యేకంగా దృష్టి సారించి 40 ర్యాలీల్లో పాల్గొనడంతో ఎస్సీ ప్రాబల్య స్థానాల్లో సగానికి పైగా కాంగ్రెస్ ఖాతాలో పడ్డాయి. మొత్తమ్మీద కేవలం ఐదు శాతం ఓట్ల తేడాతోనే ఫలితాల్లో భారీగా మార్పులు కనిపించడమే మన ప్రజాస్వామ్యంలో వైచిత్రిగా ఎన్నికల విశ్లేషకులు అభివర్ణిస్తూ ఉంటారు.



చితికి చేరుతున్న చీతాలు

డీహైడ్రేషన్‌తో మరో రెండు కూనల మృతి • ఆరుకు చేరిన మరణాల సంఖ్య



భోపాల్: భారత్‌లో అంతరించిపోయిన చీతాల సంతతిని పెంచేందుకు నమీబియా, దక్షిణాఫ్రికాల నుంచి చీతాలను తీసుకొచ్చిన కార్యక్రమంపై నీలినీడలు కమ్ముకుంటున్నాయి. మధ్యప్రదేశ్‌లోని కూనో జాతీయ వనంలో చీతాలు వరసబెట్టి మృత్యుబాట పడుతున్నాయి. తాజాగా మరో రెండు చీతా కూనలు మరణించినట్లు అటవీశాఖ ఉన్నతాధికారి ఒకరు గురువారం వెల్లడించారు. మంగళవారం ఒక చీతా కూన చనిపోగా గురువారం మరో రెండు కూనలు చనిపోయినట్లు ప్రకటించారు. గురువారంనాటి మరణాలు మంగళవారమే సంభవించాయని తెలుస్తోంది. దీంతో విదేశాల నుంచి భారత్‌కు చీతాల తరలింపు ప్రాజెక్ట్ చేపట్టిననాటి నుంచి ఇప్పటిదాకా మూడు చీతాలు, మూడు చీతా కూనలు ప్రాణాలు కోల్పోయాయి. తాజాగా వీటి మరణాల సంఖ్య ఆరుకు పెరగడం ఆందోళకరం.

డీహైడ్రేషన్..

గత ఏడాది సెప్టెంబర్‌లో నమీబియా నుంచి తీసుకొచ్చిన సియాయా అనే ఆడ చీతాకు జ్వాల అని నామకరణం చేసి కూనో నేషనల్ పార్క్‌లో వదిలిపెట్టారు. అది మార్చి నెలలో నాలుగు కూనలకు జన్మనిచ్చింది. కాగా సూర్యప్రతాపం కారణంగా కూనో వనంలో పగటిపూట వేడి దాదాపు 47 డిగ్రీల సెల్సియస్‌గా ఉండటంతో డీహైడ్రేషన్ కారణంగా మే 23న తొలి కూన మృత్యువాత పడింది. దీంతో వాటిని వేరే చోటుకు తరలించాలని అధికారులు భావించారు. ఆలోపే అదేరోజు మరో రెండు కూనలు మరణించాయి. వాస్తవానికి ఆ రెండింటినీ ప్రత్యేక సంరక్షణలో ఉంచామని అయినా కాపాడలేకపోయామని, నాలుగో కూనను అత్యంత జాగ్రత్తగా చూసుకుంటున్నామని పర్యవేక్షక బృందం గురువారం ప్రకటించింది.

మార్చిలో తొలి మరణం

నమీబియా నుంచి తీసుకొచ్చేటపుడే మూత్రపిండ సంబంధ వ్యాధితో బాధపడుతున్న సాశా అనే చీతా మార్చి 27న చనిపోయింది. తర్వాత దక్షిణాఫ్రికా నుంచి తీసుకొచ్చిన ఉదయ్ అనే చీతా ఏప్రిల్ 13న మరణించింది. దక్షిణాఫ్రికా నుంచి తెచ్చిన దక్ష అనే మరో చీతా కలయిక కోసం మరో మగ చీతాతో జరిగిన పోరాటంలో తీవ్ర గాయాలపాలై ఈనెల తొమ్మిదో తేదీన తుదిశ్వాస విడిచింది.

జైల్లో కుప్పకూలిన జైన్

హుటాహుటిన ఢిల్లీ ఆస్పత్రిలో చేర్పించిన పోలీసులు

ఐసీయూలో సత్యేందర్ జైన్‌కు కొనసాగుతున్న చికిత్స



న్యూఢిల్లీ: ఢిల్లీ మద్యం కుంభకోణం కేసులో అరెస్టై 2022 మే నుంచి తీహార్ జైల్లో ఉన్న మాజీ మంత్రి సత్యేంద్ర జైన్ గురువారం కుప్పకూలిపోయారు. జైల్లో కళ్లు తిరిగిపడిన జైన్‌ను పోలీసులు హుటాహుటిన దీన్‌దయాళ్ ఉపాధ్యాయ ఆస్పత్రిలో చేర్పించారు. శ్వాసతీసుకోవడంలో ఇబ్బందులు పడుతుండటంతో ఢిల్లీ ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే లోక్‌నాయక్ జయ్‌ప్రకాశ్ నారాయణ్ ఆస్పత్రి ఐసీయూకి మార్చారని ఆప్ వర్గాలు వెల్లడించాయి. గురువారం ఉదయం జైలు బాత్రూమ్‌లో జైన్ కాలుజారి పడిపోయారని జైలు అధికారి చెప్పారు. ''కీలక అవయవాలకు గాయాలయ్యాయా అని వెంటనే వైద్యులు పరిశీలించి అంతా సాధారణంగా ఉందని తేల్చారు. వెనుకవైపు, ఎడమ కాలు, భుజం విపరీతంగా నొప్పి ఉన్నాయని చెప్పడంతో ఆస్పత్రికి తీసుకెళ్లాం'' అన్నారు. స్నానాలగదిలో కళ్లు తిరిగి పడిపోవడంతో వెన్నెముకకు తీవ్ర గాయమైందని ఆప్ తెలిపింది. ''ఢిల్లీ ప్రజలకు మంచి వైద్యం, ఆరోగ్యం అందించాలని చూసిన జైన్‌ను ఒక నియంత ఇలా శిక్షిస్తున్నాడు. దేవుడు అంతా చూస్తున్నాడు. అందరికీ న్యాయం జరుగుతుంది' అంటూ ఆప్ నేత, ఢిల్లీ సీఎం అరవింద్ కేజ్రీవాల్ ట్వీట్‌చేశారు. జైన్‌ను చెప్పడంతో జైలు అధికారులు సోమవారమే సఫ్దర్‌జంగ్ ఆస్పత్రిలో చూపించారు. ''జైన మతవిశ్వాసాలను బాగా పాటించే జైన్ జైల్లో కేవలం పళ్లు, పచ్చి కూరగాయలు తింటున్నారు. దాంతో 35 కిలోలు తగ్గారు. రాత్రంతా బీఐపీఏపీ మెషీన్‌తో శ్వాస ఇవ్వాలి'' అని ఆప్ తెలిపింది.

హోమం సర్వమత ప్రార్థనలు..

పార్లమెంటు ప్రారంభోత్సవానికి సర్వం సిద్ధం

20 పార్టీల బహిష్కారం, పాల్గొంటున్నవి 25



న్యూఢిల్లీ: ముందుగా హోమం, తర్వాత సర్వమత ప్రార్థనలతో ఆదివారం పార్లమెంటు నూతన భవన ప్రారంభోత్సవ కార్యక్రమం మొదలుకానుంది. ప్రధాన కార్యక్రమంలో 18 ఎన్డీఏ పక్షాలు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతో పాటు దాదాపు 25 పక్షాలు పాలుపంచుకోనున్నాయి. బిజూ జనతాదళ్, జేడీ(ఎస్), అకాలీదళ్, బీఎస్పీ, లోక్ జనశక్తి పార్టీ (రాంవిలాస్), టీడీపీ వీటిలో ఉన్నాయి. కాంగ్రెస్ సారథ్యంలో దాదాపు 21 పార్టీలు కార్యక్రమాన్ని బహిష్కరించిన వేళ లోక్‌సభలో 50 మంది ఎంపీల బలమున్న ఈ ఏడు పార్టీల సంఘీభావం పాలక బీజేపీకి నైతిక స్థైర్యమిస్తుందని భావిస్తున్నారు. ప్రారంభోత్సవాన్ని పూర్తిగా అధికార పార్టీ కార్యక్రమంగా మార్చేస్తున్నారన్న విపక్షాల ఆరోపణలను తిప్పికొట్టేందుకు కూడా ఇది ఉపకరిస్తుందని బీజేపీ భావిస్తోంది.

పాల్గొంటున్న బీఎస్పీ, టీడీపీ

పార్లమెంటు భవనాన్ని మోదీ ప్రారంభించనుండటాన్ని స్వాగతిస్తున్నట్టు బీఎస్పీ అధినేత మాయావతి ప్రకటించారు. విపక్షాల బహిష్కరణ నిర్ణయం సరికాదన్నారు. ఆదివాసీ గౌరవం గురించి మాట్లాడుతున్న విపక్షాలకు రాష్ట్రపతి పదవి కోసం ద్రౌపదీ ముర్ముపై పోటీ పెట్టినప్పుడు ఆ విషయం గుర్తుకు రాలేదా అంటూ ఎద్దేవా చేశారు. టీడీపీ కూడా కార్యక్రమంలో పాల్గొంటున్నట్టు ప్రకటించింది. చరిత్రాత్మక సందర్భాన్ని రాజకీయం చేయకుండా హాజరై పెద్ద మనసు చూపాలని విపక్షాలకు బీజేపీ విజ్ఞప్తి చేసింది. ప్రధాని కూడా పార్లమెంటులో భాగమేనని ఆ పార్టీ నేత రవిశంకర్ ప్రసాద్ గుర్తు చేశారు. ''రాష్ట్రపతి అంటే మనందరికీ గౌరవమే. ద్రౌపదీ ముర్ము గురించి కాంగ్రెస్ నేతలు ఎలా మాట్లాడారో గుర్తు చేసి ఆ పదవిని వివాదాల్లోకి లాగదలచుకోలేదు'' అన్నారు.

కార్యక్రమం ఇలా...

- పార్లమెంటు నూతన భవన ప్రాంగణంలో ఆదివారం ఉదయం ఏడింటికి హోమం జరుగుతుంది. తర్వాత సర్వమత ప్రార్థనలుంటాయి.
- అనంతరం హోమ వేదిక వద్దే తమిళనాడు తంజావూరు శైవ మత పెద్దలు చోళుల రాజదండమైన సెంగోల్‌ను ప్రధాని నరేంద్ర మోదీకి అందజేస్తారు.
- అనంతరం లోక్‌సభ చాంబర్‌ను మోదీ లాంఛనంగా ప్రారంభిస్తారు.
- మధ్యాహ్నం ప్రధాన కార్యక్రమం జరుగుతుంది. మోదీతో పాటు లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా, రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ హరివంశ్, మాజీ ప్రధాని దేవెగౌడ తదితరులు పాల్గొంటారు.
- మాజీ ప్రధాని మన్మోహన్‌సింగ్, లోక్‌సభ మాజీ స్పీకర్ శివరాజ్ పాటిల్, కాంగ్రెస్ అధ్యక్షుడు, రాజ్యసభలో విపక్ష నేత మల్లికార్జున ఖర్గేతో పాటు విపక్ష పార్టీల నేతలందరికీ ఇప్పటికే ఆహ్వానాలు వెళ్లాయి.

రాకెన్ రోల్ క్వీన్ ఇకలేరు

టీనా టర్నర్ కన్నుమూత



న్యూయార్క్: తన పాట, ఆటతో 1960లు, 70ల్లో ప్రేక్షకులను ఉర్రూతలూగించిన రాకెన్ రోల్ క్వీన్, పాప్ సింగర్ టీనా టర్నర్ ఇక లేరు. సుదీర్ఘ అనారోగ్యం బారిన పడ్డ 83 ఏళ్ల టీనా జ్యూరిచ్ సమీపంలోని తన నివాసంలో మంగళవారం కన్నుమూశారు. మిక్ జాగర్ మొదలుకుని బేయాన్స్ దాకా రాక్ స్టార్లంతా టీనా వీరాభిమానులేనంటే ఆమె స్థాయి ఎంతటితో అర్థం చేసుకోవచ్చు! ఎత్తుపల్లాలమయంగా సాగిన ఆమె జీవితం ఆద్యంతం ఆసక్తికరం. శారీరకంగా, మానసికంగా, ఆర్థికంగా తనను పూర్తిగా గుల్ల చేసిన 20 ఏళ్ల వైవాహిక బంధం తాలూకు దెబ్బను అధిగమించి మరీ పాప్ సంగీత ప్రపంచంలో మకుటం లేని మహారాణి స్థాయిని అందుకున్నారామె. ఏకంగా 12 గ్రామీ అవార్డులు ఆమెను వచ్చి వరించాయి. ఆమె ఆల్బంలు ప్రపంచవ్యాప్తంగా 15 కోట్లకు పైగా అమ్ముడవడమూ ఓ రికార్డే. టీనా స్ఫూర్తిమంతమైన జీవితం 'వాట్స్ లవ్ గాట్ టు డూ విత్ ఇట్' పేరిట 1993లో సినిమాగా వచ్చింది. భరించలేని బాధనంతా తనలోనే దాచుకుని ప్రపంచాన్ని మెరుగ్గా తీర్చిదిద్దేందుకు దాన్నే శక్తిమంతమైన ఆయుధంగా మలచుకున్న అంతటి మహనీయ వ్యక్తికి ఏమిచ్చినా రుణం తీర్చుకోలేమని అందులో టీనా పాత్ర పోషించిన నటి ఏంఎలా బాసెట్ అన్నారు.

పవార్‌తో కేజ్రీవాల్ భేటీ

ముంబై: ఢిల్లీ రాష్ట్రంలో ఉన్నతాధికారుల నియామకం, బదిలీ నిర్ణయాలపై సర్వాధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కే దఖలుపరుస్తూ కేంద్రప్రభుత్వం తెచ్చిన ఆర్డినెన్స్‌పై ఢిల్లీ ముఖ్యమంత్రి కేజ్రీవాల్ పోరాటం ముమ్మరంచేశారు. సంబంధిత బిల్లు రాజ్యసభలో ఓడిపోయేలా విపక్షాల మద్దతు కూడగట్టేందుకు విపక్ష నేతలను కలవడంలో బిజీగా మారారు. ఇందులోభాగంగా గురువారం ముంబైలో నేషనలిస్ట్ కాంగ్రెస్ పార్టీ(ఎన్సీపీ) చీఫ్ శరద్ పవార్‌ను కలిశారు. 'ఎన్డీఏయేతర పార్టీలు ఉమ్మడి నిర్ణయంతో ముందుకెళ్తే రాజ్యసభలో బిల్లు ఓడిపోవడం ఖాయం' అని కేజ్రీవాల్ అన్నారు. కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, ఆ పార్టీ నేత రాహుల్ గాంధీలను శుక్రవారం కలిసేందుకు ప్రయత్నిస్తా' అని అన్నారు. ఈ సందర్భంగా పవార్ మాట్లాడారు. 'ప్రభుత్వాల పాలనా హక్కులను పరిరక్షించాల్సిందే. మేం ఆప్ వెంటే ఉంటాం. ఈ విషయంలో బీజేపీయేతర పార్టీలన్నీ ఆప్‌కు మద్దతు ప్రకటించాలి' అని అన్నారు. ఇప్పటికే కేజ్రీవాల్ శివసేన(యూబీటీ) చీఫ్ ఉద్ధవ్ ఠాక్రే, టీఎంసీ చీఫ్ మమతా బెనర్జీలను కలిసి మద్దతు కోరడం తెల్సిందే. ఢిల్లీలో పాలనాధికారం లెఫ్టినెంట్ గవర్నర్‌కు కాకుండా ఎన్నికైన రాష్ట్ర సర్కార్‌కే ఉంటుందంటూ సుప్రీంకోర్టు ధర్మాసనం తీర్పు వెలువడిన కొద్దిరోజులకే కేంద్రం ఆర్డినెన్స్ తేవడం, రాజ్యసభలో దానిపై బిల్లును ఓడించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేయడం విదితమే.

ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే వారిదే

ఆస్ట్రేలియాలో అధికార, ప్రతిపక్షాలపై ప్రధాని మోదీ ప్రశంసలు

పార్లమెంటు ప్రారంభోత్సవాన్ని బహిష్కరించిన పార్టీలపై పరోక్ష విమర్శలు



డెహ్రాడూన్–ఢిల్లీ వందేభారత్ రైలును ప్రారంభిస్తూ...

న్యూఢిల్లీ: పార్లమెంటు కొత్త భవనం ప్రారంభోత్సవంపై వివాదం కొనసాగుతూనే ఉంది. ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని ప్రతిపక్ష పార్టీలు బహిష్కరించిన నేపథ్యంలో ప్రధానమంత్రి నరేంద్ర మోదీ వారిపై పరోక్షంగా విరుచుకుపడ్డారు. ప్రజాస్వామ్య స్ఫూర్తి అంటే ఎలా ఉంటుందో ఆస్ట్రేలియా పర్యటనలో తెలిసిందంటూ విపక్షాల్ని విమర్శించారు. ఆరు రోజుల విదేశీ పర్యటన ముగించుకొని గురువారం స్వదేశానికి తిరిగి వచ్చిన ప్రధాని మోదీ ఢిల్లీలోని పాలం విమానాశ్రయం వెలుపల తనకు స్వాగతం పలికిన బీజేపీ కార్యకర్తలు, అభిమానులనుద్దేశించి మాట్లాడారు. సిడ్నీలో భారత సంతతికి చెందిన సదస్సులో పాల్గొన్నప్పుడు ఆస్ట్రేలియా ప్రధానమంత్రి ఆంటోని అల్బానెసెతో పాటుగా ప్రతిపక్ష పార్టీకి చెందిన నాయకులు, మాజీ ప్రధాని కూడా హాజరయ్యారన్నారు. ''భారతీయులకు చెందిన ఒక కార్యక్రమానికి ప్రతీ ఒక్కరూ హాజరై తమ దేశానికి ప్రాధాన్యం ఇచ్చారు. ప్రజాస్వామ్య స్ఫూర్తిని, బలాన్ని అలా చాటారు'' అని మోదీ కొనియాడారు. పార్లమెంటు ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని బహిష్కరించే విపక్ష పార్టీలపై ఆయన నేరుగా ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. ఆస్ట్రేలియాలో భారతీయ ప్రతినిధులందరికీ అరుదైన గౌరవం దక్కిందంటే అది మోదీకున్న కీర్తిప్రతిష్టల వల్ల కాదని, భారత్‌కున్న పటిష్టమైన బలం వల్లనేనని ప్రధాని స్పష్టం చేశారు. భారత్ చెప్పేది విదేశాలన్నీ వింటున్నాయని, మెజార్టీ ప్రభుత్వం ఉండడమే దానికి కారణమని చెప్పారు. తాను వినిపించేది 140 కోట్ల భారతీయుల గళమేనని ప్రపంచ నాయకులందరికీ బాగా తెలుసునన్నారు. భారత్‌ను ప్రపంచంలో అగ్రగామిగా తీర్చిదిద్దడానికి ఎన్నో సవాళ్లు ఎదుర్కొంటున్నామన్నారు. అయితే సవాళ్లనే సవాల్ చేయడం తన స్వభావమని చెప్పుకొచ్చారు. కరోనా సంక్షోభ సమయంలో కోవిడ్ టీకాలు విదేశాలకు ఎందుకు పంపిణీ చేస్తున్నారని ప్రతిపక్షాలు అప్పట్లో నిలదీశాయని, కానీ ఎందరో ప్రాణాలు నిలిపినందుకు వారంతా భారత్‌కు కృతజ్ఞతగా ఉన్నారని అన్నారు. బుద్ధుడు, గాంధీ నడయాడిన నేలపై శత్రువులపైన కూడా కరుణ చూపిస్తామని ప్రధాని మోదీ వ్యాఖ్యానించారు.

వారసత్వ రాజకీయాలు అభివృద్ధి నిరోధం

డెహ్రాడూన్: దేశాన్ని ఏళ్ల తరబడి పరిపాలించి హైస్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టామని గొప్పలు చెప్పుకునే పార్టీలు వారసత్వ రాజకీయాల నుంచి బయటపడలేకపోతున్నాయని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ విమర్శించారు. ఇలాంటి వారసత్వ రాజకీయాలే అభివృద్ధికి అడ్డంకిగా మారుతున్నాయని అన్నారు. ఉత్తరాఖండ్‌లో మొట్టమొదటి వందేభారత్ రైలుని మోదీ గురువారం వీడియో కాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. ఈ డెహ్రాడూన్–ఢిల్లీ రైలు ప్రారంభోత్సవంలో కాంగ్రెస్‌పై పలు విమర్శలు చేశారు. ఉత్తరాఖండ్ రైల్వేలో మౌలిక సదుపాయాల కోసం బడ్జెట్‌ను పెంచామన్నారు. 2014కి ముందు రూ.200 కోట్ల కంటే తక్కువ ఉంటే, ప్రస్తుతం రూ.5 వేల కోట్లు ఉందన్నారు. రైల్వే శాఖలో మౌలిక సదుపాయాలను మెరుగుపరిచి, ట్రాకుల్ని ఆధునీకరిస్తే మరింత హై స్పీడ్ రైళ్లను ప్రవేశపెట్టవచ్చన్నారు. దశాబ్దాలుగా అధికారంలో ఉన్న పార్టీ దానిని గుర్తించకుండా అవినీతి, కుంభకోణాలతో మునిగిపోయిందని విమర్శించారు. వారసత్వ రాజకీయాల నుంచి ఆ పార్టీ బయటపడలేకపోవడంతో దేశాభివృద్ధికి అడ్డంకిగా మారిందన్నారు.

మోదీ అహం, ప్రచార పిచ్చి

అవే పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేశాయి

'మోదీ– పార్లమెంట్ ప్రారంభోత్సవం' రగడపై కాంగ్రెస్ విమర్శ

న్యూఢిల్లీ: రాష్ట్రపతిని పక్కకునెట్టి ప్రధాని హోదాలో నూతన పార్లమెంట్ భవనాన్ని నరేంద్ర మోదీ ప్రారంభించడాన్ని కాంగ్రెస్ మరోమారు తీవ్రంగా తప్పుబట్టింది. ''ఇదంతా ఒక్కరి అహంకారం, ప్రచార వ్యామోహం. ఆయనలోని ఈ దుర్గుణాలే రాష్ట్రపతికి రాజ్యాంగం ద్వారా దక్కాల్సిన గౌరవం దక్కకుండా చేస్తున్నాయి' అని మోదీపై మండిపడింది. మోదీ ప్రభుత్వ అహంకార వైఖరి మన పార్లమెంటరీ వ్యవస్థను నాశనం చేసిందంటూ కాంగ్రెస్ చీఫ్ మల్లికార్జున ఖర్గే ట్వీట్ చేశారు. ''పార్లమెంట్‌ను ప్రారంభించే హక్కును రాష్ట్రపతి నుంచి లాక్కుని మీరు ఏం చూపాలనుకుంటున్నారో 140 కోట్ల మంది ప్రజలు తెల్సుకోవాలనుకుంటున్నారు'' అన్నారు. ''బుధవారమే రాంచీలో జార్ఖండ్ హైకోర్టు నూతన భవనాన్ని రాష్ట్రపతి ద్రౌపదీ ముర్ము ప్రారంభించారు. ఢిల్లీలో మాత్రం ఒక వ్యక్తి అహంకారం పార్లమెంట్ భవనాన్ని ప్రారంభించాల్సిన రాష్ట్రపతి హక్కును ఎదిరిస్తోంది. అశోక ది గ్రేట్. అక్బర్ ది గ్రేట్. మోదీ ది ఇనాగరేట్ (ప్రారంభోత్సవాలు చేసే వ్యక్తి)' అంటూ కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి జైరాం రమేశ్ ఎద్దేవా చేశారు.

గిరిజనులను అవమానించడమే: ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్

పార్లమెంటు భవన ప్రారంభోత్సవానికి రాష్ట్రపతిని ఆహ్వానించకపోవడం, మోదీయే ప్రారంభించనుండటం మహిళలను కించపరచడమేనని, గిరిజనులను అవమానించడమేనని ఆలిండియా ఆదివాసీ కాంగ్రెస్ విమర్శించింది. దీనిపై శుక్రవారం నిరసన చేపడతామని ప్రకటించింది.

ప్రారంభోత్సవంపై సుప్రీంలో పిల్

పార్లమెంట్ భవనాన్ని ప్రధాని ప్రారంభించకూడదంటూ సుప్రీంకోర్టులో గురువారం ప్రజా ప్రయోజన వ్యాజ్యం దాఖలైంది. రాష్ట్రపతి ద్వారా ప్రారంభోత్సవం జరిగేలా లోక్‌సభ సచివాలయాన్ని ఆదేశించాలని పిటిషన్‌దారు న్యాయవాది జయ సుఖిన్ కోరారు. పిల్‌లో పేర్కొన్నారు. పార్లమెంట్‌లో అంతర్భాగమైన రాష్ట్రపతికే ఆహ్వానం పంపలేదని ఆక్షేపించారు. ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని కోరారు.



మైసూర్ పులిగా కీర్తించబడిన రాజు టిప్పు సుల్తాన్ వినియోగించిన ఖడ్గమిది. లండన్‌లోని బోహామ్స్ సంస్థ నిర్వహించిన వేలంపాటలో రికార్డుస్థాయిలో రూ.143 కోట్ల ధర పలికింది. టిప్పు సుల్తాన్ పడకగదిలో లభించిన దీనిని ఈస్టిండియా కంపెనీ వారు మేజర్ జనరల్ డేవిడ్ బేర్డ్‌కు బహుమతిగా ఇచ్చారు.

సాక్షి
కరీంనగర్
శుక్రవారం । 26 । మే । 2023

సీఎం సమీక్షలో కలెక్టర్, సీపీ



తెలంగాణ ఆవిర్భావదశాబ్ది ఉత్సవాలపై గురువారం హైదరాబాద్‌లో సీఎం కేసీఆర్ కలెక్టర్లు, పోలీసు ఆఫీసర్లతో సమీక్ష నిర్వహించారు. సమావేశానికి కరీంనగర్ కలెక్టర్ ఆర్వీ కర్ణన్, పోలీస్ కమిషనర్ సుబ్బరాయుడు హాజరయ్యారు.

న్యూస్‌రీల్

ప్రశాంతంగా లాసెట్



తిమ్మాపూర్: న్యాయ కళాశాలల్లో ప్రవేశాల కోసం గురువారం టీఎస్ లాసెట్, పీజీ లాసెట్ ప్రవేశపరీక్షలు నిర్వహించారు. ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాలకు చెందిన అభ్యర్థుల కోసం తిమ్మాపూర్ మండలంలోని వాగేశ్వరి, జ్యోతిష్మతి, శ్రీచైతన్య ఇంజినీరింగ్ కళాశాలలో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మూడు సంవత్సరాల లా కోర్స్ ప్రవేశపరీక్షను మొదటి సెషన్‌లో ఉదయం 9:30నుంచి మధ్యాహ్నం 11.30గంటల వరకు, మధ్యాహ్నం 12:30నుంచి 2 గంటల వరకు నిర్వహించారు. పీజీ లాసెట్ ప్రవేశ పరీక్షను సాయంత్రం నాలుగు గంటల నుంచి 5.30 గంటల వరకు నిర్వహించారు.

బీపీ, షుగర్ బాధితులకు మందులు పంపిణీ చేయాలి



కరీంనగర్‌టౌన్: బీపీ, షుగర్ బాధితులకు ప్రతీ నెల సరిపడా మందులు ఇవ్వాలని, ప్రైవేటు ఆస్పత్రిలో చికిత్స చేసుకున్నప్పటికీ ప్రభుత్వ ఆసుపత్రిలోనూ మందులు అందజేయాలని డీఎంహెచ్‌వో కె.లలితాదేవి ఆదేశించారు. గురువారం డీఎంహెచ్‌వో కార్యాలయంలో జిల్లాలోని వైద్యాధికారులు, ఎన్సీడీ స్టాఫ్‌నర్స్‌తో సమీక్ష నిర్వహించారు. జిల్లాలోని ఏఎన్‌ఎంలకు డిజిటల్ బీపీ ఆపరేటర్లు పంపిణీ చేశారు. తమ గ్రామాల పరిధిలోని క్యాంపులను నిర్వహించి బీపీ, షుగర్ రోగులను గుర్తించి మందులు పంపిణీ చేయాలన్నారు. సిబ్బంది ఉదయం 9 నుంచి సాయంత్రం 4గంటల వరకు పేషెంట్లు ఉన్నా లేకున్నా ఆసుపత్రిలో అందుబాటులో ఉండాలన్నారు. పీవోలు సుజాత, వినీత, టీబీ ఆఫీసర్ రవీందర్‌రెడ్డి, రాజగోపాల్ పాల్గొన్నారు.

లోక్ అదాలత్‌లో రాజీపడే కేసుల పరిష్కారం



కరీంనగర్‌క్రైం: రాజీ పడే కేసులు గుర్తించి లోక్ అదాలత్‌లో పరిష్కారం జరిగేలా చర్యలు తీసుకుంటామని కరీంనగర్ జిల్లా న్యాయసేవాధికార సంస్థ కార్యదర్శి కె.వెంకటేశ్ తెలిపారు. గురువారం న్యాయసేవాసదన్ భవనంలో జూన్ 10వ తేదీన జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను పురస్కరించుకొని కరీంనగర్ పరిధిలోని అన్ని పోలీసుస్టేషన్ల అధికారులతో సమావేశం నిర్వహించారు. సత్వర న్యాయం కోసం రాజీపడదగిన పోలీసు కేసులకు సంబంధించి పలు సూచనలు చేశారు. అనంతరం ప్రీ అరెస్టు, అరెస్టు, రిమాండ్ దశలలోని హక్కులు తెలియజేసే పోసర్ ఆవిష్కరించారు. న్యాయమూర్తి మహ్మద్ శిరీన్ పాల్గొన్నారు.

టీఎన్జీవోలకు ఏసీపీల అభినందన



కరీంనగర్ అర్బన్: టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడు దారం శ్రీనివాస్‌రెడ్డి, కార్యదర్శిగా సంగెం లక్ష్మణరావులు ఇటీవల నియామకం కాగా ఏసీపీలు గురువారం శుభాకాంక్షలు తెలిపారు. కరీంనగర్ రూరల్ ఏసీపీ కర్ణాకర్ రావు, టాస్క్‌ఫోర్స్ ఏసీపీ విజయసారధి లను మర్యాదపూర్వకంగా కలువగా పుష్పగుచ్ఛమిచ్చి అభినందించారు. సంఘం అధ్యక్ష, కార్యదర్శులు శ్రీనివాస్ రెడ్డి, లక్ష్మణ్‌రావు, కోశాధికారి కిరణ్‌కుమార్‌రెడ్డి, సహాధ్యక్షుడు రాగి శ్రీనివాస్ పాల్గొన్నారు.

కరువుభత్యం, పెండింగ్ బిల్లులు చెల్లించాలి



కరీంనగర్: ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లకు చెల్లించాల్సిన మూడు విడతల కరువు భత్యం, ట్రెజరీలో బిల్లుల చెల్లింపులు సకాలంలో జరిగేలా చూడాలని కోరుతూ రాష్ట్ర ఆర్థికశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావుకు గురువారం టీఆర్‌టీఎఫ్ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు నందికొండ విద్యాసాగర్, చింతపల్లి అశోక్‌రావు వినతిపత్రం సమర్పించారు. జనవరి 2022 నుంచి 2.73శాతం, జూలై 2022 నుంచి 3.64శాతం, జనవరి 2023 నుంచి 3.64శాతం డీఏ ఉత్తర్వులు విడుదల చేయాల్సి ఉందని అన్నారు.

తీరొక్క దందా!

- రేషన్ బియ్యంతో కోళ్ల దాణా.. బీర్ల తయారీ
- అక్రమ ఆదాయానికి ఏడు మార్గాలు
- కిరాణా దుకాణాలే నిల్వకేంద్రాలు
- అనువైన సమయాల్లో రవాణా

రేషన్‌బియ్యం దందాకు చెక్ పడడం లేదు. రూపం మారిన దందా దళారులకు కాసులు కురిపిస్తోంది. ప్రభుత్వం ఈ–పాస్ వంటి ప్రత్యేక చర్యలు తీసుకున్నా అక్రమార్గాన రేషన్‌బియ్యం తరలిపోతూనే ఉంది. టిఫిన్ సెంటర్లు.. కోళ్లదాణా.. బీర్ల తయారీ.. అధిక ఆదాయం అందించే మహారాష్ట్రకు రవాణా.. ఇలా రూపం మారిందే తప్ప దందా ఆగలేదు. ఫలితంగా ప్రభుత్వ లక్ష్యం నెరవేరడం లేదు. పేదల కడపు నింపాల్సిన బియ్యం దళారులు, మిల్లర్లకు కాసులవర్షం కురిపిస్తోంది.

కరీంనగర్ అర్బన్: జిల్లాలో రేషన్‌బియ్యం దందా యథేచ్ఛగా సాగుతోంది. బియ్యం దందా రూపం మార్చుకొని విచ్చలవిడిగా సాగుతోంది. పేదల కడుపు నింపాల్సిన రేషన్‌బియ్యం కోళ్లకు ఆహారంగా.. బీర్ల తయారీకి వనరుగా వినియోగిస్తున్నారు. రేషన్‌బియ్యాన్ని పక్కదారి పట్టించే వారిపై పీడీయాక్ట్ నమోదు చేయాలని ప్రభుత్వం చెబుతున్నా స్థానిక అధికారుల నిర్లక్ష్యంతో అక్రమ వ్యాపారికి అడ్డుకట్ట పడడం లేదు. అధికారుల ఉదాసీన వైఖరి, మామూళ్ల మాటున మళ్లీ అక్రమదందా వేళ్లూనుకుంటోంది. పలువురు రేషన్‌డీలర్లు కార్డుదారుల వేలిముద్రలు తీసుకొని బియ్యం ఇచ్చినట్లు ఆన్‌లైన్‌లో రికార్డు చేస్తున్నారు. అయితే ఆ బియ్యాన్ని వారే కొని దళారులకు నేరుగా విక్రయిస్తున్నారు.

కిరాణా, రేషన్ దుకాణాలే అడ్డాలు

కరీంనగర్ జిల్లా కేంద్రం నుంచి కుగ్రామం వరకు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారం విరాజిల్లుతోంది. రేషన్‌దుకాణాల్లో క్లోజింగ్ బ్యాలెన్స్(సీబీ) చూపించే వరకు బియ్యం నిల్వ చేసుకునే అవకాశముండగా సీబీలోపు పక్కదారి పట్టిస్తున్నారు. వేలిముద్ర వేసి వెళ్లిన వారి బియ్యానికి ప్రత్యేక రిజిష్టర్ ఏర్పాటు చేసుకుని లెక్కలు వేసుకున్న తర్వాత దళారులు, మిల్లర్లకు అంటగడుతున్నారు. కిరాణ దుకాణ నిర్వాహకులు కూడా రేషన్ బియ్యాన్ని కొనుగోలు చేసి నిల్వ చేస్తుండగా అనుకూల సమయాల్లో దళారులకు విక్రయిస్తున్నారు. మొత్తంగా దందా యథేచ్ఛగా సాగుతోంది.



పట్టుబడిన రేషన్ బియ్యం

దళారులు పుట్టుకొస్తున్నారు

చోటమోటా బియ్యం డాన్‌లతోపాటు భారీ డాన్‌ల సంఖ్య పెరుగుతుందే తప్పా తగ్గకపోవడం సంబంధిత అధికారులు వ్యవహరిస్తున్న తీరుకు నిదర్శనం. ఇతరుల పేర్లతో దందా చేస్తూ కేసులు నమోదయ్యే సమయంలో అన్నీతామై వ్యవహరిస్తున్నారు. దీనికి కొందరు అధికారుల అండ పుష్కలంగా ఉండటం విశేషం. దందా చేసే అక్రమార్కులపై పదుల సంఖ్యలో కేసులున్నప్పటికీ కఠిన శిక్షలు లేకపోవడంతో మళ్లీ అదే దందా సాగిస్తున్నారు. పలువురి అధికారులతో ఉన్న మామూళ్ల బంధంతో ఈ దందా యథేచ్ఛగా కొనసాగిస్తున్నారు. రాష్ట్ర ప్రభుత్వం పీడీయాక్టు అమలు చేయాలని స్పష్టంగా నిర్దేశించినా ఆమేరకు అధికారులు చర్యలు తీసుకోవడం లేదు. 6ఏ కేసులతోనే సరిపుచ్చుతున్నారన్న ఆరోపణలు ఉన్నాయి. అక్రమ వ్యాపారాన్ని కట్టడి చేయడంలో అధికారుల తీరును ప్రశంసించాల్సిందే కానీ పూర్తిస్థాయిలో చర్యలకు ఉపక్రమించకపోవడం అనుమానాలకు తావిస్తోంది. కాగా రేషన్‌బియ్యం పక్కదారి పట్టించేవారెవరైన వదిలేదిలేదని పౌరసరఫరాల శాఖ, విజిలెన్స్, టాస్క్‌ఫోర్స్ అధికారులు స్పష్టం చేస్తున్నారు.

అక్రమ ఆదాయానికి ఏడు మార్గాలు

- ప్రతీ వానాకాలం, యాసంగి సీజన్లలో సీఎమ్మార్ కొనసాగడం పరిపాటి. ఇదే సమయంలో పలువురు మిల్లర్లు దళారులను ఏర్పాటు చేసుకుని రేషన్‌బియ్యాన్ని కొని సీఎమ్మార్‌గా ప్రభుత్వానికి అప్పగిస్తున్నారు. అధికారులు తనిఖీలకొస్తే తమ కున్న పలుకుబడితో బయటకు పొక్కకుండా మేనేజ్ చేస్తున్నారు.
- ప్రభుత్వం ఇచ్చిన ధాన్యాన్ని మాత్రం మరా ఆడించి ఇతర మార్గాల్లో అధిక ధరలకు విక్రయిస్తూ సొమ్ము చేసుకుంటున్నారు.
- టిఫిన్‌సెంటర్లకు రేషన్ బియ్యం తరలిపోతోంది. తక్కువ ధరకు బియ్యం లభిస్తుండడంతో టిఫిన్ సెంటర్ నిర్వాహకులు సైతం కొంటున్నారు. దోశ, ఇడ్లీ, వడ ఇతర తినుబండారాల్లో కలిపేస్తుండగా పలువురు నిర్వాహకులు తక్కువ పెట్టుబడితో ఎక్కువ ఆదాయం గడిస్తున్నారు.
- కోళ్ల ఫారాలలో దాణాకు ఉపయోగిస్తున్నారు. మానకొండూర్ మండలం లక్ష్మీపూర్‌లో వంద క్వింటాళ్లకు పైగా రేషన్ బియ్యం పట్టుబడటం ఇందుకు నిదర్శనం. మక్కల ధరలు ఎక్కువగా ఉండటంతో చాలా మంది కోళ్ల ఫారం నిర్వాహకులు తక్కువ ధరకు వస్తున్న లభిస్తున్న బియ్యాన్ని కొనుగోలు చేసి కోళ్లకు దాణాగా వాడుతున్నారు.
- బీర్లు తయారీ చేసే పరిశ్రమలకు రేషన్ బియ్యాన్ని తరలిస్తున్నారు. గతంలో పట్టుబడిన కేసుల్లో 20కి పైగా ఇలాంటి రవాణావేనని పౌరసరఫరాల శాఖలోని ఓ అధికారి వివరించారు.
- సన్నరకాల దిగుబడి తక్కువగా ఉండడంతో సన్నబియ్యం ఆశించిన స్థాయిలో దిగుబడి రావడం లేదు. దీంతో చేసేదేమీ లేక పలువురు వ్యాపారులు రేషన్ బియ్యాన్నే పాలిష్ చేసి సన్నరకాల్లో కలిపి విక్రయిస్తున్నారు.
- అత్యధిక లాభాలు గడించే మార్గం మహారాష్ట్రకు తరలించడం. మహారాష్ట్ర ప్రజలు దొడ్డుబియ్యాన్ని అమితంగా ఇష్టపడతారు. అక్కడ కిలో రూ.26–30 వరకు ధర పలుకుతుండటంతో భారీగా ఆదాయం గడిస్తున్నారు.

మోడల్ కాలనీగా హౌసింగ్‌బోర్డు

- త్వరలోనే 24/7 ట్రయల్‌రన్
- మేయర్ సునీల్‌రావు

కరీంనగర్ కార్పొరేషన్: నగరంలోని హౌసింగ్ బోర్డును మోడల్ కాలనీగా మారుస్తున్నామని మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. స్మార్ట్‌సిటీలో భాగంగా రూ.65 కోట్లతో అభివృద్ధి పనులు పూర్తిచేశామన్నారు. 24 గంటల తాగునీటికి పైలెట్ ప్రాజెక్ట్‌గా కాలనీని ఎంపిక చేశామన్నారు. గురువారం హౌసింగ్‌బోర్డు కాలనీలో చేపడుతున్న 24 గంటల తాగునీటి పనులను ఆయన పరిశీలించారు. వాటర్ ట్యాంక్‌తో పాటు మీటర్లు బిగించిన ఇండ్ల వద్దకు వెళ్లి పరిశీలించారు. రెండు, మూడు నెలల్లో కాలనీలో 24గంటల తాగునీటి ట్రయల్‌రన్ నిర్వహిస్తామన్నారు. ఈ రిజర్వాయర్ కింద 5, 6, 27, 28, 29, 30, 31, 47 డివిజన్‌ల పరిధిలో 4455నల్లా కనెక్షన్‌లు ఉన్నాయని తెలిపారు. ఈ పైలెట్ ప్రాజెక్ట్‌కు రూ.18 కోట్లు కేటాయించామని టెండర్ ప్రక్రియ కూడా పూర్తయిందన్నారు. ట్రయల్‌రన్ పూర్తి చేసుకొని రాష్ట్ర మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్ బోర్డు వైస్ చైర్మన్ బి.వినోద్‌కుమార్‌లతో ప్రారంభిస్తామన్నారు. కార్పొరేటర్లు ఆకుల పద్మ ప్రకాశ్, నేతికుంట యాదయ్య, కోల మాలతి సంపత్, ఎస్ఈ నాగమల్లేశ్వర్‌రావు, ఈఈ మహేందర్, స్థానికులు నారదాసు వసంత్‌రావు, చారి, తోట రాజేందర్ పాల్గొన్నారు.



హౌసింగ్‌బోర్డుకాలనీలో 24 గంటల తాగునీటి పనులు పరిశీలిస్తున్న మేయర్ సునీల్‌రావు

సిల్ట్ తొలగింపు ముమ్మరం చేయాలి

వచ్చే వానాకాలం దృష్ట్యా నగరవ్యాప్తంగా డ్రైనేజీ సిల్టింగ్ పనులను ముమ్మరం చేయాలని మేయర్ సునీల్‌రావు అన్నారు. నగరపాలక సంస్థ కార్యాలయంలో గురువారం ఇంజనీరింగ్, శానిటేషన్ అధికారులు, సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. స్పెషల్ శానిటేషన్ డ్రైవ్ నేపథ్యంలో డ్రైనేజీసిల్టింగ్ పనులు, లింకేజీ డ్రైన్ పెండింగ్ స్లాబ్ పనులు, డ్రైనేజీ లో పైప్ లైన్ గుర్తింపు పనులు, రోడ్లు ఫుట్‌పాత్ పనులపై చర్చించారు.వచ్చే వర్షకాలాన్ని దృష్టిలో పెట్టుకొని ప్రధాన స్టాం వాటర్ డ్రైన్‌లతో పాటు డివిజన్లలో సిల్టును తొలగించాలన్నారు. రూ.70లక్షల నిధులు కేటాయించి టెండర్లు పిలిచిన ప్రకారం సిల్ట్ తొలగింపు పనులు జరగాలన్నారు.

త్వరలోనే పదోన్నతులు, బదిలీలు



పదోతరగతిలో 10జీపీఏ సాధించిన గవర్నమెంట్ స్కూల్ విద్యార్థులతో ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి

- ఎమ్మెల్సీ కూర రఘోత్తమరెడ్డి

కరీంనగర్: ఉపాధ్యాయ పదోన్నతులు, బదిలీలపై త్వరలోనే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటుందని ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి అన్నారు. పీఆర్‌టీయూ జిల్లాశాఖ ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ఆడిటోరియంలో జరిగిన ప్రతిభా పురస్కార వేడుకల్లో ఎస్ఎస్‌సీలో వందశాతం ఉత్తీర్ణత సాధించిన ప్రధానోపాధ్యాయులకు, 10జీపీఏ సాధించిన విద్యార్థులకు ప్రతిభా పురస్కారాలు అందించారు. ఎమ్మెల్సీ రఘోత్తమరెడ్డి మాట్లాడుతూ.. ప్రభుత్వం త్వరలో ఉపాధ్యాయులకు పదోన్నతులు ఇవ్వడానికి సిద్ధంగా ఉందని, జూన్ 13 తరువాత షెడ్యూల్ వచ్చే అవకాశం ఉందని తెలిపారు. జిల్లాలో 55 పాఠశాలలు 100శాతం ఫలితాలు, 29మంది 10జీపీఏ సాధించడం అభినందనీయమన్నారు. డీఈవో జనార్ధన్ రావు మాట్లాడుతూ రానున్న రోజుల్లో జిల్లా అంచెలంచెలుగా మొదటిస్థానం నిలవాలని ఆకాంక్షించారు. పీఆర్‌టీయు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బీరెల్లి కమలాకర్‌రావు మాట్లాడుతూ జూన్ 2నుంచి ఉద్యోగ, ఉపాధ్యాయులకు పూర్తిస్థాయిలో ఈహెచ్‌ఎస్ అమలు చేయడానికి సిద్ధంగా ఉందని తెలిపారు. జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు ముస్కు తిరుపతిరెడ్డి, మర్రి జైపాల్‌రెడ్డి, మండల విద్యాధికారులు శ్రీనివాస్‌రెడ్డి, వేణుకుమార్, మధుసూధనచారి, హెచ్‌ఎం అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు రాజభాను ప్రకాశ్, జాలి మహేందర్‌రెడ్డి, కేవీఎస్‌రెడ్డి, శ్రీకాంత్ రావు, అన్నాడి మోహన్‌రెడ్డి, సునీత, రమాదేవి, శ్రీనివాస్‌రెడ్డి, తిరుపతి, అశోక్‌రెడ్డి పాల్గొన్నారు.

అంగారిక టౌన్‌షిప్ 4వ విడతకు ఏర్పాట్లు

- 27న నుస్తులాపూర్ రైతు వేదికలో ప్రీబిడ్ సమావేశం
- అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్



మాట్లాడుతున్న గరిమా అగర్వాల్

కరీంనగర్ అర్బన్: అంగారిక టౌన్‌షిప్ 4వ విడతలో ప్లాట్ల వేలంకోసం ప్రీ బిడ్ సమావేశం ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ గరిమా అగర్వాల్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సమీక్షించారు. 4వ విడతలో 75 ప్లాట్ల వేలానికి సంబంధించి జూన్ 8న నిర్వహించనున్న వేలం కార్యక్రమానికి, ప్రిబిడ్ సమావేశాన్ని ఈ నెల 27 ఉదయం 11 గంటలకు తిమ్మాపూర్ మండలం నుస్తులాపూర్ గ్రామ రైతువేదిక ప్రాంగణంలో నిర్వహించాలని తెలిపారు. ప్లాట్ల వేలానికి సంబంధించిన ప్రజలకు చేరేలా ప్రచారం జరగాలని, కూడళ్లలో ఫ్లెక్సీలను ఏర్పాటు చేయాలని తెలిపారు. గతంలో వేలం ద్వారా ప్లాట్లను సొంతం చేసుకొని వాయిదాలు సక్రమంగా చెల్లించని వారికి నోటీసులు జారీచేసి త్వరగా వాయిదాలను చెల్లించేలా చూడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో కరీంనగర్ ఆర్డీఓ ఆనంద్ కుమార్, మున్సిపల్ కమిషనర్ సేవా ఇస్లావత్, సర్వే ల్యాండ్ ఏడీ అశోక్, డీటీ సీపీవో అంజయ్య, స్వగృహ ఏఈ చిరంజీవి, తిమ్మాపూర్ తహసీల్దార్ కనకయ్య, సూపరింటెండెంట్ సురేఖ పాల్గొన్నారు.

జిల్లా ఆస్పత్రిలో 'నో రోస్టర్'



జిల్లా ప్రభుత్వ ప్రధానాసుపత్రి

- నర్సింగ్ విధుల కేటాయింపులో ఇష్టారాజ్యం
- కొంత మంది ఏళ్ల తరబడి ఒకేచోట తిష్ట

కరీంనగర్‌టౌన్: జిల్లా ఆస్పత్రిలో నర్సింగ్ డ్యూటీలు వేసేందుకు రోస్టర్ విధానానికి స్వస్తి పలికారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. స్టాఫ్ నర్సులు, హెడ్ నర్సులు, నర్సింగ్ సూపరింటెండెంట్లు ఇలా అన్నిస్థాయిల్లో ఉన్న కొంత మంది ఏళ్ల తరబడి ఒకే చోట విధులు నిర్వహిస్తుండడమే ఇందుకు నిదర్శనం. ప్రతి 6 నెలలకోసారి రోస్టర్ ప్రకారం డ్యూటీలు మార్చాల్సి ఉండగా, కొంత మందికి నిబంధనలు వర్తింపజేయడం లేదు. జిల్లా ఆసుపత్రితో పాటు అనుబంధంగా ఉన్న మాతాశిశు ఆరోగ్య కేంద్రంతో కలిపి 500పడకలతో ఆసుపత్రి నిర్వహణ కొనసాగుతోంది. సరిపడా నర్సింగ్ సిబ్బంది ఉన్నారు. వీరికి తోడు నర్సింగ్ స్కూల్ విద్యార్థులు సేవలందిస్తున్నారు. అయినప్పటికీ అస్తవ్యస్తమైన డ్యూటీల నిర్వహణతో కొంత మంది రెగ్యులర్‌గా పనిచేస్తుంటే మరికొంత మంది ఏళ్ల తరబడి ఒకే చోట నైట్ డ్యూటీలు లేకుండా విధులు నిర్వహిస్తుండడం పలు అనుమానాలకు తావిస్తోంది. కొంత మంది స్టాఫ్ నర్సులకు ప్రభుత్వ ఆర్డర్ లేకుండానే హెడ్ నర్సులుగా ప్రమోట్ చేశారనే విమర్శలు ఉన్నాయి.

సిటీకి రూ.132 కోట్లు

- సీఎంఏ నిధులు విడుదల
- పూర్తికానున్న మిగులు పనులు
- శివారు, విలీన ప్రాంతాలకు ప్రాధాన్యం
- జూన్‌లో టెండర్ పిలిచే అవకాశం
- ఆగస్టు నాటికి పూర్తిచేయాలని సంకల్పం



కరీంనగర్ కార్పొరేషన్: నగరంలో పలు అభివృద్ధి పనులు చేపట్టేందుకు రాష్ట్ర ప్రభుత్వం తాజాగా రూ.132 కోట్లు విడుదల చేసింది. స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్, సాధారణ నిధులు, సీఎం హామీ నిధులతో ఇప్పటికే నగరంలో పలు అభివృద్ధి పనులు కొనసాగుతుండడం తెలిసిందే. గతంలో రద్దయిన పనుల స్థానంలో 60 డివిజన్లలోని పనులకు సంబంధించిన కొత్త ప్రతిపాదనలకు రూ.132 కోట్ల 94 లక్షల 71 వేలు విడుదల చేస్తూ మెమో నెం.3183/2023, తేదీ 24.05.2023 ద్వారా పరిపాలనా పరమైన మంజూరు జారీ అయింది.

రూ.132 కోట్లు విడుదల

నగరం స్మార్ట్‌సిటీ విభాగంలో ఎంపికైన తరువాత అభివృద్ధి పనులు నిరంతరంగా కొనసాగుతున్నాయి. రాష్ట్ర ప్రభుత్వ భాగస్వామ్యంతో కేంద్ర ప్రభుత్వ నిధులతో చేపడుతున్న స్మార్ట్‌సిటీ ప్రాజెక్ట్‌తో పనుల జాతర సాగుతోంది. ఇదే క్రమంలో ముఖ్యమంత్రి హామీ నిధుల (సీఎంఏ) కింద కోట్లాది రూపాయలు నగరానికి కేటాయిస్తున్నారు. 2017 ఆర్థిక సంవత్సరంలో రూ.100 కోట్లు, 2018 సంవత్సరంలో రూ.100 కోట్లు, 2019లో రూ.147 కోట్లు నగరానికి కేటాయించారు. ఈ నిధులతో 566 పనులకు టెండర్ పిలిచారు. ఇందులో ఇప్పటివరకు 400 పనుల వరకు పూర్తయ్యాయి. 166 పనులు వివిధ కారణాలతో ప్రారంభం కాలేదు. అప్పుడు పూర్తి కాని పనుల స్థానంలో మళ్లీ పనులు చేపట్టేందుకు నగరపాలకసంస్థ ప్రతిపాదనలు సిద్ధం చేసింది. నగరంలో అక్కడక్కడా మిగిలిపోయిన పనుల (క్రిటికల్ గ్యాప్స్)తో పాటు 60 డివిజన్‌లకు సంబంధించిన కార్పొరేటర్ల విజ్ఞప్తిల మేరకు కొత్త ప్రతిపాదనలు ప్రభుత్వానికి పంపించారు. ఈ ప్రతిపాదనల మేరకు రాష్ట్ర ప్రభుత్వం రూ.132 కోట్లు విడుదల చేస్తూ ఆదేశాలు జారీ చేసింది.

శివారు ప్రాంతాలకు ప్రాధాన్యం

ముఖ్యమంత్రి హామీ నిధుల (సీఎంఏ) కింద నగరానికి వచ్చిన రూ.132 కోట్ల పనులకు వచ్చే నెలలో టెండర్ ప్రక్రియ చేపట్టేందుకు అధికారులు కసరత్తు చేస్తున్నారు. రెండు మూడు రోజుల్లో టెండర్ ప్రక్రియను సిద్ధం చేయనున్నారు. జూన్ నెలలో టెండర్ పిలిచి, ఆగస్టు చివరినాటికి పనులు పూర్తి చేయాలనే సంకల్పంతో పాలకపక్షం ఉంది. నగరంలోని ఆయా ప్రాంతాల్లో ప్రధాన సమస్యలుగా ఉన్న అంతర్గత రోడ్లు, లింక్‌రోడ్లు, డ్రైనేజీలు,పైప్‌లైన్‌లు, రహదారుల గ్యాప్‌లు ఈ పనుల్లో పూర్తి కానున్నాయి. కోతిరాంపూర్ నుంచి కట్టరాంపూర్ వరకు మెయిన్‌రోడ్డు, మంకమ్మతోట నుంచి జ్యోతినగర్ వరకు రోడ్డు లాంటి దీర్ఘకాలికంగా అపరిష్కృతంగా ఉన్న పనులు ఈ నిధులతో పూర్తి కానున్నాయి. ప్రధానంగా విలీన గ్రామాలు, శివారు ప్రాంతాలకు ఇందులో అధిక ప్రాధాన్యం ఇస్తున్నారు.

రాష్ట్ర మంత్రికి కృతజ్ఞతలు

నగరానికి రూ.132 కోట్లు సీఎంఏ నిధులు విడుదల అయ్యేందుకు చొరవ చూపిన రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, ప్లానింగ్‌బోర్డు వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్‌లకు కృతజ్ఞతలు. 60డివిజన్లలో ఎక్కడైతే పనులు అవసరం, అపరిష్కృతంగా ఉన్నాయో ఆ పనులను ఈ నిధులతో పూర్తి చేస్తాం. శివారు, విలీన ప్రాంతాల్లో పనులు చేపట్టేందుకు ప్రాధాన్యతనిచ్చాం. రాజకీయాలకు తావు లేకుండా, ప్రతిపక్ష పార్టీలు ప్రాతినిధ్యం వహిస్తున్న డివిజన్‌లలోనూ ఈ పనులు చేపడుతున్నాం. జూన్‌లో టెండర్ ప్రక్రియ పూర్తి చేసి, ఆగస్టు నాటికి పనులు పూర్తి చేయాలనే పట్టుదలతో ఉన్నాం.

– సునీల్‌రావు, మేయర్, కరీంనగర్

క్లుప్తంగా

ప్రయివేటు ఆస్పత్రుల్లో తనిఖీలు



హుజూరాబాద్‌: కలెక్టర్‌, డీఎంహెచ్‌వో ఆదేశాల మేరకు హుజూరాబాద్‌ డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్‌ చందు గురువారం హుజూరాబాద్‌లోని పలు ప్రైవేట్‌ ఆస్పత్రులను తనిఖీ చేశారు. ప్రతిఒక్క క్లినిక్‌, పాలిక్లినిక్‌, నర్సింగ్‌హోమ్‌ విధిగా రిజిస్ట్రేషన్‌ చేసి ఉండాలని సూచించారు. లేకపోతే చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. నర్సింగ్‌హోమ్‌లో సాధారణ ప్రసవాలు చేయాలని, సెక్షన్లు చేయరాదని పేర్కొన్నారు. పీసీపీఎన్‌డీటీ చట్టాన్ని సక్రమంగా అమలు చేయాలన్నారు. అకారణంగా అబార్షన్లు చేయరాదని హెచ్చరించారు. రెండు బృందాలను ఏర్పాటుచేసి హుజూరాబాద్‌, జమ్మికుంటల్లో ప్రతి నర్సింగ్‌ హోంను తనిఖీ చేస్తున్నామని తెలిపారు. ప్రతీ ఆస్పత్రి నిబంధనల ప్రకారం నిర్వహించాలని తెలిపారు. జిల్లా హెల్త్‌ ఎడ్యుకేటర్‌ పంజాల ప్రతాప్‌, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

క్వింటాల్‌ పత్తి ధర రూ.6,800



జమ్మికుంట(హుజూరాబాద్‌): జమ్మికుంట వ్యవసాయ మార్కెట్‌లో పత్తి ధరలు రోజురోజుకు పడిపోతున్నాయి. బుధవారం క్వింటాల్‌కు రూ.7,050 కాగా గురువారం రూ.250 తగ్గింది. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,800 పలికింది. మార్కెట్‌కు 19 వాహనాల్లో 213క్వింటాళ్ల పత్తిని రైతులు అమ్మకానికి తీసుకొచ్చారు. మోడల్‌ ధర రూ.6,700, కనిష్ట ధర రూ.6,200 పలికింది. గన్నీసంచుల్లో నలుగురు రైతులు మూడు క్వింటాళ్ల పత్తిని అమ్మకానికి తీసుకొచ్చారు. క్వింటాల్‌కు గరిష్ట ధర రూ.6,600, మోడల్‌ ధర రూ.5,200, కనిష్ట ధర రూ.5,000కు ఖరీదు వ్యాపారులు కొనుగోలు చేశారు. మార్కెట్‌లో క్రయ విక్రయాలు కార్యదర్శి గూగులోతు రెడ్డి నాయక్‌ పర్యవేక్షించారు.

దరఖాస్తు గడువు పొడిగింపు

కరీంనగర్‌: బీసీ స్టడీ సర్కిల్‌ కరీంనగర్‌ ఆధ్వర్యంలో గురుకుల ఉపాధ్యాయ పోటీ పరీక్షకు ఉచిత శిక్షణ దరఖాస్తు గడువును ఈ నెల 28వ తేదీ వరకు పొడిగించినట్లు స్టడీ సర్కిల్‌ డైరెక్టర్‌ డాక్టర్‌ ఎం.రవి కుమార్‌ గురువారం ఒక ప్రకటలో తెలిపారు. కరీంనగర్‌, జగిత్యాల, పెద్దపల్లి జిల్లాలకు చెందిన నిరుద్యోగ బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనారిటీ అభ్యర్థులు బీసీ స్టడీ సర్కిల్‌ వెబ్‌సైట్‌ ద్వారా ఈనెల 28 తేదీ లోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. డిగ్రీ, బీఈడీ పరీక్షలో పొందిన మార్కులు, రిజర్వేషన్‌ ఆధారంగా ఎంపిక ఉంటుందని అయన పేర్కొన్నారు. పూర్తి వివరాలకు కరీంనగర్‌ బీసీ స్టడీ సర్కిల్‌ కార్యాలయ ఫోన్‌ నంబర్‌ 0878–2268686ను సంప్రదించాలని కోరారు.

ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు

మానకొండూర్‌: మానకొండూర్‌ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై ఫేస్‌బుక్‌లో అసభ్యకర పోస్టులు పెడుతున్నాడని ఓరుగంటి శేఖర్‌ అనే కళాకారుడిపై మానకొండూర్‌ పోలీస్‌స్టేషన్‌లో గురువారం కేసు నమోదు అయ్యింది. సీఐ మాదాసు రాజ్‌కుమార్‌ వివరాలు.. జగిత్యాల జిల్లా కొడిమ్యాల మండలం చెప్యాలకు చెందిన శేఖర్‌ ఫేస్‌బుక్‌లో ఎమ్మెల్యే రసమయి బాలకిషన్‌పై అసభ్యకరమైన పోస్టులు పెడుతున్నాడని,ఓ పాటలో అసభ్యకరంగా వ్యాఖ్యలు చేశాడని తిమ్మాపూర్‌ మండలం రేణికుంటకు చెందిన ఎలుక ఆంజనేయులు ఫిర్యాదు చేయడంతో ఎస్సీ,ఎస్టీ కేసు నమోదు చేసినట్లు సీఐ తెలిపారు. విచారణ నిమిత్తం రూరల్‌ ఏసీపీ ఎదుట హాజరు పరిచినట్లు సీఐ వివరించారు.

జీలుగ విత్తనాలు వచ్చేశాయ్‌

- జిల్లాకు 5,400క్వింటాళ్లు మంజూరు
- మండలాలవారీగా కేటాయింపు
- జీలుగ 30 కిలోలకు రూ.843
- జనుము 40కిలోలకు రూ.1,225



తీగలగుట్టపల్లి డీసీఎంఎస్‌లో నిల్వ ఉన్న జీలుగ విత్తనాలు

కరీంనగర్‌రూరల్‌: యాసంగి సీజన్‌ ధాన్యం కొనుగోళ్లు చివరిదశకు చేరుకున్నాయి. గురువారం నుంచి రోహిణికార్తె ప్రవేశించడంతో రైతులు వానాకాలం సాగు చేసేందుకు సన్నద్ధమయ్యారు. విత్తనాలు, ఎరువులను కొనుగోలు చేసేందుకు సిద్ధమవుతున్నారు. పచ్చిరొట్ట అయిన జనుము,జీలుగ విత్తనాలను దుక్కిలో వేసి దున్నితే భూసారం పెరుగుతుంది. ఏటా వానాకాలం సీజన్‌ ఆరంభంలో రైతులకు ప్రభుత్వం సబ్సిడీపై విత్తనాలు పంపిణీ చేస్తోంది.

జిల్లాకు 5400 క్వింటాళ్ల జీలుగ కేటాయింపు

జిల్లాకు జనుము 120క్వింటాళ్లు, జీలుగ 5,400క్వింటాళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఆయా విత్తనాలను వ్యవసాయాధికారులు మండలాల వారీగా కేటాయించారు. ఆయా మండలాల్లోని సహకార సంఘాలు, డీసీఎంఎస్‌, ఆగ్రోస్‌ కేంద్రాల ద్వారా రైతులకు పంపిణీ చేస్తున్నారు. వ్యవసాయంలో రోజు రోజుకు రసాయన ఎరువుల వినియోగం పెరిగిపోతోంది. దీంతో భూసారం తగ్గిపోవడమే కాకుండా పంట దిగుబడి ఆశించిన మేరకు రావడంలేదు. అయితే పలువురు రైతులు సేంద్రియ పద్ధతుల్లో సాగు చేస్తున్నప్పటికీ పూర్తిస్థాయిలో ముందుకు రావడంలేదు. కనీసం దుక్కిలోనైనా పచ్చిరొట్ట విత్తనాలను వేస్తే కొంతవరకైనా భూసారం పెరిగే అవకాశముందని జాతీయ విత్తనాభివృద్ధిసంస్థ, తెలంగాణ రాష్ట్ర విత్తన కార్పొరేషన్‌ ఆధ్వర్యంలో జనుము,జీలుగ విత్తనాలను సబ్సిడీపై రైతులకు అందిస్తున్నారు.

పెరిగిన జీలుగ ధర

ప్రభుత్వం జీలుగ విత్తనాలను 65శాతం సబ్సిడీపై రైతులకు అందిస్తోంది. అయితే గతేడాది కిలో విత్తనం ధర రూ.63 ఉండగా ప్రస్తుతం రూ.80.25 పెంచారు. ధర పెంచడంతో రైతులపై అదనపు ఆర్థికభారం పడుతోంది. క్వింటాల్‌కు రూ.8,025 ధర ఉండగా ప్రభుత్వం రూ.5,216 సబ్సిడీ ఇస్తోంది. రైతు రూ.2,809 చెల్లించాల్సి ఉంటుంది. 30 కిలోల జీలుగబస్తాకు రూ.842 చెల్లించాలి. జనుము 40కిలోల బస్తాకు సబ్సిడీ పోగా రైతు రూ.1225 చెల్లించాల్సి ఉంటుంది. జీలుగ,జనుము విత్తనాలు కావాల్సిన రైతులు పట్టాదారు పాసుపుస్తకం, ఆధార్‌కార్డు జిరాక్స్‌ ప్రతులతో సంబంధిత మండల వ్యవసాయాధికారులను సంప్రదించినట్లయితే పర్మిట్‌ జారీ చేస్తారు.

సద్వినియోగం చేసుకోవాలి

జిల్లాలోని రైతులందరికీ జనుము,జీలుగ విత్తనాలను అందుబాటులో ఉంచాం. సబ్సిడీపై అందిస్తున్న విత్తనాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలి. తొలకరి ప్రారంభంలో జనుము,జీలుగ విత్తనాలను విత్తినట్లయితే పంట దిగుబడి వస్తుంది. పంటను పొలంలో కలియ దున్నడం ద్వారా నత్రజని, భాస్వరం, పొటాషియం ఎరువులతో భూసారం పెరుగుతుంది.

– వి. శ్రీధర్‌, జిల్లా వ్యవసాయాధికారి, కరీంనగర్‌

మండలాల వారీగా జీలుగ కేటాయింపు(క్వింటాళ్లు)

చిగురుమామిడి	270
చొప్పదండి	480
ఇల్లంతకుంట	330
గంగాధర	350
గన్నేరువరం	250
హుజురాబాద్‌	480
జమ్మికుంట	420
కరీంనగర్‌రూరల్‌	300
కొత్తపల్లి	120
మానకొండూరు	540
రామడుగు	360
శంకరపట్నం	420
తిమ్మాపూర్‌	330
సైదాపూర్‌	330
వీణవంక	420

డబుల్‌ బెడ్‌రూం ఇళ్ల పంపిణీ ఎప్పుడు?

- ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి



డబుల్‌ బెడ్‌రూం ఇండ్లు పరిశీలిస్తున్న జోజిరెడ్డి

కరీంనగర్‌: అర్హులైన వారందరికీ డబుల్‌ బెడ్‌ రూం ఇళ్లు నిర్మించి ఇస్తామని ప్రభుత్వం ఇచ్చిన వాగ్దానాలు అమలు కావడం లేదని ఆల్‌ ఇండియా ఫార్వర్డ్‌ బ్లాక్‌ పార్టీ జాతీయ ఉపాధ్యక్షుడు అంబటి జోజిరెడ్డి అన్నారు. ఏఐఎఫ్‌బీ పార్టీ ఆధ్వర్యంలో కరీంనగర్‌ అసెంబ్లీ నియోజకవర్గ పరిధిలో పూర్తయిన డబుల్‌ బెడ్‌రూం ఇళ్లను గురువారం పరిశీలించారు. ప్రభుత్వం చెప్పేది ఒకటి.. చేసేది ఒకటిగా ఉందని అన్నారు. కరీంనగర్‌ అసెంబ్లీ పరిధిలో చింతకుంట, మొగ్దుంపూర్‌, తీగలగుట్టపల్లి, కమాన్‌పూర్‌ గ్రామాల్లో 2019లో పర్యటించిన మంత్రి గంగుల కమలాకర్‌ 660 మొదటి విడత, 340 రెండవ విడతలో ఇళ్లు పంపిణీ చేస్తామన్న మాటలు నీటి మూటలుగా మారాయని ఆరోపించారు. ఇకనైనా పూర్తయిన ఇళ్లను పంపిణీ చేయాలని, అర్హులైన దరఖాస్తులందరికీ ఇళ్ల నిర్మాణం చేపట్టి పంపిణీ చేయాలని లేనట్లయితే ఏఐఎఫ్‌బీ ఆధ్వర్యంలో ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

4న కొత్తగూడెంలో సీపీఐ ప్రజాగర్జన సభ

- పోస్టర్‌ ఆవిష్కరించిన నాయకులు



వాల్‌పోస్టర్‌ ఆవిష్కరిస్తున్న సీపీఐ నాయకులు

కరీంనగర్‌: ఎన్నికలకు ముందు సీఎం కేసీఆర్‌ ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్‌ చేస్తూ జూన్‌ 4న కొత్తగూడెంలో సీపీఐ ఆధ్వర్యం బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు పార్టీ జిల్లా కార్యదర్శి మర్రి వెంకటస్వామి తెలిపారు. గురువారం స్థానిక బద్దం ఎల్లారెడ్డిభవన్‌ వద్ద 'చలో కొత్తగూడెం' పోస్టర్‌ ఆవిష్కరించారు. వెంకటస్వామి మాట్లాడుతూ.. దేశంలో బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్‌ శక్తులకు, పెట్టుబడిదారులకు కొమ్ముకాస్తూ దేశసంపదను కొల్లగొడుతోందని అన్నారు. రాష్ట్రంలో సీఎం కేసీఆర్‌ ఎన్నికలకు ముందు ఇచ్చిన వాగ్దానాలను అమలు చేయాలని డిమాండ్‌ చేశారు. జూన్‌ 4న కొత్తగూడెంలో జరిగే ప్రజాగర్జన భారీ బహిరంగ సభకు ముఖ్య అతిథులుగా సీపీఐ జాతీయ ప్రధాన కార్యదర్శి మాజీ ఎంపీ డీ.రాజా, జాతీయ కార్యదర్శులు డాక్టర్‌ కె.నారాయణ, అజీజ్‌ పాషా, జాతీయ కార్యవర్గ సభ్యుడు చాడవెంకటరెడ్డి తదితరులు హాజరు అవుతారని తెలిపారు. సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కొయ్యడ సృజన్‌కుమార్‌, బోయిని అశోక్‌, కసిరెడ్డి సురేందర్‌రెడ్డి, ఏఐఎస్‌ఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు కసిరెడ్డి మణికంఠరెడ్డి, సీపీఐ జిల్లా కౌన్సిల్‌ సభ్యుడు పిల్లి కొమురయ్య, పైడిపెల్లి రాజు, తదితరులు పాల్గొన్నారు.

యువగళం ఉప్పెనలా దూసుకెళ్లాలి

- బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ.రామకృష్ణారావు



జీవీని సన్మానిస్తున్న నాయకులు

గన్నేరువరం(మానకొండూర్‌): మానకొండూర్‌ నియోజకవర్గం నుంచి ఎమ్మెల్యేగా రసమయి బాలకిషన్‌ హ్యాట్రిక్‌ విజయం కోసం యువగళం ఉప్పెనా ముందుకు సాగాలని బీఆర్‌ఎస్‌ జిల్లా అధ్యక్షుడు జీవీ రామకృష్ణారావు పిలుపునిచ్చారు. గన్నేరువరంలో గురువారం ఆ పార్టీ యువజన విభాగం మానకొండూర్‌ నియోజకవర్గ అధ్యక్షుడు గూడూరి సురేశ్‌ ఆధ్వర్యంలో యువప్రతినిధుల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన జీవీఆర్‌ మాట్లాడుతూ.. రైతులు, పేదలు, దళితులు, మహిళలు, విద్యార్థులతో పాటు గ్రామాభివృద్ధికి ప్రభుత్వం ఎంతో కృషి చేస్తోందన్నారు. వీరి కోసం అమలు చేస్తున్న సంక్షేమపథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లాన్నారు. ప్రతి యువకార్యకర్త పార్టీ గెలుపు కోసం సైనికుడిలా కృషి చేయాలని పిలుపునిచ్చారు. జెడ్పీటీసీలు మాడుగుల రవీందర్‌రెడ్డి, తాళ్లపల్లి శేఖర్‌ గౌడ్‌, పార్టీ మండల అధ్యక్షుడు గంప వెంకన్న, ఆర్‌ఎస్‌ఎస్‌ మండల కోఆర్డినేటర్‌ బద్దం తిరుపతిరెడ్డి, సర్పంచులు సంపత్‌, మల్లయ్య, నాయకులు న్యాత సుధాకర్‌, శ్రీనివాస్‌, కొమురయ్య, ప్రభాకర్‌, వెంకటరమణరెడ్డి పాల్గొన్నారు.

వెల్‌నెస్‌ సెంటర్‌ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



పరీక్షలు చేస్తున్న వైద్యురాలు

కరీంనగర్‌: జిల్లాకేంద్రంలోని వెల్‌నెస్‌ సెంటర్‌లో ఆరోగ్యసేవలు బాగున్నాయని, ఉమ్మడిజిల్లాకు చెందిన ఉద్యోగ, ఉపాధ్యాయ, పెన్షనర్లు సద్వినియోగం చేసుకోవాలని పీఆర్‌టీయూ జిల్లా అధ్యక్షుడు గోనె శ్రీనివాస్‌, ప్రధాన కార్యదర్శి పల్లెపాటి వేణు గోపాల్‌రావు అన్నారు. గురువారం పీఆర్‌టీయూ జిల్లా శాఖ ముఖ్య నాయకులు వెల్‌నెస్‌ సెంటర్‌ను సందర్శించారు. సెంటర్‌ ఇన్‌చార్జి డాక్టర్‌ శరత్‌తో సమావేశమై అందుతున్న ఆరోగ్యసేవలను గురించి అడిగి తెలుసుకున్నారు. డాక్టర్‌ శరత్‌ మాట్లాడుతూ ఆరోగ్య సేవలు పొందాలనుకునేవారు ఎంప్లాయి హెల్త్‌ కార్డును వెంటతీసుకొని రావాలని తెలిపారు. పరీక్షలకు ఉదయం 8:30 వరకు శాంపిల్స్‌ ఇవ్వాలని, వాటితో 50రకాల పరీక్షలు చేస్తామని వివరించారు. పీఆర్‌టీయూ నాయకుడు పులిపాక కిషన్‌, వి.నాగరాజు, శ్రీనివాస్‌ ఉన్నారు.

'కార్పొరేట్‌' ఆగడాలు అరికట్టడంలో విఫలం



మాట్లాడుతున్న మచ్చ రమేశ్‌

కరీంనగర్‌: కార్పొరేట్‌ విద్యాసంస్థల ఆగడాలను అరికట్టడంలో ప్రభుత్వం పూర్తిగా విఫలం చెందిందని ఏఐఎస్‌ఎఫ్‌ జిల్లా కార్యదర్శి మచ్చ రమేశ్‌ అన్నారు. గురువారం సంఘ కార్యాలయంలో మాట్లాడుతూ జిల్లావ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలు, కళాశాలలు సమస్యలకు నిలయంగా మారాయని అన్నారు. యూనివర్సిటీ విద్యార్థులు అనేక సమస్యలతో సతమతమవుతున్నారని ఆరోపించారు. ఖాళీగా ఉన్న టీచింగ్‌, నాన్‌ టీచింగ్‌ పోస్టులు భర్తీ చేయకుండా ప్రభుత్వ యూనివర్సిటీలను రాష్ట్రంలో నిర్వీర్యం చేసే కుట్ర చేస్తోందని అన్నారు. కార్పొరేట్‌ విద్యాసంస్థలు రాష్ట్రంలో పుట్టగొడుగుల్లా పుట్టుకొస్తున్నాయని, ప్రైవేట్‌ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టడంలేదని జిల్లాలో ఉన్నత విద్య కన్నా ఎల్‌కేజీ, యూకేజీ ఫీజులే ఎక్కువగా ఉన్నాయని అన్నారు. విద్యారంగ సమస్యలను పరిష్కరించాలని లేనిపక్షంలో ఏఐఎస్‌ఎఫ్‌ ఆధ్వర్యంలో ఉద్యమాలు చేస్తామని హెచ్చరించారు. నగర కార్యదర్శి మామిడిపల్లి హేమంత్‌, నాయకులు కసిరెడ్డి సందీప్‌రెడ్డి, వినయ్‌, రాహుల్‌, నాని పాల్గొన్నారు.

లా డిగ్రీ కోసం కూతురు.. పీజీ కోసం తండ్రి

- ఒకే సెంటర్‌లో ఒకే రోజు పరీక్ష రాసిన తండ్రీ కూతురు



సతీశ్‌, ఉమామహేశ్వరి

తిమ్మాపూర్‌: లా డిగ్రీ చదివేందుకు కూతురు, పీజీ చదివివేందుకు తండ్రి.. ఇద్దరూ ఒకే రోజు, ఒకే సెంటర్‌లో ప్రవేశ పరీక్ష రాసిన అరుదైన ఘటన మండలంలోని వాగేశ్వరి ఇంజినీరింగ్‌ కళాశాలలో గురువారం జరిగింది. పెద్దపల్లి జిల్లా మంథనికి చెందిన ఇనుముల సతీశ్‌ న్యాయశాస్త్రం డిగ్రీ పూర్తిచేశాడు. ఆయనకు న్యాయశాస్త్రంపై ఉన్న మక్కువతో కూతురు ఉమామహేశ్వరిని కూడా లా చదివించాలనుకున్నాడు. తను కూడా లా పీజీ చేయాలని నిర్ణయించుకున్నాడు. సతీశ్‌ పీజీ కోసం, ఉమా మహేశ్వరి డిగ్రీ కోసం దరఖాస్తు చేసుకున్నారు. ఇద్దరి ప్రవేశ పరీక్ష తేదీ ఒకేరోజు(మే 25న) వచ్చింది. ఇక ఆశ్చర్యకరంగా ఇద్దరి పరీక్ష కేంద్రం కూడా ఒకేచోట పడింది. తిమ్మాపూర్‌ మండలం రామకృష్ణకాలనీ పంచాయతీ పరిధిలోని వాగేశ్వరి ఇంజినీరింగ్‌ కళాశాలలో గురువారం నిర్వహించిన పరీక్షకు ఇద్దరూ హాజరయ్యారు. ఒకే రోజు, ఒకే చోట ఇద్దరం పరీక్ష రాయడం సంతోషంగా ఉందని తండ్రీ కూతురు తెలిపారు.

తండ్రి బాటలో తనయ

- కరీంనగర్‌ విద్యార్థిని స్ఫూర్తికి అగ్రికల్చర్‌లో 43వ ర్యాంక్‌



సప్తగిరికాలనీ(కరీంనగర్‌): కరీంనగర్‌ రాంనగర్‌కు చెందిన ఎస్‌.స్ఫూర్తి ఎంసెట్‌ ఫలితాల్లో అగ్రికల్చర్‌ అండ్‌ మెడికల్‌ విభాగంలో స్టేట్‌లెవల్‌ 43వ ర్యాంకు సాధించింది. స్వతహాగా డాక్టర్‌ కావాలన్న ఆశయం పెట్టుకొన్న స్ఫూర్తి కష్టపడి చదివింది. నాన్న శ్రీధర్‌ నగర పాలకసంస్థలో వెటర్నరీ డాక్టర్‌. అమ్మ స్మైలాబ్‌ రాణి గృహిణి. తండ్రి బాటలోనే తనూ నడవాలనే లక్ష్యంతో డాక్టర్‌ వృత్తిని చేపట్టాలనుకుంది. హైదరాబాద్‌లోని శ్రీ చైతన్య పాఠశాలలో పదోతరగతి చదివి 10 జీపీఏ సాధించింది. ఇంటర్‌ బైపీసీలో ఫస్ట్‌ ఇయర్‌లో 434మార్కులు, సెకండియర్‌లో 987మార్కులు సాధించింది. ఎంసెట్‌లో 146.34 మార్కులో స్టేట్‌ 43వ ర్యాంకు సంపాదించింది. తాను కార్డియాలజిస్ట్‌ కావాలనేది ఆశయమని తెలిపింది.

ఎంసెట్‌ ఫలితాల్లో విద్యామందిర్‌ ప్రతిభ

కరీంనగర్‌: ఎంసెట్‌ ఫలితాలలో విద్యామందిర్‌ విద్యార్థులు అద్భుతమైన ఫలితాలు సాధించారు. విద్యామందిర్‌ క్లాస్సెస్‌ కరీంనగర్‌ బ్రాంచ్‌ విద్యార్థులు జి.శివసాయి 1562వ ర్యాంక్‌, ఎస్‌.సాత్విక 1738, ఏ.మిథిల్‌ 4112, బి.వర్షిణి 4682, పి.సుమనశ్రీ 4957, పి.వివేక్‌ వర్ధన్‌ 5051వ ర్యాంక్‌ సాధించారు. 10,000లోపు 25శాతం మంది విద్యార్థులు, 20,000లోపు 55 శాతం మంది విద్యార్థులు ర్యాంకులు సాధించారు. అమృత యూనివర్సిటీ(ఏఐఈఈఈ) ఫలితాలలో విద్యామందిర్‌ క్లాస్సెస్‌ బ్రాంచ్‌ విద్యార్థులు ప్రతిభచాటారు. వీరిని అకాడమిక్‌ డైరెక్టర్‌ జిల్లా రమేష్‌, అధ్యాపకులు అభినందించారు.

వరుడిని చితకబాది వధువును తీసుకెళ్లిన బంధువులు

- పోలీసులకు ఫిర్యాదు చేసిన వరుడు

హుజూరాబాద్‌: ప్రేమించి కులాంతర వివాహం చేసుకున్న వరుడిని చితకబాది వధువును బంధువులు తీసుకెళ్లిన సంఘటన బుధవారం అర్ధరాత్రి హుజూరాబాద్‌లో చోటుచేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... హనుమకొండ జిల్లా మడికొండ గ్రామానికి చెందిన కలయన్‌ మంగయ్య రవికుమార్‌ అదే గ్రామానికి చెందిన యువతి ఐదేళ్లుగా ప్రేమించుకున్నారు. బుధవారం భీమదేవరపల్లి మండలం కొత్తకొండలోని శ్రీ వీరభద్రస్వామి ఆలయంలో వివాహం చేసుకున్నారు. వధువు తరపు బంధువులు సమాచారం తెలుసుకుని అడ్డుకునేందుకు వచ్చారు. హుజూరాబాద్‌వైపువచ్చి అంబేద్కర్‌చౌరస్తాలో కారులో వెళ్తున్న క్రమంలో వధువు తరపు బంధువులు సుమారు 15మంది యువకుడిని చితకబాది, యువతిని తీసుకెళ్లారు. రవికుమార్‌కు తీవ్రగాయాలు కావడంతో ఎంజీఎంలో చికిత్స పొంది గురువారం సాయంత్రం హుజూరాబాద్‌ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు సీఐ బొల్లం రమేశ్‌ తెలిపారు.

డీసీఎం ఢీకొని ధాన్యం ట్రాక్టర్‌ బోల్తా



తిమ్మాపూర్‌: మండలం ఇందిరానగర్‌– నుస్తులాపూర్‌ రాజీవ్‌ రహదారిపై నుస్తులాపూర్‌ నుంచి కరీంనగర్‌ వైపు ధాన్యంలోడుతో వెళ్తున్న ట్రాక్టర్‌ను డీసీఎం ఢీకొనడంతో ట్రాక్టర్‌ బోల్తాపడి ధాన్యం బస్తాలు రోడ్డుపై పడ్డాయి. డీసీఎం డ్రైవర్‌ మద్యంమత్తులో వాహనం నడిపినట్లు స్థానికులు తెలిపారు. స్థానికులు పోలీసులకు సమాచారం అందించడంతో అక్కడకి చేరుకొని ట్రాఫిక్‌ క్లియర్‌ చేశారు. ప్రమాదవశాత్తు ఎవరికి గాయాలు కాలేదు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

కరీంనగర్‌లో శిక్షణ కానిస్టేబుల్‌ మృతి



రనుసింగ్‌ (ఫైల్‌)

కరీంనగర్‌క్రైం: కరీంనగర్‌ పోలీసు శిక్షణ కళాశాలలో హెడ్‌కానిస్టేబుల్‌ పదోన్నతి శిక్షణ పొందుతున్న ఓ కానిస్టేబుల్‌ గుండెపోటుతో గురువారం మృతి చెందారు. హైదరాబాద్‌ కమిషనరేట్‌లో కానిస్టేబల్‌గా పనిచేస్తున్న రనుసింగ్‌(43) హెడ్‌ కానిస్టేబుల్‌ ప్రమోషన్‌ కోసం తీసుకుంటున్న శిక్షణలో భాగంగా ఈనెల 22న కరీంనగర్‌ పీటీసీకి వచ్చాడు. బుధవారం రాత్రి అస్వస్థతకు గురికావడంతో ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పరిస్థితి విషమంగా మారడంతో ప్రయివేటు ఆస్పత్రికి తీసుకెళ్లారు. చికిత్స పొందుతూ గురువారం గుండెపోటుతో మృతిచెందినట్లు తెలిసింది. ఈ విషయాన్ని పీటీసీ పోలీసులు అధికారికంగా ప్రకటించలేదు.

ఎంసెట్‌లో సత్తాచాటిన 'అల్ఫోర్స్‌'



విద్యార్థులను అభినందిస్తున్న నరేందర్‌రెడ్డి

కొత్తపల్లి(కరీంనగర్‌): ఎంసెట్‌–2023 ఇంజినీరింగ్‌, అగ్రికల్చర్‌ ఫలితాల్లో అల్ఫోర్స్‌ విద్యాసంస్థల విద్యార్థులు ఉత్తమర్యాంకులు సొంతం చేసుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను కరీంనగర్‌లోని అల్ఫోర్స్‌ కేంద్ర కార్యాలయంలో గురువారం విద్యాసంస్థల చైర్మన్‌ డాక్టర్‌ వి.నరేందర్‌రెడ్డి సన్మానించి ర్యాంకుల వివరాలు వెల్లడించారు. ఎం.అభిరామ్‌ 301వ ర్యాంకు సాధించి అత్యున్నత స్థానంలో నిలిచాడు. ఎ.ఇషాంత్‌రెడ్డి 322, బి.శ్రీగోధ 356, జి.జ్యోతి 374, టి.దీపిక 446, ఎం.చిన్మయ్‌ 542, బి.శ్రీనివాస్‌ 650, ఎస్‌.సాయిసధిష్ట 681, కె.ప్రణీతరెడ్డి 752, హస్వితరెడ్డి 818, బి.విద్యాలక్ష్మి 821, ఎస్‌.ధీరజ్‌కుమార్‌ 833, ఎస్‌.మనస్విని 865, ఆర్‌.సుహాసిత 893వ ర్యాంకు సాధించారు. అలాగే వెయ్యిలోపు 14 మంది, రెండువేల లోపు 40, మూడువేల లోపు 63, ఐదువేల లోపు 118 మంది ర్యాంకులు సాధించినట్లు వివరించారు. ఇటీవల ప్రకటించిన ఐఐటీ(మెయిన్‌) ఫలితాల్లో విద్యార్థులు సత్తాచాటి 450 మంది ఐఐటీ (అడ్వాన్స్‌)కి అర్హత సాధించారని గుర్తు చేశారు. రాబోయే నీట్‌ ఫలితాల్లో కూడా ఉత్తమ ర్యాంకులతో ముందంజలో ఉంటామని ధీమా వ్యక్తం చేశారు.

'శ్రీచైతన్య' విద్యార్థుల ప్రభంజనం



విద్యార్థులను అభినందిస్తున్న యాజమాన్యం

కరీంనగర్‌: ఎంసెట్‌–2023 ఫలితాల్లో శ్రీ చైతన్య విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి అత్యుత్తమ ర్యాంకులు సాధించారు. యు.మోహన్‌సాయి 256వ ర్యాంకు, ఎ.కీర్తన 896, కె.డింపుల్‌ జస్టినా 1,092, మధుకర్‌ 1,109, ఎస్‌.శ్రీనివాస్‌ 1,903, బి.సాయి వినీత్‌ 2,078, ఐ.రమణి 2,770, డి.వంశీకృష్ణ 2,943, డి.కార్తీక్‌ 2,958వ ర్యాంకులు సాధించారు. 5వేల లోపు 12 మంది, 28 మంది విద్యార్థులు రాష్ట్రస్థాయి ర్యాంకులు సాధించారు. ఈసందర్భంగా రాష్ట్రస్థాయిలో అత్యున్నత ర్యాంకులు సాధించిన శ్రీ చైతన్య విద్యార్థులను వారి తల్లిదండ్రులను చైర్మన్‌ ముద్దసాని రమేశ్‌రెడ్డి, డైరెక్టర్‌ కర్ర నరేందర్‌రెడ్డి, డీన్‌ జగన్‌మోహన్‌రెడ్డి, జూనియర్‌ కళాశాలల ప్రిన్సిపాల్స్‌ మల్లారెడ్డి, తిరుపతిరెడ్డి, శ్రీనివాస్‌, రాధాక్రిష్ణ, ఏజీఎం శ్రీనివాస్‌, అధ్యాపకులు అభినందించారు.

ట్రినిటీ విజయదుందుభి

కరీంనగర్‌: ఎంసెట్‌ ఫలితాల్లో పెద్దపల్లి, కరీంనగర్‌ ట్రినిటీ కళాశాలల విద్యార్థులు సత్తాచాటారు. ఎంపీసీ విభాగంలో ఎం.రాజారెడ్డి రాష్ట్రస్థాయిలో 186ర్యాంకు, టి.అభినయ 848, ఎస్‌.సుహాస్‌రెడ్డి 1128, పి.శ్రీథాన్‌శాష్‌ 2007, బైపీసీ విభాగంలో వి.మధుకర్‌ 1109, డి.సాయిలక్ష్మి మానస 1969, బి.ప్రణయ్‌ 1976, షఫీ నాఫీస్‌ 2321, ఎస్‌.ఫాతీమా 2464, కె.లిఖిత 2479, బి.దీపక్‌ 2531, ఎం.రేఖ 2698, వి.అర్పిత 2783 ర్యాంకులు సాధించారు. బి.సిరి 3126 ర్యాంకు, జి.హన్విత 3496, వి.శ్రీజ 3514, ఎం.డీ అబ్దుల్‌ ముజీబ్‌ 3675, శ్రీకిరణ్‌ 3752, పి.అరవింద్‌ కుమార్‌ 3875,ఎం.చంద్రశేఖర్‌ 4176, బి.సంధ్యావాణీ 4190, ఎం.నిత్య 4348,జి.షారోన్‌ 4358, ఆర్‌.అలేఖ్య 4519, కె.త్రిష 4529, డి.దిలీప్‌ కుమార్‌ 4558, అయేషా మహాజాభీన్‌ 4759, వై.అశలేష్‌ 4896, బి.దీపకళ 4957, ఆర్‌.కావ్య 4985 ర్యాంకులు సాధించారు. రాబోయేకాలంలో మరిన్ని మంచి ఫలితాలను సాధిస్తామని ఫౌండర్‌ చైర్మన్‌ దాసరి మనోహర్‌ రెడ్డి, కళాశాలల చైర్మన్‌ దాసరి ప్రశాంత్‌రెడ్డి తెలిపారు.

క్లుప్తంగా

జీపీ భవన నిర్మాణానికి భూమిపూజ


భూమిపూజ చేస్తున్న ఎంపీపీ లక్ష్మయ్య

కరీంనగర్‌రూరల్: మండలంలోని దుబ్బపల్లి జీపీ నూతన భవన నిర్మాణానికి గురువారం ఎంపీపీ తిప్పర్తి లక్ష్మయ్య భూమిపూజ చేసి పనులు ప్రారంభించారు. ఉపాధిహామీ పథకం నిధులు రూ. 20లక్షలతో భవనాన్ని నిర్మించనున్నారు. కార్యక్రమంలో సర్పంచ్ సిరిగిరి దుర్గ, పంచాయతీ కార్యదర్శి సరిత, నాయకులు గాదే శ్రీనివాస్‌రెడ్డి, పబ్బతి రంగారెడ్డి, కల్లెం రాంరెడ్డి, చంద్రారెడ్డి పాల్గొన్నారు.

అపోలో ఫార్మసీలో ఉద్యోగాలు

కరీంనగర్ అర్బన్: జిల్లాలోని గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ యువతీ, యువకులకు అపోలో ఫార్మసీ రిటైల్ హైదరాబాద్‌లో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తున్నట్లు జిల్లా గ్రామీణాభివృద్ధిశాఖ అధికారి ఎల్.శ్రీలత తెలిపారు. ఫార్మసీ అసిస్టెంట్, ఫార్మసిస్టు ఉద్యోగాలుండగా ఫార్మసీ అసిస్టెంట్‌కు 10వ తరగతి లేదా ఆపైన విద్యార్హత గలవారు, ఫార్మసిస్టు బీఫార్మసీ డీఫార్మసీ, ఎంఫార్మసీవిద్యార్హత గలవారు అర్హులన్నారు. 150 ఖాళీలుండగా 19నుంచి 35 ఏళ్లలోపు వయస్సు గలవారు ఈనెల 27న ఉదయం 10 గంటలకు కరీంనగర్‌లోని అంబేడ్కర్ స్టేడియం పక్కన స్వశక్తి కళాశాలలోని ఈజీఎంఎం కార్యాలయంలో నిర్వహించే ఇంటర్వ్యూలకు హాజరు కావాలని కోరారు. బయోడెటా, ఆధార్‌కార్డు, విద్యార్హతల జిరాక్స్‌లతో రావాలని సూచించారు.

బస్‌స్టేషన్‌లో దుకాణాల తనిఖీ


తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

విద్యానగర్: కరీంనగర్ ఆర్టీసీ బస్‌స్టేషన్‌లోని దుకాణాలను గురువారం ఆర్టీసీవిజిలెన్స్ ఎస్సై జె. శ్రీనివాస్ రెడ్డి తనిఖీచేశారు. ఎమ్మార్పీకంటే ఎక్కువ ధరకు తినుబండారాలు అమ్ముతున్న దుకాణదారులకు జరిమానా విధించారు. స్టేషన్ మేనేజర్ అంజయ్య, హెడ్ కానిస్టేబుల్ బలరాంరెడ్డి, కంట్రోలర్ రామకృష్ణ పాల్గొన్నారు.

టీఎన్జీవో నేతలకు అభినందన


సన్మానిస్తున్న బధిర సంఘం నేతలు

కరీంనగర్‌అర్బన్: టీఎన్జీవోల సంఘం జిల్లా అధ్యక్షుడిగా ఎన్నికైన దారం శ్రీనివాస్‌రెడ్డి, ప్రధానకార్యదర్శి సంగెం లక్ష్మణ్‌రావును బధిర ఉద్యోగుల సంఘం జిల్లా నేతలు గురువారం సన్మానించారు. బద్దం లక్ష్మారెడ్డి, సహాధ్యక్షుడు శ్రీమాన్‌రావు, ఉపాధ్యక్షుడు నిజాం సంతోష్‌కుమార్, ఆర్గనైజింగ్ సెక్రెటరీ అవాని కుమార్, జాయింట్ సెక్రెటరీ రాకేశ్, ఆసిఫ్ అలీ తదితరులు పాల్గొన్నారు.

ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వ ప్రోత్సాహం


బద్దిపల్లిలో మాట్లాడుతున్న ఎంపీపీ శ్రీలత

కొత్తపల్లి: ఆయిల్‌పామ్ సాగుకు ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహకాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీపీ పిల్లి శ్రీలత కోరారు. వ్యవసాయశాఖ ఆధ్వర్యంలో కొత్తపల్లి మండలం బద్దిపల్లి రైతువేదికలో గురువారం ఆయిల్‌పామ్ సాగుపై రైతులకు అవగాహన సదస్సునిర్వహించి మాట్లాడారు. ఆయిల్‌పామ్ సాగుకు రాష్ట్ర ప్రభుత్వం 90శాతం రాయితీపై మొక్కలు, డ్రిప్ అందిస్తోందన్నారు. రైతులు ప్రత్యామ్నాయ పంటలపై దృష్టిసారించాలన్నారు. కార్యక్రమంలో ఏవో రంజిత్, ఉద్యానవన అధికారి మౌనిక, ఏఈవో లలితా, రైతు కో ఆర్డినేటర్ ఉప్పు తిరుపతి, ఆయిల్ పామ్ కంపెనీ ప్రతినిధి శ్రావణ్, రైతులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీ

హుజూరాబాద్‌రూరల్: మండలంలోని పోతిరెడ్డిపేటలో గురువారం లబ్ధిదారులకు ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్ రెడ్డి సీఎంఆర్‌ఎఫ్ చెక్కులు పంపిణీచేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ... సీఎం సహాయనిధి ద్వారా ఎంతో మంది నిరుపేదలకు రాష్ట్ర ప్రభుత్వం ఆర్థికంగా అండగా నిలిచిందని స్పష్టం చేశారు. ఎస్సీ కార్పొరేషన్ చైర్మన్ బండ శ్రీనివాస్, సర్పంచ్ తాటికొండ పుల్లాచారి ఉన్నారు.

తుది దశకు ధాన్యం కొనుగోళ్లు

- కరీంనగర్ నియోజకవర్గంలో 26 కేంద్రాలు ఏర్పాటు
- నెలరోజుల్లో 1.81లక్షల క్వింటాళ్ల కొనుగోలు
- వారం రోజుల్లో కొనుగోళ్లు పూర్తి


మొగ్ధుంపూర్‌లో తూకం వేస్తున్న ధాన్యం

కరీంనగర్‌రూరల్: యాసంగి సీజన్ ధాన్యం కొనుగోళ్లు చివరిదశకు చేరుకుంటున్నాయి. అకాల వర్షాలు, వడగళ్ల వాన, తడిసిన ధాన్యం, రైసు మిల్లర్ల కొర్రీలు తదితర సమస్యల నడుమ నెల రోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు జరుగుతున్నాయి. కరీంనగర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు చేసేందుకు మొత్తం 26 కేంద్రాలను ఏర్పాటు చేశారు. ఐకేపీ–4, కరీంనగర్ సింగిల్‌విండో –10, దుర్శేడ్ సింగిల్‌విండో–6, డీసీఎంఎస్–6 కేంద్రాల ద్వారా ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. ప్రస్తుతం ఏడు గ్రామాల్లో ధాన్యం కొనుగోళ్లు పూర్తికావడంతో కేంద్రాలను మూసివేయగా మరో వారం రోజుల్లో మిగితా గ్రామాల్లో కొనుగోళ్లు పూర్తిచేసేందుకు చర్యలు చేపట్టారు.

అకాల వర్షాలతో తీరని నష్టం

కరీంనగర్ నియోజకవర్గంలో ధాన్యం కొనుగోలు కేంద్రాలను గతనెల 16నుంచి ప్రారంభించారు. రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్ చెర్లభూత్కూర్, మొగ్దుంపూర్ గ్రామాల్లోని కేంద్రాలను లాంఛనంగా ప్రారంభించిన అనంతరం ధాన్యం కొనుగోళ్లు చేపట్టారు. అయితే అనంతరం కురిసిన అకాల వర్షాలకు కరీంనగర్ మండలంలోని పలు గ్రామాల్లోని వరిపంట నేలకొరిగింది. వడగళ్ల వానకు వరిగింజలన్నీ నేలరాలిపోగా ఉత్త గడ్డి మాత్రమే మిగిలడంతో రైతులు తీవ్రంగా నష్టపోయారు. అకాల వర్షాలకు కేంద్రాల్లోని ధాన్యం తడిసిపోవడంతో రైతులు ఆరబెట్టేందుకు పడరాని పాట్లు పడ్డారు. తడిసిన ధాన్యం, వడగళ్ల వానకు దెబ్బతిన్న ధాన్యాన్ని కొనుగోలు చేసేందుకు రైసుమిల్లర్లు నిరాకరించడంతో చివరకు క్వింటాల్‌కు ఐదారు కిలోలను అదనంగా ఇవ్వాల్సిన పరిస్థితి రైతులకు ఏర్పడింది. అకాల వర్షాలతో ధాన్యం కొనుగోళ్లు మందకొడిగా సాగాయి.

1.81లక్షల క్వింటాళ్లు కొనుగోలు

యాసంగిలో ఉమ్మడి కరీంనగర్ మండలంలో 20వేల ఎకరాల్లో వరిపంటను సాగు చేయగా సుమారు 3లక్షల క్వింటాళ్ల ధాన్యం దిగుబడి వస్తుందని వ్యవసాయాధికారులు అంచనా వేశారు. అయితే అకాల వర్షాలతో దిగుబడి సగానికిపైగా తగ్గిపోయినట్లు ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తే తెలుస్తోంది. నెలరోజుల నుంచి ధాన్యం కొనుగోళ్లు సాగుతున్నప్పటికీ అనుకున్నంత వేగంగా కొనుగోళ్లు పూర్తికావడం లేదు. ఇప్పటివరకు 1,81,677 క్వింటాళ్లను మాత్రమే కొనుగోలు చేశారు. మరో వారం రోజుల్లో కొనుగోళ్ల ప్రక్రియను పూర్తిచేసి కేంద్రాలను మూసివేసేందుకు అధికారులు అవసరమైన చర్యలు చేపట్టారు.

కేంద్రాల వారీగా ధాన్యం కొనుగోళ్లు(క్వింటాళ్లలో..)

బహదూర్‌ఖాన్‌పేట	2,178.40	ఎలగందల్	8,594.40
చామనపల్లి	5,846.80	జూబ్లీనగర్	5,340
ఎలబోతారం	6,830	కమాన్‌పూర్	7,245.60
బావుపేట	5,631.60	నాగులమల్యాల	9,898.80
చేగుర్తి	6576.80	నగునూరు	8,280.80
దుర్శేడ్	3775.60	తీగలగుట్టపల్లి	1,576
గోపాల్‌పూర్	8992.40	వ్యవసాయమార్కెట్	9,481.20
ఇరుకుల్ల	8500.40	చింతకుంట	4,622.40
మొగ్దుంపూర్	14,099	బద్దిపల్లి	10,380
నల్లగుంటపల్లి	1,620	మల్కాపూర్	7,410
బొమ్మకల్	5,133.60	ఖాజీపూర్	12,540
చెర్లభూత్కూర్	14,363.60	రాజీపూర్	4,460
దుబ్బపల్లి	4,073.20	కొత్తపల్లి	4,227.20

నగర అభివృద్ధే మా ఏజెండా

- బోయినపల్లి, మంత్రి గంగుల హయాంలోనే అభివృద్ధి
- తొమ్మిదేళ్లల్లో గణనీయమైన అభివృద్ధి
- నగర మేయర్ వై.సునీల్‌రావు


మాట్లాడుతున్న నగర మేయర్ వై.సునీల్‌రావు

కరీంనగర్: అభివృద్ధే మా ఏజెండా అని, బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కరీంనగర్ పట్టణాన్ని వేల కోట్లతో రూపురేఖలు మార్చామని, సీఎం కేసీఆర్, ప్రణాళిక సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు బోయిన్‌పల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్ అండదండలతో అభివృద్ధి చేస్తుంటే గోబెల్స్ ఆరోపణలు చేయడం తగదని మేయర్ వై.సునీల్ రావు అన్నారు. గురువారం ఎస్‌బీఎస్ ఫంక్షన్ హాల్ సమావేశంలో ఆయన పాల్గొని మాట్లాడారు. అభివృద్ధి మాటున వందల కోట్ల అవినీతి జరుగుతుందని మాజీ ఆర్టీసీ చైర్మన్ గోనే ప్రకాశ్‌రావు విమర్శించడం విచారకరమన్నారు. తనతో పాటు బోయినపల్లి వినోద్‌కుమార్, మంత్రి గంగుల కమలాకర్‌పై ఆరోపణలు చేయడం వారి అవివేకానికి నిదర్శనమన్నారు. కరీంనగర్ సుందరీకరణలో భాగంగా స్మార్ట్ సిటి పనులు, తీగల వంతెన, మానేరు రివర్ ఫ్రంట్ పనులు, ఐటీ టవర్ ఏర్పాటుకు మంత్రి గంగుల కమలాకర్ ఎంతో కృషిచేశారని సీఎం కేసీఆర్ నుంచి ప్రత్యేకంగా నిధులు కేటాయింపులు చేయిస్తూ పట్టణాన్ని అభివృద్ధిలో ముందుంచారన్నారు. బోయినపల్లి సహకారంతో స్మార్ట్‌సిటీగా కరీంనగర్‌ను ప్రకటింపజేయడం, కేంద్రం, రాష్ట్రం సమాన వాటా నిధులు కేటాయింపులు చేస్తూ శరవేగంగా నగరం అభివృద్ధి చెందుతుంటే అనవసరపు విమర్శలతో గోబెల్స్ ప్రచారం చేయడం దిగజారుడు రాజకీయాలకు నిదర్శనమన్నారు. నగరంలో వివిధ గ్రామాల నిధులతో పాటు స్మార్ట్ సిటీ ప్రాజెక్టు నిధులతో నగరాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసేందుకు ముందుకువెళ్తున్నామన్నారు. నగరాన్ని పూర్తిస్థాయిలో అభివృద్ధి చేసేందుకు మరో నూట ముప్పై కోట్ల రూపాయల నిధులతో విలీన గ్రామాలతో సహా నగరవ్యాప్తంగా నిధులను కేటాయించి పెండింగ్ లో ఉన్న అన్ని అభివృద్ధి పనులు మూడు మాసాల్లో పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఈ సందర్భంగా సీఎం కేసీఆర్‌కు కృతజ్ఞతలు తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ పార్టీ నగర అధ్యక్షుడు చల్ల హరిశంకర్, కార్పొరేటర్లు ,నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

పోస్టల్ సేవలు వినియోగించుకోవాలి


చెక్కు అందిస్తున్న మున్సిపల్ చైర్‌పర్సన్ నీరజ

చొప్పదండి: ఆపదలో ఆదుకునే పోస్టల్ సేవలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని మున్సిపల్ చైర్‌పర్సన్ గుర్రం నీరజ, ఎంపీపీ చిలుక రవీందర్ కోరారు. పట్టణానికి చెందిన అనుమండ్ల రాజశేఖర్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందగా రూ. పదిలక్షల పోస్టల్ బీమా మంజూరైంది. గురువారం చొప్పదండిలో పోస్టల్ అధికారులు సమావేశం ఏర్పాటు చేసి రూ.10 లక్షల చెక్కును మృతుడి కుటుంబ సభ్యులకు అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఈనెల 31 వరకు పోస్టల్ బీమా ప్రత్యేక శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారని, ప్రజలు సద్వినియోగం చేసుకోవాలన్నారు. ప్రతి వ్యక్తి పోస్టల్ బీమా కలిగి ఉంటే ఆపదలో కుటుంబాన్ని ఆదుకుంటుందని తెలిపారు. కార్యక్రమంలో ఐపీబీపీ చీఫ్ మేనేజర్ భాస్కర్ నాయక్, పోస్టల్ ఇన్‌స్పెక్టర్ చంద్ర మోహన్, బ్రాంచ్ మేనేజర్ శ్రీనివాస్, అంజయ్య, మల్లేశం, శేఖర్, పాల్గొన్నారు.



ముగిసిన ఆలయ వార్షికోత్సవం

జమ్మికుంట: మున్సిపల్ పరిధి ధర్మారంలో శ్రీరేణుక ఎల్లమ్మతల్లి ఆలయ వార్షికోత్సవాలు గురువారంతో ముగిశాయి. ఉత్సవాల్లో భాగంగా బుధవారం రాత్రి గౌడశెట్టి, పంబాల పూజారుల ఆధ్వర్యంలో మహిళలు నెత్తిన బోనంతో డప్పు చప్పుళ్ల మధ్య ఊరేగింపుగా ఆలయానికి తరలివెళ్లి రేణుక ఎల్లమ్మ తల్లికి మొక్కులు, నైవేద్యం సమర్పించారు. అనంతరం సురమాంబదేవి, కంఠమహేశ్వరస్వామి కల్యాణం, రేణుక ఎల్లమ్మతల్లి, జమదగ్ని కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. గౌడకులస్తులు, మహిళలు, భక్తులు భక్తిశ్రద్ధలతో అమ్మవారికి మొక్కు లు చెల్లించారు. కార్యక్రమంలో కౌన్సిలర్ బొంగోని వీరన్న, కల్లుగీత పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు ఆనందంగౌడ్, ఉపాధ్యక్షుడు అయోధ్యగౌడ్, కమిటీ సభ్యులు శ్రీనివాస్‌గౌడ్, తిరుపతిగౌడ్, వెంకటరమణగౌడ్, పైడిపల్లి పెద్ద బీమయ్యగౌడ్, మండల ఎల్లయ్యగౌడ్, బుర్ర సంపత్‌గౌడ్, గౌడ శెట్టి పూజారి తిరుపతి, భక్తులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

సమాచారం

నేడు హజ్ యాత్రికులకు వ్యాక్సినేషన్

విద్యానగర్: హజ్‌కు వెళ్లే యాత్రికులకు శుక్రవారం కరీంనగర్ బొమ్మకల్ రోడ్ కృష్ణానగర్‌లోని కల్యాణి గార్డెన్‌లో వ్యాక్సినేషన్ కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు రాష్ట్ర హజ్ కమిటీ సభ్యులు సయ్యద్ ఇర్ఫాన్ ఉల్‌హఖ్ తెలిపారు. ఉదయం 10గంటలకు ప్రారంభమయ్యే వ్యాక్సినేషన్ కార్యక్రమంలో రాష్ట్ర బీసీ సంక్షేమ, పౌరసరఫరాల శాఖ మంత్రి గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్, కరీంనగర్ జిల్లా కలెక్టర్ కర్ణన్ పాల్గొంటారని ఆయన తెలిపారు.

నేడు బీజేపీ మండల కార్యవర్గ సమావేశం

కరీంనగర్‌రూరల్: మండల బీజేపీ కార్యవర్గ సమావేశం శుక్రవారం జూబ్లీనగర్‌లోని శ్రీరామ ఫంక్షన్ హాల్‌లో నిర్వహిస్తున్నట్లు పార్టీ ప్రధానకార్యదర్శి గాండ్ల గోపాల్ తెలిపారు. రాష్ట్ర,జిల్లా, మండల బాధ్యులు, ప్రజాప్రతినిధులు, కార్యవర్గసభ్యులు సకాలంలో పాల్గొని సమావేశాన్ని విజయవంతం చేయాలని కోరారు.

27న మండల పరిషత్ సమావేశం

కరీంనగర్‌రూరల్: మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఈనెల 27న ఏర్పాటు చేసినట్లు ఎంపీడీవో సీహెచ్.జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. ఎంపీపీ లక్ష్మయ్య అధ్యక్షతన ఉదయం 11గంటలకు నిర్వహించే సమావేశానికి సభ్యులు, అధికారులు సకాలంలో హాజరు కావాలని కోరారు.


అక్రమ నిర్మాణాలపై కఠిన చర్యలు

- మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక


మాట్లాడుతున్న మున్సిపల్ చైర్‌పర్సన్ రాధిక

హుజూరాబాద్: హుజూరాబాద్ మున్సిపల్ పరిధిలో అక్రమంగా నిర్మిస్తున్న భవన నిర్మాణాలు, అక్రమ లేఅవుట్లపై డీటీఎఫ్ కమిటీ తీసుకునే చర్యలపై తహసీల్దార్ కోమాల్‌రెడ్డి, టౌన్ సీఐ బొల్లం రమేశ్, కౌన్సిల్ సభ్యులతో చర్చించామని, వారిపై కఠిన చర్యలు తీసుకునేందుకు నిర్ణయించామని మున్సిపల్ చైర్‌పర్సన్ గందె రాధిక తెలిపారు. గురువారం పురపాలక సంఘంలోని కౌన్సిల్ సమావేశ మందిరంలో సాధారణ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా హుజూరాబాద్ పురపాలక సంఘం పరిధిలోని వివిధ రద్దీ ఏరియాలు, ముఖ్యమైన కూడళ్లలో రూ. 10 లక్షలతో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసేందుకు తీర్మానం చేశామన్నారు. ప్రభుత్వ ఆదేశాల ప్రకారం జూన్ 2 నుంచి 22 వరకు రాష్ట్ర ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలను ఘనంగా నిర్వహించేందుకు పురపాలక సంఘం అవసరమైన ఏర్పాట్లు చేసేందుకు తీర్మానించామన్నారు. వైస్ చైర్‌పర్సన్ కొలిపాక నిర్మల, కమిషనర్ సల్వాది సమ్మయ్య, మున్సిపల్ ఇంజినీర్ సాంబరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

హుజూరాబాద్‌లో రాస్తారోకో



హుజూరాబాద్: భారత రాజ్యాంగ గ్రంథాలను దేశంలోని పౌరులందరికీ ఉచితంగా అందించాలని డిమాండ్ చేస్తూ గురువారం డీఎస్పీ(ధర్మ సమాజ్ పార్టీ) ఆధ్వర్యంలో అంబేడ్కర్ చౌరస్తా వద్ద రాస్తారోకో నిర్వహించారు. నాలుగువందల మండలాల్లోని తహసీల్దార్లకు ఈ నెల 8న వినతిప్రత్రాలు ఇచ్చామని తెలిపారు. అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేశారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు శ్రీకాంత్, జిల్లా ప్రచార కమిటీ నాయకులు రాకేశ్, అశోక్, రాకేశ్, రవికిరణ్, శ్రీనివాస్, మండల ప్రచార కమిటీ సభ్యులు రాజు, వెంకటేశ్, శ్రీనివాస్, అజిత్ తదితరులు పాల్గొన్నారు.

దళిత ఉపకులాలకు ప్రాధాన్యమివ్వాలి


ప్రెస్‌మీట్‌లో మాట్లాడుతున్న రాజారాం

విద్యానగర్: రెండో విడత దళితబంధు పథకంలో ఎస్సీ 57 ఉపకులాలకు ప్రాధాన్యతనివ్వాలని ఎస్సీ 57 ఉపకులాల హక్కుల పోరాట సమితి అధ్యక్షుడు బాణాల రాజారామ్ డిమాండ్ చేశారు. గురువారం కరీంనగర్ ప్రెస్‌భవన్‌లో సమావేశం నిర్వహించి మాట్లాడారు. హుజూరాబాద్‌లో అమలుచేసిన దళితబంధు పథకంలో ఎస్సీ ఉపకులాలకు తగిన ప్రాధాన్యత ఇవ్వాలేదని, రెండో విడతలో ప్రాధాన్యత ఇవ్వాలన్నారు. డబుల్‌బెడ్రూం, మూడెకరాల భూమి పథకాల్లో ఎస్సీ ఉపకులాలకు అవకాశం కల్పించాలన్నారు. సమావేశంలో నాయకులు మల్యాల శ్రీనివాస్, ఉపాధ్యక్షులు సిరిపాటివేణు,కాడెపు అర్జున్, రాయిల్ల లక్ష్మినర్సయ్య, గంగనర్సయ్య, సమ్మయ్య తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు ప్రారంభం


లారీలో ధాన్యం బస్తాలు లోడ్ చేస్తున్న హమాలీలు

కరీంనగర్‌రూరల్: మండలంలోని బొమ్మకల్ సింగిల్‌విండో ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న కొనుగోలు కేంద్రంలో గురువారం నుంచి ధాన్యం కొనుగోళ్లను తిరిగి ప్రారంభించారు. స్థానిక రైసుమిల్లర్ 43 కిలోలు కాంటా పెడితేనే ధాన్యం అన్‌లోడింగ్ చేసుకుంటానని చెప్పడంతో రైతులు ఆందోళనకు దిగారు. దీంతో బుధవారం నిర్వాహకులు కొనుగోళ్లు నిలిపివేశారు. గురువారం కరీంనగర్ సింగిల్‌విండో వైస్‌చైర్మన్ బీరం అంజనేయులు, సీఈవో రమేశ్ రైసుమిల్లర్‌తో కలిసి చర్చించారు. స్థానికంగా రైసుమిల్ ఉండడంతో రైతులు ధాన్యం అన్‌లోడింగ్ చేసుకోవాలని కోరడంతో మిల్లర్ అంగీకరించాడన్నారు. ఈక్రమంలో కొనుగోళ్లు ప్రారంభించడంతో రైతుల నుంచి 380 క్వింటాళ్ల ధాన్యం కాంటాపెట్టి రైసుమిల్లుకు తరలించినట్లు సీఈవో రమేశ్ తెలిపారు.

లాభాల బాటలో కరీంనగర్ 1 డిపో


గేట్ మీటింగ్‌లో మాట్లాడుతున్న ఎన్.చందర్‌రావు

విద్యానగర్: ఆర్టీసీ కరీంనగర్ 1డిపో 2023–24 ఆర్థిక సంవత్సరంలో ఇప్పటివరకు రూ.1,03, 95000 ఆదాయం సాధించి కరీంనగర్ రీజియన్‌లో ప్రథమ స్థానం, జోన్ స్థాయిలో ద్వితీయ స్థానం, రాష్ట్రస్థాయిలో 8వ స్థానంలో నిలిచినట్లు కరీంనగర్ రీజియన్ డిప్యూటీ రీజనల్ మేనేజర్ ఎస్.చందర్ రావు తెలిపారు. గురువారం 1 డిపోలో సిబ్బందితో గేట్ మీటింగ్ నిర్వహించి మాట్లాడారు. కరీంనగర్ 1డిపో అధిక ఆదాయం సాధించడంలో ప్రతీ ఉద్యోగి కృషిచేయడం అభినందనీయమన్నారు. ఇదేస్ఫూర్తితో రానున్న రోజుల్లో డిపోను రాష్ట్రస్థాయిలో ఉత్తమ డిపోగా నిలపాలని కోరారు. కార్యక్రమంలో డిపోమేనేజర్ ప్రణీత్, సూపర్‌వైజర్లు శివప్రసాద్, అంజయ్య, కంట్రోలర్ రవీందర్, సెక్యూరిటీ హెడ్ కానిస్టేబుల్ లక్ష్మిరాజం సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులకు యుద్ధ నైపుణ్యంలో శిక్షణ


ఫైరింగ్ శిక్షణలో పాల్గొంటున్న విద్యార్థులు

కరీంనగర్‌స్పోర్ట్స్: కరీంనగర్ పద్మానగర్‌లోని పారమిత పాఠశాలలో గురువారం ఎన్‌సీసీ వార్షిక శిక్షణలో భాగంగా ఎన్‌సీసీ కేడెట్స్‌కు యోగా, మెడిటేషన్, ఫైరింగ్‌లతో పాటు యుద్ధ నైపుణ్యంలో శిక్షణనిచ్చారు. ఈ సందర్భంగా శత్రువుల నుంచి ఎలా తప్పించుకోవాలి, ల్యాండ్‌మార్క్, ఏరీ డ్రాపింగ్, బైకార్ట్ స్ట్రిప్, స్మోక్‌బాంబ్, తదితర సైనిక యుద్ధ నైపుణ్యాలపై డెమో నిర్వహించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా శ్రీరామచంద్ర మిషన్ మెడిటేషన్ ట్రైనర్ సింగం రాజు మాట్లాడుతూ.. యోగా, మెడిటేషన్ అనేవి విద్యార్థులను మానసిక, శారీరక ధృఢత్వానికి ఉపయోగపడతాయన్నారు. 9వ తెలంగాణ బెటాలియన్ కమాండర్ కల్నల్ డానియల్ లోట్లిమ్, డిస్ట్రిక్ ఫైరింగ్ ఆఫీసర్ టి.వెంకన్న సుబేదార్ మేజర్ సాగర్ సింగ్, ఎన్‌సీసీ అధికారులు కిరణ్ జ్యోతి, జ్యోత్స్న, భోగిని ప్రకాశ్, వి.రాజేశ్, జ్యోతి లక్ష్మి, మ్యాగీ, సందీప్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

నేడు మహాశక్తి ఆలయ త్రయోదశ వేడుకలు




హంపి పీఠాధిపతికి స్వాగతం పలుకుతున్న భక్తులు

విద్యానగర్/సప్తగిరికాలనీ: కరీంనగర్ చైతన్యపురి కాలనీలోని శ్రీ మహాశక్తి ఆలయ త్రయోదశ వార్షికోత్సవ వేడుకలు శుక్రవారం శ్రీ జగద్గురు శంకరాచార్య హంపి విరూపాక్ష విద్యారణ్య భారతీ స్వామి ఆధ్వర్యంలో నిర్వహించనున్నారు. వార్షికోత్సవ వేడుకల్లో భాగంగా ఉదయం 4:30 గంటల నుంచి ఆలయంలో ప్రత్యేప పూజలు ప్రారంభించనున్నారు. పూజ కార్యక్రమాల అనంతరం తీర్థ ప్రసాద వితరణ చేయనున్నట్లు ఆలయకమిటీ నిర్వాహకులు తెలిపారు. సాయంత్రం 6:30 గంటలకు సుహాసినీలచే సామూహిక కుంకుమ పూజలు, లలిత సహస్ర నామ పారాయణం చేస్తున్నామని భక్తులు పాల్గొని అమ్మవార్ల కృపకు పాత్రులు కావాలని కోరారు.

విద్యారణ్య భారతీ స్వామిజీకి ఘన స్వాగతం

శ్రీమహాశక్తి ఆలయంలో 13వ వార్షికోత్సవ వేడుకల సందర్భంగా గురువారం రాత్రి హంపి పీఠాధిపతి శ్రీశ్రీ విద్యారణ్య భారతీ స్వామిజీ కరీంనగర్ చేరుకున్నారు. ఆయనకు భక్తులు, ఆలయ పూజారులు మంగళ హారతులతో స్వాగతం పలికారు.

నేడు పవర్‌కట్ ప్రాంతాలు

కొత్తపల్లి: విద్యుత్ మరమ్మతుల్లో భాగంగా రహదారి వెంట విద్యుత్ తీగలకు అడ్డుగా ఉన్న చెట్లకొమ్మల తొలగింపు పనులు చేపడుతున్నందున శుక్రవారం ఉదయం 10.30 నుంచి 11.30 గంటల వరకు 11 కె.వీ.వెంకటసాయి ఫీడర్ నుంచి 33/11 కె.వీ. హౌజింగ్ బోర్డు సబ్‌స్టేషన్ ప్రాంతంలోని వెంకట సాయి థియేటర్, కమాన్, పాతబజార్, భారత్ టాకీస్, షాషామ హాల్, లక్ష్మీనగర్, గాయత్రీనగర్ ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్లు టౌన్ 2 ఏడీఈ ఎం.సుధీర్ కుమార్ తెలిపారు.

● న్యూ-ఏజ్ థియేటర్

ఒక సాయంత్రం


రష్మిత అంకిత్

'ఇలా మాత్రమే' అనుకుంటే ఏం చేయలేము. 'ఇలా కూడా' అనుకున్నప్పుడే ప్రయోగాలు చేయగలుగుతాం. 'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్' ప్రయోగశీలతకు అద్దం పట్టే ప్లే...

కొన్నిసార్లు మన చుట్టూ ఉన్న సమాజమే జైలర్ పాత్ర పోషిస్తుంది. ఏం మాట్లాడాలి? ఎలా మాట్లాడాలి? ఎక్కడికి వెళ్లాలి, ఎలా వెళ్లాలి....ఇలా సమస్త విషయాలను అప్రకటిత ఆంక్షలుగా ప్రకటిస్తుంది. అందులో అనివార్యంగా ఖైదీలు కాకతప్పదు. 'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్'లో ఇద్దరు ఖైదీలు ఈ కోవకే చెందిన వారు.

ఈ ప్లేలోని 'ఫేస్‌లెస్ జైలర్' నిత్యజీవితంలో మనకు ఎక్కడో ఒకచోట కనిపించి ఉండవచ్చు.

ఆ ఇద్దరు ఖైదీల పేర్లు ఒకటి, రెండు. బ్లాక్‌బాక్స్‌లో ఉన్న వారు విచారణ కోసం ఎదురుచూస్తుంటారు. వారు ఏ నేరం చేశారు? అనేదాంట్లో స్పష్టత లేదు. వారికి ఉన్న ఏకైక అభిరుచి.... అతిగా ఆలోచించడం.

'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్' ప్లే ను రంగస్థలం ముందు ఉన్న సీట్లలో కూర్చొని మాత్రమే చూడనక్కర్లేదు. ఇంట్లో కూర్చొని, సౌకర్యవంతంగా లేటెస్ట్ ఓటీటీ షోలాగే చూడవచ్చు. ఆన్‌లైన్ ద్వారా ప్రపంచం నలుమూలల నుంచి నాటకాన్ని వీక్షించే వెబ్‌ప్లాట్‌ఫామ్‌ను ఏర్పాటు చేసింది ముంబైకి చెందిన ఆల్ఫాజ్ థియేటర్. 48 గంటల వ్యవధిలో మనకు నచ్చిన 'ప్లే'ను ఎన్నిసార్లయిన చూడవచ్చు. తాజా ప్లే 'ది ఏజ్ ఆఫ్ ప్రిజన్' యూనిక్ హైబ్రిడ్ లైవ్ వర్చువల్ ఫార్మట్. మ్యూజిక్, లైట్స్, రకరకాల మూమెంట్స్‌తో ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది. ఈ 'ప్లే'కు అంకిత్ వర్మ రచన చేసి దర్శకత్వం వహించాడు. కొత్తదనాన్ని ఇష్టపడే ముంబైకి చెందిన యామిని జోషి, ఇవితలు 'ఆల్ఫాజ్ థియేటర్'ను ప్రారంభించారు.

'ఇది ఎన్నో లేయర్స్‌తో కూడిన శక్తిమంతమైన నాటకం' అంటుంది యామిని జోషి.

'మనం నాటక రూపంలో అనుకున్నది వేరు. అది ప్రేక్షకులకు అర్థమయ్యేలా చెప్పడం వేరు. ఇది కాస్త కష్టమే' అంటున్న రష్మిత నాటకంలోని సంక్లిష్ట భావాలను సరళంగా ప్రేక్షకులకు చేరువ చేయడంలో విజయం సాధించింది. ఇక వర్మ విషయానికి వస్తే 'ఫిల్మ్‌కు పని చేస్తున్న భావన రానీయకుండా మూడు కెమెరాల మధ్య పనిచేయడం అనేది పెద్ద సవాలు' అంటాడు. అయితే ఆ సవాలులో సక్సెస్ అయ్యాడు.

'ఆర్టిస్టులుగా మాకు లైవ్‌పెర్‌ఫార్మెన్స్ విలువ తెలుసు. అయితే రకరకాల కారణాల వల్ల థియేటర్‌కు వెళ్లే అవకాశం చాలామందికి ఉండకపోవచ్చు. ప్రతి ఒక్కరికీ థియేటర్ అందుబాటులో ఉండాలనేది మా కల. ఎక్కడ నుంచి చూసినా థియేటర్ నుంచి చూసిన భావనే కలగాలి' అంటున్నారు రష్మిత, వర్మలు.

● ఇంగ్లిష్ ఇడియమ్



ఏ స్లాప్ ఆన్ ది రిస్ట్

మనం ఏదైనా ప్రశ్నకు తప్పు జవాబు చెప్పినప్పుడు, ఏదైనా తప్పు చేసినప్పుడు చిన్నగా మందలించడంలాంటి సందర్భంలో ఉపయోగిస్తారు.

సీ త్రూ రోజ్-కలర్డ్ గ్లాసెస్

'ఒక విషయానికి సంబంధించి అనుకూల అంశాలను మాత్రమే చూడడం'...ఇలాంటి సందర్భంలో ఉపయోగిస్తారు.

హెడ్ స్టార్ట్

ఒక పోటీ లేదా రేసుకు సంబంధించి ఒక వ్యక్తికి మొదట్లో కలిగే అడ్వాంటేజ్ విషయంలో వాడుతారు. **ఉదా:** ఇఫ్ వుయ్ లివ్ ఎర్లీ వుయ్ కెన్ గెట్ ఏ హెడ్‌స్టార్ట్ ఆన్ ది హాలిడే ట్రాఫిక్.

● సక్సెస్ స్టోరీ



బేకింగ్ భాటియా

తినగ తినగ వేము తీయనుండు. మరి తీయటి కేకు తినగ తినగ ఏం అనిపించును? శివేష్ మాటల్లో చెప్పాలంటే 'మనకు కూడా చేయాలనిపించును' ఢిల్లీకి చెందిన శివేష్ భాటియా సెల్ఫ్-టాట్ బేకర్, రైటర్, స్టార్ ఇన్‌ఫ్లూయెన్సర్. 27 సంవత్సరాల శివేష్ తాజాగా 'ఫోర్బ్స్ 30 అండర్ 30 ఏషియా-2023' జాబితాలో చోటు సంపాదించాడు...

శివేష్ వాళ్ల నానమ్మ కేకులు ఎంత బాగా తయారు చేస్తుందంటే వర్ణించడానికి మాటలు చాలవు. ఆమె తయారు చేసిన కేకులే మళ్లీ నడిచి రావాలి. ఆమె అన్ని రకాల కేక్‌లను బ్రహ్మాండంగా బేక్ చేసేది.

నానమ్మ చేసే పసందైన కేకులను చూడగా, చూడగా...మరోవైపు స్వీడిష్ బ్లాగర్ లిండా లొమెని బ్లాగులలో కేక్ మేకింగ్ గురించి చదవగా చదవగా...

'నేనెందుకు ట్రై చేయకూడదు?' అనుకున్నాడు శివేష్.

పదహారు సంవత్సరాల వయసులో ప్రయాణం మొదలు పెట్టాడు. 'ఇది చేయాలి' అని ఒక ముందస్తు ప్రణాళిక ప్రకారం వెళ్లకుండా అప్పటికప్పుడు తాను ఫీలైంది చేసేవాడు. ఆరోజు కాస్త ఎండ ఎక్కువగా ఉంటే లెమన్ కేక్, క్విక్‌గా కావాలంటే బేసిక్ చాక్లెట్ కేక్, సమయం బాగా ఉన్నప్పుడు లేయర్‌కేక్ తయారుచేస్తాడు.

కేక్ మేకింగ్‌లో సక్సెస్ అయిన తరువాత తాను తయారుచేసిన కేక్‌ల ఫొటోలను ఇన్‌స్టాగ్రామ్‌లో పోస్ట్ చేయడం మొదలుపెట్టాడు.

'దయచేసి రెసిపీ తెలియజేయండి' అంటూ బోలెడు ఈమెయిల్స్ వస్తూ ఉండేవి. వాటికి సమాధానాలు ఇస్తుండేవాడు. అయితే రాను రానూ అది కష్టంగా మారింది. దీంతో బ్లాగింగ్ మొదలు పెట్టాడు. బేకింగ్‌కు అవసరమైన మైదా, కోకా పౌడర్, ఎగ్స్‌లాంటి ప్రాథమిక ఇన్‌గ్రేడియెంట్స్‌తో పాటు ఫ్యాన్సీ ఇన్‌గ్రేడియెంట్స్ గురించి రాసేవాడు.

'బేక్ విత్ శివ' బ్లాగ్ పాపులర్ కావడంతో కొత్త పరిచయాలు ఏర్పడ్డాయి. కొత్త విషయాలు తెలుసుకొనే అవకాశం ఏర్పడింది.

'మీ బ్లాగు చదివి నేను సొంతంగా కేకు తయారు చేశాను' అంటూ కుప్పలు, తెప్పలుగా ఈమెయిల్స్ వచ్చేవి. మరో వైపు బేకరీలు శివేష్ తయారుచేసిన సరికొత్త కేకులను మెనూలోకి తీసుకువచ్చేవి. ఇదంతా చూసిన తరువాత...

'ఫరవాలేదు. నాలో సరుకు ఉంది' అనుకునేవాడు శివేష్.

ఇంతకీ శివేష్ విజయ రహస్యం ఏమిటి?

సూపర్ ఈజీ ఫార్ములా. అంటే...ఎవరికి వారు 'ఇది మనం కూడా తయారు చేసుకోవచ్చు' అనిపించడం.

'విజువల్ పార్ట్'కు ప్రాముఖ్యత ఇవ్వడం. అంటే...కళ్లతోనే తినేసేలా చేయడం. ఈ ఫొటోల కోసం ఫ్యాన్సీ కెమెరాలను కాకుండా తన దగ్గర ఉన్న ఐప్యాడ్, ఐఫోన్ కెమెరాలను ఉపయోగించేవాడు.

'ఇష్టమే రకరకాల ప్రయోగాలు చేయిస్తుంది. ఒక ప్రయోగం మరో ప్రయోగానికి దారి చూపుతుంది. ప్రయోగాల ఫలితమే గొప్ప విజయం అవుతుంది. ప్రాబ్లమ్ అనే బోర్డ్ చూసి పక్కకు వెళ్లవద్దు. దాన్ని తెరుకొని వెళితే కొత్త ప్రపంచం కనిపిస్తుంది' అంటున్నాడు 27 సంవత్సరాల శివేష్ భాటియా.



ఈ పుస్తకాలు హాటు కేకులు

ఆ పుస్తకాలు హాటుకేకుల్లా అమ్ముడు పోయాయి... అంటుంటారు. అయితే శివేష్ రాసిన 'బేక్ విత్ శివేష్' 'డిసర్ట్స్ ఫర్ ఎవ్రీ మూడ్' 'ఎగ్‌లెస్ బేకింగ్ విత్ శివేష్' 'ఏ కుక్ బుక్ ఫర్ స్పెషల్ డేస్, స్పెషల్ పీపుల్: ఫ్రమ్ శివేష్ విత్ లవ్' లాంటి పుస్తకాలు నిజంగానే హాటుకేకుల్లా అమ్ముడయ్యాయి. 'ఏ కుక్ బుక్ ఫర్ స్పెషల్ డేస్' పుస్తకం పిల్లలను దృష్టిలో పెట్టుకొని రాసింది. ఇలస్ట్రేషన్‌లు ఆకట్టుకుంటాయి. ఈ పుస్తకం ఆవిష్కరణ సభలో వక్త అయిన ప్రముఖ చెఫ్ అనుకృతి ఆనంద్ ఇలా అన్నారు: 'శివేష్ యుఎస్పీ...సింపుల్ అండ్ ఈజీ'

'హాటు హాటుగా కేక్ చేయడం ఎంత ఇష్టమో హాయిగా పుస్తకాలు రాయడం కూడా అంతే ఇష్టం' అంటున్నాడు పొలిటికల్ సైన్స్‌లో పట్టా పుచ్చుకున్న శివేష్. 'మీ పుస్తకాలు మా ఇంట్లోకి వచ్చిన తరువాత బేకరీలకు వెళ్లడం తగ్గిపోయింది' అని శివేష్‌తో అంటుంటారు ఎంతోమంది.

● టెక్.. టాక్



టోజో గోల్డెన్ ఎక్స్‌ఐ వైర్‌లెస్ ఇయర్‌బడ్స్

● బ్రాండ్: టోజో మోడల్: ఎక్స్‌ఐ ● యాక్టివ్ నాయిస్ కన్సెలేషన్ ● స్పెషల్ ఫీచర్: స్వెట్ ప్రూఫ్, వాటర్ ప్రూఫ్ ● బ్లూటూత్: 5.3 ● బ్యాటరీ:500 ఎంఏహెచ్ ● కలర్: బ్లాక్



ఫర్ మూవీ డైస్

ఫర్ మూవీ డైస్ అనేది పోర్టబుల్ ఎల్‌ఈడీ డీఎల్‌పీ ప్రొజెక్టర్. దీన్ని సులభంగా ఒక చోటు నుంచి ఇంకో చోటుకి తీసుకెళ్లవచ్చు.

● ఆప్టికల్ రిజల్యూషన్: 1920X1080 పిక్సెల్స్ ● బ్లూటూత్: 4.0 డైమెన్షన్స్: 155X125X60 ఎంఎం బరువు: 2.2 కేజీ
● బ్యాటరీ: 16,000 ఎంఏహెచ్ ● ఐఆర్ రిమోట్ కంట్రోల్
● ఆప్టికల్ అడ్జస్ట్‌మెంట్స్: ఆటోమెటిక్ కీస్టోన్ కరెక్షన్, ఆటోమెటిక్ ఫోకస్

వాట్సాప్ (ఆండ్రాయిడ్ అండ్ ఐవోఎస్) మెసేజ్ ఎడిట్ చేయడానికి...

1. ఎడిట్ చేయాలనుకున్న మెసేజ్‌ను సెలెక్ట్ చేసుకోవాలి.
2. మెసేజ్ కాంటెక్స్ట్ మెనూ(ఐవోఎస్)లో 'ఎడిట్'ను సెలెక్ట్ చేసుకోవాలి. ఆండ్రాయిడ్: స్క్రీన్ టాప్‌రైట్ కార్నర్‌లోని త్రీ-డాట్ మెనూ.
3. న్యూ మెసేజ్‌ను 'టెక్స్ట్ ఫీల్డ్'లోకి ఎంటర్ చేయాలి.
4. ఎడిటెడ్ మెసేజ్ సేవ్ చేయడానికి గ్రీన్ చెక్ మార్క్ బటన్ నొక్కాలి.

● గేమింగ్



సిస్టమ్ షాక్ 2072

ఎనిమిది సంవత్సరాల తరువాత రీమేక్‌గా వస్తున్న ఫస్ట్ పర్సన్ యాక్షన్-అడ్వెంచర్ గేమ్....సిస్టమ్ షాక్ ఈ నెల 30న విడుదల అవుతుంది. 2072లో సైబర్‌పంక్‌లోని స్పేస్ స్టేషన్‌లో జరిగే గేమ్ ఇది. ప్లేయర్ చేయాల్సింది...'శోధన్' అనే దుష్టశక్తితో కూడిన కృత్రిమమేధస్సును అడ్డుకోవడం. త్రీడీ ఎన్విరాన్‌మెంట్‌లో మల్టీ లెవెల్ ప్లే స్టేషన్‌లో పజిల్స్‌ను సాల్వ్ చేస్తూ, శత్రువులను ఎదుర్కొంటూ ముందుకు సాగాలి.

కథ విషయానికి వస్తే...అనామధేయుడైన హ్యాకర్ (ప్రొటాగనిస్ట్) ప్రత్యర్థులకు పట్టుబడతాడు. అతడిని స్పేస్ స్టేషన్‌కు తీసుకువెళతారు. ఈ హ్యాకర్ ఆరునెలలు కోమాలోకి వెళ్లిపోతాడు. కోమా నుంచి బయటికి వచ్చిన తరువాత గేమ్ మొదలవుతుంది.

ఇంజిన్: అన్ రియల్ ఇంజిన్ 4 **జానర్:** యాక్షన్-ఎడ్వెంచర్
ప్లాట్‌ఫామ్స్: విండోస్, మాక్ వోఎస్, ప్లేస్టేషన్ 4, ప్లే స్టేషన్ 5, ఎక్స్‌బాక్స్ వన్, ఎక్స్‌బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్.

సినిమా


● రామ్‌చరణ్

వి మెగా పిక్చర్స్ ప్రారంభం

''నూతన ప్రతిభావంతులను ప్రోత్సహించాలనే ఆలోచనతో 'వి మెగా పిక్చర్స్' బ్యానర్ ప్రారంభిస్తున్నాం'' అని హీరో రామ్‌చరణ్ అన్నారు. 'యూవీ క్రియేషన్స్' నిర్మాణ భాగస్వామి విక్రమ్‌రెడ్డి, రామ్‌చరణ్ కలిసి 'వి మెగా పిక్చర్స్' పై నిర్మించనున్న కొత్త సినిమాల వివరాలు త్వరలో వెల్లడి కానున్నాయి. ''విలక్షణమైన, సరికొత్త ఆలోచనలను ఆవిష్కరించేలా ఈ బ్యానర్‌పై సినిమాలను నిర్మించబోతున్నాం. ప్రతిభావంతులను ఇండస్ట్రీకి పరిచయం చేస్తాం'' అన్నారు రామ్‌చరణ్. ''వి మెగా పిక్చర్స్' ప్రయాణాన్ని ప్రారంభించటం మాలో తెలియని ఓ ఆనందాన్ని కలిగిస్తోంది. ప్రతిభ ఉన్న నటీనటులు, రచయితలు, దర్శకులు, సాంకేతిక నిపుణులతో కలిసి 'వి మెగా పిక్చర్స్' అసోసియేట్ అవుతుంది. ప్రేక్షకులకు కథ చెప్పడంలో సరికొత్త ఒరవడిని తీసుకు రావాలనుకుంటున్నాం. సినీ ఇండస్ట్రీ హద్దులను చెరిపేయడమే లక్ష్యం'' అన్నారు విక్రమ్. ఈ సంగతి ఇలా ఉంచితే.. రామ్‌చరణ్ నిర్మాతగా మారడం ఇది తొలిసారి కాదు. చిరంజీవి హీరోగా నటించిన 'ఖైదీ నంబరు 150', 'సైరా: నరసింహారెడ్డి', 'ఆచార్య', 'గాడ్‌ఫాదర్' చిత్రాలకు రామ్‌చరణ్ ఓ నిర్మాతగా ఉన్న సంగతి గుర్తుండే ఉంటుంది. మరోవైపు నటుడిగా రామ్‌చరణ్ ప్రస్తుతం 'గేమ్ చేంజర్' సినిమా చేస్తున్నారు.

మెన్ టూ మహిళలకూ నచ్చుతుంది - దర్శకుడు శ్రీకాంత్ జి. రెడ్డి


● మౌర్య, బ్రహ్మాజీ, శ్రీకాంత్

''మెన్ టూ' చిత్రంలో మేం ఎక్కడా మహిళలని తిట్టలేదు. ఈ సినిమా పురుషులకే కాదు.. మహిళలకు కూడా నచ్చుతుంది. ఈ చిత్రం బాగా రావటానికి కారణమైన నిర్మాతలు, మౌర్యలకు థ్యాంక్స్'' అని దర్శకుడు శ్రీకాంత్ జి. రెడ్డి అన్నారు. నరేష్ అగస్త్య, బ్రహ్మాజీ, హర్ష చెముడు, సుదర్శన్, మౌర్య సిద్ధవరం, కౌశిక్ ఘంటశాల, రియా సుమన్, ప్రియాంక శర్మ ప్రధాన తారాగణంగా నటించిన చిత్రం 'హ్యాష్‌టాగ్ మెన్ టూ'. శ్రీకాంత్ జి. రెడ్డి దర్శకత్వంలో మౌర్య సిద్ధవరం నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా మౌర్య సిద్ధవరం మాట్లాడుతూ– ''హిలేరియస్ ఎంటర్‌టైనర్‌గా రూపొందిన చిత్రమిది. మా సినిమా విడుదలకు కారణమైన మైత్రీ మూవీస్ సంస్థకి థ్యాంక్స్'' అన్నారు. ''మగవాళ్లని ఆడవాళ్లు ఏ విధంగా వేధిస్తారు? అనేది 'హ్యాష్‌టాగ్ మెన్ టూ' చూసి తెలుసుకోవచ్చు'' అన్నారు నటుడు బ్రహ్మాజీ. చిత్ర సహనిర్మాత శ్రీమాన్, నటీనటులు ప్రియాంక శర్మ, నరేష్ అగస్త్య, కౌశిక్ మాట్లాడారు.


● అదితీ రావ్ ● సన్నీ లియోన్

కాన్స్‌లో 'కెన్నెడీ'కి ఆదరణ

ఫ్రాన్స్‌లో జరుగుతున్న 76వ కాన్స్ చలన చిత్రోత్సవాల్లో మెరిశారు సన్నీ లియోన్. అనురాగ్ కశ్యప్ దర్శకత్వంలో రాహుల్ భట్, సన్నీ లియోన్ ప్రధాన పాత్రల్లో నటించిన చిత్రం 'కెన్నెడీ'. కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఈ సినిమా ప్రీమియర్‌ను ప్రదర్శించింది యూనిట్. 'కెన్నెడీ' పూర్తయిన తర్వాత వీక్షకుల నుంచి ఐదు నిమిషాలకు పైగా స్టాండింగ్ ఒవేషన్ చిత్ర యూనిట్‌కు దక్కినట్లు తెలిసింది. ఇక కాన్స్ రెడ్ కార్పెట్‌పై సన్నీ లియోన్ నడవడం ఇదే తొలిసారి కావడం విశేషం. ''కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఇండియన్ సినిమాను రిప్రజెంట్ చేయడం చాలా గౌరవంగా ఉంది'' అన్నారు సన్నీ లియోన్.

సన్నీకి హెల్ప్ చేసిన అనురాగ్


● అనురాగ్, రాహుల్

కాన్స్ రెడ్ కార్పెట్‌పై పొడవాటి గౌనులో సన్నీ లియోన్ మెరిశారు. అయితే నడుస్తున్నప్పుడు ఆ గౌను ఆమె షూలో చిక్కుకోవడంతో ఇబ్బందిపడ్డారు. పక్కనే ఉన్న అనురాగ్ కశ్యప్ ఈ విషయాన్ని గ్రహించి సన్నీకి హెల్ప్ చేశారు. అలాగే మౌనీ రాయ్, అదితీరావ్ హైదరీలు కూడా రెడ్ కార్పెట్‌పై నడిచారు. కాన్స్ చలన చిత్రోత్సవాల్లో ఇండియన్ పెవిలియన్‌లో 'లయనీస్' సినిమాను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఇందులో అదితీ రావ్ హైదరి, సంధు ముఖ్య తారలు.

దీపావళికి జపాన్


● కార్తీ


కార్తీ హీరోగా నటిస్తున్న అడ్వెంచరస్ థ్రిల్లర్ ఫిల్మ్ 'జపాన్'. అనూ ఇమ్మాన్యుయేల్ హీరోయిన్‌గా నటిస్తున్న ఈ చిత్రంలో సునీల్, విజయ్ మిల్టన్ కీలక పాత్రలు పోషిస్తున్నారు. రాజు మురుగన్ దర్శకత్వంలో డ్రీమ్ వారియర్ పిక్చర్స్ పతాకంపై ఎస్ఆర్ ప్రకాశ్‌బాబు, ఎస్ఆర్ ప్రభు నిర్మిస్తున్నారు. గురువారం (మే 25)న కార్తీ బర్త్ డే. ఈ సందర్భంగా 'జపాన్' సినిమా గ్లింప్స్ వీడియోను విడుదల చేసి, ఈ సినిమాను దీపావళికి రిలీజ్ చేస్తున్నట్లుగా చిత్ర యూనిట్ ప్రకటించింది.

మహేశ్ మాటలు సంతోషాన్నిచ్చాయి - అనురాగ్ రెడ్డి


● సుమంత్ ప్రభాస్, శరత్, చంద్రు మనోహరన్, అనురాగ్ రెడ్డి

''మహేశ్‌బాబుగారు 'మేమ్ ఫేమస్' సినిమా చూసి గొప్పగా మాట్లాడటం చాలా ఆనందాన్ని ఇచ్చింది. ఈ మూవీ విడుదల కాకముందే సుమంత్ ప్రభాస్‌తో మరో సినిమా చేయాలని మహేశ్‌గారు ముందుకు రావడం మజా అనిపించింది.. ఆయన ధైర్యానికి హ్యాట్సాఫ్'' అన్నారు నిర్మాత అనురాగ్ రెడ్డి. సుమంత్ ప్రభాస్ హీరోగా నటించి, దర్శకత్వం వహించిన చిత్రం 'మేమ్ ఫేమస్'. అనురాగ్ రెడ్డి, శరత్, చంద్రు మనోహరన్ నిర్మించిన ఈ సినిమా నేడు రిలీజ్ అవుతోంది. ఈ సందర్భంగా సుమంత్ ప్రభాస్ మాట్లాడుతూ– ''మా గురించి మహేశ్ బాబుగారి ట్వీట్ చదువుతున్నపుడు నమ్మలేకపోయాను. నా తర్వాతి సినిమాని అనురాగ్, శరత్‌గార్లతో కలసి మహేశ్ గారు నిర్మిస్తామని చెప్పడం అద్భుతం అనిపించింది'' అన్నారు. ''మా సినిమా ప్రీమియర్స్ అన్నీ ఫుల్ అయిపోయాయి. కొత్తవారితో చేసిన సినిమాకి ఇంత మంచి రెస్పాన్స్ రావడానికి కారణమైన అందరికీ థ్యాంక్స్'' అన్నారు శరత్ చంద్ర. ''మహేశ్ బాబుగారి మాటలు గొప్ప స్ఫూర్తిని ఇచ్చాయి'' అన్నారు చంద్రు మనోహరన్.

మళ్ళీ పెళ్లితో పెద్ద హిట్ సాధిస్తాం - వీకే నరేశ్



''పెళ్లనేది పవిత్రమైనది. దాన్ని గౌరవించాలనే కోణంలో 'మళ్ళీ పెళ్లి' సినిమా చేశాం. యువతరంతో పాటు అన్ని వయసుల వారికీ కనెక్ట్ అయ్యే కథ ఈ చిత్రంలో ఉంది. పెద్ద హిట్ సాధిస్తామనే నమ్మకం ఉంది'' అన్నారు వీకే నరేశ్. ఆయన హీరోగా నటించి, నిర్మించిన చిత్రం 'మళ్ళీ పెళ్లి'. ఎమ్మెస్ రాజు దర్శకత్వం వహించారు. నరేశ్‌కి జోడీగా పవిత్రా లోకేష్ నటించిన ఈ సినిమా నేడు విడుదలవుతోంది. ఈ సందర్భంగా గురువారం వీకే నరేశ్ విలేకరులతో మాట్లాడుతూ– ''మా అమ్మగారు (విజయ నిర్మల) తన ఆలోచనలను సినిమాల్లో చూపించాలని కృష్ణగారితో కలసి 1972లో విజయకృష్ణ మూవీస్‌ని స్థాపించారు. ఈ బేనర్ స్థాపించి 50 ఏళ్లు, నా సినీ జీవితం ప్రారంభించి కూడా యాభై ఏళ్లు. ఈ సమయంలో హీరోగా 'మళ్ళీ పెళ్లి' సినిమా చేయడం నా అదృష్టం. ఈ సినిమా వినోదంతో పాటు షాకింగ్‌గా ఉంటుంది.. నటుడిగా థ్రిల్‌గా ఉంది. పదికోట్ల మందిలో వందమంది కూడా బిజీగా ఉండరు. ఇక సినిమాలకు వస్తే.. పది మంది హీరోలే బిజీగా ఉంటారు. నేను హీరోగా హిట్స్ ఇచ్చాను, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా చేశాను. ఇప్పుడు మళ్లీ హీరోగా చేస్తున్నాను. విజయకృష్ణ మూవీస్ లాంటి పెద్ద బ్యానర్‌ని మళ్లీ తీసుకురావడం, కృష్ణ-విజయ నిర్మలగార్ల వారసత్వాన్ని కాపాడటం, ఒక మంచి ఎంటర్‌టైనర్ ఇవ్వడం.. ఇవన్నీ నిర్మాతగా నాకు పెద్ద బాధ్యత. ఈ విషయంలో రాజుగారిని నమ్మాను'' అన్నారు.

స్పై డ్రామా


● అరవింద్ కృష్ణ, కిరణ్, రాజ్ మదిరాజు, మహేశ్

ప్రతాప్ పోతన్, ఊర్వశీ రాయ్, అలీ రెజా, అరవింద్ కృష్ణ, రాజ్ మదిరాజు ప్రధాన పాత్రల్లో నటించిన స్పై థ్రిల్లర్ ఫిల్మ్ 'గ్రే'. 'ద స్పై హూ లవ్డ్ మి' అనేది ఉపశీర్షిక. రాజ్ మదిరాజు దర్శకత్వంలో కిరణ్ కాళ్లకూరి నిర్మించిన ఈ చిత్రం నేడు విడుదల కానుంది. ఈ సందర్భంగా రాజ్ మదిరాజు మాట్లాడుతూ– ''కొన్నేళ్ల క్రితం దేశంలో రెండేళ్ల వ్యవధిలో దాదాపు పదిమంది న్యూక్లియర్ సైంటిస్ట్‌లు మాయమైపోయారు. గతంలో కూడా కొన్నిసార్లు ఇలా జరిగింది. ఫారిన్ ఇంటెలిజెన్స్ ఏజెన్సీస్ ఆపరేషన్స్ వల్లే ఇలా జరుగుతుందనే వార్తలు ఉన్నాయి. వీటి నుంచి పుట్టిన ఐడియానే 'గ్రే' మూవీ. 40 ఏళ్ల తర్వాత బ్లాక్ అండ్ వైట్‌లో వస్తున్న చిత్రం కూడా ఇదే. పీవీఆర్ పిక్చర్స్ ఈ మూవీ రిలీజ్ చేస్తోంది'' అన్నారు. ''గ్రే' పర్‌ఫెక్ట్ స్పై మూవీ. మా బ్యానర్లో మరో మూడు ప్రాజెక్ట్స్ ఉన్నాయి'' అన్నారు కిరణ్. ''గ్రే' సినిమాను ప్రేక్షకులు ఆదరించాలి'' అన్నారు అరవింద్ కృష్ణ. ఈ చిత్రానికి సహనిర్మాత: మహేశ్.

అసత్య ప్రచారం వద్దు - సుధాకర్



ప్రముఖ నటుడు సుధాకర్ అనారోగ్యంతో ఇబ్బంది పడుతున్నారని, ఐసీయూలో చికిత్స తీసుకుంటున్నారనే వార్త ప్రచారంలోకొచ్చింది. అయితే ఆ వార్తల్లో వాస్తవం లేదని స్పష్టం చేశారు సుధాకర్. ఈ విషయంపై సుధాకర్ ఓ వీడియోను విడుదల చేశారు. ''అందరికీ నమస్కారం. నా ఆరోగ్యం గురించి వచ్చే తప్పుడు వార్తలను నమ్మవద్దు. అసత్య ప్రచారం చేయవద్దు. నేను చాలా సంతోషంగా ఉన్నాను'' అని పేర్కొన్నారు సుధాకర్. ఇక హీరోగా, హాస్యనటుడిగా, క్యారెక్టర్ ఆర్టిస్ట్‌గా తెలుగు, తమిళ భాషల్లో సుధాకర్ దాదాపు ఐదు వందల చిత్రాలకు పైగా నటించారు. నాలుగైదు సినిమాలను నిర్మించారు కూడా.

సాక్షి బిజినెస్
శుక్రవారం
26-5-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు		
సెన్సెక్స్ ▲	99	61,873
నిఫ్టీ ▲	36	18,321

మరిన్ని బిజినెస్ వార్తల కోసం 'సాక్షి ప్లస్' చూడండి

విదేశీ సూచీలు (తొలి సెంట రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	12,684	▲	200
డోజోన్స్	32,643	▼	157
ఎఫ్‌టీఎస్‌ఈ 100	7,571	▼	56
డాక్స్	15,794	▼	48
షాంఘై	3,201	▼	3
నికాయ్	30,801	▲	118

•అమెరికా •బ్రిటన్ •జర్మనీ •చైనా •జపాన్

బులియన్ రూ.లలో — ముంబై	
బంగారం (99.9 స్వచ్ఛత)	60,361 ▼ 319
బంగారం (99.5 స్వచ్ఛత)	60,119 ▼ 318
వెండి (కిలో)	70,285 ▼ 844


30 రోజుల్లో పునరుద్ధరణ ప్రణాళిక ఇవ్వండి

గో ఫస్ట్‌కు డీజీసీఏ సూచన



న్యూఢిల్లీ: కార్యకలాపాల పునరుద్ధరణకు సంబంధించిన ప్రణాళికను 30 రోజుల్లోగా సమర్పించాలంటూ విమానయాన సంస్థ గో ఫస్ట్‌కు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ) సూచించింది. అందుబాటులో ఉన్న విమానాలు .. పైలట్లు ..ఇతర సిబ్బంది, నిర్వహణ ఏర్పాట్లు, నిధులు .. వర్కింగ్ క్యాపిటల్, లీజుదార్లతో ఒప్పందాలు తదితర వివరాలు అందులో పొందుపర్చాలని డీజీసీఏ పేర్కొన్నట్లు సంబంధిత వర్గాలు తెలిపాయి. ప్రణాళికను సమీక్షించిన తర్వాత డీజీసీఏ తగు నిర్ణయం తీసుకోవచ్చని వివరించాయి. ఆర్థిక సంక్షోభంలో చిక్కుకున్న గో ఫస్ట్ మే 2న స్వచ్ఛందంగా దివాలా పరిష్కార ప్రక్రియ చేపట్టాలంటూ నేషనల్ కంపెనీ లా ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌టీ)లో దరఖాస్తు చేసుకున్న సంగతి తెలిసిందే. ముందుగా మే 3, 4 తారీఖుల్లో రద్దు చేసిన విమాన సేవలను ఆ తర్వాత మరిన్ని రోజులకు పొడిగించింది. ఈలోగా సర్వీసుల నిలిపివేతపై డీజీసీఏ షోకాజ్ నోటీసు జారీ చేసింది. దీంతో మారటోరియం వ్యవధిని ఉపయోగించుకుని పునరుద్ధరణ ప్రణాళికను సమర్పించేందుకు సమయం ఇవ్వాలంటూ గో ఫస్ట్ తన సమాధానంలో కోరింది. మరోవైపు లీజుదార్లు వ్యతిరేకిస్తున్నప్పటికీ.. గో ఫస్ట్ దివాలా పరిష్కార పిటిషన్‌ను అనుమతించాలని ఎన్‌సీఎల్‌టీ తీసుకున్న నిర్ణయాన్ని సమర్థిస్తూ మే 22న జాతీయ కంపెనీ లా అప్పిలేట్ ట్రిబ్యునల్ (ఎన్‌సీఎల్‌ఏటీ) ఉత్తర్వులు జారీ చేసింది.

లెక్సస్ కారు @ రూ.2.39 కోట్లు



హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: లగ్జరీ కార్ల తయారీలో ఉన్న జపాన్ సంస్థ లెక్సస్.. తాజాగా భారత్‌లో కొత్త ఎల్‌సీ 500హెచ్ మోడల్‌ను పరిచయం చేసింది. నాలుగు సీట్లు ఉన్న ఈ లగ్జరీ కూపే ధర రూ.2.39 కోట్లు. గ్లాస్ బ్లాక్ మెటాలిక్ ఫినిష్, 3డీ మెషీన్డ్ టెక్స్చర్‌తో అలాయ్ వీల్స్, 12.3 అంగుళాల టచ్ స్క్రీన్ డిస్‌ప్లే, 3.5 లీటర్, 6 సిలిండర్, మల్టీ స్టేజ్ హైబ్రిడ్, లీటరుకు 12.3 కిలోమీటర్ల మైలేజీ, 264 కిలోవాట్ పవర్ ఏర్పాటు ఉంది. గరిష్ట వేగం గంటకు 250 కిలోమీటర్లు. గంటకు 100 కిలోమీటర్ల వేగాన్ని 5 సెకన్లలోనే చేరుకుంటుంది. పనోరమిక్ వ్యూ మానిటర్, రేర్ క్రాస్ ట్రాఫిక్ అలర్ట్, 10 ఎయిర్‌బ్యాగ్స్, కార్బన్ ఫైబర్ రీ–ఇన్‌ఫోర్స్‌డ్ ప్లాస్టిక్స్ రూఫ్, డైనమిక్ హ్యాండ్లింగ్ సిస్టమ్, వేరియేబుల్ గేర్ రేషియో స్టీరింగ్, డ్రైవ్ స్టార్ట్ కంట్రోల్, వెహికిల్ డైనమిక్స్ ఇంటిగ్రేటెడ్ మేనేజ్‌మెంట్, ఈబీడీతో ఏబీఎస్, బ్రేక్ అసిస్ట్ సిస్టమ్, ట్రాక్షన్ కంట్రోల్ సిస్టమ్, వెహికిల్ స్టెబిలిటీ కంట్రోల్, హిల్ స్టార్ట్ అసిస్ట్ వంటి భద్రతా ఫీచర్లు జోడించారు. భారత్‌లో హైదరాబాద్ సహా ఏడు నగరాల్లో లెక్సస్ షోరూంలు ఉన్నాయి.

సీఐఐ కొత్త ప్రెసిడెంట్‌గా దినేశ్‌కు బాధ్యతలు



న్యూఢిల్లీ: ప్రస్తుత ఆర్థిక సంవత్సరానికి గాను (2023–24) భారతీయ పరిశ్రమల సమాఖ్య సీఐఐ కొత్త ప్రెసిడెంట్‌గా టీవీఎస్ సప్లై చెయిన్ సొల్యూషన్స్ ఎగ్జిక్యూటివ్ వైస్ చైర్మన్ ఆర్ దినేశ్ బాధ్యతలు స్వీకరించారు. బజాజ్ ఫిన్‌సర్వ్ సీఎండీ సంజీవ్ బజాజ్ స్థానంలో ఆయన ఎన్నికయ్యారు. అలాగే, ఎర్న్‌స్ట్ అండ్ యంగ్ ఇండియా చైర్మన్ రాజీవ్ మెమానీ సీఐఐ వైస్ ప్రెసిడెంట్‌గా ఎన్నికయ్యారు. గురువారం జరిగిన సీఐఐ నేషనల్ కౌన్సిల్ సమావేశంలో 2023–24కు గాను కొత్త ఆఫీస్–బేరర్లను ఎన్నుకున్నారు.

చివర్లో బౌన్స్‌బ్యాక్

- సెన్సెక్స్ 99 పాయింట్లు అప్
- 61,873 వద్ద ముగింపు
- నిఫ్టీ 36 పాయింట్లు ప్లస్



ముంబై: రోజంతా నష్టాల మధ్యే కదిలిన దేశీ స్టాక్ మార్కెట్లో బౌన్స్‌బ్యాక్ సాధించాయి. వెరసి సెన్సెక్స్ 99 పాయింట్లు లాభపడి 61,873 వద్ద ముగిసింది. నిఫ్టీ సైతం 36 పాయింట్లు బలపడి 18,321 వద్ద స్థిరపడింది. మే నెల డెరివేటివ్స్ ముగింపు నేపథ్యంలో తొలి నుంచీ మార్కెట్లు ఆటుపోట్లకు లోనయ్యాయి. ఇంట్రాడేలో సెన్సెక్స్ 61,934 వద్ద గరిష్టాన్ని, 61,485 దిగువన కనిష్టాన్ని తాకింది. ఈ బాటలో నిఫ్టీ 18,338–18,202 పాయింట్ల మధ్య ఊగిసలాడింది. ప్రధానంగా చివరి అర్ధగంటలో ఇన్వెస్టర్లు కొనుగోళ్లకు దిగడంతో మార్కెట్లు నష్టాలను వీడి లాభాల్లో నిలిచాయి.

రియల్టీ అప్

ఎన్‌ఎస్‌ఈలో ప్రధానంగా రియల్టీ, ఎఫ్‌ఎంసీజీ, కన్జ్యూమర్ డ్యూరబుల్స్ 1–0.5 శాతం మధ్య పుంజుకోగా.. పీఎస్‌యూ బ్యాంక్స్ 0.5 శాతం నీరసించాయి. నిఫ్టీ దిగ్గజాలలో బజాజ్ ఆటో, అదానీ ఎంటర్, ఎయిర్‌టెల్, ఐటీసీ, దివీస్, ఐషర్, టాటా కన్జ్యూమర్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, బ్రిటానియా, కొటక్ బ్యాంక్, అదానీ పోర్ట్స్, అపోలో హాస్పిటల్స్ 3–1% మధ్య ఎగశాయి. అయితే విప్రో, టాటా మోటార్స్, ఇండస్‌ఇండ్, యూపీఎల్, హిందాల్కో, సన్ ఫార్మా, హెచ్‌డీఎఫ్‌సీ, హెచ్‌యూఎల్, కోల్ ఇండియా 1.2–0.5 శాతం మధ్య డీలా పడ్డాయి.

చిన్న షేర్లు ఓకే

బీఎస్‌ఈలో మిడ్, స్మాల్ క్యాప్స్ 0.3 శాతం స్థాయిలో బలపడ్డాయి. ట్రేడైన షేర్లలో 1,802 లాభపడితే.. 1,687 నష్టపోయాయి. నగదు విభాగంలో విదేశీ ఇన్వెస్టర్లు రూ. 589 కోట్లు, దేశీ ఫండ్స్ రూ. 338 కోట్లు ఇన్వెస్ట్ చేశారు. గత 3 రోజుల్లో ఎఫ్‌పీఐలు రూ. 2,291 కోట్ల విలువైన స్టాక్స్ కొనుగోలు చేసిన సంగతి తెలిసిందే. కాగా.. విదేశీ మార్కెట్లో బ్రెంట్ చమురు బ్యారల్ 1.2 శాతం క్షీణించి 77.47 డాలర్లకు చేరింది. డాలరుతో మారకంలో రూపాయి 7 పైసలు తగ్గి 82.75ను తాకింది.

మాంద్యంలోకి జర్మనీ ఎకానమీ



బెర్లిన్: యూరోప్‌లో అతిపెద్ద ఆర్థిక వ్యవస్థను కలిగిన జర్మనీ మాంద్యంలోకి జారిపోయింది. 2023 మొదటి త్రైమాసికంలో (జనవరి–మార్చి) దేశ స్థూల దేశీయోత్పత్తి 0.3 శాతం క్షీణించినట్లు ఫెడరల్ స్టాటిస్టికల్ ఆఫీస్ గణాంకాలు పేర్కొన్నాయి. 2002 చివరి త్రైమాసికం అంటే అక్టోబర్–డిసెంబర్ మధ్య దేశ జీడీపీ 0.5 శాతం క్షీణించింది. వరుసగా రెండు త్రైమాసికాల్లో ఆర్థిక వ్యవస్థలో వృద్ధిలేకపోగా క్షీణత నమోదయితే దానిని ఆ దేశం మాంద్యంలోకి జారినట్లు పరిగణించడం జరుగుతుంది. అధిక ధరలు వినియోగంపై తీవ్ర ప్రభావం చూపుతున్నట్లు ఎకనమిస్టులు పేర్కొంటున్నారు. ఏప్రిల్‌లో ద్రవ్యోల్బణం ఏకంగా 7.2 శాతంగా ఉంది. రష్యా–ఉక్రెయిన్ యుద్ధం ద్రవ్యోల్బణంపై తీవ్ర ప్రభావం చూపుతోంది.

ఎల్ఐసీ జూమ్

క్యూ4లో ఆకర్షణీయ ఫలితాలు సాధించిన ఎల్ఐసీ షేరు 2 శాతం వృద్ధితో రూ. 604 వద్ద ముగిసింది. ఒక దశలో రూ. 616వరకూ ఎగసింది. దీంతో కంపెనీ మార్కెట్ విలువ రూ. 6,357 కోట్లు బలపడి రూ. 3,81,777 కోట్లకు చేరింది. ఎన్‌ఎస్ఈ, బీఎస్‌ఈలలో కలిపి 55.4 లక్షల షేర్లు ట్రేడయ్యాయి.

పటిష్టంగా భారత బ్యాంకుల లాభదాయకత

- ఆస్తుల నాణ్యతలోనూ మెరుగు
- ఎస్అండ్‌పీ రేటింగ్స్ అంచనా



న్యూఢిల్లీ: భారత బ్యాంకుల లాభదాయకత ఆరోగ్యకర స్థాయిలో స్థిరపడుతుందని, ఆస్తుల (రుణాలు) నాణ్యత మెరుగుపడడం కూడా కొనసాగుతుందని అంతర్జాతీయ రేటింగ్ ఏజెన్సీ ఎస్అండ్‌పీ రేటింగ్స్ అంచనా వేసింది. ''భారత బ్యాంకుల లాభాలు ఇక మీదట ఆరోగ్యంగానే ఉంటాయి. ప్రభుత్వరంగ బ్యాంకుల మొండి బకాయిల భారం గణనీయంగా పెరిగిన దగ్గర్నుంచి, గత ఏడేళ్లలో ఈ రంగం ఎంతో మెరుగుపడింది'' అని ఎస్అండ్‌పీ గ్లోబల్ రేటింగ్స్ క్రెడిట్ అనలిస్ట్ దీపాలిసేత్ ఛాబ్రియా తెలిపారు. రుణ వసూళ్లు బలంగా ఉన్నాయని, భారత బ్యాంకులు దశాబ్ద కాలంలో మెరుగైన ఫలితాలను చూపిస్తున్నాయని ఎస్అండ్‌పీ రేటింగ్స్ పేర్కొంది. క్రెడిట్ వ్యయాలు తక్కువగా ఉండడం, అధిక నికర వడ్డీ మార్జిన్ల నుంచి ప్రయోజనం పొందడం వల్ల భారత బ్యాంకింగ్ రంగం ప్రయోజనం చూస్తున్నట్టు తెలిపింది. వ్యవస్థ అంతటా ఆస్తులపై సగటు రాబడులు (ఆర్‌వోఏ) 1.2 శాతంగా 2022–23లో ఉంటాయని, 2023–24లో 1.1 శాతంగా ఉండొచ్చని అంచనా వేసింది. కొత్తగా వచ్చే ఎన్‌పీఏలు తక్కువగానే ఉన్నట్టు తెలిపింది. మాఫీ చేసిన రుణాలు వసూలు అవుతుండడంతో వాటి లాభాలు పెరుగుతున్నట్టు పేర్కొంది. భారత్ బలమైన ఆర్థిక పనితీరు బ్యాంకింగ్ రంగానికి సానుకూలమని ఎస్అండ్‌పీ రేటింగ్స్ అంచనా వేసింది. 2026 వరకు భారత్ ఏటా 6–7 శాతం స్థాయిలో వృద్ధిని చూస్తుందని, ప్రపంచంలో వేగంగా వృద్ధి చెందుతున్న ఆర్థిక వ్యవస్థల్లో ఒకటని తెలిపింది.

ఈ దేశాల నుంచి స్టార్టప్‌ల్లోకి పెట్టుబడులు.. పన్ను లేదు



న్యూఢిల్లీ: అమెరికా, బ్రిటన్, ఫ్రాన్స్ తదితర 21 దేశాల నుంచి అన్‌లిస్టెడ్ భారత స్టార్టప్‌ల్లోకి వచ్చే పెట్టుబడులపై ఏంజెల్ ట్యాక్స్ వర్తించదని కేంద్ర ఆర్థిక శాఖ ప్రకటించింది. సింగపూర్, నెదర్లాండ్స్, మారిషస్ నుంచి వచ్చే పెట్టుబడులకు ఈ అవకాశం కల్పించలేదు. ఆస్ట్రేలియా, జర్మనీ, స్పెయిన్ ఆస్ట్రియా, కెనడా, చెక్ రిపబ్లిక్, బెల్జియం, డెన్మార్క్, ఫిన్లాండ్, ఇజ్రాయెల్, ఇటలీ, ఐస్ లాండ్, జపాన్, కొరియా, రష్యా, నార్వే, న్యూజిలాండ్, స్వీడన్ ఏంజెల్ ట్యాక్స్ మినహాయింపు జాబితాలో ఉన్నాయి. అన్‌లిస్టెడ్ కంపెనీల్లోకి వచ్చే విదేశీ పెట్టుబడులను ఏంజెల్ ట్యాక్స్ పరిధిలోకి తీసుకొస్తూ బడ్జెట్‌లో ప్రతిపాదించారు. అనంతరం కొన్ని రకాల విదేశీ ఇన్వెస్టర్ల తరగతులను మినహాయించాలంటూ పరిశ్రమ నుంచి వినతులు రావడంతో.. ప్రత్యక్ష పన్నుల కేంద్ర మండలి తాజా ఆదేశాలు జారీ చేసింది. ఈ నోటిఫికేషన్ ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వచ్చినట్టు పేర్కొంది.

వొడాఫోన్ ఐడియా నష్టాలు తగ్గాయ్

క్యూ4లో రూ. 6,419 కోట్లు



న్యూఢిల్లీ: మొబైల్ టెలికం కంపెనీ వొడాఫోన్ ఐడియా గత ఆర్థిక సంవత్సరం(2022–23) చివరి త్రైమాసికంలో ఆసక్తికర ఫలితాలు సాధించింది. కన్సాలిడేటెడ్ ప్రాతిపదికన జనవరి–మార్చి(క్యూ4)లో నికర నష్టాలు తగ్గి రూ. 6,419 కోట్లకు పరిమితమయ్యాయి. అంతక్రితం ఏడాది (2021–22) ఇదే కాలంలో రూ. 6,513 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం సైతం 3 శాతం పుంజుకుని రూ. 10,507 కోట్లకు చేరింది. కాగా.. మార్చితో ముగిసిన పూర్తి ఏడాదికి నికర నష్టం పెరిగి రూ. 29,298 కోట్లను తాకింది. 2021–22లో రూ. 28,234 కోట్ల నష్టం ప్రకటించింది. మొత్తం ఆదాయం రూ. 38,490 కోట్ల నుంచి రూ. 42,134 కోట్లకు బలపడింది. క్యూ4లో వెచ్చించిన రూ. 560 కోట్లతో కలిపి గతేడాదిలో పెట్టుబడి వ్యయాలు రూ. 3,360 కోట్లకు చేరాయి. 2022 డిసెంబర్‌కల్లా రూ. 2,28,890 కోట్లుగా నమోదైన స్థూల రుణభారం మార్చికల్లా రూ.2,09,260 కోట్లకు తగ్గింది. క్యూ4లో ఒక్కో వినియోగదారునిపై సగటు ఆదాయం(ఏఆర్‌పీయూ) రూ. 124 నుంచి బలపడి రూ. 135ను తాకింది. సబ్‌స్క్రయిబర్ల సంఖ్య 7 శాతం తగ్గి 22.59 కోట్లకు చేరింది. కంపెనీలో ప్రభుత్వ వాటా 33.1 శాతంగా నమోదైంది. స్పెక్ట్రమ్ వాయిదాలు, ఏజీఆర్ బకాయిలపై వడ్డీని ఈక్విటీగా మార్పుచేసి ప్రభుత్వానికి జారీ చేయడంతో రుణ భారం తగ్గినట్లు కంపెనీ వెల్లడించింది.

వొడాఫోన్ ఐడియా షేరు ఎన్ఎస్ఈలో 0.7 శాతం బలపడి రూ. 7 వద్ద ముగిసింది.

సాక్షి స్పోర్ట్స్



షార్జా మాస్టర్స్ టోర్నీ విజేత అర్జున్

ఆరంభ రౌండ్‌లలో తడబడ్డా... చివర్లో అనూహ్యంగా పుంజుకున్న తెలంగాణ గ్రాండ్‌మాస్టర్ ఇరిగేశి అర్జున్ షార్జా మాస్టర్స్ అంతర్జాతీయ చెస్ టోర్నీలో చాంపియన్‌గా అవతరించాడు. గురువారం ముగిసిన ఈ టోర్నీలో నిర్ణీత తొమ్మిది రౌండ్ల తర్వాత అర్జున్ 6.5 పాయింట్లతో అగ్రస్థానాన్ని దక్కించుకున్నాడు. చివరి రౌండ్‌లో తెల్లపావులతో ఆడిన అర్జున్ 27 ఎత్తుల్లో నోదిర్‌బెక్ యాకుబోయెవ్ (ఉజ్బెకిస్తాన్)పై గెలిచాడు. ఎనిమిదో రౌండ్ తర్వాత మరో ఏడుగురితో కలిసి అర్జున్ సంయుక్తంగా ఆధిక్యంలో ఉన్నాడు. అయితే తొమ్మిదో రౌండ్‌లో అర్జున్ గెలుపొందగా... మిగతా ఆరుగురు ప్లేయర్లు తమ గేమ్‌లను 'డ్రా' చేసుకోవడంతో అర్జున్‌కు టైటిల్ ఖరారైంది. భారత్‌కే చెందిన దొమ్మరాజు గుకేశ్ ఆరు పాయింట్లతో మరో ఏడుగురితో కలిసి సంయుక్తంగా రెండో స్థానంలో నిలిచాడు. అయితే మెరుగైన టైబ్రేక్ స్కోరు ఆధారంగా ర్యాంకింగ్‌ను వర్గీకరించగా గుకేశ్‌కు రెండో ర్యాంక్ లభించింది. విజేతగా నిలిచిన అర్జున్‌కు 10 వేల డాలర్లు (రూ. 8 లక్షల 27 వేలు) ప్రైజ్‌మనీగా లభించాయి.

ఫైనల్లో కాదు సెమీస్‌లోనే...

- ఒకే పార్శ్వంలో అల్‌కరాజ్, జొకోవిచ్
- ఫ్రెంచ్ ఓపెన్ 'డ్రా' విడుదల



పారిస్: టెన్నిస్ సీజన్ రెండో గ్రాండ్‌స్లామ్ టోర్నీ ఫ్రెంచ్ ఓపెన్ 'డ్రా' వివరాలను గురువారం విడుదల చేశారు. పురుషుల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ రాఫెల్ నాదల్ గాయం కారణంగా తొలిసారి ఫ్రెంచ్ ఓపెన్‌కు దూరమయ్యాడు. ఈ నేపథ్యంలో ఈసారి కొత్త చాంపియన్ అవతరిస్తాడా లేక మాజీ విజేత జొకోవిచ్ మూడోసారి ఫ్రెంచ్ ఓపెన్ టైటిల్ గెలుస్తాడా వేచి చూడాలి. పురుషుల సింగిల్స్ 'డ్రా' ప్రకారం టాప్ సీడ్, ప్రపంచ నంబర్‌వన్ అల్‌కరాజ్ (స్పెయిన్), మూడో సీడ్ జొకోవిచ్ (సెర్బియా) ఒకే పార్శ్వంలో ఉన్నారు. దాంతో వీరిద్దరు ఫైనల్లో కాకుండా సెమీఫైనల్లోనే తలపడే అవకాశముంది. మరో పార్శ్వం నుంచి రెండో సీడ్ మెద్వెదెవ్ (రష్యా), నాలుగో సీడ్ కాస్పర్ రూడ్ (నార్వే), ఆరో సీడ్ హోల్గర్ రూనె (డెన్మార్క్), ఎనిమిదో సీడ్ జానిక్ సినెర్ (ఇటలీ)లలో ఇద్దరు సెమీఫైనల్ చేరుకుంటారు. మహిళల సింగిల్స్‌లో డిఫెండింగ్ చాంపియన్ ఇగా స్వియాటెక్ (పోలాండ్)కు టాప్ సీడింగ్ కేటాయించారు. గత ఏడాది రన్నరప్ కోకో గాఫ్ (అమెరికా)కు ఆరో సీడ్ దక్కడంతో క్వార్టర్ ఫైనల్లో ఆమెకు స్వియాటెక్ ఎదురయ్యే చాన్స్ ఉంది. ఆదివారం ఫ్రెంచ్ ఓపెన్ టోర్నీ మొదలవుతుంది.

భారత్‌కు రెండో గెలుపు


అరైజీత్ సింగ్

సలాలా (ఒమన్): జూనియర్ ఆసియా కప్ పురుషుల హాకీ టోర్నీలో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టుకు రెండో విజయం దక్కింది. జపాన్‌తో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో టీమిండియా 3–1 గోల్స్ తేడాతో గెలిచింది. భారత్ తరఫున 'మ్యాన్ ఆఫ్ ద మ్యాచ్' అరైజీత్ సింగ్ (36వ ని.లో), శ్రద్ధానంద్ తివారీ (39వ ని.లో), ఉత్తమ్ సింగ్ (56వ ని.లో) ఒక్కోగోల్ చేశారు. జపాన్ జట్టుకు కుంపె యసుదా (19వ ని.లో) ఏకైక గోల్ అందించాడు.

చెన్నైని 'ఢీ'కొట్టేదెవరు?

నేడు రెండో క్వాలిఫయర్‌లో గుజరాత్ టైటాన్స్‌తో ముంబై ఇండియన్స్ పోరు

రాత్రి గం. 7:30 నుంచి స్టార్ స్పోర్ట్స్, జియో సినిమాలో ప్రత్యక్ష ప్రసారం


హార్దిక్ పాండ్యా
రోహిత్ శర్మ

అహ్మదాబాద్: ఐపీఎల్‌లో ఇది సెమీస్ కానీ సెమీస్‌లాంటి మ్యాచ్. డిఫెండింగ్ చాంపియన్ గుజరాత్ టైటాన్స్‌కు ఇంకో చాన్సుండదు. ముంబై వరుసగా మరోమ్యాచ్ గెలుపొందక తప్పదు. ఈ నేపథ్యంలో ఐపీఎల్‌లో మేటి జట్ల మధ్య శుక్రవారం రెండో క్వాలిఫయర్ లో ఆసక్తికర పోరు జరుగనుంది. ఈ టోర్నీలో ఎవరి గడ్డపై వారు గర్జించారు. ఇప్పుడు గుజరాత్ గడ్డపై జరిగే మ్యాచ్ కావడంతో తప్పకుండా టైటాన్స్‌కు అనుకూలతలు ఉంటాయి. అయితే ఐదుసార్లు చాంపియన్ అయిన ముంబైకి ఇదేమంత ప్రతికూలం కానేకాదు. పైగా 'ఇంపాక్ట్ ప్లేయర్' రాకతో అంతా మారింది. ఏదైనా సాధ్యమే... ఏకపక్షం మాత్రం కానేకాదు! ఇంకా చెప్పాలంటే ఈ సీజన్‌లో రెండు జట్లూ చేజింగ్‌లో సత్తా చాటుకొని ఆరేసి మ్యాచ్‌ల్లో నెగ్గాయి.

గుజరాత్ గర్జించాల్సిందే

లీగ్ దశ పాయింట్ల పట్టికలో 'టాప్' లేపిన గుజరాత్ టైటాన్స్ చివరకు తొలి క్వాలిఫయర్‌లో నాలుగుసార్లు చాంపియన్ అయిన చెన్నై ధాటికి బోల్తా పడింది. ఇప్పుడు ఏకంగా ఐదుసార్లు విజేత ముంబై ఇండియన్స్‌ను ఎదుర్కొనేందుకు సిద్ధమైంది. ఓపెనింగ్‌లో సాహా నిరుత్సాహపరుస్తున్నా... స్టార్ ఓపెనర్ గిల్ తన మెరుపు ఇన్నింగ్స్‌లతో చెలరేగుతున్నాడు. బెంగళూరుతో ఆఖరి లీగ్‌లో 'ఇంపాక్ట్' చూపిన విజయ్ శంకర్ గత మ్యాచ్‌లో తేలిపోయాడు. కెప్టెన్ హార్దిక్ పాండ్యా పేలవ ఫామ్‌కు ముగింపు పలికి ఈ మ్యాచ్‌లో పరుగుల ధమాకా సృష్టిస్తే జట్టు విజయానికి ఢోకా ఉండదు. ఎందుకంటే మిగతా పని కానిచ్చేందుకు మిల్లర్, తెవాటియా, రషీద్ ఖాన్ ఉండనే ఉన్నారు.

ఆఖరి దశలో ముంబైకి ఎదురుందా?

గత కొన్ని సీజన్లను పరిశీలిస్తే ముంబై ఇండియన్స్ ఆఖరి దశలో శివాలెత్తుతోంది. తమ ఆఖరి లీగ్ మ్యాచ్‌లో 200 పైచిలుకు పరుగుల లక్ష్యాన్ని 18 ఓవర్లలోనే ఛేదించింది. ఎలిమినేటర్‌లో లక్నోను చిత్తు చేసింది. పటిష్టమైన బ్యాటింగ్, వైవిధ్యమైన బౌలింగ్ కలగలిపిన రోహిత్ సేనను ఢీకొట్టడం అంత సులభం కాదు. గ్రీన్, సూర్యకుమార్, టిమ్ డేవిడ్ అసాధారణ స్థాయిలో హిట్టింగ్ చేయగలరు. ఓపెనింగ్‌లో ఇషాన్–రోహిత్ శర్మ 'పవర్‌ప్లే' మెరుపులు మెరిపిస్తే మిగతా 'రన్స్'రంగాన్ని మిడిలార్డర్ చూసుకుంటుంది. బౌలింగ్ సంచలనం ఆకాశ్ మధ్వాల్ ఇప్పుడు ముంబై అదనపు బలమైంది. ఇతనితోపాటు జోర్డాన్, బెహ్రెన్‌డార్ఫ్, పీయూశ్ చావ్లాలు ప్రత్యర్థి బ్యాటర్ల పనిపడతారు.

పిచ్, వాతావరణం



అహ్మదాబాద్‌లో ఉష్ణోగ్రత 43 డిగ్రీలకు చేరడంతో పిచ్‌పై పగుళ్లు రాకుండా కవర్లు పరిచారు. పేస్, బౌన్స్‌కు అనుకూలమని పిచ్ క్యూరేటర్ అన్నారు. నిలదొక్కుకుంటే బ్యాటర్లకు కలిసొచ్చే పిచ్ ఇది. వర్ష సూచన లేదు.

తుది జట్లు (అంచనా)

ముంబై ఇండియన్స్: రోహిత్ శర్మ (కెప్టెన్), ఇషాన్ కిషన్, గ్రీన్, సూర్యకుమార్, తిలక్ వర్మ, టిమ్ డేవిడ్, నేహల్ వధేరా, జోర్డాన్, హృతిక్ షోకీన్, పీయూశ్ చావ్లా, బెహ్రెన్‌డార్ఫ్, ఆకాశ్ మధ్వాల్.

గుజరాత్ టైటాన్స్: హార్దిక్ పాండ్యా (కెప్టెన్), సాహా, శుబ్‌మన్ గిల్, షనక, మిల్లర్, విజయ్ శంకర్/మోహిత్ శర్మ, రాహుల్ తెవాటియా, రషీద్ ఖాన్, షనక, నూర్ అహ్మద్, షమీ.

3 ఐపీఎల్ టోర్నీలో ముంబై, గుజరాత్ మధ్య మూడు మ్యాచ్‌లు జరిగాయి. రెండింటిలో గుజరాత్, ఒక మ్యాచ్‌లో ముంబై గెలిచాయి.

6 ఐపీఎల్‌లో ముంబై ఆరుసార్లు ఫైనల్ చేరి ఐదుసార్లు విజేతగా నిలిచి, ఒకసారి రన్నరప్‌తో సరిపెట్టుకుంది. గతేడాది ఫైనల్ చేరిన తొలిసారే గుజరాత్ చాంపియన్‌గా నిలిచింది.

శ్రీకాంత్ జోరు...

ప్రపంచ ఐదో ర్యాంకర్‌పై విజయం


శ్రీకాంత్

కౌలాలంపూర్: వ్యక్తిగత విదేశీ కోచ్‌ను నియమించుకున్న తర్వాత భారత స్టార్ షట్లర్, ఆంధ్రప్రదేశ్ క్రీడాకారుడు కిడాంబి శ్రీకాంత్ ఆటతీరులో మార్పు కనిపిస్తోంది. మలేసియా మాస్టర్స్ వరల్డ్ టూర్ సూపర్–500 టోర్నీలో ప్రపంచ 23వ ర్యాంకర్ శ్రీకాంత్ క్వార్టర్ ఫైనల్లోకి దూసుకెళ్లాడు. ప్రపంచ 5వ ర్యాంకర్ కున్లావుత్ వితిద్‌సర్న్ (థాయ్‌లాండ్)తో గురువారం జరిగిన పురుషుల సింగిల్స్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ప్రపంచ మాజీ నంబర్‌వన్ శ్రీకాంత్ 21–19, 21–19తో అద్భుత విజయం సాధించాడు. 45 నిమిషాలపాటు జరిగిన ఈ మ్యాచ్‌లో శ్రీకాంత్ రెండు గేముల్లోనూ ఒకదశలో వెనుకబడి పుంజుకున్నాడు. కున్లావుత్‌పై శ్రీకాంత్‌కిదే తొలి గెలుపు కావడం విశేషం. గతంలో కున్లావుత్‌తో ఆడిన మూడుసార్లూ శ్రీకాంత్ వరుస గేముల్లో ఓడిపోవడం గమనార్హం.

ఆల్ ఇంగ్లండ్ చాంపియన్‌పై నెగ్గిన ప్రణయ్


ప్రణయ్

భారత నంబర్‌వన్ హెచ్ఎస్ ప్రణయ్ మరో గొప్ప విజయంతో క్వార్టర్ ఫైనల్ బెర్త్ ఖరారు చేసుకున్నాడు. తొలి రౌండ్‌లో ప్రపంచ ఆరో ర్యాంకర్‌ను ఓడించిన ప్రణయ్ ప్రిక్వార్టర్ ఫైనల్లో ఈ ఏడాది ఆల్ ఇంగ్లండ్ చాంపియన్, ప్రపంచ 11వ ర్యాంకర్ షి ఫెంగ్ లీని బోల్తా కొట్టించాడు. 70 నిమిషాలపాటు జరిగిన మ్యాచ్‌లో ప్రపంచ తొమ్మిదో ర్యాంకర్ ప్రణయ్ 13–21, 21–16, 21–11తో షి ఫెంగ్ లీపై గెలిచాడు. నిర్ణాయక మూడో గేమ్‌లో స్కోరు 7–5తో వద్ద ప్రణయ్ వరుసగా తొమ్మిది పాయింట్లు నెగ్గి 16–5తో ఆధిక్యంలోకి వెళ్లాడు. ఈ ఆధిక్యాన్ని కాపాడుకొని విజయాన్ని ఖాయం చేసుకున్నాడు. భారత్‌కే చెందిన లక్ష్య సేన్ 14–21, 19–21తో ఎన్జీ కా లాంగ్ అంగుస్ (హాంకాంగ్) చేతిలో ఓటమి చవిచూశాడు.

సింధు వరుసగా 13వసారి...


సింధు

మహిళల సింగిల్స్‌లో భారత స్టార్, ప్రపంచ మాజీ చాంపియన్ పీవీ సింధు క్వార్టర్ ఫైనల్లోకి అడుగుపెట్టింది. ప్రిక్వార్టర్ ఫైనల్లో 13వ ర్యాంకర్ సింధు 21–16, 21–11తో ప్రపంచ 28వ ర్యాంకర్ అయా ఒహోరి (జపాన్)పై గెలిచింది. తొలి గేమ్‌లో ఆరంభంలోనే 4–0తో ముందంజ వేసిన సింధు వెనుదిరిగి చూడలేదు. రెండో గేమ్‌లోనూ ఆమెదే పైచేయిగా నిలిచింది. ఒహోరిపై సింధుకిది వరుసగా 13వ విజయం కావడం విశేషం. నేడు జరిగే క్వార్టర్ ఫైనల్స్‌లో జాంగ్ యి మాన్ (చైనా)తో సింధు; నిషిమోటో (జపాన్)తో ప్రణయ్; క్రిస్టియన్ అడినాటా (ఇండోనేసియా)తో శ్రీకాంత్ తలపడతారు.

హారిక గేమ్ 'డ్రా'



నికోసియా (సైప్రస్): మహిళల గ్రాండ్‌ప్రి సిరీస్ చెస్ టోర్నీలో భారత గ్రాండ్‌మాస్టర్ ద్రోణవల్లి హారిక ఖాతాలో ఏడో 'డ్రా' చేరింది. తాన్ జోంగ్యి (చైనా)తో శుక్రవారం జరిగిన తొమ్మిదో రౌండ్ గేమ్‌ను హారిక 74 ఎత్తుల్లో 'డ్రా' చేసుకుంది. తొమ్మిదో రౌండ్ తర్వాత హారిక 5.5 పాయింట్లతో మరో ఇద్దరితో కలిసి సంయుక్తంగా అగ్రస్థానంలో ఉంది.

భారత జట్టుకు మరో ఓటమి

అడిలైడ్: ఆస్ట్రేలియా పర్యటనలో భారత మహిళల హాకీ జట్టుకు మరో ఓటమి ఎదురైంది. తొలుత ఆస్ట్రేలియా సీనియర్ జట్టుతో మూడు మ్యాచ్‌ల సిరీస్‌ను 0–2తో కోల్పోయిన భారత్... ఆస్ట్రేలియా 'ఎ' జట్టుతో గురువారం జరిగిన తొలి మ్యాచ్‌లో 2–3 గోల్స్ తేడాతో ఓడిపోయింది. ఆసీస్ 'ఎ' తరఫున అలైస్ అర్నాట్ (18వ ని.లో) ఒక గోల్ చేయగా... రూబీ హారిస్ (20వ, 35వ ని.లో) రెండు గోల్స్ సాధించింది. భారత్ జట్టుకు సలీమా టెటె (40వ ని.లో), సంగీత కుమారి (54వ ని.లో) ఒక్కో గోల్ అందించారు. ఈ రెండు జట్ల మధ్య సిరీస్‌లోని చివరిదైన రెండో మ్యాచ్ శనివారం ఇదే వేదికపై జరుగుతుంది.

క్లుప్తంగా...

నాగార్జునసాగర్‌లో హైకోర్టు న్యాయమూర్తి



నాగార్జునసాగర్: తెలంగాణ హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ ఎం.జి.ప్రియదర్శిని కుటుంబ సభ్యులతో కలిసి గురువారం నాగార్జునసాగర్‌ను సందర్శించారు. నాగార్జునకొండకు లాంచీలో వెళ్లి అక్కడి మ్యూజియంలో బుద్ధుని శిల్పాలు, స్తూపాలను తిలకించారు. అనంతరం బుద్ధవనాన్ని సందర్శించారు. వీరివెంట నల్లగొండ జిల్లా న్యాయమూర్తి ఎం.నాగరాజు, జిల్లా న్యాయశాఖ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు ఎం.వీరబాబు తదితరులు ఉన్నారు.

బంగారు శఠగోపానికి రూ.62 లక్షల విరాళం



యాదగిరిగుట్ట: యాదాద్రి శ్రీలక్ష్మీనరసింహ స్వామి బంగారు శఠగోపం తయారీకి మాజీ ఎమ్మెల్సీ చిన్నపరెడ్డి రూ.62 లక్షల విరాళం అందజేశారు. చిన్నపరెడ్డి కుటుంబ సభ్యులతో కలిసి గురువారం గర్భాలయంలో స్వయంభూ, ప్రతిష్ఠాలంకార మూర్తులను దర్శించుకొని, అష్టోత్తర పూజలో పాల్గొన్నారు. అనంతరం బంగారు శఠగోపం తయారీకి రూ.62 లక్షల డీడీని అధికారులకు అందజేశారు.

నేడు, రేపు టీఎస్ ఐసెట్

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023–2024 విద్యా సంవత్సరంలో ప్రవేశాలకుగాను శుక్ర, శనివారాల్లో జరగనున్న టీఎస్ ఐసెట్‌కు అన్ని ఏర్పాట్లు చేసినట్లు టీఎస్ ఐసెట్ కన్వీనర్, కాకతీయ యూనివర్సిటీ కామర్స్ అండ్ బిజినెస్ మేనేజ్‌మెంట్ కళాశాల ప్రొఫెసర్ పి.వరలక్ష్మి గురువారం తెలిపారు. ఆన్‌లైన్‌లో జరగనున్న ఈ పరీక్షలకు 72 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశారు. మొత్తంగా 75,932 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. శుక్రవారం, శనివారాల్లో ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 గంటల వరకు, మధ్యాహ్నం 2:30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు నాలుగు సెషన్లలో పరీక్షలు జరగనున్నాయి. ఉదయం సెషన్‌కు 8:30 గంటల నుంచే కేంద్రాల్లోకి అనుమతించనుండగా మధ్యాహ్నం సెషన్‌కు ఒంటి గంట నుంచే లోనికి వెళ్లొచ్చు. నిర్దేశించిన సమయానికి నిమిషం ఆలస్యమైనా పరీక్ష కేంద్రాల్లోకి అనుమతించరు. అభ్యర్థులు హాల్‌టికెట్లతోపాటు ఆధార్ వంటి ధ్రువీకరణ ఐడీ కార్డు తీసుకురావాలని.. పూర్తి వివరాలకు టీఎస్ ఐసెట్ వెబ్‌సైట్‌ను చూడాలని కన్వీనర్ కోరారు.

'మళ్లీ పెళ్లి'.. ఆపండి
కోర్టులో నరేష్ భార్య రమ్యా రఘుపతి పిటిషన్

కూకట్‌పల్లి (హైదరాబాద్): నరేష్, పవిత్ర లోకేష్ నటించిన 'మళ్లీ పెళ్లి'చిత్రం శుక్రవారం విడుదల కానున్న నేపథ్యంలో.. ప్రదర్శించకుండా ఆపాలని కోరుతూ నరేష్ మూడో భార్య రమ్యా రఘుపతి కూకట్‌పల్లి ఫ్యామిలీ కోర్టులో పిటిషన్ దాఖలు చేశారు. ఆ సినిమాలో కొన్ని సన్నివేశాలు తన ప్రతిష్ఠ కించపరిచేలా ఉన్నాయని ఆమె పేర్కొన్నారు. కాగా ఇదే కోర్టులో వారి మధ్య కేసు నడుస్తోంది. బుధవారం రమ్యా రఘుపతి న్యాయవాది ఆమె తరఫున పిటిషన్ దాఖలు చేశారు. కానీ నరేష్ తరఫు న్యాయవాది కోర్టుకు హాజరుకాలేదు. పిటిషన్‌ను స్వీకరించిన న్యాయస్థానం విచారణను జూన్ 28కి వాయిదా వేసింది.


గ్రూప్-1 ప్రిలిమ్స్‌పై మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేం
హైకోర్టు స్పష్టీకరణ

సాక్షి, హైదరాబాద్: టీఎస్‌పీఎస్సీ జూన్ 11న నిర్వహించనున్న గ్రూప్-1 ప్రిలిమ్స్ పరీక్షను వాయిదా వేయాలని కోరుతూ దాఖలైన పిటిషన్‌పై ఎలాంటి మధ్యంతర ఉత్తర్వులు ఇవ్వలేమని హైకోర్టు స్పష్టంచేసింది. ప్రతివాదులైన హోంశాఖ ముఖ్య కార్యదర్శి, టీఎస్‌పీఎస్సీ చైర్మన్ తదితరులకు నోటీసులు జారీ చేసింది. తదుపరి విచారణ నాటికి కౌంటర్ దాఖలు చేయాలని ఆదేశిస్తూ, విచారణను జూన్ 20కి వాయిదా వేసింది. ప్రిలిమ్స్ వాయిదా కోరుతూ రంగారెడ్డి జిల్లా అబ్దుల్లాపూర్‌మెట్ మండలం తుర్కయాంజాల్‌కు చెందిన గ్రూప్-1 అభ్యర్థి బి.వెంకటేశ్ సహా పలువురు పిటిషన్ దాఖలు చేసిన విషయం తెలిసిందే. ఈ పిటిషన్ తొలుత జస్టిస్ కె.లక్ష్మణ్ వద్దకు విచారణకు వచ్చింది. తన కూతురు గ్రూప్-1 పరీక్ష రాస్తున్న నేపథ్యంలో విచారణ చేపట్టడం సరికాదంటూ కేసును మరో బెంచ్‌కు బదిలీ చేస్తున్నట్లు చెప్పారు. అనంతరం అభ్యర్థుల పిటిషన్‌పై జస్టిస్ పుల్ల కార్తీక్ విచారణ చేపట్టారు. ప్రభుత్వం తరఫున అడ్వొకేట్ జనరల్ బీఎస్ ప్రసాద్ వాదనలు వినిపించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. కౌంటర్ దాఖలు చేయాలని ప్రతివాదులను ఆదేశిస్తూ, విచారణ వాయిదా వేశారు.

మహానగరంలో మానసిక కల్లోలం!

సాక్షి, హైదరాబాద్

ఇతర నగరాలతో పోలిస్తే భాగ్యనగరంలో చాలా మందిలో వయసులకు అతీతంగా ఆత్మహత్య ధోరణులు ఎక్కువగా ఉన్నట్లు తాజా అధ్యయనం వెల్లడించింది. మానసిక ఆరోగ్యంలో వచ్చిన మార్పులపై ఇప్పటివరకు సుమారు 2,500 మంది నగరవాసుల నుంచి సేకరించిన వివరాల ఆధారంగా ఈ విషయం వెలుగులోకి వచ్చినట్లు పేర్కొంది. అయితే సర్వే ఇంకా కొనసాగుతోందని... మరో నెల తర్వాత ఈ అంశంపై పూర్తిస్థాయిలో స్పష్టత రానుందని సర్వే బృందానికి నేతృత్వం వహిస్తున్న వారిలో ఒకరైన హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ మెడికల్ సైన్సెస్ స్కూల్ ప్రొఫెసర్ బి.ఆర్.షమన్నా తెలిపారు. దేశంలో కోవిడ్ విజృంభణకు ముందు, తర్వాత అర్బన్ ప్రాంతాల ప్రజల మానసిక ఆరోగ్య పరిస్థితుల్లో అనూహ్య మార్పులు వచ్చిన నేపథ్యంలో కేంద్రం దేశవ్యాప్తంగా ఈ సర్వే నిర్వహిస్తోంది. నేషనల్ మెంటల్ హెల్త్ సర్వే–పార్ట్ 2 పేరిట హైదరాబాద్‌తోపాటు ఢిల్లీ, ముంబై, చెన్నై, బెంగళూరు, కోల్‌కతాలలో ఈ అధ్యయనం చేపడుతోంది. హైదరాబాద్‌లో జరుగుతున్న ఈ అధ్యయనానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ, ఎర్రగడ్డలోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్‌లు ఇన్వెస్టిగేటర్లుగా వ్యవహరిస్తున్నాయి.



మిగతా నగరాలకన్నా హైదరాబాద్‌లో ఎక్కువగా ఆత్మహత్యా ధోరణులు

వ్యసనాలు, ఒత్తిళ్లు, ఆందోళనల వల్లే...

కోవిడ్‌కు ముందు, తర్వాత మానసిక ఆరోగ్యంపై సర్వేలో వెల్లడి

దేశవ్యాప్తంగా కొనసాగుతున్న అధ్యయనం.. మరో నెలలో పూర్తి స్పష్టత

అన్నింటినీ టచ్ చేస్తూ...

సాధారణ సర్వేల రీతిలో ఇందులోనూ 75 ప్రశ్నలు ఉన్నప్పటికీ పరిస్థితినిబట్టి మార్పుచేర్పులకు అవకాశం ఇస్తూ మొత్తం 300 ప్రశ్నలు ఉన్నాయి. లాటరీ వ్యసనం, గుర్రపు పందేలు, స్ట్రీమింగ్ వీడియోలతోపాటు ఇంటర్నెట్, మొబైల్ వ్యసనం వంటి అంశాలపై ప్రశ్నలను కూడా చేర్చారు. కోవిడ్ మహమ్మారి నేపథ్యంలో ఎలాంటి మానసిక స్థితిని ఎదుర్కొన్నారు వంటి ప్రశ్నలు పొందుపరిచారు. కోవిడ్ తర్వాత ప్రజల మానసిక ఆరోగ్య భారాన్ని అర్థం చేసుకోవడానికి దోహదపడుతుందని పరిశోధకులు అంటున్నారు.

టీనేజర్ల నుంచి...

సర్వే బృందాలు గ్రేటర్ హైదరాబాద్ పరిధిలో 3,600గా తీసుకున్న శాంపిల్ సైజ్‌లో టీనేజర్లు సహా ఆపై వయసుగల వారు ఉన్నారు. వారందరినీ ముఖాముఖి ప్రశ్నించి సమాధానాలు సేకరిస్తున్నారు. ఆ సమాచారాన్ని సర్వేకు నోడల్ ఏజెన్సీగా వ్యవహరిస్తున్న బెంగళూరులోని నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మెంటల్ హెల్త్ అండ్ న్యూరోసైన్సెస్ (నిమ్హాన్స్)కు ఏ రోజుకారోజు అప్‌లోడ్ చేస్తున్నారు. ఈ సర్వే జూన్ నెలాఖరులోపే పూర్తవుతుందంటున్న పరిశోధకులు... నగరంలో రోహింగ్యాలు, ట్రాన్స్‌జెండర్ల వంటి వారిని కూడా ప్రత్యేక కేటగిరీగా చేర్చి సర్వే చేయవచ్చా అనే అంశాన్ని కూడా పరిశీలిస్తున్నారు.

బస్తీల్లో సై...కాలనీల్లో నై..

సర్వే కోసం నగరంలో 60 క్లస్టర్లను గుర్తించగా అందులో 20 మురికివాడల్లోనే ఉన్నాయి. మురికివాడల నివాసితులు అనేక వ్యసనాలతోపాటు ఇతర సమస్యలతో సతమతమవుతున్నా సర్వే ప్రశ్నలకు తక్షణమే సమాధానాలిస్తున్నారని బృంద సభ్యులు అంటున్నారు. అదే సమయంలో కాలనీల్లో నివసించే ప్రజల నుంచి సమాధానాలు పొందడం కఠినంగా ఉందని... తమ ప్రశ్నలకు చాలా మంది ఎదురు ప్రశ్నలు వేస్తున్నారని వివరిస్తున్నారు. తమ కోసం సమయం వెచ్చించడానికి తేలికగా ఒప్పుకోవడం లేదని చెబుతున్నారు.

అన్ని చోట్లా పూర్తయ్యాకే స్పష్టత...



ప్రొ. బి.ఆర్.షమన్నా
మెడికల్ సైన్సెస్ స్కూల్, హెచ్‌సీయూ

అన్ని నగరాల్లో పూర్తి సర్వే ఫలితాలు వచ్చాకే స్పష్టత వస్తుంది. బెంగళూరు, ముంబైలలో అధ్యయనాలు పూర్తి కావచ్చాయి. చెన్నై, హైదరాబాద్‌లలో దాదాపుగా ఒకేస్థాయిలో ఉన్నాయి. ఢిల్లీ, కోల్‌కతాలలో సర్వేలు కాస్త నెమ్మదిగా సాగుతున్నాయి. ఆయా నగరాలకు చెందిన అధ్యయన ఫలితాలు కూడా వచ్చాక 'నిమ్హాన్స్'వాటిని విశ్లేషించి మరో నెల రోజుల్లో పూర్తి వివరాలు వెల్లడిస్తుందని భావిస్తున్నాం.

భారీగా పెట్టుబడులు.. 42,000 కొలువులు

రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కేటీఆర్ విదేశీ పర్యటన విజయవంతం

- వివిధ రంగాల్లో పెట్టుబడులకు ముందుకొచ్చిన పలు దిగ్గజ సంస్థలు
- 80కి పైగా వాణిజ్య సమావేశాలు, రెండు సదస్సుల్లో పాల్గొన్న కేటీఆర్
- విదేశీ గడ్డపై తెలంగాణ సాధించిన జలవిజయం ఆవిష్కరణ
- ప్రవాస భారతీయ సీఈవోలతోనూ భేటీ



మంత్రి కేటీఆర్ బృందంలో ఐటీ శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక విభాగ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ డిజిటల్ మీడియా వింగ్ డైరెక్టర్ దిలీప్ కొణతం

సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి కె. తారక రామారావు యూకే, యూఎస్ పర్యటన గురువారంతో ముగిసింది. రెండు వారాలపాటు సాగిన పర్యటనలో 80కిపైగా వాణిజ్య సమావేశాలు, ఐదు రంగాలకు సంబంధించి రౌండ్ టేబుల్ సమావేశాలు, రెండు సదస్సుల్లో రాష్ట్రానికి భారీగా పెట్టుబడులను కేటీఆర్ ఆకర్షించగలిగారు. తద్వారా తెలంగాణలో సుమారు 42 వేల ఉద్యోగాల కల్పనకు మార్గం సుగమమైంది.

వార్నర్ బ్రదర్స్ మొదలు జ్యాప్‌కామ్ వరకు..

లండన్, న్యూయార్క్, వాషింగ్టన్ డీసీ, హ్యూస్టన్, హెండర్సన్, బోస్టన్ నగరాల్లో జరిగిన కేటీఆర్ వివిధ సంస్థల ప్రతినిధులతో చేపట్టిన వాణిజ్య సమావేశాల్లో భారీ పెట్టుబడులకు సంబంధించిన ప్రకటనలు వెలువడ్డాయి. ముఖ్యంగా బ్యాంకింగ్, బీమా, ఎమర్జింగ్ టెక్నాలజీస్, ఐటీ, ఐటీ ఆధారిత సేవలు, ఏరోస్పేస్, రక్షణ, లైఫ్ సైన్సెస్, మెడికల్ డివైసెస్, డిజిటల్ సొల్యూషన్స్, డేటా సెంటర్స్ తదితర రంగాల్లో అంతర్జాతీయ సంస్థల నుంచి పెట్టుబడుల ప్రకటనలు వచ్చాయి. తద్వారా 42 వేల ప్రత్యక్ష ఉద్యోగాలతోపాటు పరోక్షంగా మరో 3–4 రెట్లు ఉద్యోగాలు వచ్చే అవకాశం ఉందని ప్రభుత్వ వర్గాలు చెబుతున్నాయి. రాష్ట్రంలో భారీ పెట్టుబడులు ప్రకటించిన సంస్థల జాబితాలో వార్నర్ బ్రదర్స్, డిస్నీ, మెడ్‌ట్రోనిక్, స్టేట్ స్ట్రీట్, లండన్ స్టాక్ ఎక్స్ఛేంజ్ గ్రూప్, టెక్ ఎఫ్ఎంసీ, అలియంజ్ గ్రూప్, స్టెమ్ క్యూర్స్, జ్యాప్‌కామ్ తదితర సంస్థలు ఉన్నాయి. వాణిజ్య సమావేశాలతోపాటు రెండు ప్రధాన సదస్సులోనూ మంత్రి కేటీఆర్ ప్రసంగించారు. లండన్‌లో ఈ నెల 12న 'ఐడియాస్ ఫర్ ఇండియా'సదస్సులో తెలంగాణ మోడల్‌ను కేటీఆర్ వివరించారు. ఆ తర్వాత ఈ నెల 15న కొంగరకలాన్‌లో జరిగిన ఫాక్స్‌కాన్ కంపెనీ శంకుస్థాపనకు వచ్చిన కేటీఆర్... ఆ వెంటనే అమెరికా టూర్‌కు వెళ్లారు. ఈ నెల 22న హెండర్‌సన్‌లో జరిగిన సదస్సులో అమెరికన్ సొసైటీ ఆఫ్ సివిల్ ఇంజనీర్స్ సదస్సులో కాళేశ్వరం ప్రాజెక్టు, మిషన్ భగీరథ పథకం ద్వారా తెలంగాణ సాధించిన జల విజయాన్ని ఆవిష్కరించారు. తెలంగాణలో 9 ఏళ్లలో జరిగిన అభివృద్ధిని వివరించారు. అలాగే రాష్ట్రంలోని ద్వితీయశ్రేణి నగరాలకు ఐటీ రంగాన్ని విస్తరించేందుకు చేస్తున్న ప్రయత్నాలను ఎన్నారై సీఈఓలతో జరిగిన సమావేశంలో కేటీఆర్ వివరించారు. కేటీఆర్ వెంట వెళ్లిన ప్రతినిధి బృందంలో ఐటీ, పరిశ్రమల శాఖ ముఖ్యకార్యదర్శి జయేశ్ రంజన్, పెట్టుబడుల ప్రోత్సాహక విభాగ ప్రత్యేక కార్యదర్శి విష్ణువర్ధన్‌రెడ్డి, తెలంగాణ డిజిటల్ మీడియా వింగ్ డైరెక్టర్ దిలీప్ కొణతం తదితరులు ఉన్నారు.

శ్రీకృష్ణుడి రూప ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటుకు అనుమతి నో

స్టే పొడిగిస్తూ విచారణను వాయిదా వేసిన హైకోర్టు

సాక్షి, హైదరాబాద్: ఖమ్మంలోని లకారం చెరువులో శ్రీకృష్ణుడి రూపంలోని ఎన్టీఆర్ విగ్రహ ప్రతిష్టాపనకు హైకోర్టు అనుమతి నిరాకరించింది. గతంలో ఇచ్చిన స్టేను పొడిగిస్తూ తదుపరి విచారణను జూన్ 6కు వాయిదా వేసింది. ఎన్టీఆర్ శతజయంతి వేడుకలను పురస్కరించుకుని లకారం చెరువులో 54 అడుగుల ఎన్టీఆర్ విగ్రహం ఏర్పాటు చేయాలని ప్రభుత్వం నిర్ణయించిన విషయం విదితమే. ఈ విగ్రహావిష్కరణను ఈ నెల 28న నిర్వహించాలని ఇప్పటికే ఖరారు చేశారు. తెలుగు అసోసియేషన్ ఆఫ్ నార్త్ అమెరికా (తానా) ఈ విగ్రహాన్ని అందిస్తోంది. అయితే శ్రీకృష్ణుడి రూపంలో ఉన్న ఎన్టీఆర్ విగ్రహ ఏర్పాటును సవాల్ చేస్తూ భారత యాదవ సమితి, ఆదిభట్ల శ్రీకళా పీఠం, బహుజన జాయింట్ యాక్షన్ కమిటీ పిటిషన్లు దాఖలు చేశాయి. వీటిపై జస్టిస్ కె.లక్ష్మణ్ ధర్మాసనం గురువారం విచారణ చేపట్టింది. పిటిషనర్ల తరఫు న్యాయవాది వెంకట్‌యాదవ్ వాదనలు వినిపిస్తూ.. బహిరంగ ప్రదేశాల్లో విగ్రహాల ఏర్పాటు సుప్రీంకోర్టు తీర్పునకు విరుద్ధమన్నారు. లకారం ట్యాంక్‌బండ్‌పై విగ్రహ ఏర్పాటుకు సదరు కమిటీ అనుమతి ఇస్తే.. చెరువు మధ్యలో ఏర్పాటు చేయడం చట్ట ఉల్లంఘనే అవుతుందని చెప్పారు. ఏఏజీ రామచంద్రరావు వాదనలు వినిపిస్తూ.. బస్టాండ్లు, రైల్వే స్టేషన్ల లాంటి వాటిని బహిరంగ ప్రదేశంగా పేర్కొనవచ్చన్నారు. పిటిషనర్ న్యాయవాది జోక్యం చేసుకుని.. ప్రజలకు సంబంధించిన బహిరంగ ప్రదేశం కానప్పుడు ప్రభుత్వం దాదాపు రూ. 3.5 కోట్ల వ్యయంతో ట్యాంక్‌బండ్ నిర్మాణం ఎందుకు చేపట్టిందని ప్రశ్నించారు. వాదనలు విన్న న్యాయమూర్తి.. విగ్రహ ఏర్పాటుకు అనుమతి నిరాకరించారు.

కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్‌లో నగరవాసి

రెడ్ కార్పెట్‌పై బిజినెస్ టైకూన్ సుధా రెడ్డి



బంజారాహిల్స్ (హైదరాబాద్): ప్రతిష్టాత్మకమైన కేన్స్ ఫిల్మ్ ఫెస్టివల్ వేదికపై నగరానికి చెందిన బిజినెస్ టైకూన్ సుధా రెడ్డి సందడి చేశారు. ప్రఖ్యాత డైరెక్టర్ మార్టిన్ స్కోర్సేస్, హాలీవుడ్ నటుడు లియోనార్డో డికాప్రియో చిత్రం 'కిల్లర్స్ ఆఫ్ ది ఫ్లవర్ మూన్' నేషనల్ ప్రీమియర్‌లో భాగంగా ఆమె రెడ్ కార్పెట్ వాక్ చేశారు. స్టార్–స్టడెడ్ ఫెస్టివల్‌లో ప్రపంచ ప్రముఖులతో అలరించే రెడ్ కార్పెట్‌పై వాక్ చేసిన మొట్టమొదటి సినిమాయేతర సెలబ్రిటీ సుధారెడ్డి కావడంవిశేషం. ఈ సందర్భంగా ఆమె కస్టమ్–మేడ్ ఫల్గుణి షేన్ పీకాక్ పీచ్ పెర్ల్ డ్రెప్ చీరలో ఆకట్టుకున్నారు. అనంతరం ప్రతిష్టాత్మకమైన బీచ్ డెస్టినేషన్, ప్లేజ్ హోటల్ బారియర్ లే మెజెస్టిక్‌లో జరిగిన మేడమ్ ఫిగరో ఈవెంట్‌లో తళుక్కుమన్నారు.

రవికిశోర్ ద్వారా మరో ముగ్గురికి..

- చేతులు మారిన టీఎస్‌పీఎస్సీ పరీక్ష పేపర్లు
- గురువారం ముగ్గురిని అరెస్టు చేసిన సిట్ అధికారులు

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్ర పబ్లిక్ సర్వీస్ కమిషన్ (టీఎస్‌పీఎస్సీ) నిర్వహించిన పోటీ పరీక్షల ప్రశ్నపత్రాల లీకేజీ కేసులో సిట్ అధికారులు గురువారం మరో ముగ్గురు నిందితులను అరెస్ట్ చేశారు. దీంతో ఈ కేసులో నిందితుల సంఖ్య 43కి, అరెస్ట్ అయిన వారి సంఖ్య 42కు చేరింది. ఈ వ్యవహారంలో సూత్రధారులుగా ఉన్న కమిషన్ మాజీ ఉద్యోగులు పులిదిండి ప్రవీణ్‌కుమార్, రాజశేఖర్‌రెడ్డి ద్వారా అనేక ప్రశ్నపత్రాలు ఒకప్పుడు కమిషన్‌లో పని చేసిన వీరి స్నేహితుడు సురేశ్‌కు చేరాయి. ఇతడు వీటిలో అసిస్టెంట్ ఇంజినీర్ (ఏఈ), డివిజనల్ అకౌంట్స్ ఆఫీసర్ (డీఏఓ) పేపర్లను తన అపార్ట్‌మెంట్‌లో నివసించే వారికి మధ్యవర్తి ద్వారా విక్రయించాడు. ఈ వ్యవహారంలో నల్లగొండ జిల్లా నకిరేకల్‌లో జూనియర్ అసిస్టెంట్‌గా పనిచేస్తున్న పూల రవికిశోర్ మధ్యవర్తిగా వ్యవహరించాడు. సురేశ్ గతంలోనే అరెస్టు కాగా... రవికిశోర్‌తోపాటు ఏఈ, డీఏఓ పేపర్లు ఖరీదు చేసిన అన్నాచెల్లెళ్లు రాయపురం విక్రమ్, దివ్యలను బుధవారం అరెస్టు చేశారు. సురేశ్ ద్వారా మొత్తం 14 పేపర్లు చేరినట్లు సిట్ ఆధారాలు సేకరించింది. వీరిలో దళారులతోపాటు అభ్యర్థులూ ఉన్నారు. మరోపక్క రవికిశోర్ ఏఈ సివిల్ పేపర్లను తమ బంధువులకు ఉచితంగా ఇవ్వడంతోపాటు బయటి వారికి అమ్మినట్లు గుర్తించారు. ఈ మాస్టర్ క్వశ్చన్ పేపర్‌ను రూ.3 లక్షలకు కొనేందుకు ఒప్పందం చేసుకుని, రూ.లక్ష అడ్వాన్స్ చెల్లించిన భరత్ నాయక్‌ను, వరంగల్‌కు చెందిన బంధువులు పసి కాంతి రోహిత్‌కుమార్, గాడె సాయి మధులను గురువారం అరెస్టు చేశారు. ప్రశ్నపత్రాలు సొంతం చేసుకుని రాసిన వారిలో చాలామందికి అత్యధిక మార్కులు వచ్చినట్లు సిట్ అధికారులు చెప్తున్నారు.

పిల్లల అక్రమ రవాణా ముఠా అరెస్టు

26 మంది పిల్లలను కాపాడిన మహిళా భద్రత విభాగం

సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో ఎనిమిది మందిని అరెస్టు చేసిన పోలీసులు

సాక్షి, హైదరాబాద్: బాలకార్మికులుగా మార్చేందుకు తరలిస్తున్న పిల్లలను రాష్ట్ర మహిళా భద్రత విభాగం యాంటీ హ్యూమన్ ట్రాఫికింగ్ యూనిట్ కాపాడింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో జీఆర్పీ (గవర్నమెంట్ రైల్వే పోలీస్), ఆర్పీఎఫ్, బచ్‌పన్ బచావో ఆందోళన్ ఎన్జీఓతో కలసి చేపట్టిన ఈ ఆపరేషన్‌లో మొత్తం 26 మంది చిన్నారులను కాపాడినట్టు రాష్ట్ర మహిళా భద్రత విభాగం అదనపు డీజీ శిఖాగోయల్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. పశ్చిమ బెంగాల్, జార్ఖండ్ రాష్ట్రాలకు చెందిన 13 నుంచి 18 ఏళ్ల మధ్య వయసు పిల్లలను ఈస్ట్ కోస్ట్ ఎక్స్‌ప్రెస్‌లో విజయవాడ నుంచి సికింద్రాబాద్‌కు తరలిస్తున్నట్టు సమాచారం అందడంతో అధికారులు ఆ పిల్లలను రక్షించేందుకు ఆపరేషన్ చేపట్టారు. వీరందరినీ హైదరాబాద్‌లోని వివిధ కర్మాగారాల్లో పనిచేయించేందుకు తీసుకువస్తున్నట్టు అధికారులకు తెలిసింది. సికింద్రాబాద్ రైల్వే స్టేషన్‌లో మాటు వేసిన పోలీసులు మొత్తం ఎనిమిది మంది ముఠా సభ్యులను అరెస్టు చేశారు. వీరిపై ఐపీసీ సెక్షన్ 374, 341ల కింద సికింద్రాబాద్ జీఆర్పీ పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదు చేశారు. పట్టుబడిన నిందితులను పశ్చిమ బెంగాల్‌కు చెందిన రంజాన్ మోల్లా, షేక్ సైదులు, ప్రియారుల్‌షేక్, జాకీర్ అలీ, సురోజిత్ సంత్రా, జార్ఖండ్‌కు చెందిన పింటుదాస్, హైదరాబాద్ చార్మినార్‌కు చెందిన సుసేన్ తుడు, అబ్దుల్ అల్మాని మోండేల్‌గా గుర్తించారు. కాపాడిన 26 మంది పిల్లలను సైదాబాద్‌లోని ప్రభుత్వ హోమ్‌కు పంపినట్టు అధికారులు తెలిపారు. పిల్లల అక్రమ రవాణా ముఠా సభ్యులను పట్టుకున్న సిబ్బందిని అదనపు డీజీ శిఖాగోయల్ అభినందించారు.

నేడు మోస్తరు వర్షాలు!



కొనసాగుతున్న ఉపరితల ద్రోణి

సాక్షి, హైదరాబాద్: పశ్చిమ మధ్యప్రదేశ్ నుంచి విదర్భ, తెలంగాణ, కోస్తా కర్ణాటక వరకు ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది సముద్ర మట్టం నుంచి సగటున కిలోమీటర్ల ఎత్తులో ఉంది. ఉపరితల ద్రోణి ప్రభావంతో శుక్రవారం రాష్ట్రంలో అక్కడక్కడా తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు నమోదయ్యే అవకాశం ఉన్నట్లు వాతావరణ శాఖ అంచనావేసింది. ఉత్తర తెలంగాణ జిల్లాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 40–42 డిగ్రీ సెల్సియస్ మధ్య నమోదయ్యే అవకాశంఉంటుందని చెప్పింది. గ్రేటర్ హైదరాబాద్ పరిసర ప్రాంతాల్లో గరిష్ట ఉష్ణోగ్రతలు 38–40 డిగ్రీ సెల్సియస్ మధ్య నమోదు కానున్నట్లు వెల్లడించింది. గురువారం రాష్ట్రంలో గరిష్ట ఉష్ణోగ్రత పెద్దపల్లి జిల్లా ముత్తారంలో 43.9 డిగ్రీ సెల్సియస్ నమోదైంది.

రాష్ట్రంలో అత్యధిక ఉష్ణోగ్రత నమోదైన ప్రాంతాలు

ప్రాంతం	జిల్లా	గరిష్ట ఉష్ణోగ్రత
ముత్తారం	పెద్దపల్లి	43.9
జూలూరుపాడు	కొత్తగూడెం	43.8
తనుగుల	కరీంనగర్	43.8
హాజీపూర్	మంచిర్యాల	43.6
గార్ల	మహబూబాబాద్	43.5

రాష్ట్రంలోని ప్రధాన కేంద్రాల్లో నమోదైన గరిష్ట ఉష్ణోగ్రతలు (సెల్సియస్‌లో)



కేంద్రం	గరిష్టం	కేంద్రం	గరిష్టం
నల్లగొండ	42.5	నిజామాబాద్	40.4
రామగుండం	41.6	హనుమకొండ	40.0
ఖమ్మం	41.5	భద్రాచలం	39.0
ఆదిలాబాద్	41.3	హైదరాబాద్	37.2
మహబూబ్‌నగర్	40.8	హకీంపేట్	37.0
మెదక్	40.6	దుండిగల్	37.0

కేంద్రం ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు!

- 2న గోల్కొండ కోటలో నిర్వహణకు నిర్ణయం
- జెండా వందనం, కేంద్ర బలగాల కవాతు
- కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి వెల్లడి



సమావేశంలో కేంద్రమంత్రి కిషన్ రెడ్డి, డాక్టర్ లక్ష్మణ్, శశిధర్ రెడ్డి తదితరులు

సాక్షి, హైదరాబాద్/రసూల్‌పురా: జూన్ 2న తెలంగాణ ఆవిర్భావ దినోత్సవాన్ని పురస్కరించుకుని కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో గోల్కొండ కోటలో జాతీయజెండాను ఎగురవేయనున్నట్టు కేంద్ర సాంస్కృతిక, పర్యాటకశాఖల మంత్రి జి.కిషన్‌రెడ్డి పేర్కొన్నట్టు విశ్వసనీయ సమాచారం. ఈ ఉత్సవాల్లో భాగంగా ఉదయం జెండా వందనం సందర్భంగా కేంద్ర బలగాల కవాతు కూడా నిర్వహించనున్నారు. సాయంత్రం గోల్కొండ కోటలో సాంస్కృతిక కార్యక్రమాలు సైతం నిర్వహించనున్నట్టు తెలుస్తోంది. గురువారం జరిగిన బీజేపీ హైదరాబాద్ సెంట్రల్ జిల్లా వర్కింగ్ కమిటీ సమావేశంలో కిషన్‌రెడ్డి రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాల నిర్వహణకు సంబంధించి ప్రకటన చేసినట్లు పార్టీ వర్గాలు చెప్పాయి. రాష్ట్ర ప్రభుత్వ ఆధ్వర్యంలో జూన్ 2 నుంచి 21 రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా తెలంగాణ ఆవిర్భావ దశాబ్ది ఉత్సవాలు నిర్వహిస్తున్న సంగతి తెలిసిందే. ఈ నేపథ్యంలో కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో చారిత్రక గోల్కొండ కోటలో నిర్వహించాలని నిర్ణయించినట్టు తెలుస్తోంది. ఈ ఉత్సవాల్లో కేంద్ర ప్రభుత్వం నుంచి కిషన్‌రెడ్డి లేదా సీనియర్ మంత్రి జాతీయజెండాను ఎగురవేసే అవకాశముంది. ఈ ఉత్సవాల్లో పాల్గొనాల్సిందిగా రాష్ట్ర ప్రభుత్వంతోపాటు సీఎం కేసీఆర్, ప్రభుత్వ ప్రధానకార్యదర్శి, డీజీపీలకు ఆహ్వానాలు పంపనున్నట్లు సమాచారం. గత సెప్టెంబర్ 17న హైదరాబాద్ విమోచన దినోత్సవాన్ని సికింద్రాబాద్ పరేడ్‌గ్రౌండ్స్‌లో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో అధికారికంగా నిర్వహించిన సంగతి తెలిసిందే. ఈ వేడుకలకు బీజేపీ అగ్రనేత, కేంద్రహోం మంత్రి అమిత్‌షా ముఖ్యఅతిథిగా హాజరై సీఐఎస్ఎఫ్, సీఆర్‌పీఎఫ్ ఇతర కేంద్ర బలగాల గౌరవ వందనాన్ని స్వీకరించారు. రాష్ట్రంలో త్వరలోనే అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో అదే తరహాలో కేంద్రప్రభుత్వ ఆధ్వర్యంలో రాష్ట్ర ఆవిర్భావ ఉత్సవాలు నిర్వహించాలని నిర్ణయించినట్లు రాజకీయవర్గాలు అంచనా వేస్తున్నాయి.

దేశ ఔన్నత్యాన్ని చాటుతున్న మోదీ

దేశంలో ఉగ్రవాద కదలికలను కట్టడి చేసి ప్రపంచ దేశాలకు భారత దేశ ఔన్నత్యాన్ని చాటుతున్న నేత ప్రధాని మోదీ అని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి అన్నారు. మోదీ నాయకత్వంలో దేశం ప్రగతి పథంలో దూసుకుపోతున్నా ప్రతిపక్షాలు కేంద్ర ప్రభుత్వంపై బురదజల్లే ప్రయత్నం చేస్తున్నాయన్నారు. కాంగ్రెస్ పాలనలో పది లక్షల కుంభకోణం జరిగిందని కాగ్, సుప్రీంకోర్టులు నిర్ధారించాయన్నారు. కార్యక్రమంలో ఎంపీ డా.కె.లక్ష్మణ్, కొండా విశ్వేశ్వర్ రెడ్డి, మర్రి శశిధర్ రెడ్డి, చింతల రాంచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

త్వరలో హైదరాబాద్-ఫ్రాంక్‌ఫర్ట్ విమానం

సాక్షి, హైదరాబాద్: హైదరాబాద్ నగరానికి యూరప్ మరింత చేరువ కానుంది. ప్రధాన యూరోపియన్, స్టార్ అలయన్స్ మెంబర్ ఎయిర్‌లైన్ అయిన లుఫ్తాన్సా నాన్‌స్టాప్ డైరెక్ట్ సర్వీస్ అందుబాటులోకి రానుంది. ఫ్రాంక్‌ఫర్ట్ నుండి హైదరాబాద్‌కు లుఫ్తాన్సా తొలి విమానం వచ్చే ఏడాది జనవరి 16న వైడ్ బాడీ బోయింగ్ బి787–9 డ్రీమ్‌లైనర్‌తో ప్రారంభం కానుంది. ప్రారంభ విమానం ఫ్రాంక్‌ఫర్ట్ నుండి స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 10 గంటలకు బయల్దేరి రాత్రి 11 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో హైదరాబాద్ నుంచి తెల్లవారుజామున ఒంటిగంటకు బయలుదేరి స్థానిక కాలమానం ప్రకారం ఉదయం 6.10 గంటలకు ఫ్రాంక్‌ఫర్ట్ చేరుకుంటుంది. ఫ్రాంక్‌ఫర్ట్ – హైదరాబాద్ మధ్య వారానికి మూడుసార్లు రాకపోకలు సాగిస్తుంది.

Published and Printed by V. Murali, on behalf of Jagati Publications Limited, Published at Jagati Publications Limited, Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527, T.G., and Printed at Jagati Publications Limited Survey No 300/E, Timmapur Village&Mandal, Karimnagar Dist–505527 T.G.,
Editor: V. Murali(Responsible for selection of News under the PRB Act), Phone No. 0878 - 2223017, Fax No. 0878 – 2223019. RNI Regn No. TELTEL/2008/23800.